TRAVELOGUE

విపులాచ పృథ్వీ

- పాకిస్తాన్‌లో కొన్నాళ్ళు...
- అందాల అండమాన్

రచన

ఎస్.ఎమ్. మలిక్

విషయ సూచిక

పాకిస్తాన్‌లో కొన్నాళ్ళు....

1. ప్రయాణం........................ 05
2. సరిహద్దులు........................ 10
3. లోకప్రియుడు........................ 13
4. లోకబంధువు........................ 16
5. రాక్షస పాలన........................ 33
6. శిక్షణ, సంస్కరణలు................ 39
7. ఆరిపోయిన మంటల గాథ......... 48
8. ప్రతీకారానికి పరాకాష్ఠ.............. 53
9. గజిబిజి వాతావరణం................. 57
10. పరదేశంలో తెలుగు జిలుగులు..... 61
11. నా భూమి, నా కర్తవ్యాలు......... 65
12. ఖుదాహాఫిజ్........................ 68
13. యుగపురుషుడు.................... 73

అందాల అండమాన్

1. ప్రయాణం........................ 78
2. మద్రాసు 80
3. స్ఫూర్తినివ్వగల మహిళలు..............81
4. గగన యానం...................... 83
5. అంతర్మథనం...................... 84
6. ముఖ్యభూమికి దూరంగా.............86
7. కోడ్ వర్డు...........................87
8. తొలి తెలుగు ప్రసంగం..............90
9. సామరస్యానికి ప్రతీక..................91
10. వింటే మతిబోతుంది................ 92
11. ప్రభువూ ఒక్కడే, బోధనా ఒక్కటే..........................93
12. సామరస్యానికి ప్రతీక................ 94
13. ఈ ఆదర్శం అంతటా వెల్లివిరియాలి..................... 95
14. కలుషితం చేసేవారిని మట్టుపెట్టండి.................. 96
15. సుకవనం.............................. 97
16. జీవికకై.............................. 98
17. చేసేవాడికి చేతినిండా పని......... 99
18. దేశానికి దూరంగా............... 101
19. కారాగారమా? మృత్యుకుహరమా? 102
20. యోధానుయోధుల శయ్య.......... 103
21. జైలులో జైలు....................... 105
22. నాగరికతకు దూరంగా.............. 106
23. ఆటవిక సంస్కృతి 106
24. ఉర్దూకు అడవుల్లో ఆదరణ........ 108
25. అందం, ఆనందం, ఆహ్వానం...... 110
26. శిథిలమయిన తెల్లదొరల ప్రాభవం 113
27. తిరంగా పార్క్......................... 116
28. భాషాతీతమయిన భావసమ్మేళనం...118
29. మధురస్మృతులతో ముఖ్యభూమికి...124
30. ఉద్యమ బాంధవ్యం 127

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

ఒక మాట

నేను సాధారణంగా చిన్న ప్రయాణం చేసినా, పెద్ద ప్రయాణం చేసినా ప్రయాణం లోని వింతల్ని లేక నాకు వింతలుగా అనిపించినవాటిని, నన్ను ఆకర్షించినవాటిని, నన్ను ప్రభావితం చేసినవాటిని, నన్ను ప్రేరేపించినవాటిని వ్రాసి పదిలపరచుకోవాలని అనుకుంటాను. అప్పుడప్పుడు అలా అనుకున్నవి కొన్ని 'కవితలు'గా వెలువడ్డాయి; తరచుగా అనుకోవడమేగాని వాటికి అక్షరరూపం ఇచ్చే ఓపిక లేక ఆ ఆలోచనలు, కాగితాలకెక్కలేక పోయాయి, నిరాశల గూటిలో ఆదమరచి నిద్రపోయాయి. ప్రయాణాల తరువాత వెంటనే కథనాల వేషం వేసుకున్నవి రెండు యాత్రలు. పాకిస్తాన్, అండమాన్ దీవుల పర్యటనలు. అవి ఆయా కాలాల్లోనే గీటురాయిలో దర్శనమిచ్చినప్పుడు పాఠకుల్ని ఆకట్టుకున్న విషయం కూడా వాస్తవమే. ఆ రెండు సందర్భాలలోనూ ఆ యాత్రా వివరాలను పుస్తక రూపం ఇవ్వాలని చాలా వత్తిడి తెచ్చిన పాఠకులూ ఉన్నారు. నేను మటుకు అదంతా అనవసరమని, ఇదంతా ఏదో తాత్కాలికంగా వచ్చిన స్పందన అని కొట్టిపారవేశాను. ఇప్పుడు తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ యాజమాన్యం చేపట్టిన కొత్త మిత్రులు దాన్ని వెలువరించాలని ప్రతిపాదించినప్పుడు కాదనే సాహసం చేయలేకపోయాను.

పాకిస్తాన్‌లో గడిపిన కొన్నాళ్ళు నా ఆంతర్యంలో నేటికీ చెదరని ముద్రలు కొన్ని లిఖించాయి. అవి మరెప్పుడయినా బయటపెట్టగలనో లేదో నేను ఈ వేళ మాటిచ్చే స్థితిలో లేను. అలాగే అండమాన్ పర్యటనలో కూడా కొన్ని సన్నివేశాలు నన్ను అమితంగా చలింపజేశాయన్నదీ వాస్తవమే. అవి కూడా ఎన్నటికయినా నా కలం ద్వారా ప్రపంచాన్ని చూడగలుగుతాయో లేదో దైవానికే తెలుసు. ఆ మాటకు వస్తే నేను చేసే చిన్నచిన్న ప్రయాణాలలోనూ, జమాఅతె ఇస్లామీ హింద్ కేంద్రం, ఢిల్లీ రాకపోకల సందర్భంలోనూ, కేరళ, ఝార్ఖండ్ రాష్ట్రాల పర్యటనల్లోనూ అనుభవాలు అనేకం నన్నాకర్షించాయి, కాని వాటిని వ్రాసే ఓపిక లేకపోయింది, వ్రాయలేదు, అవి ఎప్పుడయినా వెలుగు చూస్తాయా అన్నది చెప్పలేను.

పాకిస్తాన్, అండమాన్ పర్యటనల ద్వారా నేను గడించిన అనుభవాలు, నా అనుభూతులూ ఈ పుస్తకంలో పాఠకులు చదవగలరు. వీటి ద్వారా కేవలం పర్యాటక సమాచార ప్రయోజనలేకాక విలువల ప్రాబల్యానికయితే నేను నా జీవితాన్ని అంకితం చేశాను వాటిలో ఒకటీ అరా అయినా పాఠకులలో పాదుకోగలిగితే ఈ పుస్తక ప్రచురణ సార్థకమయిందని భావిస్తాను. దైవం దానికి మార్గం సుగమం చేయాలని ప్రార్థిస్తున్నాను.

హైదరాబాద్ — మలిక్
3-3-2007

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

విపులా చ పృథ్వీ

పాకిస్తాన్‌లో కొన్నాళ్ళు...

ప్రయాణం

రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో ఎవరో తలుపు తట్టారు. ఇంట్లో అందరూ గాఢ నిద్రలో ఉన్నవేళ, అది శనివారం, సెప్టెంబర్ 22 నాటి రాత్రి, ఆ పూట వంట్లో బావుండక పోవటంవల్ల భోంచెయ్యకుండానే పడుకున్నాను. నీరసంగా ఉంది. మరోసారి తలుపు తట్టిన శబ్దం, మెల్లిగా నేనే లేచాను. తలుపు తెరిస్తే మిత్రులు యూసుఫ్‌ఖాన్ గారు నిల్చుని ఉన్నారు. గుండె దడ దడ లాడింది. ఏదో అనిర్వచనీయమయిన భయం ఆవరించింది. ఆయన యేదో కుశల ప్రశ్నలు వేశారు. నేను సమాధానం పలికి క్షేమ సమాచారాలు విచారించాను.

"నిన్న నుండి మౌలానా మౌదూది గారి అస్వస్థత తీవ్రరూపం దాల్చింది తెలుసా"?

"అవును, యేమయింది?" గుండెను ఆపశక్యం కాలేదు,

ఆయన......................

"ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్".

నిజమా? కళ్ళు బైర్లుకమ్మాయి.

"అందరూ ఆఫీస్‌లో ఉన్నారు పేపర్లకు న్యూస్ పంపాలి............"

"నన్ను రమ్మన్నారా?" నీరసంగా అడిగా.

"కాదు- మీకు తెలియచేశా" - అని నసిగారాయన.

"నేను రాలేను- అందరికీ సలాం చెప్పండి" ఆయన్ని సాగనంపనయినా వీలుపడక వెనక్కి మరలాను, వచ్చి పడకపై పడ్డానే కాని నిద్ర దూరమయింది, ఆలోచనలు అదుపు తప్పాయి, మనసు ఎక్కడెక్కడో పరిభ్రమించసాగింది. సరిగ్గా 18 యేళ్ళ క్రితం మద్రాసులో ఉద్యోగం వెలగబెడుతున్న రోజులు, పరిశుద్ధమయిన ప్రాంతంలో రూముకై అన్వేషిస్తుండగా పురుసైవాక్కంలో రూముతో పాటు కొత్త మిత్రులు కూడా దొరికారు, అక్కడే చదివాను

ఖురాన్‌కు కొత్త వ్యాఖ్యానాన్ని, హేతుబద్ధమయిన శాస్త్రీయమైన రచనల్ని, ఆ రచనలు యేదో మత సంబంధమయిన రచనలు కావనిపించింది. యేదో విప్లవాత్మక శైలి, ఇంకా అర్థం కాని యేదో పిలుపు, యేదో కొత్త నినాదం, సరికొత్త దృక్పథం గోచరించింది ఆ రచనల్లో. కమ్యూనిస్టు వుద్యమానికి బానిసయిన నా ఆలోచనలు, కమ్యూనిస్టు సాహిత్యానికి ప్రభావితమయిన భావాలు విశృంఖల విహారానికి అలవడ్డ నా కలం అన్నీ ఆ శైలిలోని భావప్రకటనా ఉరవడిలో కొట్టుకుపోయాయి, ఆ రచనల్లోని సహేతుక జ్వాలల్లో కరిగి, కాలి మసి అయిపోయాయి, ఆ భావాల్లోని శాస్త్రీయ పదునులో చిత్రహింసకు లోనయ్యాయి. నా ప్రపంచమంతా తారుమారయింది. ఊహా జగత్తులో కొత్త అంకురార్పణ జరిగింది. ఆలోచనా పథంలో కొత్త గురుతులు వెలిసాయి, మనసులో కొత్తభావాలు చిగురించ సాగాయి. ఆ కాలంలోనే - ఆ పరివర్తనా ఘడియల్లోనే నా పరిస్థితిని ఇలా వర్ణించింది నా కలం;

జీవన గగనపుటంచుల్లో
వెలిసిన అస్పష్ట రూపాలు
వెల వెల బోయాయి
అదృశమయ్యాయి
నీ సోయగాల సదనంలో
స్థానం కోల్పోయ్యాయి,
జ్ఞానం నడివీధుల్లో
కరవాలం చేతబూనీ
ఫీంకరిస్తూ వెడలింది:
ఏ ఏ తల లెగురుతాయో!
ఎన్నెన్ని బలిఅవుతాయో
భావావేశాల బాహువులు!!
యదార్థాల అద్దాల మేడలో
ఎన్నెన్ని నేల కొరుగుతాయో-
నల్లని మేలి ముసుగులు!!!
అప్పుడే నీ సోయగాల సదనంలో
మిల మిల లాడతాయి
అంతర్యంలో మండే మచ్చులు!
కుళ్ళే గాయాల దీపాలు !!........... (మలుపు; 15-1-1963)

అలా నా మార్గం, నా వేగం, నా గమ్యం అన్నీ ధర్మ విహీన వీధుల్లో నుంచి ధర్మబద్ధ రాచబాట వైపునకు మరలాయి. నేను ఈ కొత్త లోకంలో ప్రవేశించేటప్పటికి తెలిసింది-

"నే నొక్కడినే కాదు
నా వెంట వున్నారు గాడిమార్చి వచ్చిపడిన
బాటసారు లెందరో అని."

ఇలా యెన్నో 'బండ్ల' కు పట్టాలు మార్చిన "పాయింట్స్ మెన్ " గా వ్యవహరించాయి ఆ విప్లవాత్మక రచనలు! వాటి రచయితే నేడు ఐహిక కాయాన్ని వదలి తన ప్రభువు సన్నిధిన చేరిన మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది, నన్ను పెడమార్గాన్నుండి రుజు మార్గం వైపునకు మరల్చిన మహోపకారి ఇక లేడు. ఈ ఆలోచనే నన్ను కలవర పెట్టసాగింది. గతం నా అంతర్యాన్ని లోతుగా త్రవ్వింది. కళ్ళ చెలమల గుండా పెల్లుబుకుతున్న ధారను ఆపటం నా తరమా?'అల్లాహు అక్బర్' 'అల్లాహు అక్బర్' అని దైవ నామ సంకీర్తనం వినబడేవరకు కాలం ఎలా దొర్లిపోయిందో తెలియదు.

రాత్రంతా ద్రవించి పోయిన గుండె ప్రొద్దున క్రమేణ ఘనీభవించసాగింది. పట్టణ జమాఅత్ అధ్యక్షులు శ్రీ ముజఫ్ఫర్ హుసైన్ గారి వద్దకు పోయాను, ఇద్దరం ఒకరి నొకరం చూసుకున్నాం- నోటమాట రాలేదు. కళ్ళు మాత్రమే పలకరించుకున్నాయి. యిద్దరం చెరో ప్రక్క తలలు వంచుకుని కూర్చున్నాం. రాత్రి సంఘటనలను గురించి మాట్లాడుకున్నాం. పురానీ హవేలీ వైపునకు బయలుదేరాం.

అక్కడ మిత్రులందరూ ఎక్కడికో టెలిఫోన్లు చేస్తునారు. హాఫిజ్ అన్వారుల్లా మహ్మూద్ గారేమో ఢిల్లీ కేంద్రాలయానికి ఫోన్ చేస్తున్నారు. శోకముద్రలో ఉన్నవాళ్ళందర్నీ చూసి నాకు దుఃఖం ఆగలేదు. నేను ఏదో చెప్పబోయాను కాని నోట మాట పెగల్లేదు. నా ఈ పరిస్థితి చూసి మిత్రులు- "ఏోయి అలా నడుం వాల్చు" అని సలహా ఇవ్వసాగారు, నేనంతగా బలహీనమయిపోయానా? అని అప్పుడే నాకు అనిపించింది. వద్దు అని తల ఆడించి ఓ కుర్చీలో కూలబడ్డాను, హాఫిజ్ గారు కేంద్రంతో సంప్రదిస్తున్నారు.

నేనాలోచిస్తున్నాను; మౌలానా గారిని, నా మహోపకారిని నేనిక చూడలేను, తఫ్హీముల్ ఖుర్అన్ తెలుగు అనువాదం పూర్తి అయ్యాక ఆయన్ని సందర్శించే, సంభాషించే అవకాశం దొరకదా అని భావించాను. నేనే కాదు యింకా యెందరో మిత్రులు ఇలా తలపోసి ఉంటారు. కాని-యిప్పుడు కనీసం చివరి దర్శనానికి కూడా నోచుకోలేక పోతున్నాం.

దేశ విభజన వల్ల కేవలం భూభాగమే చీలిపోలేదు మనసులు, మనుషులు, కుటుంబాలు కూడా చీలిపొయ్యాయి. దేశకాల పరిమితులకు అతీతమయిన దైవ సందేశం, ఆ సందేశం వైపునకు మానవాళిని ఆహ్వానించేవారు కూడా చీలి పొయ్యారా? దేశ

విభజన ఇంతటి పటిష్ఠమయిన గోడల్ని నిలిపిందా? ఈ గోడల మూలానేగా నేను, నా లాంటి యెందరో మౌలానా గారిని చూడలేక పోయింది?

"మలిక్!" ఆలోచనలకు అంతరాయం, "పాకిస్తాన్ వెళ్ళగలిగే సూచనలు కానవస్తున్నాయి - బయల్దేరుతావా?" హాఫిజ్ గారు ఆశ గొల్పారు.

"నిజంగానా-?" నా ముఖం ఒక్క సారిగా విప్పారిందనుకుంటా!

"అవును- అయితే ఇప్పుడే బయల్దేరాలి - ఆంధ్రప్రదేశ్ సూపర్ ఎక్స్‌ప్రెస్ బయల్దేరటానికి ఇంకా నాలుగు గంటలే ఉన్నాయి. నేను కూడా బయల్దేరుతున్నాను ఢిల్లీ వెళ్దాం, వీసా దొరికే సూచనలున్నాయి. పద బయల్దేరు" హాఫిజ్ గారు హడావిడి చెయ్యసాగారు. అక్కడున్న ఇతర మిత్రులు కూడా వెళ్ళి వీసాకై ప్రయత్నించడమే మంచిదని సలహా ఇచ్చారు.

ఒక గంటలో సిద్ధమయి గీటురాయి ఆఫీస్ చేరాను, మిత్రులు ఇక్బాల్‌కు విషయాలన్నీ వివరించి, తిరిగి అక్టోబర్ 1వ తారీఖు లోపల వచ్చేస్తానని అందరి వద్ద సెలవు తీసుకుని బయల్దేరాను.

❖ ❖ ❖

ఆంధ్రప్రదేశ్ సూపర్ ఎక్స్‌ప్రెస్‌లో ఎలాగో బెర్తు లభించింది. అక్కడ మరో మిత్రులు (సయ్యిద్ గులామ్ అక్బర్) కూడా మా బృందంలో చేరారు. ఇప్పుడు మేం ముగ్గుర మయ్యాం. కొంత సేపు 'ఇరుగు పొరుగు' వాళ్ళతో సర్దుకోవడంతోనే సరిపోయింది. మనసు చంచలమయింది, కాస్తంత ఏకాంతం దొరగ్గానే అందరి కళ్ళు కప్పి గతంలోకి పారిపోయింది.

నేను మద్రాసులోనే ఉన్నాను, అప్పుడు ప్రపంచం నలుమూలలా ధర్మ విహీనత ప్రబలిపోవటాన్ని చూసి నా అంతర్యంలో చిన్న అనుమానపు రేఖ ఉదయించింది- ఈ జనమంతా ఇలా అపధర్మపు అంధకారాల్లో పడి చివరి దినాన అభాసుపాలు కావడమే కాక నిష్ఫలతకు గురి కావలసి వస్తే బాధ్యత అంతా సత్యధర్మం కలవారయిన ఈనాటి ముస్లింలపైనే పడుతుంది కదా? ఆ బాధ్యత నుండి తప్పించుకోవడం ఎలా - సాధ్యమా అని నా అనుమానం, ఆ రోజుల్లోనే మౌలానాగారి ఓ వ్యాసం చదివాను. దాని సారాంశం నా ఊహల్లో తేలియాడసాగింది:

"మానవ ఊహాజనిత వ్యవస్థలన్నీ ప్రపంచంలోనే తమ దుర్దశను చేరుకుంటాయి. అయితే దానికి ఒక షరతు ఉంది. దైవధర్మం అనుయాయులు తమ ధర్మాన్ని సక్రమంగా సంపూర్ణంగా అవగతం చేసుకోవాలి, దాన్ని తమ వ్యక్తిగత సామూహిక జీవితాల్లో పాటించాలి. ఆ తరువాత తమ మాటలతో, వ్రాతలతో, తమ చేతలతో, నడవడికలతో



మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ

ప్రొ. ఖుర్షీద్ అహ్మద్



అల్లామా ఇక్బాల్ సమాధి, షాహీ మస్జిద్, లాహోర్



డిఫెన్స్ కాలనీ మస్జిద్, కరాచీ



జనరల్ జియా ఉల్‌హక్



ప్రార్థన చేస్తున్న మౌలానా మౌదూది

కాయిదె ఆజమ్, పాకిస్తాన్ నిర్మాత
ముహమ్మద్ అలీ జిన్నాహ్



మౌలానా మౌదూదీ రచనా వ్యాసంగం సాగించే గదిలో

మౌలానా మౌదూదీ ఉపన్యసిస్తూ

ఆ దైవధర్మాని కనుగుణంగా సాక్ష్యమివ్వాలి, అప్పుడు కమ్యూనిస్టు నియంతృత్వం ఎక్కడెక్కడ పాదం మోపిందో అక్కడక్కడి నుంచి దాన్ని తరిమి తరిమి పారదోలితే అది ఎక్కడా నిలువ నీడ కానరాక మాస్కో రెడ్ స్క్వేర్‌లో తల దాచుకుంటుంది. అలాగే పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం తగిలే ఎదురుదెబ్బలకు తట్టుకోలేక వాషింగ్టన్ వైట్‌హౌస్‌లో శరణు పొందవలసి వస్తుంది- -అయితే షరతు అదే"!

నా కళ్ళు చెమ్మగిల్లాయి నేడు కమ్యూనిజమూ కాపిటలిజమూ రెండూ పలాయన మంత్రం పఠిస్తుండగా తన"జోస్యం" నిజమవుతుండగా చూస్తూ కన్ను మూశారాయన. నిజంగా ఆయన కృతార్థ జీవే!

తృప్తిగా నేనూ కన్నుమూశాను. నిద్రవడిలో ఒరిగిపోయాను.

❖ ❖ ❖

వీసా కోసం దరఖాస్తులు పంపాం. కాలం అతి వేగంగా దొర్లి పోతోంది. సాయంత్రం కావచ్చింది. అంతులేని ఆతృతతో, యెన్నో భయాందోళనలతో కూర్చున్నాం.

"ఇప్పుడు వచ్చిన నాలుగు పాస్‌పోర్టుల్లో నుంచి ఒకటి వాపసు తీసుకోవాలి. 40 వీసాలకు మాత్రమే అనుమతి ఉంది. మొత్తం 41 అయ్యాయి" ఆఫీసులో నుండి వచ్చిన " దౌత్యాధికారి" తెలిపారు.

దడదడలాడే గుండెలతో చూస్తే ఆ నాల్గింటిలో మా రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ అజీజ్ గారిది, ఉపాధ్యక్షుడు హాఫిజ్ గారిది, నాది, మరో ఆజంగఢ్ మిత్రుని పాస్‌పోర్టులున్నాయి. అధ్యక్షులు పోవలసిందే, ఉపాధ్యక్షులు పోవలసిందే. ఆజంగఢ్ మిత్రుడు ససేమిరా వాపసు తీసుకోనన్నాడు, ఇక మిగిలింది నేనే - ఓహ్! నాకు మౌలానా గారి అంతిమ దర్శన భాగ్యం కూడా లేదా? ఒక్కసారి ఆశానిరాశల మధ్య ఊగిసలాడాను. హాఫిజ్ గారు ముందుకు వచ్చి నేను వాపసు తీసుకుంటానన్నారు. నాకు మరో ఆలోచన రాలేదు, ఆయన బాధ్యతాయుతుడయిన వ్యక్తి. ఆయన వెళ్ళడమే సమంజసమేమో! నేను నా పాస్‌పోర్టును మారుమాట్లాడక వాపసు తీసుకున్నాను. అయితే దైవంనన్ను మౌలానా దర్శనానికి చేరవేస్తాడని దృఢనమ్మకం మాత్రం ఉంది.

దౌత్యాధికారితో 'నేను కేవలం మౌలానా అంత్యక్రియల్లో పాల్గొనే నిమిత్తం హైదరాబాద్ నుంచి వచ్చిన' నిజాన్ని చెప్పుకున్నాను. ఇతర మిత్రులు కూడా బలపరిచారు. దౌత్యాధికారి వీలుకాదని లోనికి వెళ్ళిపోయాడు.

సహనమే శరణ్యమయింది, మిత్రులందరు నన్ను సముదాయిస్తున్నారు. 'భయపడకండి రేపు మరికొన్ని వీసాలు దొరుకుతాయి. వాటిలో మీకూ లభిస్తుంది, వచ్చేద్దురు గాని' అని. నాకూ ధైర్యంగానే ఉంది. అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడా అధికారి.

"ఆ హైద్రాబాద్ నుండి వచ్చిన దెవరూ?" అడిగాడాయన, నేను నిలబడ్డాను. "మీ పాస్‌పోర్టు కూడా ఇవ్వండి. పాపం, మీరు మాత్రం ఎందుకు ఉండిపోవ్వాలి." చిరునవ్వుతో పలుకరించి నా పాస్‌పోర్టు కూడా తీసుకెళ్ళాడాయన.

అంతా దైవసంకల్పం. నాకు యుగపురుషుని అంత్యక్రియల్లో పాల్గొనే భాగ్యం దైవం కల్పిస్తే ఎన్ని అవాంతరాలయినా దైవికంగానే దాటుకుంటాయి. "దైవ కారుణ్యాన్ని గురించి నిరాశ చెందకు" (దివ్య ఖుర్‌ఆన్)

❖ ❖ ❖

ఇలా ఆశానిరాశల మధ్య ప్రారంభమయింది నా పాకిస్తాన్ ప్రయాణం. నేను ఏ నాడయిన పాకిస్తాన్ వెళ్తానని, అదీ, ఈ విధంగా హఠాత్పరిణామాల్లో ప్రయాణం చెయ్యవలసి వస్తుందని ఊహించనయినా లేదు. దైవ నిర్ణయాలు ఎప్పుడు ఎలా ముందుకు వస్తాయో మానవమాత్రులం మనం ఊహించలేము. వాటికి తల ఒగ్గడం తప్ప చేసేదేముంది?

సరిహద్దులు

మేము, కొన్ని గంటల్లోపల ఎమర్జెన్సీ వీసా ఇచ్చిన పాకిస్తాన్ దౌత్యాలయాన్ని అభినందించుకుంటూ "మర్కజ్" (జమాఅత్ కేంద్ర కార్యాలయం) చేరుకునేటప్పటికి సాయంత్రం 5 గంటలయింది. మర్కజ్‌లో ఇంకా అద్భుతమయిన వార్త మా చెవిన పడ్డది. మౌలానా అంత్యక్రియల్లో పాల్గొనాలని ఎవరికి మాత్రం ఉండదు? మరయితే అందరి వద్ద పాస్ పోర్టులు ఉండవద్దూ? పాస్‌పోర్టులు లేని "అభ్యర్థులు" దాదాపు 50 మంది తయారయ్యారు. వీరి సంగతేమిటీ?

మన విదేశాంగ శాఖకు జోహార్లు అర్పించుకోవాలి, వారు మౌలానా మౌదూది అస్తమయం, ఆయన అంత్యక్రియల్లో పాల్గొనాలని తహతహలాడే వారి ఆతృత అంతా గమనించిన కొన్ని గంటల్లోపల ఆ 50 మందికి టెంపొరరీ పాస్‌పోర్టులు తయారుచేసి యిచ్చారు. వాస్తవానికి విదేశాంగ శాఖ ఇంత చురుగ్గా విశాల హృదయంతో, జమాఅత్ కార్యకర్తలపై ఇంత నమ్మకంతో వ్యవహరించినందుకు దాన్ని ఎంతగా అభినందించినా తక్కువే. పాకిస్తాన్‌లో వీలుపడినప్పుడల్లా మేము విదేశాంగ శాఖను గురించి పాకిస్తానీయులకు వినిపించాం. వారు ఇంత చురుగ్గా అన్నీ జరగడంపై తొలుత విస్తుపోవడం తరువాత మన విదేశాంగశాఖను కొనియాడటం మామూలయింది.

❖ ❖ ❖

ఆ రోజు (24-9-79) రాత్రి మేము మొత్తం 70 మందిమి, అమృతసర్ జనతా ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి మరునాడు మధ్యాహ్నానికల్లా సరిహద్దులకు చేరిపోయాము. దాదాపు

30 మంది మిత్రులు ముందే మరో ట్రెయినులో ప్రయాణమయ్యారు, పాకిసాన్ వెళ్ళే వారు రూ. 300 వరకు"విదేశీ మారకద్రవ్యం" తీసుకుపోవచ్చు. భారతకరెన్సీకి పాకిస్తానీ కరెన్సీకి మారకం రేటు 100కి రూ. 120 అటారీ బోర్డర్ వద్ద మారకం దార్లు (అధికారికంగా) ఉంటారు. పాకిస్తానీ కరెన్సీకి భారత కరెన్సీ మారకం రేటు రూ. 100కి.రూ. 70 మాత్రమే!

బార్డర్ దాటటంలో మాకు పెద్ద చిక్కేమీ ఎదురవ లేదు. మన కస్టమ్స్ అధికార్లు మాప్రయాణపు ఉద్దేశాన్ని తెలుసుకుని, జరగవలసిన తంతు అంతా లాంఛనంగా జరిపి పంపివేశారు. అయినా మావద్ద చెరో సూట్‌కేస్ లేక బ్రీఫ్ కేస్ తప్ప మరేమి లేదు. అలాగే పాక్ కస్టమ్స్ వాళ్లు కూడా మమ్మల్ని తొందరగా సాగనంపారు.

బార్డర్‌ని దాటేటప్పుడు వింతయిన అనుభూతి కలిగింది. ఒకే భూభాగం, అదే సింధూ నదీ ఉపనదులు ప్రవహించే పంజాబ్ (అయిదు నదుల) భూభాగం! దేవుని ఈ భూమిపై మానవులు గిరి గీసి ఇది నాది అది నీది అని పంచుకున్నారా? బంగరు పండించే పంజాబ్ భూమి రెండుగా వేర్పడి, ఓ ఉర్దూ కవి అన్నట్టు.

ధాయి ధాయి హువా పంజాబ్ ....రెండున్నర రెండున్నరగా చీలిందా. గత చరిత్ర అంతా ఒక్కొక్క పుటే నాకు ఎదురవసాగింది.

❖ ❖ ❖

భారత ఉప ఖండంలో ఆంగ్లేయుల పాలనను తొలగించడానికి పోరాటం ఉధృతంగా సాగుతోంది. అప్పటి అనేక రాజకీయ, సామాజిక పరిస్థితుల కారణంగా ముస్లింలు అత్యధికంగా ఉన్న ప్రాంతాన్ని వేరొక రాజ్యంగా రూపొందించాలని, అక్కడ ఇస్లామీయ ప్రభుత్వాన్నీ స్థాపించాలని ముస్లింలీగ్ కోరింది, దానిగ్గాను ఉద్యమం నడిపింది. ఆ ఉద్యమంలో మౌలానా మౌదూదీ పాల్గొన లేదు. దానికి ఆయన వద్ద కారణాలు మూడు;

(1) ఒకవేళ ఇస్లామీయ రాజ్యస్థాపన మన లక్ష్యమయితే మనం ముస్లిం సమాజాన్ని ఈ లక్ష్యసాధన కొరకు నైతికంగా కూడా సమాయత్తపరచాలి, కేవలం రాజకీయ పోరాటంతో సరిపోదు. దీనికి ఆలోచనాపరంగా, శాస్త్రీయంగా, నైతికంగా సాంస్కృతికంగా, రాజకీయంగా అన్ని విధాలుగా, సమస్త రంగాల్లో కృషి చెయ్యకుండా ఆ లక్ష్యాన్ని సాధించడం కష్టతరం.

(2) ఈ ఉద్యమంలో ప్రతి రంగంలోనూ, ప్రతి స్థాయిలోనూ సర్వతోముఖమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ఎంతో జాగ్రత్తగా మసలుకోవలసి ఉంటుంది. కమ్యూనిస్టుల్ని, నాస్తికుల్ని, ధర్మవిహీనుల్ని, జాగీర్దార్లను, జమిందార్లను - అందరినీ విచక్షణా రహితంగా ఇందులో చేర్చుకుంటే ప్రోగయ్యే గుంపు ఎప్పటికయినా జాతికి

సరయిన దిశలో మార్గం చూపజాలదు. వీరంతా పరస్పరం ఘర్షించుకుని తమ తమ స్వప్రయోజనాలకై జాతిని వినియోగించుకోడానికి ప్రయత్నిస్తారు. పర్యవసానంగా అసలు లక్ష్యం అదృశ్యమవుతుంది.

(3) ముస్లింలు మౌలికంగా ఒక సైద్ధాంతిక వర్గం, సందేశాత్మకమయిన పార్టీ, వాళ్ళ ఈ స్థానానికి ఎట్టి పరిస్థితిలోనూ భంగం వాటిల్లకూడదు.

ముస్లిం లీగ్‌తో తనకు గల ఈ విభేదాన్ని ఆయన తన రచనల్లో, (తన పత్రిక తర్జుమానుల్ ఖురాన్ ద్వారా) తన ఉపన్యాసాల్లో విస్పష్టంగా ప్రకటించారు. ముస్లింలీగ్ ఆయన్ని "కాంగ్రెస్ వాది" అని చిత్రించింది! ఆయన ఇస్లాం పునరుజ్జీవనానికి పలికే మాటలు విని, అప్పట్లో, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, జాతీయ వాదుల కలగూర గంప అయిన కాంగ్రెస్ పార్టీ ఆయన్నీ "ముస్లిం లీగర్" అని వర్ణించింది! ఆయనేమో ఈ కితాబులన్నింటికీ అతీతంగా తన నిర్మాణాత్మక కార్యక్రమం కొనసాగిస్తూ పోయారు, మనుషుల నైతిక సంస్కరణ, ఇస్లామీయ శిక్షణల పునరుద్ధరణ, ఆలోచన, ఆచరణల ప్రక్షాళన. ఓ ప్రణాళికాబద్ధంగా ఆయన ఉద్యమం పురోగమిస్తూ పోయింది.

ఆలోచనలకు అంతరాయం కలిగింది. "పదండి ముందు జుహర్ నమాజ్ చేసుకుందాం." ఎవరో అంటున్నారు. చుట్టూకలియజూశాను. బార్డర్ క్రాస్ చేసి "వాఘా"ఎప్పుడో వచ్చేశాము. పాకిస్తాన్‌లో అడుగు పెట్టామన్నమాట. కుడి ప్రక్కన ఓ మస్జిద్ చిన్నదయినా అందంగా ఆహ్వానించింది. అప్పుడు మధ్యాహ్నం రెండున్నర గంటలు. జుహర్, అసర్ ప్రార్థనలు ముగించుకున్నాము, సిటీబస్ ఒకటి వచ్చి మాకోసం ఎదురు చూస్తోందని తెలిసింది. అందరం ఎక్కి లాహోర్‌లోని జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్ కేంద్ర కార్యాలయం "మన్సూరా"కు బయల్దేరాం. దారిలో తెలిసింది, మౌలానా భౌతిక కాయం బఫెలో నుండి న్యూయార్క్, లండన్ గుండా కరాచీ చేరుకుందని, కొంతసేపటికి లాహోర్ వచ్చేస్తుందని. అప్పుడే నా దృష్టి శిథిలావస్థలో ఉన్న ఆ "సిటీబస్"ని పరిశీలనాత్మకంగా పరికించింది. బస్‌ను ఆ పరిస్థితిలోనూ దాదాపు 60 మైళ్ళవేగంతో నడుపుతున్న డ్రయివర్ వైపు చూశాను, అమృత్‌సర్ నుండి "అటారీ" వరకు తెచ్చిన అందమైన మినీబస్ దాని డ్రయివర్ గుర్తుకువచ్చారు. ఈ రెండు బస్సుల్లో భూమ్యాకాశాల తేడా ఉన్నా మనుషుల్లో ఏ మాత్రం వ్యత్యాసం లేదు. ఉభయులూ పంజాబ్ దృఢకాయులు మన దేశంలో పేరుపొందిన పెద్ద మనషులే కదా!

లుటలుట లాడుతున్న కిటికి అద్దాలగుండా బయటికి దృష్టిసారించాను. మనవైపు బంగరు పండిస్తున్న పంజాబ్ అటువైపు బంజరుగా అగుపించింది. అటారీలో ఆర్‌సీసీ బంగళాలు కాకపోయినా పక్కా గృహాలు ఎక్కువగా కనిపించాయి, కాని వాఘాలో రేకులషెడ్‌లు, పెంకుటిళ్ళు, ఇటుకలతో నిర్మించబడ్డ ఇళ్ళే అధికం. తిండి పరిశుభ్రతల్లో కూడా మన పంజాబ్‌లోనూ అక్కడి పంజాబ్‌లోనూ చాలా వ్యత్యాసం కనిపించింది.

వాఘా నుండి మన్సూరా వెళ్ళే మార్గంలో రోడ్డు ప్రక్కన దాదాపు 2 మైళ్ళ పొడుగూత ఓ కాలువ ప్రవహిస్తోంది. కాలువకు ఆవలకూడా రోడ్డు ఉంది. ఆ కాలువ ఒడ్డున మల మూత్ర విసర్జన జరిగిన ఛాయలు ఎక్కడా గోచరించలేదు, అంతే కాదు, పాకిస్తాన్‌లో మరేచోట నయినా పబ్లిక్ స్థానాల్లో ఇలాంటి దర్శనభాగ్యం కలుగ లేదు! దేవుడు రక్షించాడు!! పారిశుధ్యం, లజ్జలాంటి గుణాలను మహా ప్రవక్త (సఅసం) విశ్వాసాంశాలని ప్రవచించారు. పాకిస్తానీయులు వాటినయినా పాటిస్తున్నందుకు సంతోషించవలసిందే! ఈ సందర్భంలో మన గడ్డన కాలువల ఒడ్డున, చెరువుల గట్టున, రోడ్ల ప్రక్కన కనిపించే రోత తలచుకున్న నేను లోలోనే క్రుంగిపోయాను, మన్సూరా వచ్చేసింది. ఇది జమాఅత్ కేంద్ర కార్యాలయాల కాంప్లెక్సు. కార్యనిర్వాహక విభాగం, అతిథి గృహం, జమాఅత్ బాధ్యులైన కార్యకర్తల క్వార్టర్స్, ఒక పెద్ద మస్జిద్, ఆ కాంప్లెక్స్‌లో సకల సౌకర్యాలు ఇనుమడించబడ్డాయి. సువిశాలమైన స్థలంలో అధునాతన సౌకర్యాలతో ఆ కాంప్లెక్సు ఎంతో ఆకర్షణీయంగా ఉంది. అతిథి గృహంలో మాకు గదులు కేటాయించబడ్డాయి. రూములు చాలకపోతే కార్యకర్తల గృహాల్లో ఒకదాన్ని అప్పటికప్పుడు ఖాళీచేయించి మాకు ఇచ్చారు, స్నానాలు అవీ ముగించుకునే వేళకు మగ్రిబ్ ప్రార్ధన కాలం సమీపించింది. కొత్తగా నిర్మాణమవుతున్న మస్జిద్‌లో ఓ ప్రక్కన (మహిళా విభాగంలో) సామూహిక ప్రార్ధన జరిగింది.

మౌలానా భౌతిక కాయం లాహోర్ వచ్చేసిందని, 'ఇఛ్రా'లోని ఆయన గృహంవద్ద ప్రజల దర్శనార్ధం శవపేటిక పెట్టబడిందని, రాత్రి 9 గంటల వరకు మహిళల దర్శనం కోసం ఒకేటాయించారని, ఆ తరువాత పురుషులు వెళ్ళవచ్చని, అప్పుడే తెలిసింది. ఆ రాత్రి 9 గంటల (పాకిస్తాన్ టైం) నుండి 9-30 వరకు టి.వి.లో మౌలానా గురించి ప్రత్యేక ప్రోగ్రాం చూపెడతారనికూడా తెలిసింది. ఎలాగూ 9-30 వరకు ఇఛ్రా వెళ్ళలేం గనుక టీ.వి. ప్రోగ్రాం చూడాలని నిశ్చయించుకుని అక్కడే ఉండి పోయాము. కొందరు మిత్రులు పట్టణానికి వెళ్ళి పోయారు.

లోకప్రియుడు

జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్ కార్యనిర్వాహక విభాగం(Secretariat) లోని ప్రచారప్రసారాల శాఖ హాలులో ఓ ప్రక్కన ఎత్తయిన స్థలంపైన టీ.వీ. సెట్టు, దాదాపు 4అడుగుల వెడల్పుది అమర్చబడి ఉంది. టీ.వీ. ప్రోగ్రాం చూడటానికి వచ్చిన మిత్రులకు కుర్చీలు చాల్లేదు. చాలా మంది నిర్మొహమాటంగా వెళ్ళి క్రిందనే కూర్చున్నారు. మరి కొందరు వెనకాల నిలబడే ప్రోగ్రాం చూస్తున్నారు. నేనూ ఓ ప్రక్కన నిలబడ్డాను. టీ.వీ.లో వార్తలు చదువుతున్నారు. హాలంతా ఓ సారి అలా దృష్టి సారించాను,టీ.వీకి దగ్గరగా అధ్యక్షుడు జియా క్యాబినెట్‌లో ప్లానింగ్ మంత్రిగా పని చేసిన ప్రఖ్యాత ఇసామీయ ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్, ఆయనకు చేరువలో ప్రచారప్రసారాల శాఖ కార్యకర్తలు, కొందరు జమాఅత్ సలహామండలి సభ్యులు కూర్చున్నారు. అందరూ టీ.వీ. స్క్రీన్ పైనే

దృష్టిని కేంద్రీకరించి చూస్తున్నారు. ఆ కళ్ళల్లో నిరీక్షణ తప్ప మరే భావమూ కనబడటంలేదు. ప్రొఫెసర్ ఖుర్‌షీద్ మౌలానా భౌతిక కాయంతో పాటు న్యూయార్క్ నుండి సహప్రయాణం చేశారు. ఎడతెగకుండా ప్రవహిస్తున్న అశ్రుధారను తనలో దాచుకోడానికి శత విధాలా ప్రయత్నిస్తున్నారు. జేబు రుమాలు తడిసి ముద్దయిపోయింది. ముఖం ఎర్రగా కందిపోయింది.

విద్యార్థి దశలోనే మౌలానా మౌదుదీ రచించిన విప్లవ సాహిత్యం చదివిన ఖుర్‌షీద్ అహ్మద్, అప్పుడు విద్యార్థుల కోసం స్థాపించబడిన "ఇస్లామి జమిఅతె తలబా" (ఇస్‌లామీయ విద్యార్థి సంఘం) దాన్ని మౌలానా ప్రత్యేక శ్రద్ధాసక్తులు, ప్రోత్సాహంతో పాకిస్తాన్‌లోనే ఆదర్శవంతమయిన విద్యార్థి సంస్థగా మలచగలిగారు. ఖుర్‌షీద్ అహ్మద్ నేడు ప్రపంచస్థాయిలోనే ఇస్లామీయ ఉద్యమ నాయకుడుగా విరాజిల్లుతున్నారంటే అది మౌలానా ప్రత్యక్ష శిక్షణలో సంప్రాప్తించిన యోగమని వారిరువురి బాంధవ్యం ఎరిగి ఉన్నవారు ఎవరయినా ఇట్టే చెప్పగలరు. నేడు ఆ ఖుర్‌షీద్ అహ్మద్ గుండెలు ద్రవించి కన్నులగుండా ప్రవహిస్తోంటే ఆశ్చర్యమే లేదు, ఆ మాటకు వస్తే ఎవరి గుండెలు మాత్రం అదుపులో ఉన్నాయనీ?

"ఇస్‌లామీయ ప్రపంచ అద్వితీయ తత్వవేత్త, అనుపమ ఖురాన్ వ్యాఖ్యానమయిన తఫ్‌హీముల్ ఖుర్‌అన్ కృతికర్త, మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ భౌతికకాయం నేడు లండన్ నుండి పి.ఐ.ఏ. విమానంలో కరాచి చేరింది" టి.వీ. అనౌన్సర్ మాటలు వినగానే ఆలోచనలు కట్టిపెట్టి అటు మరలాను. మౌలానా దేహాన్ని కరాచీలో దింపి, అక్కడ గంటలతరబడి నిరీక్షిస్తున్న అనేక మంది మౌలానా అభిమానులు నమాజే జనాజా (శవప్రార్థన) చెయ్యడానికి వీలుగా చేసిన ఏర్పాట్లకు సంబంధించిన వార్తతోపాటు దృశ్యాలు టి.విలో కనిపిస్తున్నాయి. వగరుస్తూ రోదిస్తూ విలపిస్తూ యువకులు, "వృద్దులు సయ్యదీ, ముర్షదీ మౌదూదీ మౌదూదీ" (నా నాయకుడు, నాగురువు-మౌదూదీ) అనిచేసే మిన్నుముట్టే నినాదాలు వాతావరణంలో సంచలనం పుట్టించాయి. అంతర్యాన్నికలచివేశాయి. ప్రేక్షకులు కూడావిలపిస్తున్నారు. ఎటు చూచినా కన్నీటి వర్షం, ఎక్కిళ్ళు- టీ. వి. లోపలా బయట! ఆ సందడిలో నల్లగడ్డంగల యువకుడు రుద్ధకంఠంతో, వెక్కిళ్ళ మధ్య ప్రకటించాడు.

"మహాశయులారా మీరంతా ఎయిర్‌పోర్ట్ స్టేడియం వెళ్ళండి. మౌలానాగారు ....ఇక్కడ ఆగరు.......ఆయన వెంటనే తిరిగివెడతారు.....అతడు ఇక ఆపుకోలేక వెక్కివెక్కి రోదించసాగాడు. "అల్ విదా అల్‌విదా, సయ్యదీ అల్‌విదా! " (మరోనినాదం! వీడ్కోలు, వీడ్కోలు! నాయకుడా వీడ్కోలు!) దేహనికయితే వీడ్కోలు చెప్పాము- హృదయాంతరాళాల్లో నివసించే ఆ ప్రేమైకమూర్తిని, స్ఫూర్తిని, చైతన్యాన్ని వదలలేము. ఆ భావనారూపం చెరగనిది, తరగనిది. కళ్ళవెంట కారుతున్న ప్రేమధారతో అంతర్యాల ప్రక్షాళన జరుగుతోంది- గడ్డాలు తడిసి నిగనిగ మెరుస్తున్నాయి- తెల్లని గడ్డాలు, నల్లని గడ్డాలు నూనూగు గడ్డాలు!

టి.వి.లో ఏదో "హైదరాబాద్" అన్నమాట వినపడి ఆలోచనల్లో నుండి తేరుకొని అటు చూశాను, వార్తలు ముగిశాయి. ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమయింది. మౌలానాకు సంబంధించిన ఎన్నో "స్టిల్స్" ఘట్టాలు తెలిపే నేపథ్య కథనం జరుగుతోంది.

అందరూ ఒక్కసారిగా"ఆహ్!" అన్నారు. మౌలానా చిత్రపటం మాట్లాడుతోంది! నావళ్ళు పులకరించింది. జీవితంలో ఆయన మాట్లాడగా వినాలని, చూడాలని కలలు కన్న నా హృదయం ఒక్కసారిగా రోదించసాగింది - ఆ పెదాలు కదులుతూ అమృతం చిలికిస్తుంటే కన్నులు జలజలా వర్షించసాగాయి. ఆ రూపాన్ని ఆ కదలికల్ని శాశ్వతం చేసుకోవాలని, ఆ శబ్దాన్ని ఎదలో ముద్రించుకోవాలని తపన, ఆవేదన, ఆతృత. కన్నులు, చెవుల్ని వదిలేసి ఆ రూపంలో విలీనం కావడానికి పరుగెడుతున్నాయి. చెవులు మనసుతో సంబంధం లేకుండా మౌలానా ప్రవచనాలు, ప్రేక్షకుల ఎక్కిళ్ళు హాహాకారాలు అన్నీ కల నలిపి వింటున్నాయి. హృదయం అన్నింటినీ వదలి శబ్దాన్ని రూపాన్ని భద్రపరచుకుంటోంది. టీ.వి.లో మౌలానా ప్రసంగిస్తున్నారు.

".................ఏరోజయితే మహాప్రవక్త(స) మదీనా చేరారో ఆ రోజునే ఇస్లామియ రాజ్యం పునాది పడ్డది. ఆ ఇస్లామీయ రాజ్యం చేసిన మొదటి పని, ప్రజల్లో ఇస్లాం జ్ఞానాన్ని విస్తృత పరచడం. ఎందుకంటే ఇస్లాం అంటే అజ్ఞానం కాదు, ఇస్లాం జ్ఞానానికి మారు పేరు."

మౌలానా అంటున్నారు. నేను ఆలోచిస్తున్నాను- ఆ ఇస్లాంను, ఆ జ్ఞానకాంతిని నలువైపులా ప్రసరింప చేయడానికే కదా మౌలానా తన చివరిశ్వాసవరకు తిమిరంతో నిరంతర సమరం జరిపారు? మౌలానా తన కర్తవ్యం నెరవేర్చారని నా ఆంతర్యం సాక్ష్యం పలికింది. తృప్తిగా టీ.వీ. వైపు చూశాను. మౌలానా అంటున్నారు.

"..........ఎంత ఉత్తమమయిన ప్రభుత్వ వ్యవస్థనయినా మీరు నెలకొల్పండి. జనసామాన్యంలో ఆ వ్యవస్థను నిలబెట్టగల నైతికబలం లేకపోతే ఆ వ్యవస్థ విజయ వంతంగా మనజాలదు, అందుకే మహాప్రవక్త చేసిన గొప్ప కార్యం, ప్రజల నైతిక సంస్కరణ. ప్రభుత్వ ఆదేశాలపై అమలు జరపడానికి అక్కడ పోలీసుల అవసరముండేది కాదు".

ఆ నైతిక సముద్ధరణ కొరకే మౌలానా జీవితాంతం పాటుపడ్డారు. పాకిస్తాన్ కావాలని కోరినవారిని హెచ్చరించారు. "దండం దశగుణం భవేత్" అన్న సూత్రం ఎక్కువకాలం ప్రయోజనం చేకూర్చదని మౌలానా గొప్ప గొప్ప దండనాయకులకే బోధించారు. "మౌలానా! మతానికి రాజకీయాలకు ఉన్న సంబంధం ఏమిటో అర్థం కావడం లేదండి"! ఒక సమావేశంలో వెటకారంగా ఆశ్చర్యం వ్యక్తంచేసిన ఫీల్డ్ మార్షల్ అయ్యూబ్ ఖాన్‌కు, మౌలానా మరో సమావేశంలో ఇచ్చిన సమాధానం చాలా తికమక పెట్టింది. "నిజమే! ఈ మాట అర్థంకానిది మికొక్కరికే - కాని - సైన్యానికీ రాజకీయాలకూ ఉన్న సంబంధం ఏమిటో 13 కోట్లప్రజలకు (తూర్పు పాకిస్తాన్ సజీవంగానే ఉంది.) అర్థం కాకుండా ఉంది. ఏమంటారు?" అన్నారట.

"మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ ఇక ఈ లోకాన లేరు కాని ఆయన తన ఆలోచనల కాంతిలో తన రచనల తెరలపై, తన ప్రసంగాల దర్పణాల్లో సజీవంగా ఉన్నారు - సజీవంగా ఉంటారు. మనిషి భౌతిక కాయం మట్టిలో కలిసి పోతుంది. కాని అతడు చేసిన గొప్ప కార్యాలే బ్రతికి ఉంటాయి." టీ.వీ. అనౌన్సర్ కూడా దుఃఖంవల్ల బరువెక్కిన హృదయంతో తన శ్రద్ధాంజలి అర్పించుకొని నిష్క్రమించాడు.

లోకబంధువు

"అకాల మరణం అన్నది ఒక నాస్తిక భావం. ముస్లింలు ప్రతి చావును సకాలమనే భావిస్తారు. అల్లాహ్ ఒకరిచావుని, ఒకరి సలహా ప్రకారం కాదు. తన వివేచన, విచక్షణల ప్రకారం నిర్ణయిస్తాడు." "క్యూలో నా ఎదుట నిలబడ్డ వ్యక్తి మౌలానా అస్తమయాన్ని "అకాలమరణం" అని ప్రస్తావించగానే నాకు మౌలానా రాసినా పై మాటలు గుర్తుకు వచ్చాయి. అదే అన్నాను ఆ వ్యక్తితో.

"నేను మౌలానా రచనలు అంతగా చదవలేదు. తఫ్‌హీముల్ ఖుర్ఆన్ తప్ప" అన్నాడు సిగ్గుపడుతూ. అతడు జమాఅత్ అనుయాయి కాకపోయినా జమాఅత్ పాకిస్తాన్‌లో ఇస్లామీయ జీవనవ్యవస్థ పునరుద్ధరణ కొరకు చేస్తున్న కృషి అద్వితీయమని భావిస్తాడట. మౌలానా రాసిన తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అంటే తన పంచ ప్రాణలేనట. జమాఅత్ కార్యకర్తల ధార్మిక సాంఘిక సేవా కార్యకలాపాలను చాలా సేపు కొనియాడుతూ వచ్చాడు.

"మరయితే మీరు ఈ ధార్మిక, సాంఘిక సేవాకార్యకలాపాలలో జమాఅత్‌తో సహకరించడానికి, అందులో చేరరెందుకూ?" అడిగాను కుతుహలంగా.

మరోమారు సిగ్గు పడ్డాడు. క్యూముందుకు సాగుతోంది, క్యూ నుండి కాస్త కుడి ప్రక్కకు తొలిగి వెనక్కి చూపిస్తూ అన్నాడు. "ఇదో ఈ మైలున్నర పొడుగు క్యూలో ఉన్న వారంతా జమాఅత్ అనుయాయులు కారు. వీరిలో, కేవలం జమాఅత్ పనుల్ని మెచ్చుకుని దాని కార్యకలాపాల్లో వీలయినంతగా తోడ్పడే వారు కనీసం సగం మంది ఉంటారు. వారంతా మౌలానా రచనలు చదివి ఉండరు, అయినా చదువుకున్న ప్రతి వాడు తఫ్‌హీమ్ తప్పక చదువుతాడు. దాన్ని మించిన ఖుర్ఆన్ వ్యాఖ్యానం ఉర్దూలో ఉన్న డజన్ల వ్యాఖ్యానాల్లో ఏదీలేదు, ఆ మాటకు వస్తే ప్రపంచంలోనే దానికి సాటిలేదు" అన్నాడు ఉద్రేకంతో.

అతడు ఇచ్చిన సంజాయిషీ నాకునచ్చలేదు. సరే క్యూ నుండి బయటికి వచ్చి నేను ఆ క్యూను చూసాను. మేము వచ్చి 10 నిముషాలయినా కాలేదు. మా వెనకాల ఫిరోజుపూర్ రోడ్డున కనుచూపు మేరలో అంతుకానరాని క్యూ తయారయింది. మా ముందు కూడ అరమైలు క్యూ ఉంది.

موت العالم موت العالم

مولانا مودودی انتقال کر گئے

جنگ کراچی

انا للہ و انا الیہ راجعون

موت العالم موت العالم

مفکرِ اسلام مولانا سید ابوالاعلیٰ مودودی خالقِ حقیقی سے جا ملے

مشرق

موت العالم موت العالم

مولانا سید ابوالاعلیٰ مودودی انتقال کر گئے

انا للہ و انا الیہ راجعون

ٹیلی ویژن پر خبر سن کر لوگ دھاڑیں مار مار کر رونے لگے ہزاروں سوگوار مولانا کے مکان پر جمع ہو گئے ممتاز سیاسی لیڈروں نے میاں محمد طفیل سے تعزیت کی

FOUNDED BY QUAID-I-AZAM MOHAMMAD ALI JINNAH

THE PAKISTAN TIMES

National English Daily with Largest Circulation

Maulana Maudoodi passes away

Loss to entire Muslim world, say Zia, Sawar

Govt. keen to transfer power; Nov. 17 polls

2 days: Talks with PNA possible

red parties

نوائے وقت

مولانا سید ابوالاعلیٰ مودودی انتقال کر گئے

دل کا دورہ جان لیوا ثابت ہوا۔ ایک گردہ اور جگر بھی جواب دے چکا تھا

سید ابوالاعلیٰ مودودی وفات پا گئے انا للہ انا الیہ

ఆ రోజు పత్రికలో...


ఆయన ప్రసంగిస్తూ ఉంటే
జనం శ్రద్ధగా, మౌనంగా
వినేవారట!

"భాయిసాబ్! క్రమంలో అంతరాయం రానివ్వకండి, కలిమా పఠిస్తూ నిలబడండి; దరూద్ పఠించండి." వేడుకుంటూ, ఉపదేశిస్తూ అన్నాడు మా భుజాల్ని తడుతూ ఓ వలంటీర్. తక్షణం మేము క్యూలోకి వచ్చేశాము. "ఈ వలంటీర్‌ని చూసారా. ఇతడు ఇస్లామీ జమీఅతె తలబా, (ఇస్లామియ విద్యార్ధి సంఘం) కార్యకర్త. దేశంలో విద్యాబుద్ధుల దృష్ట్యా, క్రమ శిక్షణ రీత్యా జమిఅత్‌కు ఓ విశిష్ఠ స్థానం ఉంది. 1977లో దేశంలో ఇస్లామీయ వ్యవస్థ స్థాపన కొరకు, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కొరకు జమీఅత్ కార్యకర్తలు ప్రదర్శించిన త్యాగం అనన్యమయింది, మిలిటరీ తుపాకులకే కాదు, మర ఫిరంగులకు కూడా ఎదురొడ్డినిలచారు – వీరి తర్ఫీదు అంతా మౌలానా మౌదూదీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగేది. పూ తోటను పెంచి వెళ్ళిపోయాడు మాలి, ఆయన ఒక్క సంజ్ఞ అయితే చాలు తమ ప్రాణాలనయినా త్యాగం చెయ్యడానికి వెనకాడ లేదు. మౌలానా ముసలి వారే, కాని ఆయన యువకుల నాయకుడు!" ఆవేశంగా అంటున్నాడు ఆ వ్యక్తి.

మేమూ దగ్గర పడ్డాము. నడి రాత్రివేళ, ఫిరోజ్ పూర్ రోడ్డు సగభాగం దర్శనార్థం నిలిచిన క్యూ కొరకు మూసి వేశారు. మైలున్నర పొడుగు ఉన్న క్యూలో గుసగుసల స్థాయిలో సంభాషణ, కలిమా పఠనం, దరూద్ పఠనం తప్ప మరేమి వినరావటం లేదు. ఏ క్రమశిక్షణను మౌలానా తన జీవితాంతం అనుయాయుల్లో ప్రవేశ పెట్టడానికి కృషి చేశారో దాని ప్రదర్శన అడుగడుగునా కొట్టవచ్చినట్లు కానవస్తోంది.

ఆయన యువకుల్లో అంతర్లీనం చేసిన ధార్మికత, ధర్మ పరాయణత, నైతికత ప్రతి వ్యక్తిలో స్పష్టమవుతోంది. పాకిస్తాన్ నలుమూలల నుండి వచ్చిన ప్రజలేమో, ఎందరో మిత్రులు ఇక్కడ కలుసుకుంటూన్నారు. మౌలానా మృతి పట్ల, పరస్పరం, అశ్రుపూరిత నయనాలతో పరామర్శించుకుంటున్నారు. ఎవరు ఎవరిని పరామర్శించాలో అర్థం కావడం లేదు, అందరూ బాధితులే, అన్నీ శోక సంతప్త హృదయాలే, ఎవరూ ఎవరికీ సాంత్వన పచనాలు పలకడం లేదు. ఏనోట విన్నా ఒక్కటే మాట "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" ఇదే వచనం అంతటా ప్రతిధ్వనిస్తోంది.

"భాయిసాబ్, దరూద్ పఠించండి కలిమా పఠించండి, ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్ (మేమంతా దైవం కొరకే, దైవం వైపునకే మరలిపోవలసిన వారం.) "ఫిరోజ్‌పూర్ రోడ్డు నుండి 5 ఏ, జైల్దార్ పార్క్, మౌలానా నివాసం ఉన్న వీధిలోకి తిరిగాము. వలంటీర్లు తొందరగా నడవమంటున్నారు. పవిత్ర వచనాల పఠనం ప్రతినోటా వినిపిస్తోంది. వీధిమలుపులో ప్రారంభమయి ఇంటిముఖద్వారం వరకు మౌలానా మౌదూదిగారి సూక్తులు పెద్ద పెద్ద అక్షరాల్లో అట్టలపై వ్రాయబడి వ్రేలాడుతున్నాయి.

"నేను ముస్లింని. దైవవాణి అయిన దివ్యఖురాన్, మహాప్రవక్త సంప్రదాయాలు నా మార్గ దర్శకత్వానికి ఉండగా నేను మార్గదర్శకత్వం కొరకు మరో వైపు చూడనవసరం లేదు."

"ఆదేశాలిచ్చే అధికారం, శాసనాలు నిర్మించే హక్కు అల్లాహ్‌కు మాత్రమే ఉంది"

"నా చివరి హితవు ఏమిటంటే ఎవరయితే దైవధర్మ మార్గంలో కృషి సలుపుతున్నారో వారు తమ స్వంత పని ప్రతిదానిపైన ఈ మహత్కార్యానికి ప్రాధాన్యత నివ్వాలి."

ఇంకా ఎన్నో సూక్తులు, మరెన్నో నినాదాలు ప్రజల్ని ఆకర్షిస్తూ వారి హృదయాలను ఆవేదనలో ముంచేస్తున్నాయి. అంతలోనే ఆంధ్రప్రదేశ్ జమాఅతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ అజీజ్ చిన్ననాటి గురువు, చాలాకాలం వరకు మౌలానా మౌదూదికి పి.ఏ.గా పనిచేసిన శ్రీ నకీఅలీ తన శిష్యుణ్ని వెదుక్కుంటూ "ఇన్నాలిల్లా......"పఠిస్తూ వచ్చారు. మౌలానా అజీజ్‌ని చూడగానే ఆలింగనం చేసుకున్నారు. పరామర్శలయ్యాయి. గేటు సమీపిస్తోంది.

ఈ ఇంటి నుండి దాదాపు 30 ఏళ్ళ వరకు విజ్ఞాన కాంతులు,ప్రపంచంలో నలుమూలలా ప్రసరించాయి. ఎక్కడెక్కడి నుండో వచ్చే ఇస్లాం ప్రేమికులు, నవయుగ ఇస్లాం పునరుజ్జీవనోద్యమ వైతాళికునితో కలసి, సంప్రదించి, తమ సమస్యలకు పరిష్కారాలు పొందగోరే వారంతా ఈ వీధిన నడవ వలసిందే. పండితులు, పామరులు, యువకులు, వృద్ధులు, వ్యాపారులు, పారిశ్రామికులు, నాయకులు, అధికారులు అంతా తమ సమస్యల పరిష్కారాలకై, తమ సందేహల నివృత్తికై ఈ గడపతొక్కవలసిందే.

"భాయిసాబ్ ఆగే బఢియె" అదరిపడ్డాను.

అప్పుడే శవపేటిక దగ్గరకు వచ్చేశాను. రెండు క్షణాలయినా నన్ను ఆ తేజోవంత మయిన దివ్యరూపాన్ని తిలకించనివ్వడం లేదు వాలంటీరు. వెడల్పాటి ముఖంలో ఏ మాత్రం తగ్గని గులాబీ ఛాయలు మౌలానా కేవలం నిద్రపోతున్నారని సూచిస్తున్నాయి. బ్రతికుండగా ఆయన్ని చూసే భాగ్యం కలగలేదు. ఇప్పుడయినా తనివితీరా చూసే అవకాశం లేదు. కన్నులు మసకబారి పోతున్నాయి.

"బఢియే సాబ్, ఆగే బఢియే".

ఎలా వచ్చానో బయటికి వచ్చేశాను. ఏదో వెలితి, ఆవేదన నిస్సహాయత, ఏవేవో అనిర్వచనీయ భావాలు నన్నావరించాయి. అదుపు తప్పిన గుండెలతో ఒక తరానికి వెలుగునిచ్చిన ఆ జ్యోతిర్మయుని రూపు తలచుకుంటూ గేటుకు అవతల నిల్చొని ఆయన నివాసం వైపు చూస్తూ నిలబడిపోయాను.

❖ ❖ ❖

"అల్లాహు అక్బర్, అలాహు అక్బర్" అజాన్ పిలుపు!

రాత్రి చాలాసేపు మేల్కోవడం మూలాన బద్ధకంగానే లేచాను. కాలకృత్యాలు తీర్చుకుని, వుజూచేసి మస్జిద్‌కు వెళ్తున్న సమయాన ఎవరో చెప్పారు– ఫజర్ నమాజ్

కాగానే బస్సుల్లో ఇఙ్రా వెళ్ళాలని. భారతదేశ ప్రతినిధి వర్గానికి ప్రత్యేక దర్శన సౌలభ్యం ఏర్పాటు చేశారని. మస్జిద్ వద్దకు వెళ్ళేటప్పటికి, దేశం నలుమూలల నుండి జమాఅత్ కార్యకర్తలు మౌలానాగారి అంతిమ దర్శనార్థం రావడం వల్ల అక్కడ స్థలం చాలలేదు. ప్రాంగణంలో నమాజ్ ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి టీవి వద్ద, పొంగుకు వస్తున్న దుః ఖాన్ని ఆపుకుని పొరలి వస్తున్న అశ్రువుల్ని ఆపుకోలేక పోయిన మాజీ ప్లానింగ్ శాఖ మంత్రి ప్రొ. ఖుర్షీద్ అహ్మద్ చాపలు పరిచి వరుసలు సరిజేస్తున్నారు.

నమాజ్ ముగిసాక మా కోసం ఏర్పాటు చేసిన బస్సులో ఇఙ్రా వెళ్ళాం. బస్సు దిగగానే కనిపించిన దృశ్యం - రాత్రి కనిపించిన దాదాపు మైలున్నర పొడుగు క్యూ అలాగే ఉంది! జనసందోహం ఏ మాత్రం తగ్గలేదు. ఫిరోజ్‌పూర్ రోడ్డు ఒక భాగం అలాగే మూసి ఉంది. వలంటీర్లు అలాగే హితబోధలు చేస్తున్నారు- "కలిమా పఠించండి, దరూద్ పఠించండి - ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్"

ఒక వలంటీర్‌ని అడిగితే చెప్పాడు రాత్రి 9-30 గంటనుండి ఇప్పటి వరకు క్యూ అలాగే ఉందని. అక్కడ పని చేస్తున్న వలంటీర్లను జాగ్రత్తగా పరిశీలించాను. వారిలో చాలా మంది రాత్రి కనిపించిన వారే! రాత్రంతా జాగరణ చేస్తూ గడిపారన్న మాట. ఆ మాటే అడిగాను ఒక వలంటీర్ని. అతని కళ్ళు జలజల లాడాయి. మా జీవితాలను ఇస్లాం పోతపోసి తీర్చిదిద్దిన సయ్యిదీ కొరకు, ఆయన ప్రేమికుల కొరకు ఈ మాత్రం చెయ్యలేమా? అన్నట్టు బాధాపూరిత నయనాలతో మందహాసం చేశాడు.

"భారత అతిథులు" అంతా ప్రత్యేక ఏర్పాటు ప్రకారం మరో క్యూలో దర్శనార్థం లోపలికి వెళ్ళారు. క్యూలో నిల్చున్నవారు ఈ ప్రత్యేకత పట్ల నిరసన తెలుపుతారేమో అన్న సంశయం కలిగింది నాకు. కాని మమ్మల్ని సహృదయతతో చూడనివ్వడమే కాక మా వైపు ప్రశంసా పూర్వకంగా కూడా చూస్తున్నారు. మరో మారు ప్రశాంతవదనాన్ని తిలకించే భాగ్యం కలిగినందుకు లోలోనే దైవానికి కృతజ్ఞతలు అర్పించుకుంటూ ముందుకు సాగాను. రాత్రి మెర్క్యురీ బల్బుల కాంతిలో కంటే పగటి వెలుగులో ఆ గుండ్రని వెడల్పాటి ముఖం ఇంకా నిగనిగ లాడుతోంది.

విశాలమైన నుదుటిపైనా చెంపలపైనా మెరిసే గులాబీ వన్నెలోని కాంతి ద్విగుణీకృతమయి ఉంది. ఈ సారి వెనకాల నుండి వచ్చి నిల్చోడానికి భారతీయ అతిధులకు ప్రత్యేక సౌకర్యం కల్పించారు. దాదాపు పావుగంట నిల్చొని ఆ ముఖారవిందాన్ని చూడగలిగాను. క్యూ ఏ మాత్రం తగ్గడం లేదు. ఏవరో మిలిటరీ జవాన్‌లా ఉన్నాడు 'టక్' మని శబ్దం చేసి అటెన్షన్‌లో సెల్యూట్ అర్పించుకుని కళ్ళు తుడుచుకుని వెళ్తున్నాడు. దాదాపు 80 ఏళ్ళ వృద్ధుడు మరొకాయన బిగ్గరగా రోదిస్తూ "ఇంకే ముంది మా సర్వస్వం నేడు కోల్పోయాం" అంటూ అక్కడే చతికిలబడ్డాడు., ముగ్గురు వలంటీర్లు అతన్ని లేపి బయటకు తీసుకెళ్తున్నారు. పాతికేళ్ళ యువకుడు శవాన్ని చూడగానే ఒక్కసారిగా తన

వెనకనున్న మిత్రుని వాటేసుకొని విలపిస్తున్నాడు. ఇద్దరు వలంటీర్లు అతన్ని సముదాయించ డానికి ప్రయత్నిస్తున్నారు. అతడు వాళ్ళ చేతుల్లోనుండి జారి కింద పడిపోయాడు. మరో ఇద్దరు వలంటీర్లు వచ్చి అతన్ని లేవదీశారు.

"స్పృహ తప్పాడు, ప్రక్కకు తీసుకురండి." "నీడన పట్టండి." "పంకా కిందికి తేండి."

తలో విధంగా అంటున్నారు. కాని వలంటీర్లు అతన్ని ఎత్తుకుని పక్కగదిలోకి తీసుకెళ్ళి పరుండ బెట్టారు. ఫ్యాన్ గాలి తగులుతోంది. చన్నీళ్ళు చల్లి స్పృహ తేవడానికి ప్రయత్నం చేస్తున్నారు.

అప్పుడే రషీద్‌గారు దిన పత్రికతెచ్చారు అందులో ఒక వార్త- "బిబిసిలో అల్తాఫ్ గొహర్ నివాళులు."

క్రితం రోజు బిబిసి ప్రసారం చేసిన ఉర్దూ ప్రొగ్రాంలో, పాకిస్తాన్ ప్రభుత్వపు మాజీ సెక్రటరీ, డాన్ మాజీ సంపాదకుడు అయిన అల్తాఫ్ గొహర్ (ప్రస్తుతం లండన్ లో "థర్డ్ వరల్డ్ మీడియా" అనే సంస్థ అధినేత) మౌలానా మౌదూదీ గురించి తన సొంత అభిప్రాయాలు వెల్లడించారు. ఆయన చివర్లో గద్గదస్వరంతో అన్న మాటలు నేడు యదార్థాలుగా ప్రతివ్యక్తి ఇక్కడ తిలకించ గలుగుతున్నాడు.

"నేను ఇక్కడ మౌలానా నమాజె జనాజాలో పాల్గొని టాక్సీలో తిరిగి వస్తున్న వేళ డ్రైవర్ అడిగాడు, 'అతను ఎవరు? నవయువకుడా?'

'కాదు ఆలోచనా యువ్వనుడు!' అన్నాను.

టాక్సి డ్రయివర్ వెనక్కి తిరిగి నావైపు వింతగా చూసి, 'మి బంధువా?' అనడిగాడు.

నేనన్నాను, 'లోక బంధువు!'

దివ్యప్రస్థానం:

"మేమంతా హైదరాబాద్ (దక్కన్) నుండి వచ్చామని చెప్పి, మా అందరి తరఫున మీ అమ్మకు, చెల్లెండ్రకు మా సంతాపాన్ని తెలియచేయండి - మౌలానాకు హైదరాబాద్‌తో ఉన్న అనుబంధం, అనురాగం ఎంతో విశిష్టమయినది." మా రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌గారు మౌలానా జ్యేష్ఠకుమారుడు సయ్యిద్ ఉమర్ ఫారూక్ మౌదూదీని మేమంతా కలసి పరామర్శించినప్పుడు చెప్పారు.

"జజా కల్లాహ్! దైవం మీ ఎడల మేలు చేయుగాక! మీరంతా అంతశ్రమకోర్చి ఇంత దూరం వచ్చారు, అలాగే చెబుతాను" కాస్త పొట్టిగా దృఢంగా ప్రశాంత వదనంతో సహనం వల్ల ఏర్పడ్డ గాంభీర్యంతో, "ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" పఠిస్తూ అందరినీ పలకరిస్తూ ఉన్నాడు ఉమర్ ఫారూక్.

మౌలానా ఈ కుమారుణ్ణి అమితంగా ప్రేమించేవారట. కారణం, అతని వినయ విధేయతలే అయిఉంటాయి. అతడు ఖురాన్ పఠనం చేసి అర్థం బోధించే సమయంలో అతని కంఠం, ధోరణి వ్యాఖ్యాన పంథా అంతా తన తండ్రిలాగే ఉంటుందట! రియాజ్‌లో ఏదో శాఖలో పనిచేస్తున్నాడు. చిన్నగడ్డంలో అక్కడక్కడ తెలుపుఛాయలు కనిపిస్తున్నాయి. మిగతా అయిదుగురు తమ్ముళ్ళు ముగ్గురు చెల్లెండ్రున్న ఆ కుటుంబంలో తల్లి తరువాత తానే పెద్దదిక్కు. మౌలానా అస్తమయం వల్ల కుటుంబ వ్యవహారాల భారం తన మీదే పడ్డది.

మౌలానా రెండవ తనయుడు అహ్మద్ ఫారూక్ జఫెలో లోని ఓ ప్రఖ్యాత ఆసుపత్రిలో డాక్టరుగా పని చేస్తున్నాడు. మౌలానా చివరి చికిత్స ప్రారంభంలో అక్కడే జరిగింది. మూడవవాడు పాత్రికేయుడు, నాలుగో అతను పైలట్, 5వ వాడు ఏదో వ్యాపారంలో ఉండగా, ఆరో కుమారుడు చదువుకుంటున్నాడు. ముగ్గురు అమ్మాయిల పెళ్ళిళ్ళయ్యాయి. గొప్పతండ్రికి చెందిన ఈ సంతానం ఇంత గొప్ప దుఃఖంలోనూ సహనాన్నీ గాంభీర్యాన్ని కోల్పోలేదు.

ఎనిమిది గంటలు కావస్తునాయి. మైక్‌లో ఏదో ప్రకటన: సరిగ్గా 8-30కు దర్శన కార్యక్రమం ముగుస్తుంది. అరగంట కాలంక కుటుంబ సభ్యులకు గాను కకేటాయించబడింది. సరిగ్గా తొమ్మిది గంటలకు శవ పేటిక కజాఫి స్టేడియం చేరుతుంది. అక్కడ నమాజె జనాజా జరిగాక శవ పేటిక తిరిగి ఇఛ్రాలోని మౌలానా నివాస గృహానికి ఖననం కొరకు తేబడుతుంది. దర్శనార్థం వచ్చే ప్రేమికులు వస్తూనే ఉన్నారు. మౌలానా దాదాపు 50 ఏళ్ళ ప్రజాజీవితం గడిపారు. అనేక పత్రికల సంపాదకులుగా గొప్ప గొప్ప గ్రంథాల రచయితగా, ఒక మహత్తరమయిన ఉద్యమ వైతాళికుడిగా, అత్యుత్తమ సంస్థ రథసారధిగా, అన్నింటినీ మించి దేవుని అంతిమ గ్రంధానికి అద్వితీయమయిన వాఖ్యానకర్తగా! ఈ ప్రజా జీవితం దేశ దేశాలలో మూడు తరాల వారిని ప్రభావితం చేసింది. కోట్లాది ప్రజలు ఆయన రచనలు చదివి మనోపరివర్తన చెందారు. తన్మూలంగా కొత్తపంథా రచయితలు, పాత్రికేయులు ఉద్భవించారు. అనేక ఉద్యమాలు వెలిసాయి. కోటాను కోట్ల ప్రజల హృదయాలను చూరగొన్న ఆ అపురూపమయిన వ్యక్తిత్వం తన 76వ ఏట, తాను వెలిగించిన జ్యోతి బ్రహ్మాండమైన కాంతిపుంజంగా మారుతున్న తరుణంలో రంగం నుండి నిష్క్రమిస్తోంది.................తటాలున ఆయన మాటలు గుర్తుకు వచ్చాయి.

"వయసును గురించి కొందరి అభిప్రాయమే తప్పు. వయసు వాస్తవానికి జీవిత పరీక్షలో నెగ్గడానికి మనకు ఇవ్వబడిన వ్యవధి. పరీక్ష గదిలో పరీక్షా పత్రానికి జవాబులు రాయడానికి కేటాయించబడిన సమయం లాంటిది ఇది. ఈ కాలాన్ని లేక దానిలోని ఒక భాగాన్ని మీరు ఉత్తుత్తినే వ్యయ పరిచారంటే మీరు దాన్ని మీ పరాజయానికై నిష్ఫలతకై వినియోగించారన్న మాట- విజయానికై సాఫల్యానికై కాదు!"

ఎనిమిదిన్నర కావస్తోంది. దర్శన కాలం ముగిసిన ప్రకటన జరిగింది- కాని ప్రేమికుల వెల్లువ ఆగటం లేదు. 15 నిమిషాల్లో అంతా ముగించివేశారు. మగవారు క్రమంగా బయటికి వెళ్తున్నారు. కుటుంబ మహిళలు 15 నిముషాల్లో దర్శనం ముగించుకుపోయారు. సరిగ్గా 9 గంటలకు శవపేటిక మూసే తతంగం ముగిసింది. పి.ఐ.ఏ. ట్రక్కు పెద్దగేటువద్దకు వచ్చింది.

"సయ్యిదీ, ముర్షిదీ, ఆల్ విదా, అల్ విదా."

ప్రశాంత వాతావరణంలో సంచలనం కలిగించే నినాదం! యువప్రేమికులంతా అదుపుతప్పి రోదించసాగారు. యువకులు శవపేటిక ఎత్తారు. కొందరు శవపేటికను వాటేసుకుని విలపిస్తున్నారు. శవపేటిక ట్రక్కులో పెట్టారు. ట్రక్కులో జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్ అధ్యక్షుడు మియాఁ తుఫైల్ ముహమ్మద్, ప్రొ. ఖుర్షీద్ అహ్మద్, మౌలానా కుమారులు డా. అహ్మద్ ఫారూక్, హుస్సైన్ ఫారూక్, భారత ప్రతినిధి మౌలానా సదురుద్దీన్ ఇస్లాహి ట్రక్‌లో పేటికకు తోడుగా ఉన్నారు.

శవపేటిక ఉన్న ట్రక్కులో ఒకప్రక్క పాకిస్తాన్ జాతీయపతాకం మరో ప్రక్క జమాఅత్ పతాకం ఎగురుతున్నాయి. జమాఅత్ పతాకంలో నీలిరంగు పట్టి ప్రక్కన తెల్ల పట్టి ఆ తరువాత విశాలమయిన పచ్చరంగులో తెల్లటి అరబీ అక్షరాల్లో "లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్" అని వ్రాసి ఉంది. ట్రక్‌ను ఇంటి నుండి రోడ్డు వరకు తేవడానికి పటిష్ఠమయిన బందోబస్తు చేశారు. జమిఅత్ కార్యకర్తలు రోడ్డుపైన మౌలానా ఇంటివైపుకు పోయే జనాన్ని నిలిపేశారు. ఇంత దుఃఖం, ఇంత బాధ, ఇంత అలసటలోనూ జమీఅత్ కార్యకర్తలు ఓరిమి కోల్పోలేదు. ఎంతో మృదువుగా సంభాషిస్తూ ప్రేమికుల ప్రవాహానికి అడ్డుగా నిలిచారు. ఎంతో వినమ్రతతో నచ్చచెప్పుతున్నారు. ట్రక్కు రోడ్డుపైకి రాగానే, ప్రజలు సహనం కోల్పోయ్యారు. ఏదో కోలాహలం! కాదు కాదు అందరూ ఏదో పఠిస్తున్నారు!! లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదు ర్రసూలుల్లాహ్ !!!! కన్నులు వర్షిస్తున్నాయి, రుద్ధకంఠాలు, కలిమయే తయ్యిబా పఠిస్తున్నాయి! ట్రక్కుకు ముందు, బైకుల బృందం బయల్దేరింది. ట్రక్కుకు నాలుగు ప్రక్కలా కాలినడకన పోయే లక్షలాది ప్రజలు ఆ వెనకాల ఎన్నో ట్రక్కుల్లో ప్రజలు ఒక పట్టణమే కదలి వస్తోంది కజాఫీ స్టేడియం వైపునకు. ఫిరోజ్‌పూర్ రోడ్డున ట్రాఫిక్ మూసివేశారు.

ఈరోజు రోడ్లన్నీ కజాఫీ స్టేడియం వైపునకే పోతున్నాయా అన్నట్టు జన సందోహం అక్కడ చేరుతోంది. స్టేడియంలోని 8 ద్వారాలూ తెరచివేశారు. వరదల్లా ఉబికి వస్తున్నారు ప్రజలు, బస్సుల్లో, ట్రక్కుల్లో, కార్లపై, స్కూటర్లపై కాలినడకన!

"రబ్బె కాబా, రబ్బె కాబా, నుస్రత్‌దే, రహ్మత్‌దే" (కాబా ప్రభువు, సహకరించు కరుణించు) "అల్‌విదా అల్ విదా సయ్యిదీ ముర్షిదీ" "లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదు ర్రసూలుల్లాహ్" అనే నినాదాలతో జనాజా బయల్దేరింది. జనాజా ఊరేగింపులో చాలా

మంది స్పృహతప్పి పడిపోయారు. స్టేడియంలోనూ ఒక యువకుడు స్పృహతప్పాడు. అతన్ని రెడ్ క్రిసెంట్ అంబులెన్స్ ద్వారా ప్రథమ చికిత్స అందజేయబడింది; తరువాత అతన్ని సర్వీసెస్ ఆసుపత్రికి చేర్చారు. షాద్‌మా చౌక్ వద్ద ఒకతనికి గుండెనొప్పి వచ్చింది. అతన్ని కూడా సర్వీసెస్ ఆసుపత్రిలో చేర్చారు. దారిలో ఇంకా ఎంతో మంది స్పృహతప్పి పడిపోతుంటే ప్రథమ చికిత్స కొరకు కొందరు నిమగ్నులు కావలసి వచ్చింది.

జనాజా చేరేముందే స్టేడియం అంతా నిండిపోయింది. మైకులో క్రమశిక్షణ పాటించడానికి, కలిమా పఠిస్తు కూర్చోడానికి మరీమరీ కోరబడుతోంది. లక్షలాది ఇస్లామ్ ప్రేమికులు తమ బంధువు, తమ నాయకుడు, తమ ప్రేమల కేంద్రమయిన మౌదూది కొరకు నిరీక్షిస్తున్నారు. మేమంతా వి.ఐ.పి. ద్వారం గుండా లోనికి ప్రవేశించాము. అతిధులం కాబట్టి! జనంలోనికి రావడానికి అన్ని ద్వారాల్లోనూ త్రొక్కిసలాట జరుగుతోంది. చివరికి ద్వారాలు మూసివేశారు. జనం స్టేడియం మెట్లపై కూడా నిల్చున్నారు. వెనకాల ట్రక్కుల్లో వచ్చిన వారంతా ఇంకా స్టేడియంలోనికి చేరనేలేదు. వారంతా బయటే నిల్చుని జనాజా నమాజ్ చేయడానికి వరసలు సరిచేసుకుంటున్నారు. మైక్‌లో వారికి ఆదేశాలు ఇవ్వబడుతున్నాయి.

పదిగంటల 5 నిముషాలకు మౌలానా భౌతిక కాయం అల్యూమీనియం శవ పేటికలో (అమెరికా నుండి అందులోనే వచ్చింది) వచ్చిచేరింది. శవపేటిక మోసుకువచ్చే ట్రక్కుతో పాటు లోనికి రావాలని అనేక మంది ప్రేమికులు చొరబడ్డారు. గేటు మూసివేస్తున్నా లెక్కజెయ్యలేదు. కొందరికి గాయాలు తగిలాయి. ఆ శవపేటికను మోయాలని, తమ భుజాలపైగా, చేతులపైగా తమ నాయకుని అంతిమ ప్రయాణం, దివ్య ప్రస్థానం జరగాలని తహతహలో ఆరాటంలో ప్రాణాలను సయితం లెక్కజేయకుండా ప్రేమికులు ముందు ముందుకు ఉరకలు వేస్తున్నారు. శవపేటిక స్టేడియంలోకి తెచ్చి గంటల తరబడి నిరీక్షిస్తున్న ప్రేమికుల ముందు ప్రార్థనకై పెట్టబడింది. ఆ ప్రేమికుల్లో ముందు వరుసలో ఉన్నవారు కుడిప్రక్కన భారతదేశ అతిథిబృందం, ఆ తరువాత కతర్ ధార్మిక శాఖ డైరెక్టర్, అజ్‌హర్ యూనివర్సిటీ(కైరో) మాజీ వైస్ ఛాన్సలర్ డా॥ యూసుఫ్ అల్ కర్జావి, సౌదీ దౌత్యాధికారి రియాజుల్ ఖతీబ్, సౌదీ పండితుడు డా॥ అహ్మదల్ కాదిర్ జాబిర్, సౌదీ కౌన్సిలర్ ఖాలిద్ హమాన్, ఈరాన్ దౌత్యాధికారి ఆకాయి ముహమ్మద్ గంజీదోస్త్, ఈరాన్ కౌన్సిల్ జనరల్ ముహమ్మద్ అర్దక్ ఉర్ద్, కువైత్ నాయకులు ముహమ్మద్ అద్నాన్ సయీద్, అబ్దుల్ అజీజ్ ముతవ్వా, అబ్దుల్ కయ్యూమ్, పాకిస్తాన్ ఇస్లామిక్ సైద్ధాంతిక మండలి అధక్ష్యుడు జస్టిస్ ముహమ్మద్ అఫ్‌జల్ చీమా, మాజీ ప్రధాన న్యాయాధిపతి జస్టిస్ సర్దార్ ముహమ్మద్ ఇక్బాల్, పి.ఎస్. ఏ.నాయకుడు ముఫ్తీ ముహమ్మద్, నవాబ్జాదా నస్రుల్లా ఖాన్, రిటైర్డు ఏయిర్ మార్షల్ అస్గర్ ఖాన్, ఇంకా ఎందరో దేశ విదేశ నాయకులు, ప్రముఖ వ్యక్తులున్నారు.

సరిగ్గా 10 గంటల 29 నిముషాలకు పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ ముహమ్మద్ జియా ఉల్‌హక్, పంజాబ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సర్దార్ ఖాన్ వచ్చి కూర్చున్నారు. డా॥ యూసుఫ్ అల్ కర్జావీ లక్షలాది ఇస్లాం ప్రేమికుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు "..........సయ్యిద్ మౌదూదీ తన సందేశం, తన ఆలోచనల్లో నిత్యం సజీవంగా ఉంటారు. ఆయన వందలాది గ్రంథాలు వదలి వెళ్తున్నారు. ఆయన ఆధ్యాత్మిక సంతానం ప్రపంచంలో కోటానుకోట్ల సంఖ్యలో ఉంది. మేము మీ వద్దకు మా సంతాపాన్ని వెలిబుచ్చడానికి, మిమ్మల్ని పరామర్శించడానికి రాలేదు. ఆయన అనుయాయులు ప్రపంచమంతా వ్యాపించి ఉన్నారన్న సత్యాన్ని చాటడానికివచ్చాము. మేము మౌలానా ఉద్యమాన్ని ముందుకు నడుపుతాము........పాకిస్తాన్‌లో నిజమయిన ఇస్లామీరాజ్యం ఏర్పడటమే ఈ దేశానికి శ్రేయస్కరం. మౌదూదీ ప్రేమికులారా, ఈ ధ్యేయం నెరవేర్చడానికి కృషి చేయడం మీవిధి, మీకర్తవ్యం........................"

జనాజా నమాజ్ కొరకు వరుసలు సరిచేస్తున్నా, అల్లామా యూసుఫ్ అల్ కర్జావీ నమాజ్ చేయిస్తున్నారు. నమాజ్ ముగిశాక మియా తుఫైల్ ముహమ్మద్, డా॥ అహ్మద్ ఫారూక్ ఏదో ప్రకటించనున్నారని మైక్‌లో తెలిపారు. కాని ప్రజలు ఒక్కసారిగా శవపేటిక వైపునకు ఎగబడ్డారు. జమీఅత్ యువకులు అందరినీ ఆపలేకపొయ్యారు. మైక్ చెడిపోయింది. మియా తుఫైల్ ప్రకటన వినబడలేదు. గత్యంతరం లేక శవపేటిక లేపి ట్రక్‌లో పెట్టారు. ట్రక్ తిరిగిఅవే నినాదాలతో, కలిమా పఠనంతో వెనక్కి ఇఛ్రా వైపునకు మరలింది. ట్రక్‌లో నాయకులు విదేశీ అతిథులు ఎక్కారు.

మౌలానా నివాసానికి 12-30 గంటలకు జనాజా చేర్చబడింది. మౌలానా నివాసంలోనే ముందు భాగాన లాన్‌లో ఒక ప్రక్కన అంతిమ నివాసం నిర్మిస్తున్నారు. అక్కడ గత ముప్ఫయి ఏళ్ళుగా మౌలానా అస్ర్ నమాజ్ తరువాత (5 గంటల ప్రాంతంలో) కూర్చుని మిత్రులు, శత్రువులు అందరితో కలిసి ముచ్చటిస్తూ ఉండేవారు. అక్కడే తూర్పువైపున ఈ సమాధి నిర్మించబడుతోంది. సమాధి నిర్మించడానికి ఇంకా కాస్తవ్యవధి ఉంది. అంతా ఓర్పుతో మౌనంగా కూర్చుని ఉన్నారు. అంతలో మౌలానా మనుమళ్ళు ఇద్దరు ఇంటిలో నుంచి వచ్చి అక్కడ నిలబడ్డారు. ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"అక్కడికి వెళ్ళకు తాతయ్య విశ్రమిస్తునారు".

"ఇంత మంది ఇక్కడ ఇలా మాట్లాడుకుంటూ ఉంటే తాతయ్యకు అంతరాయం కలగదా?" కాస్సేపయ్యాక మళ్ళీ అతనే అన్నాడు "రోజూ ఇలాగే జనం వస్తుంటే తాతయ్య తనపని ఎలా చేసుకుంటూరు?"

ఈ సంభాషణ వినగానే అక్కడున్నవారు వెక్కివెక్కి ఏడ్వ నారంభిచారు, రెండు గంటల ప్రాంతంలో తిరిగి మరో నమాజ్ జనాజా చెయ్యబడింది. సహనానికి, ఓరిమికి, గాంభీర్యానికి పరీక్షా ఘడియలు ఆసన్నమయ్యాయి. భౌతికకాయాన్ని పేటిక నుండి కట్టె

పేటికలోకి మార్చి దాన్ని సమాధి వద్దకు తెచ్చారు. బట్టను గట్టి త్రాడులా పేని వాటి ఆధారంగా మౌలానా కుమారులు మియా తుఫైల్, ఖుర్షీద్ అహ్మద్, ఇతర నాయకులు భౌతిక కాయాన్ని సజల నయనాలతో ఎక్కిళ్ళ మధ్య గోరీలోకి దింపారు. ప్రయాణం ముగిసింది. అంతటితో ఇస్లామీయ ఉద్యమ చరిత్రలో ఒక అధ్యాయాన్ని ముగించారు. నిరంతరం వెలుగునిచ్చిన జ్యోతి మట్టిలో పూడ్చుకుపోయినా అక్కడా వెలుగును విరజిమ్ముతుందనే అచంచల నమ్మకంతో ఆయన అనుయాయులు ఒకరినొకరు వాటేసుకుని పరామర్శించుకుంటున్నారు.

❖ ❖ ❖

పంజాబ్ యూనివర్సిటిలోని ఫైసల్ ఆడిటోరియం, దాదాపు 2000 మంది విద్యార్థీ విద్యార్థినులు, ప్రముఖులు, యువకులతో నిండిపోయింది. కొంతమంది బయటే నిల్చున్నారు. స్టేజీపైన యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు జావీద్‌అఖ్తర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మధ్యలో జమాఅతె ఇస్లామి పాకిస్తాన్ అధ్యక్షుడు మియాఁ తుఫైల్ ముహమ్మద్ ఆయనకు ఇరుప్రక్కలా దేశ విదేశాలనుండి వచ్చిన నాయకులు, ప్రముఖులు కూర్చున్నారు.

దివ్యవాణి పఠనంతో ప్రారంభమయిన సంతాప కార్యక్రమం మధ్య మధ్యలో హాలంతా మార్మోగే నినాదాలతో విప్లవసభలా రూపొందసాగింది. ముఖ్యంగా ఈజిప్టులో మహత్తరమైన ఇస్లామీయ ఉద్యమాన్ని నడిపి, ఫారూక్ కాలంలో అమరగతిపొందిన హసనుల్ బన్నాషహీద్ కుమారుడు డా॥ సైఫుల్ ఇస్లాం అకస్మాత్తుగా స్టేజి పైకి వచ్చినప్పుడు వాళ్ళ నాన్న గుర్తుకు వచ్చి ఒక వంక హాలంతా శ్రద్ధాపూర్వకమైన అశ్రువులు ప్రవహిస్తూ ఉండగా మరొక వంక యువకులు "లాషరకియ్యా లాగరబియ్యా. ఇస్లామియ్యా ఇస్లామియ్యా" (ప్రాచ్యులూ కారు పాశ్చాత్యులూ కారు, ఇస్లామీయులు ఇస్లామీయులు) అనే భౌగోళికవిభజనల్ని అంతమొందించే నినాదాలతో హృదయాల్లో వేడినెక్కించారు.

సంతాప సభలో ప్రసంగించిన ప్రముఖుల్లో కతర్ యూనివర్సీటీ వైస్ ఛాన్సలర్ డా. యూసుఫుల్ కర్జావీ, వరల్డ్ ఆసెంబ్లీ ఆఫ్ ముస్లిం యూథ్ సెక్రటరీ జనరల్ డా॥ అహ్మద్ తోతోంజి, ముహ్మద్ బిన్ సఊద్ యూనివర్సిటీకి చెందిన డా॥ తాహా జాబిర్, కువైత్ విద్వాంసుడు అబ్దుల్లా అల్ అకీల్, జమాఅతె ఇస్లామీ బంగ్లాదేశ్ అధ్యక్షుడు అబ్బాస్ అలీఖాన్, జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షుడు మౌలానా ముహమ్మద్ యూసుఫ్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొ. ఖుర్షీద్ అహ్మద్, గొప్ప ఈజిప్టు పండితుడు అబ్దుల్ అజీజ్ ముతవ్వా, డా. సైఫుల్ ఇస్లాం, అల్ ఇఖ్వానుల్ ముస్లిమూన్ ఉద్యమ నాయకుడు డా. కమల్ సనానీరీ, సిరియాలో ఇస్లామీయ ఉద్యమనాయకుడు సయీద్ హవ్వా, కతర్ చీఫ్ జస్టిస్ అబ్దుల్ అజీజ్ అబ్దుల్లా అల్ ముహమ్మద్, ఇస్లామీ జమీఅతె తలబా పాకిస్తాన్ అధ్యక్షుడు లియాకత్ బిలోచ్ తదితరులు ఉన్నారు.

యువనాయకుడు అయిన డా॥ అహ్మద్ తోతోంజీ మాట్లాడుతూ ఒక సందర్భంలో తన పరిచయం జరుగుతున్నప్పుడు మౌలానా మౌదూదీ తనను ఇమాము ష్షబాబ్ (యువకుల నాయకుడు) అన్న వైనం గుర్తు చేసుకుని "నాకు మౌలానా గారు ఈ బిరుదు ఇవ్వడం గర్వకారణం, నా నుండి ఆయన ఆశించినదాన్నీ నెరవేర్చడానికి శాయశక్తులా కృషిచేస్తాను. ఇక్కడే కాదు ప్రపంచం మొత్తాన మౌలానా యువకుల్లో కొత్త జీవం పోశారు. ఆయితే ఆయన కేవలం యువకుల నాయకుడు కాదు. మొత్తం ముస్లిం సమాజానికే నాయకుడు. మేము ఎవరికీ సానుభూతి తెలుపడానికి రాలేదు. ఎందుకంటే మేమందరమూ ఆ సానుభూతికి అర్హులమే"!

మౌలానా అస్తమయం వల్ల తనలో కలిగిన మార్పును ప్రస్తావిస్తూ "నేను కొత్త సంకల్పం, కొత్త దీక్ష నాలో పొందాను, నేడు మనం బాధవల్ల మన భావాలను సరిగ్గా వెలిబుచ్చ లేకపోతున్నాం. అయితే మన భావాలను దైవచిత్తమయితే క్రియారూపంలో, అచరణలద్వారా నిరూపించుకుందాం మౌలానా అయితే తన ఒక వ్యక్తిత్వంలోనే ఆయన ఓ పెద్ద సైన్యాన్ని ఇనుమడించుకున్నారు. ఆ సైన్యం జీవితపు ప్రతిరంగంలో మిధ్యా శక్తులతో పోరాడింది. మనమూ ఆయన లేవదీసిన ఉద్యమాన్ని పరిపూర్ణంగావిద్దాం"

ఈ మాటలనగానే హాలులో ఽకూర్చున్న విద్యార్థులంతా హాలంతా దద్దరిల్లేలా- "నారయే తక్బీర్ అల్లాహు అక్బర్" అనీ "ఇన్కిలాబ్ ఇన్కిలాబ్, ఇస్లామీ ఇన్కిలాబ్ " నినాదాలు చేశారు. నినాదాల ఉరుములు తగ్గాక డా. తొతోంజీ ఆఫ్రికా పట్టణాలకు బహుదూరంగా, అడవుల్లో పయనిస్తూ ఉన్నా ప్రచారకులను చూసిన దృశ్యం వర్ణించారు, అక్కడ 40 లేదా 50 మంది యువజనులు కూర్చొని ఒక చెట్టు బోదెను నల్లబల్లగా ఉపయోగించుకుంటు ఏదో నేర్చుకుంటున్నారు. వారి దగ్గర రెండే రెండు పుస్తకాలు అక్కడి భాష "స్వాహిలీభాష"లో ఉన్నాయి. వాటిలో ఒకటి మౌలానా మౌదూది రచన అయితే మరొకటి అల్లామా సయ్యిద్ కుతుబ్ రచన!

షరీఅత్ కాలేజి (కింగ్ స ఊద్ యూనివర్సిటీ) ప్రిన్సిపాల్ అయిన డా॥ తాహా అల్జాబిర్ మాట్లాడుతూ ఈ యుగంలో సత్యధర్మ పునరుజ్జీవనోద్యమాన్ని విజయవంతంగా నడిపిన నలుగురు మహనీయులలో మౌలానా ఒకరు. హసనుల్ బన్నా, సయ్యిద్ కుతుబ్, అల్లామా ఖుమైనీ తతిమ్మా ముగ్గురు మహాపురుషులు, మహాప్రవక్త (స) తరువాత ఇస్లాం ఉద్యమాన్ని ప్రవక్త సహచరుల పంథాలో నడిపి, మనకొరకు మార్గచిహ్నాలు వదలిన ఈ సజ్జనుల అడుగు జాడల్లోనడచి ఆ లక్ష్యాలకై ప్రాణాలను సయితం త్యాగం చెయ్యడమే మన కర్తవ్యం"అని పలికారు.

కువైత్‌కు చెందిన అబ్దుల్లా అకీల్ ప్రసంగిస్తూ ఈ శతాబ్దం ప్రారంభంలో పాశ్చాత్యులు లేవనెత్తిన అనేక అపోహలను, దుష్ప్రచారాన్ని మట్టుపెట్టడానికి మౌలానా చేసిన సేవ అనన్యమయిందనీ ఇస్లాంను ఒక సమగ్ర జీవన వ్యవస్థగా ప్రపంచం ముందు

సమర్పించి పాశ్చాత్య దుష్టశక్తుల ప్రయత్నాన్ని వమ్ము చేశారని మౌలానా సేవల్ని కొనియాడారు. బంగ్లాదేశ్ జమాఅతె ఇస్లామీ అధ్యక్షుడు అబ్బాస్ అలీఖాన్ మాట్లాడుతూ, మౌలానా ఆలోచనా సరళి మూడు తరాల వారిని ప్రభావితం చేసిందని చెప్పారు. జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షుడు మౌలానా ముహమ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ ఇస్లామీయ ఉద్యమం ఈ శతాబ్దంలో ముస్లిం సమాజాన్ని ప్రపంచ స్థాయిలో ఏకంచేసి వేసిందని, మౌలానా తన బాధ్యతను ఎంతో సవ్యంగా నిర్వహించారని, ఇక ఆయన ప్రారంభించిన ఉద్యమాన్ని పరిపూర్ణం చెయ్యడం మన విధి అని చెప్పారు.

ఆ తరువాత ప్రఖ్యాత ఆర్థికవేత్త డా॥ ఖుర్షీద్ అహ్మద్ మైక్ వద్దకురాగానే "ఇన్కిలాబ్ ఇన్కిలాబ్, ఇస్‌లామీ ఇన్కిలాబ్" అన్న నినాదంతో హాలంతా మరో మారు మార్మోగింది. ఆయన వస్తున్న దుఃఖాన్ని ఆపుకోడానికి చేసే ప్రయత్నంలోనే కొంతసేపు గడిచి పోయింది, ఎట్టకేలకు నిలదొక్కుకొని ఆయన ప్రసంగించసాగారు. "నేడు మౌలానా భౌతిక కాయం మనకనుమరుగయింది. ఆయన వ్యక్తిత్వమే ఒక సందేశమయితే ఆయన అంతం కూడా అమరజ్యోతిలా మనల్ని నడిపించగలదని ఆశించవచ్చు. మనం ఆ సందేశానికి విశ్వస నీయులమయి ఉన్నంతవరకు మౌలానా మనలో ప్రతి ఒక్కరిలోనూ సజీంగా ఉంటారు. నేను మౌలానా (భౌతికకాయం) వెంట బఫెలో నుండి న్యూయార్క్, లండన్, కరాచీ, లాహోర్ వరకు పయనించాను. ఆయన్ని చూడటానికి, నమాజె జనాజాలో పాల్గొనడానికి వచ్చిన వారిలో అధిక సంఖ్యాకులు యువకులే. ఈ యువకులే మౌలానా సందేశానికి అమానతుదారులు. మౌలానా ఏ శుభోదయానికైతే జీవితాంతం కృషిచేస్తూ ఉన్నారో ఆ తరుణం సమీపంలోనే కానవస్తోంది. దాన్ని అతి సమీపంలో చూడడానికి యువశక్తి అంతా ముందుకు రావాలి, ఆయన పట్ల మనం విశ్వసనీయులమే అయితే మన జీవితాలను ఆ మార్గాన పణంగానయినా పెట్టి మన నిజలక్ష్యాన్ని సాధించాలి." మరొక్కసారి ఇస్‌లామీ ఇన్కిలాబ్ నినాదాలు మార్మోగాయి.

అబ్దుల్ అజీజ్ ముతవ్వా తన అనుభవాలు తెలుపుతూ "నేను మౌలానాను తర్జుమానుల్ ఖుర్‌ఆన్ మాసపత్రిక తీసేనాటినుండి ఎరుగుదును. ఆ కాలంలో నేను బొంబాయిలో ఉండేవాణ్ణి. తర్జుమానుల్ ఖుర్‌ఆన్ వ్యాసాలు అరబ్బీలో అనువదించి హసనుల్ బన్నా వద్దకు పంపేవాణ్ణి. అప్పుడు ఆయన వాటిని ఎంతో మెచ్చుకునేవారు. కొన్నింటిని ఆయన తన పత్రికలో ప్రచురించారు కూడా" అని గతాన్ని తలచుకుంటూ దివ్యఖుర్‌ఆన్ సూక్తుల ఆధారంగా ముస్లిములందరూ ఏకమయితే రాబోవు యుగం ఇస్లాం యుగమేనని ఘంటాపథంగా వక్కాణించారు.

హసనుల్ బన్నా తనయుడు, కైరోలో గొప్ప లాయరయిన సైపుల్ ఇస్లాం మాట్లాడుతూ "నాకు 1954లో మౌలానాను కలసుకునే భాగ్యం ప్రాప్తమయింది. ఆ నాటి మాధుర్యాన్ని నేను నేటికి మరువలేకున్నాను. సత్య ధర్మం అనుమానాల కారు చీకట్లలో కనుమరుగవుతూ ఉండగా ఇలాంటి మహనీయుల్ని ప్రభవింపజేసి అల్లాహ్

తన ధర్మ పునరుజ్జీవనానికి వాతావరణం సృజిస్తాడు. ఆ మహాపురుషుడు మన మధ్యన ఇకలేడు. సత్యధర్మాన్ని అందరికి అందజేసే బాధ్యత మనపై తారసిల్లింది. ప్రపంచం నలువైపుల నుండి పాకిస్తాన్ వైపు దృష్టి ప్రసరిస్తోంది. పాకిస్తాన్ ఇస్లామ్‌కు పెట్టనికోటగా మారాలని మేమంతా ఆకాంక్షిస్తున్నాము".

"లాషరకియ్యా, లాగరబియ్యా, ఇస్‌లామియ్యా, ఇస్‌లామియ్యా" నినాదాలు మరోమారు మిన్ను ముట్టాయి.

"ఇన్కిలాబ్, ఇస్లామీ ఇన్కిలాబ్" నినాదాలు కూడా ప్రారంభమయ్యే సరికి మైక్ వద్దకు పాకిస్తాన్ ఇస్‌లామీ జమీఅత్ తలబా యువనాయకుడు లియాకత్ బలోచ్ వచ్చి నిల్చున్నారు. "మా నాయకుని సంతాప సభను ఏర్పాటు చేసి ప్రసంగించడం మాకు ఏమంత ఇష్టమైన పని కాదు. లేదా నిత్యం కన్నీరు రాలుస్తూ కూర్చోవడం మా పనికాదు. మేము మా నిజధ్యేయం వైపు, ఇస్లాం సంస్థాపనం వైపునకు అహర్నిశలు కృషిచేసి పురోగమిస్తాం. ఈ దేశంలో ఇస్‌లామీయ విప్లవ మార్గాన్ని ప్రస్తుత నాయకుడు మియాం తుఫైల్ ముహమ్మద్ నాయకత్వాన సాధిస్తామని దృధ నిశ్చయంతో ఉన్నాం. మేము ఎలాంటి వ్యక్తి ఆరాధనా భావానికి గురికాకుండా ముందుకు నడవగలుగుతామని ప్రతిన బూనడంతోపాటు మాకు ఆ సద్బుద్ధిని ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము."

సిరియా విద్వాంసుడు సయీద్ హవ్వా మాట్లాడుతూ "హసనుల్ బన్నా అస్తమయా నంతరం మేము నాయకత్వం లేక బాధపడే వారం, కాని సరిగ్గా అదే సమయానికి మాలో మౌలానా అబుల్ అలా గారి రచనలు ఊపిరి పోశాయి, హసనుల్ బన్నా లేని లోటును తీర్చాయి. అంతేకాక పాకిస్తాన్ పరిమళాన్ని ఇస్లామీయ దేశాల్లో వ్యాపింప జేసిన ఘనతకూడ మౌలానా మౌదూదీకే చెందుతుంది. మౌలానా కృషి చేసి ఉండకపోతే పాకిస్తాన్‌కు ఇస్లామీయ రాజ్యాలలో ఇంత పరపతి లభించి ఉండేది కాదు."

కతర్ విశ్వవిద్యాలయం అధినేత గొప్ప షరీయత్‌వేత్త డా॥ యూసుఫుల్ కర్జావీ తన ఆవేశ భరితమైన ప్రసంగంలో యువకులనే కాదు శ్రోతల నందరినీ ఉత్తేజపరిచారు. పాశ్చాత్య సామ్రాజ్య శక్తులు ఇస్లాం చివరికోట (టర్కీ)ని పడగొట్టగానే అటు నైలు నదీ తీరాలలో ఒకరు, ఇటు భారత ఉపఖండంలో ఒకరు ఇద్దరు యువకులు ఆవిర్భవించారు. ఒక కంటితో ఇస్లామ్ సమగ్ర జీవన వ్యవస్థను మరో కంటితో సమకాలీన దృక్పథాలను, సిద్ధాంతాలను సమంగా చూడగల ఈ యోధులు ఇస్లామ్‌ను స్వయంరక్షణ స్థాయినుండి ముందడుగు వేసే క్రియాశీల స్థితికి లేవనెత్తారు. ఆ ఇద్దరు యువకులే హసనుల్ బన్నా, అబుల్ ఆలా. మొన్న మనం జనాజ నమాజ్‌లో చూశాము, లక్షలాది ప్రజలు మౌలానా కొరకు విలపిస్తూ కనిపించారు. ఆ ప్రేమ మౌలానా మౌదూదీ కొరకు కాదు కేవలం మౌలానా ప్రారంభించిన ఉద్యమం కొరకే. ఈ జనాజా దృశ్యం సాధారణమయినది కాదు, ఇస్లామీయ వ్యవస్థ కొరకు రెఫరెండం లాంటిది."

ఇస్లామీ ఇన్కిలాబ్, అల్లాహు అక్బర్ నినాదాలు ఇంకొకపర్యాయం హృదయాలను కదలించి వేశాయి. నినాదాలు దాటి ఆచరణ కావాలని ఆయన యువకులను హెచ్చరించారు. చివరలో జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్ అధ్యక్షులు మియా తుఫైల్ మైక్ వద్దకు వచ్చారు. యువకుల్లో సంచలనం బయల్దేరింది "హమారా కాయిద్, తుమారా కాయిద్, మియాతుఫైల్, మియాతుఫైల్"

"ఇస్లామీ ఇన్కిలాబ్, నారయే తక్బీర్ అల్లాహు అక్బర్"

నినాదాలు మిన్ను ముట్టాయి. రుద్ధకంఠంతో తన ఉద్యమ మిత్రుల్ని, సహచరుల్ని, అతిథుల్ని సంభోధిస్తూ, ఈ వేళ మౌలానాకై విలపించే వారు కేవలం జమాఅతె ఇస్లామీలోనూ, అదీ పాకిస్తాన్‌లో మాత్రమే కాదు ప్రపంచమంతా ఉన్నారు. నేడు ఇస్లామ్ ఒక సమగ్ర జీవన వ్యవస్థ అన్న భావన ఒక్క పాకిస్తాన్‌లోనే కాక ప్రపంచమంతా వ్యాపించింది. ఒకరోజు ప్రపంచమంతా ఈ దృక్పథం, ఈ భావన ఆధిపత్యం పొందు తుందని ఆశిస్తున్నాను." అని భావావేశాల వల్ల చెప్పలేక కృతజ్ఞతలర్పించుకుంటూ కూర్చున్నారు. సభానంతరం సభాసదులంతా ఒక కొత్త సంకల్పంతో ఒక కొత్త దీక్షతో ఒక కొత్త నిశ్చయంతో మెరిసే ముఖాలతో బయటికి వచ్చారు.

❖ ❖ ❖

పాకిస్తాన్‌లో అడుగుపెట్టి అయిదు రోజులయిపోయింది. ఇంకా రెండు రోజుల్లో సరిహద్దు దాటి మన పుణ్యభూమినీ దర్శించుకోవాలి. అయితే యింత దూరం వచ్చి కనీసం లాహోర్ అయినా సరిగ్గా చూడకుండా ఎలా పోవడం? సందర్భం ఎంతో దుః ఖభరితంగా ఉన్నా, వాతావరణం సంతాపమయంగా ఉన్నా మన్సూరా కార్యకర్తలు అమితమయిన ప్రేమాదరణలతో భారతీయ అతిథుల్ని సత్కరిస్తున్నారు. ఒకవైపున మౌలానా అస్తమయంవల్ల బరువెక్కిన హృదయాలు, మరో వైపున దేశంలో ఎన్నికల కార్యక్రమం ప్రకటించడం వల్ల ఏర్పడిన సందడి, ఎన్నికల నిబంధనలపై రాజకీయ పక్షాల్లో జరుగుతున్న తర్జన భర్జనలు, ప్రభుత్వం వహిస్తున్న పట్టుదల వైఖరి, కొన్ని రాజకీయ పక్షాల మంకుతనం ఈ గందరగోళంలో భారతీయ ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు అతిథులుగా రావడం -- అబ్బ! మన్సూరాలో జమాఅత్ కార్యనిర్వాహక విభాగానికి ఒక్క నిముషం తీరిక లేదు.

ఈ వాతవరణంలోనే (పాకిస్తాన్) జమాఅత్ కేంద్ర సలహా మండలి, కార్యవర్గ సభ్యుల సమావేశాలు జరుగుతున్నాయి. రాజకీయ పరిస్థితులపై, ప్రభుత్వ వైఖరిపై, కొన్ని రాజకీయ పక్షాల మొండితనంపై చర్చలు జరుగుతున్నాయి. జమాఅత్ నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వాధినేతలతో సంప్రతింపులు జరుపుతున్నారు, పార్టీల నాయకులకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. మాతో ముచ్చటించడానికి సమయం

కేటాయిస్తున్నారు. మన్సూరాను చూస్తుంటే అక్కడి హడావిడి. నిత్యం కార్యకలాపాలతో అక్కడి వాతావణంలో ఏర్పడిన వేడి, మనుషుల్లో ప్రేమాభిమానాల వెచ్చదనం నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. నేనెంతో ప్రభావితుణ్ణయ్యాను. ఆ మాటే మిత్రులతో అంటే వాళ్ళ పరిస్థితి కూడా దానికి భిన్నంగా లేదు. ఉద్యమం అంటే, ఉద్యమ కార్యకర్తలంటే అందునా ఇస్లామీయ ఉద్యమ నిర్వాహకులంటే అంత చురుగ్గా, అంత త్యాగనిరతులుగా, అంత ప్రేమ ధనులుగా ఉండాలని మా అందరి అంతరాత్మ ఘోషించింది. మాలో కొత్త ఉత్సాహం, కొత్త ఉద్వేగం, కొత్తఊపిరి, కొత్తప్రాణాలు పోశాయి, మన్సూరా పరిసరాలు.

సెప్టెంబర్ 29వ తారీఖున పంజాబ్ యూనివర్సిటీలోని విద్యాబోధనకు సంబంధించిన పరిశోధనావిభాగం స్టాఫ్, విద్యార్థుల తరఫున అక్కడి వహీద్ ఆడిటోరియంలో ఒక సంతాపసభ ఏర్పాటయింది. భారత అతిథులకు ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. మౌలానా ఖననం జరిగిన నాటి నుండి లాహోర్, కరాచీ, ముల్తాన్, హైదరాబాద్ (సింధ్) క్వెట్టా, పెషావర్ ఇంకా ఇతర పట్టణాల్లో రోజూ ఎన్నో సంతాప సభలు జరుగుతునట్టు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు మేధావులు, కవులు, పండితులు, సంఘ సేవకులు మౌలానా నిష్క్రమణ పట్ల తమ సంతాపాన్ని, ఆయన ఎడల తమ శ్రద్ధాంజలిని ఘటిస్తూనే ఉన్నారు. కొన్ని సభల్లో భారత ప్రతినిధి వర్గంలోని వారు కొందరు పోయి ఉపన్యసించారు కూడా.

అయితే వహీద్ ఆడిటోరియం సభకు ప్రత్యేక ఆహ్వానం రావటం మూలాన మేమంతా వెళ్ళాము. సభ ప్రముఖ రచయిత, కవి, ముహ్సినే ఇన్సానియత్ కృతికర్త అయిన నయీమ్ సిద్దీకీ అధ్యక్షతన జరిగింది. చాలా మంది యూనివర్శిటీకి సంబంధించిన శాఖాధ్యక్షులు, విదేశీ ప్రముఖులు, పంజాబ్ యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడు జావీద్ అఖ్తర్. జమాఅతె ఇస్లామీ హింద్ (ఆంధ్రప్రదేశ్) అధ్యక్షులు శ్రీ అబ్దుల్ అజీజ్ ఇంకా చాలా మంది కవులు పండితులు ప్రసంగించారు.

ఆ ప్రసంగాల్లో పేర్కొన దగ్గవి శ్రీ జావీద్ అఖ్తర్ భావావేశంలో అశ్రుధార మధ్యన చేసిన మూడు నిముషాల భాషణ. మౌలానా అబ్దుల్ అజీజ్ చేసిన హెచ్చరిక, శ్రీ నయీమ్ సిద్దీకి అధ్యక్షోపన్యాసం పేర్కొనదగ్గవి.

శ్రీ జావీద్ అఖ్తర్ పెల్లుబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఎక్కిళ్ళ మధ్యన కొన్ని వాక్యాలు ఇలా పలికారు. ఆయన సభలకు శోభ........ఆయన......యువకుల నాయకుడు, మా నాయకుడు.........ఆయన జీవనజ్ఞాని, ఆత్మజ్ఞాని, పరమాత్మజ్ఞాని. .....ఆయన.....మా కార్యకలాపాల ప్రేరణ, మా కన్నుల్లో వెలుగు, మా గుండెల్లో ఊపిరి.......ఆయన ఇప్పుడు మాలో లేరు.... .....కాని...ఆయన తన ఆలోచనల అర్థాల్లో, ఆచరణల అడుగుజాడల్లో, తన ప్రేమాభిమానాల్లో మాకై నిత్యం సజీవంగా ఉన్నారు. ఆయన తలపెట్టిన కార్యాన్ని మేము పూర్తి చేస్తామని ప్రతిన బూనుతున్నాము"

ఈ మూడు ముక్కలు శ్రోతల మన్ననల్ని అమితంగా చూరగొన్నాయి. తరువాత మన అమీరెహల్ఖా (మౌలానా అబ్దుల్ అజీజ్) మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతిచోటా ఉధృతమవుతున్న ఇస్లామీయ ఉద్యమం పట్ల కమ్యూనిస్టు, కాపిటలిస్టు సామ్రాజ్యవాదులు వేస్తున్న ఎత్తుగడల పట్ల యువతరం అప్రమత్తతో మెలగాలనీ, మౌలానా గతించిన కారణాన ఏర్పడిన వెలితిని మనమందరం ఉమ్మడిగా పూర్తిచెయ్యడానికి కృషి చెయ్యాలనీ హెచ్చరించారు. కన్నీళ్ళు కార్చడం సహజమే అయినా ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల లక్షణం కాదనీ నొక్కి వక్కాణించారు. నయీమ్ సిద్దీకి తన అధ్యక్షోపన్యాసంలో మౌలానాతో తనకు ఏర్పడిన బాంధవ్యాన్ని, ఆయనతో తనకు కలిగిన అనుభవాన్ని, ఆయన ద్వారా తాను గడించిన ప్రయోజనాన్ని ప్రస్తావించారు. ఆయన, తాను నిర్వహిస్తూ వచ్చిన తర్జుమానుల్ ఖుర్ఆన్ సంపాదకత్వాన్ని తనపై విశ్వాసంతో తనకు అప్పగించిన విషయాన్ని ప్రస్తావించి, నేను ఆయనకు అతి సన్నిహితంగా ఉంటూ పొందిన తర్ఫీదును నా యావజ్జీవితం ఇస్లామీయ ఉద్యమం కొరకు వినియోగిస్తానని మాటిస్తున్నాను" అని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. సభానంతరం శ్రీ నయీమ్ సిద్దీకితో ప్రత్యేకంగా మాట్లాడే కాస్తవ్యవధి లభించింది. నన్ను నేను పరిచయం చేసుకున్నాను, ఆయన కవిత్వం పట్ల నేను ఎంతగా ప్రభావితం అయ్యానో నా కవితా దృష్టికి ఆయన కవితలు ఎంత వెలుగునిచ్చాయో చెప్పుకున్నాను. గొప్పవ్యక్తి చిరునవ్వుతో నా ప్రశంసాభినందనల్ని స్వీకరించారు. మౌలానా చివరి కృతి అయిన "సీరతే సర్వరే ఆలమ్" (2 సంపుటాలు) కూర్పు చెయ్యడంలో ఆయనకు ప్రధానపాత్ర ఉండటంవల్ల నేను దాని తతిమ్మ సంపుటాల గురించి ప్రశ్నించాను. ముఖవర్చస్సుపై విషాదచ్ఛాయలు ఆవరించాయి. అరనిమిషం మౌనం వహించారు. కళ్ళెత్తి నావైపు కాస్త గంభీరంగా చూశారు. "మౌలానా తతిమ్మా సంపుటాలకుగాను నోట్సు అన్నీ తయారు చేశారు. ఇక వాటిని సంకలనం చేసి గ్రంథస్థం చెయ్యడం తరువాయి" అని ఊరుకున్నారు. ఆపని ఇప్పుడు ఎవరు చేపట్టారూ? నా ప్రశ్న, "వేచిచూడండి" ముక్తసరిగా ఆయన ఇచ్చిన సమాధానం.

నేను ముహ్సినే ఇన్సానియత్‌ను గురించి ప్రశ్నించాను; "మీరు మహా ప్రవక్త(స) జీవితచరిత్రను గురించి వ్రాసిన గ్రంథాన్ని మా భాష తెలుగులో అనువదించాలని ఆలోచిస్తున్నాను----------దానిలో మీరేమయినా మార్పులు అవీ చెయ్యబోతున్నారా"?

అవును, నేను కొన్ని మార్పులు చెయ్యాలని భావిస్తున్నాను. అయితే మీరు మీ పని కానివ్వండి, నేను మార్పులు చేసేనాటికి మీరు కూడా చేసుకొందురు గాని! అన్నారాయన నవ్వుతూ. కాస్సేపు మా మధ్య మౌనం చోటు చేసుకుంది. "మీ ఆరోగ్యం ఎలాగుందీ?" నేను మౌనాన్ని భరించలేక ఆయనలో గోచరిస్తున్న నీరసాన్ని గుర్తించి అడిగాను. చేతిలోని టి కప్పు బల్లపై పెట్టేసి చిరునవ్వుతో ఒక నిట్టూర్పు వదిలారు." మాదేముంది, మా వయసు నిండుకొస్తోంది, ఇక ఇది మీకాలం మీరు మీశక్తి సామర్థ్యాలను, మీ ఆరోగ్యం క్షీణించకముందే, మీ శక్తులు తరిగిపోకముందే, దైవధర్మ సంస్థాపనార్థం వినియోగించు

కోండి అదే నేనూ మీరూ మరెవ్వరైనా చెయ్యవలసిన కార్యం. దీన్ని వదలి ఆరోగ్యాలు, బ్యాంకు బాలన్సుల వెంటపడితే తీరిక దొరకదు. ఆ బాటలో పయనిస్తున్నవారిని వదలి మీరు మీ దృష్టిని మీ ఏకైక మార్గం వైపున మరల్చండి.!" అదే ఆయన జవాబు అదే ఆయన సందేశం!

❖ ❖ ❖

మా బృందం నాయకులంతా భారతదేశానికి తిరిగి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. మియా తుఫైల్ ముహమ్మద్, ముహ్మద్ ఆజమ్ ఫారూకీ, ప్రొ. గఫూర్ అహ్మద్ ప్రభృతులు కరాచి తదితర ప్రాంతాల్లో ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాలు వీక్షించి మరీ పోవాలని పట్టుపట్టారు. అయితే మన జమాఅత్ అధ్యక్షులు మౌలానా యూసుఫ్, మాజీ అధ్యక్షులు మౌలానా అబుల్ లైస్, పరిశోధనా రచన సంస్థ అధ్యక్షులు మౌలానా సద్రుద్దీన్ ఇస్లాహీ తదితర నాయకులు, మిత్రులు అంతా తిరిగి పోవాలనే నిర్ణయించు కున్నారు. మేము కొందరం, అంటే దాదాపు 25మందిమి, కరాచీ, ముల్తాన్, పెషావర్, ఇస్లామాబాద్ కూడా పర్యటించాలని నిర్ణయించుకున్నాం. తదనుగుణంగా మా వీజాను పొడగించడానికి సన్నాహాలు జరగసాగాయి. మరుసటి రోజున చాలామంది తిరిగి వెడుతున్నారు గనుక ఆ రోజున మన్సూరా కార్యకర్తల తరపున ఒకవిందు ఏర్పాటు చెయ్యబడింది. అందులో భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లకు చెందిన ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలంతా పాల్గొన్నారు.

విందులు ఎన్నో జరుగుతుంటాయి. రకరకాల వంటలు గొప్ప హంగామా ఆడంబరం అట్టహాసాలతో జరిగిన విందులు కూడా చూశాం, అనుభవించాం. కాని ఆ విందు విశేషతే వేరు. మా బోటి గున్నయ్యలంతా ఆరగిస్తుంటే పాకిస్తాన్ ఇస్లామీ ఉద్యమ రథసారథులంతా మాకు వడ్డిస్తున్నారు. వంటలు కదు సాధారణమయినవే కాని మియా తుఫైల్, ప్రొ. గఫూర్, ప్రొ. ఖుర్షీద్, ముహ్మద్ ఆజమ్ ఫారూకి, మౌలానా ఖలీల్ హామీదీ, మౌలానా మలిక్ గులాం అలీ, కాజీ హుసైన్ అహ్మద్ (పాకిస్తాన్ జమాఅత్ ప్రధానకార్యదర్శి) మౌలానా జాన్ ముహమ్మద్ లాంటి నాయకులంతా మాకు సర్వ్ చెయ్యడమే విశేషం. ఆ ప్రేమకు, ఆ నిరాడంబరతకు, ఆ హృదయ విశాలతకు ఎలా బదులు చెప్పుకోగలం? నేను విందులో కూర్చున్నానే కాని ఏమితిన్నానో సరిగ్గా గుర్తేలేదు. నా మనస్సు ఆ నాయకుల నిర్మల మనస్సులపై నిస్వార్థ, సేవపై లగ్నమయి మరోవైపు మరలనేలేదు.

వాళ్ళు ఇదంతా కార్యకర్తలు లేకపోవడంవల్ల చెయ్యడం లేదు. ఊ అంటే వందమంది కార్యకర్తలు కదలి ముందుకు వస్తారు. కాని 30 ఏళ్ళ తరువాత కలసిన పాత మిత్రుల్ని కొత్తగా ఉద్యమ బృందంలో చేరిన అనుయాయుల్ని అతిథులుగా రిసీవ్ చేసుకుని వారికి సేవ చేయడంలో వారు పొందుతున్న ఆనందం అక్షరాలా వర్ణనాతీతంగా



రచనా వ్యాసంగంలో....



నమాజ్ చేస్తూ....

అల్లామా యూసుఫుల్ కర్జావీతో...
(ఆయనే మౌలానా చివరి జనాజా నమాజ్ చేయించారు)



ఇస్లామ్ సిద్ధాంత కర్త మౌలానా మౌదూదీ తన రచన కక్ష్యలో...

వారి ముఖాలపై తాండవిస్తోంది. విందు తరువాత పరస్పర పరిచయం చేసుకున్నాం. 1941లో ప్రారంభమైన ఉద్యమం, స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఎన్నెన్ని అవాంతరాలు, అవరోధాలు, ఇక్కట్లు ఎదుర్కొని నేటికి ఆయా దేశాల్లో ఆయా దశల్లోకి చేరిందో వివరించుకున్నాము. అవిభక్త భారత ఉపఖండంలో ప్రారంభమయిన ఉద్యమం, దేశ విభజన తరువాత, వేర్వేరు నాయకుల ఆధ్వర్యాన, తమ తమ దేశాల పరిస్థితుల కనుగుణంగా వేర్వేరు విధానాల ప్రాతిపదికలపై, ఆయా దశల్లో ఉద్యమ శక్తి సామర్థ్యాల కనువయిన వేర్వేరు కార్యక్రమాల ద్వారా ఎంతగా పురోగమించిందో పునర్విమర్శన చేసుకున్నాము. ఉద్యమ వైతాళికుడు, అవిభక్త భారత ఉపఖండంలో జమాఅత్ వ్యవస్థాపకుడు మౌలానా మౌదూదీ తన జీవితాంతం ఏవిధంగానైతే తన రచనలు, తన ఖురాన్ వ్యాఖ్యానాలు, తన ఆలోచనలు, భావాల ద్వారా ప్రపంచ ముస్లిం ప్రజలందరికి ప్రకాశవంతమయిన జ్యోతిగా వెలుగును విరజిమ్ముతూ వచ్చారో, అలాగే ఆయన తన మరణం ద్వారా సయితం 30 ఏళ్ళ క్రితం ఎడబాసిన మిత్రులు, పలుదేశాల్లో ఇస్లామీయ ఉద్యమ కార్యకలాపాల్లో నిమగ్నులయి ఉన్న కార్యకర్తలు కలిసి ముచ్చటించుకునేందుకు అవకాశం కల్పించారు. ఆయన జీవితమూ శుభసూచకమే. ఆయన మృత్యువూ శుభప్రదమే!

రాక్షసపాలన

శుక్రవారం వచ్చింది. లాహోర్ బాదషాహీ మస్జిద్‌లో జుమా ప్రార్థన జరపాలని బయల్దేరాము - మౌలానా అబ్దుల్ అజీజ్, రషీద్ ముహియుద్దీన్, నేను. మన్సూరా, నగరానికి 12 మైళ్ళ దూరాన ఉంది, బస్సులో పోవాలి. తొందరగానే బయల్దేరాం. మన్సూరా నుండి లాహోర్ స్టేషన్‌కు పోయే 13 వ నెంబరు బస్సు కొరకు నిరీక్షిస్తుండగా ఎర్రటి డబుల్ డెక్కర్ ఒకటి వస్తూ కన్పించింది. ఒకానొకప్పుడు ఎర్రగా ఉన్న బస్సు ఇప్పుడు కాల ప్రభావాలకు లోనయి తన అసలు రంగును కోల్పోయి'డార్క్ బ్రౌన్' రంగును పులుముకుంది. బస్సు దగ్గరవగానే చూసి నిరాశ చెందాము. ఇది ఇప్పుడే ఏదో ఆక్సిడెంట్‌కు గురయి వచ్చినట్టుంది. బస్సు ఎడమ "చెంప" 'దవడ' తీసేసినట్టు సొట్టబోయింది. అది వచ్చి మా ముందు ఆగగానే అక్కడ నిల్చున్న వారంతా మేము ఆశ్చర్యపోయే లోపల గబ గబా ఎక్కసాగారు. మేము ఒకరి ముఖాలొకరు చూసుకుని 'దైవమూ నీదే రక్ష' అనుకుంటూ పైకి వెళ్లగానే వింతయిన దృశ్యం. పై కప్పుకు వేసిన సీలింగ్ అట్టలు విరిగిపోయి అక్కడక్కడ వేలాడుతున్నాయి. సీట్ల కవర్లు జీర్ణావస్థలో ఉన్నాయి. కొన్ని సీట్ల కుషన్లు సీటు ఫ్రేం క్రింద పడి విశ్రాంతి తీసుకుంటున్నాయి. కాస్తంత మెరుగ్గా ఉన్న సీట్లను ఆక్రమించుకున్నాం. అకస్మాత్తుగా మా ఎదుటి సీటులో నుండి ఓ బల్లి బయటికి వచ్చి పళ్ళికిలించి విదేశీ అతిథులయిన మమ్మల్ని ఆహ్వానించింది!

కాస్సేపటికి కండక్టర్ వచ్చాడు. టికెట్టు తీసుకుని ఏమిటయ్యా ఈ బస్సు అవస్థ అని మెల్లిగా కదిలించాము. అతడు మమ్మల్ని "గుర్తు" పట్టినట్టుంది. టికట్లన్నీ ఇచ్చి

వచ్చాడు. చెప్పసాగాడు. 'ఏమని చెప్పమంటారు. గత ఏడెనిమిదేళ్ళు మా పైన ఓ రాక్షస ప్రభుత్వం పాలన సాగించింది. ఆ పాలకులకు తమ భవంతులు నిర్మించుకోవడం, తమ బ్యాంక్ బ్యాలెన్సులు పెంచుకోవడం, విదేశాల్లో పర్యటనలు జరుపుకోవడం, సెల్ఫ్ డబ్బా వాయించుకోవడానికే సరిగ్గా తీరిక దొరికేది కాదు, ప్రజల అవస్థ పట్టించుకున్న పాపానికి పోయిన వారెవరూ లేరు. ఇటు ప్రజలు కూడా భీతావహులై దిన దిన గండంలా గుప్పెట్లో ప్రాణం పట్టుకుని జీవితం గడిపారు.

"మేము మీ ట్రాన్స్‌పోర్టు శాఖను గురించి అడిగాం" నేను అడ్డు వచ్చాను అతని ఉపన్యాసానికి.

ఇక మా ట్రాన్స్‌పోర్టు వ్యవస్థనంటారా? ఏదీ అడక్కండి, ఎప్పుడో కొన్న బస్సులు, వాటికి రంగు పూసి కూడా ఎన్నో ఏండ్లయ్యాయి. అతుకులు రిపేరింగుచేసి ఎలాగో నెట్టుకు వస్తున్నాం. కొత్త బస్సులు కొంటే "ప్రభుత్వ రక్షణ" పొందిన "పెద్ద ఆసాములు" పాత ఇంజన్లు వాటిలో ఫిట్ చేయించి కొత్తవి మోసుకుపోయేవారు. ఆ వాతావరణంలో ఎవ్వరూ నోరు మెదిపే వారు కారు, ఏమంటే ఏది ముంచుకు వస్తుందో అని భయపడే వారు, గత పాలకులహయాంలో ఇది పాకిస్తాన్ (పరిశుద్ధ దేశం) గా కాదు నా పాకిస్తాన్ (అపరిశుద్ధ దేశం) గా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ప్రజల భయాందోళనలు దూరమయి కాస్త ఊపిరి పీల్చుకుంటున్నాము. ఇక ఎన్నికలని జరిగితే ఇంకా కాస్త స్వేచ్ఛ అవీ ప్రాప్త మవుతాయి". గొప్పగానే ఉపన్యసించాడు కండక్టర్.

"నువ్వలా అంటావేమిటీ? భుట్టో గారి పరిపాలనలో దేశం ఎంతో ప్రగతి సాధించిందని విన్నామే,? అమీరె హల్ఖా ప్రశ్న.

"దూరపు కొండలు నునుపే అంటారు. 22 కుంటుబాలను దోచుకొని, 220 కుటుంబాలు బాగుపడ్డాయి. ప్రజలకు ఒరిగిందేమీ లేదు" అని చీదరించుకున్నట్లు లేచి టికెట్టివ్వడానికి వెళ్ళిపొయ్యాడు.

అతని మలేషా యూనిఫాం, కుట్టు తెగిపోయి భుజానికి వేలాడుతున్న "మనీ బ్యాగ్"ని చూస్తుంటే నాకు జాలేసింది. "అనార్కలీ" వద్ద దిగిపోయాం. "అనార్కలీ" దాదాపు మన ఢిల్లీ జామా మస్జిద్ పరిసరాల్లా కోలాహలంగా ఉంటుంది. అక్కడే ఉర్దూ బాజార్, (ఢిల్లీలో కూడా జామా మస్జిద్ దగ్గర్లోనే ఉంది ఉర్దూ బాజార్.) "లోహారీ గేట్ మస్జిద్ " ఉన్నాయి. అక్కడ కొన్ని పత్రికలు అవీ కొని జట్కా బండి నెక్కాము.

మొగల్ వాస్తుకళ పట్ల నా కొక అభిప్రాయం ఉంది. మొగల్ కట్టడాలన్నీ, ఢిల్లీ జామా మస్జిద్ అయినా, ఎర్ర కోట అయినా, ఆగ్రాలో తాజ్‌మహల్, పాత కోట, ఫతేపూర్ సిక్రి, ఏదయినా దూరాన్నుంచి చూస్తే ఎంతో అందంగా, ముద్దు బొమ్మల్లాగా, సౌకుమార్యం, లాలిత్యం ఒలకబోస్తూ ఉంటాయి. దగ్గరకు వెళ్ళగానే వాటి అసలు ఎత్తు, గాంభీర్యం, హుందా, ఠీవి ద్యోతకమవుతాయి. మొగల్ కట్టడాలను గురించి నేనేర్పరచుకున్న

అభిప్రాయమది. కాని లాహోర్ షాహీ మస్జిద్‌ని చూడగానే ఈ నా అభిప్రాయం తారుమారయింది. అందం ఉంది, దూరాన్నుంచే ఆకట్టుకునే గాంభీర్యం ఠీవీ ఉన్నాయి. కాని అందులో సౌకుమార్యం, లాలిత్యం నాకు కానరాలేదు. షాహిమస్జిద్ ఒక్కటే కాదు జహంగీర్ "మక్‌బరా"లో కూడా నాకు హుందాతనం తప్ప లాలిత్యం గోచరించలేదు.

షాహిమస్జిద్‌కు వెళ్ళేటప్పటికి నమాజ్‌కు ఇంకా చాలా టైముందని తెలిసింది. నాకు, మౌలానా అబ్దుల్ అజీజ్ గారికి ఏమీ తినాలని లేకున్నా మిత్రులు రషీద్ గారు భోజనానికి తొందర చేశారు. ఆయన్ని తీసుకుని నేను బయల్దేరాను. గొప్ప హోటల్ వద్దనుకుని కడుసామాన్యమైన హోటల్‌ని ఎన్నుకున్నాం. ఆయనేదో తెప్పించుకుని తింటున్నారు. నేను ప్రక్కనే కూర్చున్న మరోవ్యక్తితో మాటల్లోకి దిగాను.

అతడు ద్రాక్షపళ్ళమ్ముకుంటాడు. నేను భారత దేశాన్నుండి వచ్చానని చెప్పుకున్నాను. "బాబూ! మీకు అక్కడ భయం వెయ్యదా?" అడిగాడు అతను కుతూహలంగా. "ఎందుకు?" అడిగాను తిరిగి. "ముస్లిమేతరులంతా మిమ్మల్ని హింసిస్తున్నారని వింటామే. అక్కడ తరచూ మతకల్లోలాలు జరుగుతుంటాయే, వాళ్ళ మధ్య మీరెలా నివసించ గలుగుతున్నారు?" ఎంతో ఆశ్చర్యం, మరెంతో జాలి వ్యక్తపరుస్తోంది అతని కంఠం.

నవ్వేశాను నేను. "అంతా అబద్ధం. ముస్లిమేతరులంతా మమ్మల్ని హింసించరు. భారతీయులు సహజంగా ప్రేమమూర్తులు. అయితే దుండగులు, గూండాలు ఎక్కడ లేరు? భారతదేశంలోని ముస్లిముల్లోనూ గుండాలు, రౌడీలున్నారు. వారు కూడా ఇతరుల్ని హింసిస్తుంటారు. మీరు చెప్పే మతకల్లోలాల్లోనే ఎంతో మంది హిందూ సోదరులు ముస్లిముల్ని రక్షించారు. మరెంతో మంది ముస్లింలు హిందూ సోదరుల్ని కాపాడిన అనేక సంఘటనలున్నాయి. అలాంటి దురదృష్టకర ఘటనలు జరిగిన కొన్ని దినాలే వైషమ్యాలు. తరువాత అంతా మరచి కలసిమెలసి జీవిస్తుంటాం" నా సమాధానం అతనికి తృప్తినివ్వలేదు. అతడు నా నుండి మరోవిధమైన సమాధానం ఆశించాడేమో!

"అక్కణ్ణుంచి వచ్చేయండి... ... " నసిగాడు.

"ఎందుకూ మీరు పడుతున్న ఇక్కట్లను అధికం చెయ్యడానికా?" నేను తీవ్రంగా బదులిచ్చాను. "చూడండి, ప్రేమ ప్రేమను జనింపచేస్తుంది. ద్వేషం ద్వేషాన్నే రేకెత్తిస్తుంది. మా దేశం, మా భూమి, మా వీధులు మా పరిసరాలు, మా ఇరుగుపొరుగు మాకు మధురం. మా గురించి, ఇస్లామ్ గురించి, అక్కడి మా సోదరుల్లో కొన్ని అపోహలు, అపార్థాలున్నాయి. వాటిని మేం దూరం చేస్తున్నాం. ఇస్లామ్ బోధించే సేవాతత్పరతను, ప్రేమైక జీవితాన్ని మా నడవడి ద్వారా వారికి పరచయం చేస్తున్నాం. ఇహపరాల జీవితాల వృద్ధీ వికాసాలకు సమగ్రసోపానం ఇస్లామ్ అని తెలుపుతున్నాం. ఇస్లాం సందేశాన్ని వారికి అందజేస్తున్నాం. మేము పరస్పరం సన్నిహితులమవుతున్నాం. మీరు మా గురించి ఏవిధమైన బెంగ పెట్టుకోనవసరం లేదు" అని చిన్న ఉపన్యాసం దంచేసాను. ఇరుగు పొరుగున ఉన్నవాళ్ళు కూడా వినేలా!

ద్రాక్షపళ్ళవాని ప్రశ్నల్లాంటివి లాహోర్‌లోను కరాచీలోను చదువుకున్న వాళ్ళు, సామాన్యులు వేసినప్పుడు మా సమాధానం ఈ పంథాలోనే ఉండేది. మా దేశంలో తోటి సోదరులతో మాకున్న తగాదాలను పరదేశంలో రచ్చకెక్కించరాదని మేమంతా ముందే నిర్ణయించుకున్నాం. అలాగే వ్యవహరించాము కూడా.

జుమా నమాజ్‌కు ముందు అక్కడి 'ఇమాం' గారు చిన్న ఉపన్యాసంలో మౌలానా మౌదూదీ మృతిపట్ల తన సంతాపాన్ని, ఇస్లామీయ జీవన వ్యవస్థ పునఃస్థాపనకై ఆయన జీవితాంతం సలపిన పోరాటాన్ని గురించి ఉపన్యసించారు. నమాజ్ తరువాత మౌలానా మోక్షం మన్నింపుల కొరకు ప్రత్యేకంగా ప్రార్థించారు కూడా.

నమాజ్ తరువాత మన అమీరె హల్ఖా చిన్ననాటి గురువుగారు నకీ అలీ గారు కలిశారు. అందరం కలసి లాహోర్‌లోని కొన్ని ముఖ్యమైన స్థలాలయినా చూద్దాం అని బయల్దేరాం. అక్కడ సైకిల్ రిక్షాలు అసలు లేవు. ఎందుకని అడిగితే 'మనిషిని మనిషి చేత లాగించడం – అబ్బ! ఎంత అమానుషమండీ! అన్నాడో పెద్దమనిషి అవును కాబోలు! అనుకున్నాను. హైదరాబాద్‌లో రోజూ రిక్షా ఎక్కి పయనించే నేను! ఆటో రిక్షానే రిక్షా అంటారు పాకిస్తానీయులు. రెండు 'రిక్షాలు' తీసుకుని ఒకదానిలో అమీరెహల్కా, ఆయన గురువుగారు, రెండోదానిలో నేనూ రషీద్‌గారు బయల్దేరాం. ముందు జహంగీర్ మక్బరా చూసాం. అంత అందమయిన, ముఖ్యమయిన కట్టడానికి సరయిన పోషణ (మెయింటెనెన్స్) లేదు. టికెట్లు తీసుకుని లోనికి వదలడమే కాని యాత్రికులకు అమితంగా ఆకర్షించేలా దాని పోషణ జరగడం లేదు. ఆ మక్బరా చారిత్రక విశేషాలను నకీ అలీగారు చాలా వివరంగా తెలిపారు. ఆయన చరిత్రలో ఆరితేరినవారు. చరిత్ర అంటే ఆసక్తిలేని వాణ్ణి నేను. ఆయన చెప్పినవన్నీ అప్పటికప్పుడు మరచిపొయ్యాను.

అక్కణ్ణుంచి "షాలిమార్ బాగ్" (అక్కడ షాలమార్ అంటారు)కు పొయ్యాం. దారిలో నేను ఆటోడ్రయివర్‌తో సంభాషణ ప్రారంభించాను. అతడో పెద్ద రాజకీయవేత్తలా మాట్లాడుతున్నాడు.

"అయ్యూబ్ పాలనలో నేను చిన్నవాణ్ణి.." అతడు ఒక ప్రశ్నకు సమాధానంగా మొదలెట్టాడు.

'ఇప్పుడు నీ వయసెంత?" అడ్డొచ్చి అడిగాను.

"ఇప్పుడు 29 ఏళ్ళు. అయ్యూబ్ కాలంలో అంతగా రాజకీయాలు తెలియవు. చదువుకునే రోజులు. ఆవేశం తప్ప అవగాహన లేనేలేదు. కానీ భుట్టో పరిపాలనలో నేను క్రియాత్మకంగా జీవనరంగంలో ప్రవేశించాను."

అతనివాగ్ధోరణి చూచి, ఎంతవరకు చదువుకున్నారు? అనడిగాను బి.ఏ. పాసుకాలేకపోయాను అన్నాడు చిరునవ్వుతో. "అందరూ గల్ఫ్ దేశాలకు పొమ్మని సలహా ఇచ్చారు. అయితే దేశానికి సేవచేసేదెవరు? అన్నభావంతో ఉండిపొయ్యాను"

"ఆఁ.. 1975లో రిక్షా (ఆటో)తోలడం ప్రారంభించా. 1977లో భుట్టో నిర్వహించిన ఎన్నికలకు వ్యతిరేకంగా ప్రారంభమయిన ప్రజా ఉద్యమంలో ఎంతో ఉత్సాహంగా ఎంతో ఉద్వేగంగా పాల్గొన్నా"

ఏదో పార్క్‌లాంటి స్థలంలో నకీ అలీగారు రిక్షా ఆపి ఏదో చెబుతున్నారు. మేము కూడా దిగాము.

"అయ్యూబ్ కాలంలో జమాఅత్ నిర్వహించదలచిన ఆల్ పాకిస్తాన్ మహాసభలకు ఎక్కడా స్థలం దొరక్కపోతే, ఇక్కడే ఈ పార్కు పొడుగూత షామియానాలు వేసుకుని సమావేశాలు జరుపుకున్నాం. అప్పుడు మైక్, లౌడ్ స్పీకర్ వాడడానిక్కూడా అనుమతి లభించలేదు. మౌలానా (మౌదూది) స్టేజి నుండి ఉపన్యాసాన్ని చదువుతుంటే సైక్లోస్టయిల్ చేసిన దాని పాఠాన్ని అక్కడక్కడ స్టూళ్ళపై నిల్చొని ఇతర నాయకులు చదివి వినిపించారు. ఆ తరుణంలోనే ఒక గ్రూపు కల్లోలం సృష్టించి మౌలానాపైకి తుపాకి పేల్చింది! అల్లాబక్ష్ అనే కార్యకర్త అడ్డుపడి, ఆ గుండు తగిలి అక్కడికక్కడే అమరగతుడయ్యాడు" వివరిస్తున్నారు నకీ అలీ గారు.

❖ ❖ ❖

"మా దేశంలో ఎప్పుడూ సుస్థిరమయిన ప్రభుత్వం నెలకొనలేదు. అయ్యూబ్ కథ విన్నారుగా. ఏదో కాస్త మేలు చేశాడంటే, ప్రజాస్వామిక హక్కుల అణచివేతకు అతడే నాంది వేశాడు. అతని శిష్యుడయిన భుట్టో ఆ విధానాన్ని పరాకాష్ఠకు చేర్చాడు." రిక్షా ఎక్కి బయల్దేరగానే మొదలెట్టాడు గ్రాడ్యుయేట్ డ్రయివర్.

ఏదో మస్జిద్ వద్ద ఆగింది నకీఅలీ గారి ఆటో, మేమూ ఆపాము. "ఒకరోజు రాత్రి వేళ మౌలానా మౌదూది ఇక్కడ ఉపన్యసిస్తూ "ఈ రాత్రి ఇది చివరి సమావేశం కావచ్చు. రేపు ఉదయం నిద్ర నుండి లేవగానే ఇలా సమావేశమయి ముచ్చటించుకునే అవకాశం కూడా మీకు దొరక్కపోవచ్చు. దేశం నియంతల పాలవబోతుంది" అనీ హెచ్చరించారు. ఆ ప్రాతఃకాలమే దేశం అయ్యూబ్‌ఖాన్ విధించిన మార్షల్‌లాని చవి చూసింది" తెలుపుకు పోతున్నారు, నకీఅలీ. ఆటోలు ముందుకు కదిలాయి.

తటాలున మా ఆటో ఆగింది. "ఇక్కడ తొలిగీత గీసారు" మా డ్రయివర్ చెప్పారు. మా కేమీ అర్థం కాలేదు. ఎవరు, ఎందుకు అన్నట్లు అతని వైపు చూసాం.

"1977లో భుట్టో నిర్వహించిన ఎన్నికల తతంగంలో జరిగిన అవకతవకలకు, అవినీతికి నిరసనగా జరిగిన ప్రదర్శనల్లో, దేశ ప్రజలంతా పాల్గొన్నారు. యువకులు, అందులో అత్యధికం ఇస్లామీ జమీఅతె తలబా యువకులే, ప్రదర్శన జరుపుతూ వస్తున్నారు, వాళ్ళను మిలిటరీ వాళ్ళు ఎదిరిస్తున్నారు. ఇక్కడ గీతగీసి దాన్ని దాటితే షూట్ చేస్తాం అని బెదిరించారు. --యువకులు రొమ్ము విరుచుకుని దాన్ని దాటేశారు..."

ఆటో స్టార్ట్ చేసి అతడూ దాటుతూ అన్నాడు. "మిలిటరీ వాళ్ళు షూట్ చేశారా?" ఆత్రంగా మా నోట వెలువడ్డ ప్రశ్న.

"లేదు" వందగజాలుపోయి మళ్ళీ ఆపాడు ఆటోను, "ఇక్కడ రెండో గీత గీసారు. దీన్ని దాటితే క్షేమం లేదని చెప్పారు. ఆటో స్టార్ట్ చేశాడు. దాన్ని కూడా దాటేసినా మిలిటరీకి షూట్ చేసే ధైర్యం చాల్లేదు." మరో వందగజాలు పోయి ఆపాడు. ఇక్కడ మూడో గీత గీసారు. మిలిటరీ గాలిలో ఫైర్ చేసింది. ప్రదర్శకులు వెంబడించేసరికి మామూలుగా ఫైరింగ్ జరిగింది. అప్పుడు నేను ఇక్కడే ఉన్నాను." ఇక్కడ నుండి మృతవీరుల శవాలను మీరు కూచున్న ఈ రిక్షాలో వేసుకుని ఆస్పత్రులకు, ఇతర వైద్య శిబిరాలకు తీసుకుపోయాను." ఆటో ఆపి క్రిందికి దిగాడు. మేము కూడా దిగాము. మా మాటల్లో అమీరె హల్కా గారి ఆటో ఎటు వెళ్ళిందో గమనించనేలేదు.

"ఈ మస్జిద్‌ని చూసారా? ఇక్కడే భుట్టో పాలన చివరి రోజుల్లో మిలిటరీ బూట్లతో లోనికెళ్ళి నమాజ్ చేస్తున్న వారిని పట్టి పీడించింది. ఉలమాలను (ధర్మవేత్తలను) వివస్త్రలు గావించి రోడ్డుపై కొడుతూ తీసుకెళ్ళింది. దాని ఫలితం ఆ ఉసురు, ఆ పాతకం భుట్టోను ఎలా చుట్టుకుందో చూసారుగా? ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. ఆ పోరాటంలో జమాఅతె ఇస్లామీ కార్యకర్తలు చూపిన త్యాగం అనన్యమయింది." మెచ్చుకోలుగా చెప్పుకుంటూ పోయాడు డ్రయివర్.

"ఇంతకు మీరు ఏ పార్టీకి చెందినవారు" రషీద్‌గారు కదిలించారు డ్రయివర్ని.

"నేను.. పీర్‌పగారా గ్రూప్‌కు చెందినవాణ్ణి" పళ్ళికిలించాడు. అంతలోనే నకీఅలీ గారు, అమీరె హల్కా కూడా అగుపించారు. అందరం తిరిగి బయల్దేరాం.

షాలిమార్ గార్డెన్ ఒకప్పుడు వైభవంగా విరాజిల్లిందేమో గాని ఇప్పుడు మాత్రం అంత శుష్కగాథలా ఉంది. రకరకాల పూలచెట్లు అవీ పచ్చగానే ఉన్నాయి కాని నీళ్ళు చిమ్మే రకరకాల ఫౌంటేన్లు, కట్టిన కాలువలు, జలపాతాల్లా నిర్మించిన మెట్లు అన్నీ నీటి చుక్క లేకుండా మొత్తం తోటనే నిర్జీవంగా చేసిపారేశాయి. అంత పెద్ద ఉద్యానవనం ఇలా ఉండడం చాలా బాధ అనిపించింది. షాలిమార్ తరువాత మరో డ్రయివర్‌తో సంభాషించాలని ఆటోను మార్చుకున్నాను. అతడు "నాకు రాజకీయాలతో పనిలేదండి" అన్నాడు.

"సరేలే ఏదో ఒక పార్టీకి ఓటు వేస్తావుగా?" అడిగాను. "అది చెప్పకూడదు కదండి..." అన్నాడు నవ్వుతూ. పోనీ, నీ దేశంలో ఎలాంటి వ్యవస్థను కోరుకుంటావు? మరోవిధంగా అడిగా, బుట్టలో పడిపోయాడు.

"ఏది ఏమయినా, మేము ముస్లింలము, మాకు మా ప్రవక్త (స) ఆయన సహాబా (సహచరులు) వ్యవస్థ కావాలి. అదే ఇస్లామీయ జీవనవ్యవస్థ!" అన్నాడు ధీమాగా, గంభీరంగా. నేనీ ప్రశ్న పాకిస్తాన్‌లో కూలీ వాణ్ణి మొదలుకుని వ్యాపారుల్ని, ప్రభుత్వ ఉద్యోగుల్ని సయితం అడిగా.. అందరిదీ ఇదే సమాధానం!

ఇంకా మినారె పాకిస్తాన్, మాల్ రోడ్డును, ఇస్లామిక్ పబ్లికేషన్స్ లిమిటెడ్ ఉన్న షా ఆలం మార్కెట్‌ను చూసాం. నాకు ఏదీ ఆకర్షించలేకపోయింది. దేశవిభజన వల్ల భారతదేశంలో కెల్లా అందమయిన నగరం లాహోర్ పాకిస్తాన్‌కు పోవడం వల్ల మనవాళ్ళు చండీగఢ్‌ని నిర్మించుకున్నారని చిన్నప్పుడు ఎక్కడో చదివినట్లు గుర్తు. ఆ మాటే నకీ అలీ గారికి చెప్పి "మీ లాహోర్ నాకేమంత నచ్చలేదు. అప్పటి దాని అందచందాలు ఇప్పుడేమయ్యాయి? ఎందుకు దీన్ని అందమైన నగరమంటారు? అనడిగాను.

"ఏం చెప్పమంటావు నాయనా? నీవు కనీసం 15 ఏళ్ళ క్రితం వచ్చి ఉంటే లాహోర్ వైభవాన్ని కొద్దిగానయినా తిలకించేవాడివి. కర్రగలవాడిదే బర్రె అన్న చందాన నడిచిన పరిపాలనలో నిజమయిన దేశాభ్యున్నతి, ప్రజాశ్రేయస్సును పట్టించుకున్న నాథుడేలేడు. ఇప్పుడయినా ఎన్నికలు జరిగి కాస్త కుదుటపడితే ప్రజాపాలకులు ఇవన్నీ గమనించగలరు" అన్నారు నిట్టూర్పుతో ఆయన.

శిక్షణ, సంస్కరణలు

కరాచీ వెళ్ళడానికి ఇంకా టైముంది. అంతవరకు కనీసం మన్సూరాలలో ఉండే జమాఅత్ నాయకులతో వీలయినంతవరకు కలసి మాట్లాడదామని నిర్ణయించుకున్నాను. మన్సూరాలో జమాఅత్ నాయకులతో ముచ్చటించేసమయాన మౌలానా మౌదూదీ తాను ఒక్కడే అయినా తన తరువాత తాను లేవదీసిన ఉద్యమాన్ని నేర్పుతో నిర్వహించగల, వివిధ రంగాలకు చెందిన నాయకుల్ని ఎలా తయారుచేశారో, వీరంతా సంఘీభావంతో పనిచేసేలా ఏవిధంగా వీరిని మలిచారో అవగతమయింది.

కొందరు మిత్రులతో కలసి ఒకసారి అసద్ గీలానీ గారిని సందర్శించి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోగలిగాను. అసద్ గీలానీ గారు ప్రస్తుత లాహోర్ పట్టణ జమాఅత్‌కు అమీర్‌గా పనిచేస్తున్నారు. ఎక్కడెక్కడయితే జమాఅత్ కార్యకలాపాలు సరిగ్గా సాగవో లేదా ఎక్కడెక్కడయితే జమాఅత్ ఇంకా సరిగ్గా వ్యవస్థీకరింపబడలేదో లేదా సంస్థాగతంగా జమాఅత్ ఎక్కడెక్కడతే పటిష్ఠవంతం కాలేదో అలాంటి ప్రాంతాలకు మౌలానా మౌదూదీ గారు అసద్ గీలానీ గారినీ పంపేవారు. ఆయన పంజాబ్ నివాసి అయినా పంజాబ్‌లోని పలుజిల్లాల్లో జమాఅత్‌ను పటిష్టం చెయ్యడమే కాక అప్పటి తూర్పు పాకిస్తాన్‌లోనూ కొంతకాలం పనిచేసి అక్కడా జమాఅత్ కార్యకలాపాల్లో మంచి ఉరవడిని తీసుకువచ్చారు. మంచివక్త, ప్రేమ, మాధుర్యం ఉట్టిపడే వాగ్ధోరణి, ప్రత్యర్థుల్ని ప్రేమతో జయించిన ధీశాలి, రచయిత, తన ప్రత్యేక శైలి ద్వారా మనోజ్ఞమనోహరంగా ఏ విషయమయినా వ్రాయగల నేర్పరి. సంస్థాగత వ్యవహారాలను ఎంతో చాకచక్యంతో నిర్వహించి జమాఅత్‌ను పటిష్ఠం చెయ్యగల నాయకుడు.

అసద్ గీలాని గారిని మేము ఎన్నో ప్రశ్నలడిగాము. పాకిస్తాన్ సామాజిక వ్యవస్థను గురించి వివరంగా తెలుపుతూ ఆయన ఇలా అన్నారు. "ఇక్కడ ఇంకా జమీందారీ

వ్యవస్థ కొనసాగుతోంది. జమీందారి వ్యవస్థలోని కీడులన్నీ పల్లెప్రాంతాల్లో వ్యక్తమవుతూ ఉంటాయి. మేము మాకున్న వనరుల ద్వారా ఆ కీడుల్ని దూరం చెయ్యడానికి కృషి చేస్తున్నాము. రైతుల్ని సంఘటిత పరచడమే కాక వారి నిజ సమస్యల్ని ఇస్లాం మార్గ దర్శకత్వాన పరిష్కరించడానికి యత్నిస్తున్నాము. ఇస్లాం సూచించిన విధానాలను విసర్జించడం మూలానే మన వ్యవస్థలో లేని పోని కీడులు ఉత్పన్నమయ్యాయని ఇరువర్గాలవారికీ ఉద్బోధిస్తుంటాము. మేము సంఘటిత పరచిన రైతు సంఘాల్లో జమీందారులూ ఉన్నారు, కమతగాళ్ళు ఉన్నారు. ఒక వైపు వారి శీలనిర్మాణం చేస్తు, మరోవైపున వారి సమస్యలకు ఉమ్మడి సహకారం వల్ల పరిష్కార మార్గాలు అన్వేషిస్తుంటాము. ఈ విధంగా వారి మధ్య అన్యోన్య భావం పెంపొందింప జేస్తున్నాము. అలాగే జమీందారుల వద్ద అక్రమంగా ఉన్న భూముల్ని సక్రమ మార్గంలో వాటి నిజవారసులకు అప్పజెప్పే కృషి కూడా చేస్తుంటాము, ఇస్లాం బోధనల్ని సవ్యంగ అర్థంచేసుకున్న జమీందారులు ఈ మార్పును సంతోషంగా అంగీకరిస్తున్నారు. కమ్యూనిస్టులు ఇలాంటి పరిస్థితుల్లోనే తమ తప్పుడు సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి ఉద్రేకాలు రేపి ఘర్షణ ప్రారంభిస్తారు. దేవుని దయవల్ల ఇస్లామీయ సిద్ధాంతాల కనుగుణంగా విస్తృతంగా పని జరగడం మొదలయినప్పటి నుంచి కమ్యూనిస్టులు కర్షకులకు తమ సంకుచిత దృక్పథాన్నీ, అరచేతి స్వర్గాన్నీ చూపి వంచించలేకపొయ్యారు"

"మీరు నడుపుతున్న రైతు సంఘం బలం, బలగం ఎంత? అన్న ప్రశ్నకు బదులిస్తూ "దేశస్థాయిలో ఇప్పుడు క్రియారూపంలో ఉన్న రైతుసంఘం ఇదొక్కటే. చిన్న చిన్న ప్రాంతీయ సంఘాలున్నా అవి కూడా దీన్ని ఆశ్రయించవలసి ఉంటుంది అప్పుడప్పుడు." "శ్రామిక వర్గంలో జమాఅత్ పని....." అని అడుగుతుండగానే చిరునవ్వు లతో అడ్డుతగిలి అన్నారు. "కమ్యూనిస్టులు చేసిన గొప్పకార్యం ఇదే. మనవాళ్ళు కూడ వాళ్ళు ప్రవేశపెట్టిన పరిభాషలోనే మాట్లాడవలసివస్తుంది. ఒక కాలంలో ఇస్లాం పాలనా పరిధి మూడోవంతు ప్రపంచాన్ని ఆక్రమించిన కాలంలో ఇస్లాం ప్రవేశపెట్టిన పరిభాషలో ప్రపంచ విద్యావిజ్ఞానాలు విలసిల్లేవి ఈనాడు మనం చేతులారా ఆ స్థానాన్ని కోల్పోయాం."

"ఇంతకూ నా ప్రశ్నకు సమాధానం ...." అని నసిగాను సిగ్గుతో కుంచించుకుపోతూ! ఒకనాటి కమ్యూనిస్టునని ఎందుకు చెప్పుకోవాలి?

"పాకిస్తాన్ నేషనల్ లేబర్ ఫెడరేషన్ అనే ఏకైక ఫెడరేషన్ జమాఅత్ కార్యకర్తలే నడుపుతున్నారు. ఇంకా "పియాసీ" అనే ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన ఏకైక సంఘం కూడా జమాఅత్ కార్యకర్తలే నడుపుతున్నారు. వీరందరి వృత్తీ ఉద్యోగాల రీత్యా ఏర్పడే సమస్యల్ని పరిష్కరించడమే కాక మేము వారిని ఇస్లామీయ పంథాలో శీలవంతులుగా మలచడానికి కూడా శాయశక్తులా కృషిచేస్తుంటాము."

నా మెదడులో ఓ రాజకీయ ప్రశ్న అంకురించింది. సందేహమెందుకూ? అడిగేద్దా మనుకుని అడిగాను. "జమాఅత్‌కు ప్రజల్లో ఇంత పరపతి ఉండగా మరి.........ఎన్నికల్లో ఫలితాలు అలా వస్తాయేమండి?"

"అదొక ట్రాజెడి!" అన్నారాయన పెద్దగా నిట్టూర్చుతూ. మీరన్నట్టు కర్షకుల్లో శ్రామిక వర్గంలో ఉద్యోగుల్లో పనిచెయ్యడమేకాక జమాఅత్ లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజాసేవ కార్యకలాపాలు కూడా చేస్తుంది. ఎన్నో ఉచితవైద్య సహాయ కేంద్రాలు నిర్వహిస్తుంది. విద్యాసంస్థలు, స్కూళ్ళు కాలేజీలు నిర్వహిస్తుంది. ఉద్యోగ కల్పనా కేంద్రాలు నిర్వహిస్తుంది. ప్రజలు వీటి ద్వారా లాభంపొందుతుంటారు. జమాఅత్ కార్యకర్తలు నిస్వార్థంగా ఎంతో నైపుణ్యంతో, సేవాతత్పరతతో చేసే కృషి అంతా ప్రజలు తిలకిస్తారు. అనుభవిస్తారు కూడా; కాని "ఓట్ల" మాట రాగానే "నోట్ల"కు, నోటిమాటలకు మోస పోతారు!" అని ముగించారాయన. నాకు ఈ సమాధానం తృప్తిని కలిగించలేదు, నా భావాన్ని నా ముఖంపై చదువుకున్నారు కాబోలు గీలానీగారు, తిరిగి అన్నారు; "మరో ఫ్యాక్టరుంది. జమాఅత్ తొలినాటినుంచి చేసిన కృషి ఒక్కటే, ప్రజల్ని ఇస్లామ్‌పట్ల చైతన్యవంతులుగా చెయ్యడం. ఆ కార్యంలో మేము దైవకృపవల్ల సఫలీకృతులమయ్యామనే నేను భావిస్తాను."

"అవునవును, ఆ మాటను ఈ నాలుగయిదు రోజులు ఇక్కడ తిరిగి. ఇక్కడి సామాన్య ప్రజల్ని పలకరించి నేను తెలుసుకోగలిగాను" అన్నాను ఉత్సాహం, సంతోషం ఉబికి వస్తున్న కంఠంతో. "అవునంటారా? అయితే మౌలానా మౌదూదీ గారయినా లేక ఆయన శిక్షణలో తర్ఫీదయిన మేమయినా ప్రజల్ని జమాఅత్ వైపునకు ఎన్నడూ పిలువలేదు. సదా ఇస్లాం వైపునకే ఆహ్వానించాం, ప్రజల ఓట్లు ఒప్పుకోలు మెప్పుకోలు మేమెప్పుడు ఆశించలేదు. వారు చైతన్యవంతులుకావాలని, ఇస్లాం ద్వారా స్ఫూర్తిని పొందాలని మాత్రమే ఆశించాం, అందుకే కృషిచేశాం. అందులో అల్లాహ్ అనుగ్రహం వల్ల విజయం సాధించాం కూడా. అయితే ఈ వైఖరి రాజకీయ వ్యూహం దృష్ట్యా సమంజసమయింది కాదని కొందరు రాజకీయ కోవిదుల అభిప్రాయం. దైవప్రసన్నతే ధ్యేయంగాబ్రతికే మాకు ఈ "అవివేకం" ఎంతో ఇష్టం! ఆయనెంతో తన్మయత్వంతో సజల నయనాలతో అంటుంటే మేమంతా తాదాత్మ్యయం పొందాం. అరనిమిషం నిశ్శబ్దం ఆవరించింది.

ఆయనే తిరిగి ప్రారంభించారు, "ఆ! ఈ ఓట్ల బెడదలో మరో అంశం ఉందని చెప్పానుగదూ! అదేమంటే, జమాఅత్ కృషి వల్ల ప్రజలు చైతన్యవంతులయినా వీరు తమ తమ అభిరుచుల కనుగుణంగా విభిన్న పార్టీల్లో విభక్తమయి ఉన్నారు. నా అంచనా ప్రకారం దేశంలో 70 శాతం ఉన్నారు ఈ ఇస్లాం ప్రేమికులు, తతిమ్మా 30 శాతంలో ఉన్నవారిని గురించి ముందు చెబుతాను. ముస్లిముల్లో ఒక వర్గం (ఆ వర్గం పేరు నేను చెప్పదలచు కోలేదు)లోని 70 శాతం అహ్మదీయులు, కాదియానీలు 10 శాతం,

కమ్యూనిస్టులు 10 శాతం, గూండాలు రౌడిలు, పాశ్చాత్య నాగరికతకు బానిసలయిన వారు 10 శాతం------వీరంతా కలసి దేశ జనాభాలో 30 శాతం ఉన్నారు. అయితే వీరంతా సంఘటితంగా లేకపోయినా వీరి ఓట్ల భారమంతా మా "తక్కెడ"లో పడదు. అందరం నవ్వుకున్నాం (జమాఅత్ ఎన్నికల చిహ్నం తక్కెడే)

"వీరంతా మూకుమ్మడిగా ఒక్క పార్టీకే ఓటు వేస్తూ వచ్చారు. అయితే 70 శాతం ఉన్న ప్రజల్లో ఐక్యత లేకపోవడం వల్ల, కనీసం 7 విభిన్న వర్గాల్లో విభజించబడి ఉండటం వల్ల, 70 శాతం మాట ఎన్నడూ నెగ్గలేదు. 30 శాతం ఓట్లు మూకుమ్మడిగా పొందిన పార్టీ 70 శాతం ప్రజలపై పెత్తనం చెలాయించింది! ఈ సమస్య పరిష్కారానికే "పి.ఎన్.ఏ." "పాకిస్తాన్ నేషనల్ అలయన్స్"ని రూపొందించాం. ఇప్పుడు అదీ విచ్ఛిన్నమయిపోయింది, అంతాదైవేచ్ఛ!"

" అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్............."ఇషా ప్రార్థనకు పిలుపువచ్చింది. అందరం కలసి విశ్వానికి పరిపాలకుడు, అధికారి అయిన విశ్వప్రభువు సన్నిధిలో మోకరిల్లడానికి బయల్దేరాం.

❖ ❖ ❖

మధ్యవయసు, బక్కపల్చటి (అయితే దృఢమయిన) కాయం, తెల్లటి దేహచ్ఛాయ, నెరిసినగడ్డం. చిరునవ్వు ఒలికించే మోము. మాటల్లో ధీమా, విజ్ఞానం ఉట్టిపడే వాగ్ధోరణి, పరిశుభ్రమయిన సాధారణచొక్కా, హైదరాబాదీ స్టయిల్ పైజామా, ఈయన మౌలానా ఖలీల్ హామీదీ. మౌలానా మౌదూదీ గారు స్థాపించిన "దారుల్ ఉరూబా" (అరబీభాషలో అనువాదం, రచన, ప్రచురణలసంస్థ)కు అధినేత. అరబ్బు దేశాల పరిస్థితులు బాగా తెలిసిన పెద్ద మనిషి. 'మన్సూరా' లో ఉన్న ఆయన ఆఫీస్‌లో కెళ్ళి పరిచయం చేసుకున్నాం, నేనూ మహారాష్ట్ర అమీరెహల్కా రషీద్ ఉస్మానీగారు కలసి.

మౌలానా ఖలీల్ హమిదీ చాలాకాలం మౌలానా మౌదూదీకి సహాయకుడిగా పనిచేసినందువల్ల మౌలానాగురించి ఆయన ఎన్నోవిషయాలు తెలిపారు:

షా ఫైసల్ అవార్డును గురించి ప్రస్తావిస్తూ ఆయన ఇలా వివరించారు; "అవార్డు మౌలానాకు ప్రదానం చేసినట్లు కమిటీ తరపున అందిన టెలిగ్రాం చూసుకుని మౌలానా పిలిపించారు నన్ను. "ఏమిటయ్యా ఇదంతా, నాకేమి బోధపడటం లేదే" అన్నారు.

నాకు దాని పూర్వగాథ కొంతవరకు తెలుసు గనుక, షాఫైసల్ కుమారులు తమ తండ్రి పేరిట ఒక అవార్డును ఇచ్చే సంస్థను నెలకొల్పారు. దానికిగాను విద్వాంసులు, మేధావులు, పండితులు గల ఓ కమిటీని నియమించారు. ఆ కమిటీ ఆ సంస్థ తరపున తొలి అవార్డును ఇస్లామియ జీవనవ్యవస్థ సంస్థాపనలో సేవల దృష్ట్యా మీకు ప్రదానం చెయ్యాలని నిర్ణయించింది, అని తెలిపాను.

నా కెందుకయ్యా ఈ అవార్డులు అని అన్నారు నిర్లిప్తతతో...

మౌలానాకు అవార్డునిస్తే, ఆ అవార్డు ప్రాముఖ్యం పెరుగుద్దని ఫైసల్ కుమారులు, కమిటీ సభ్యులు అలాచేశారన్న యథార్థం నాకు తెలుసు, అప్పుడు మౌలానాను కదిలించడం భావ్యంకాదని మౌనంగా వెళ్ళి పొయ్యాను.

మరుసటిరోజు నన్ను పిలిచి మౌలానా ఇలా అన్నారు, "ఇదొ చూడండి. నేను ఆ అవార్డు కొరకు వారు చేసే ఫంక్షన్‌కు హాజరుకాలేను, హాజరు కావాలని నాకు లేదు కూడా, మీరు వెళ్ళండి, నా తరఫున మా అబ్బాయిని తీసుకు వెళ్ళండి, నాతరఫున మూడు మాటలు అక్కడ చెప్పండి - ఒకటి ప్రపంచంలో అసత్య ప్రచారకులు అవార్డులు పెట్టి తమ దృక్పథాలను, తమ ఆశయాలను విస్తరింపజేసేవారిని ప్రోత్సహిస్తూ ఉండగా ఇలా ఇస్లాం కొరకు కృషి జరిపే వారికై ఫైసల్ తనయులు అవార్డు నిర్ణయించడం ముదావహం. దానికి వారు అభినందనీయులు. రెండో మాటేమంటే నేను ఇలాంటి అవార్డును ఎప్పుడూ ఆశించలేదు. నా అసలు 'అవార్డు' నేనెవరి మెప్పుకై కృషి చేశానో ఆ ప్రభువే ప్రసాదించాలి. నాకు దీనితో నిమిత్తంలేదు. మూడోమాట ఇస్లాం జీవన వ్యవస్థను పునరుజ్జీవింప జేసే కృషికి వారు అవార్డునిచ్చారు కాబట్టి, దాన్ని నేను తిరిగి ఆకృషి జరిగేందుకు వినియోగించడానికే కేటాయిస్తున్నాను. నా తరఫున ఈ మూడు విషయాలు చెప్పండిచాలు."

ఖలీల్ హామిదీ ఒక్క నిమిషం ఆగారు. "అవార్డు ప్రదానం చేసిన రోజున నేనీ విషయాలు ప్రకటించగానే అక్కడ కూర్చున్నపండితులు, మేధావులు, సౌదీ వంశజులు, రాజుఖాలిద్, మంత్రివర్యులు, రాకుమారులందరికీ ఎక్కిళ్ళ పర్యంతం అయిందంటే నమ్మండీ. నావద్ద ఆనాడు గంటన్నర గడిచిన ఉత్సవం ఫిల్ముంది. అందులో అన్నీ చిత్రీకరించబడ్డాయి అన్నారు హామిదీ గారు. ఆ అవార్డులో వచ్చిన దాదాపు ఆరు లక్షల రియాళ్ళ మొత్తాన్ని, ఒక బంగారు పతకాన్ని మౌలానా తాను స్థాపించిన ఇస్లామిక్ రిసెర్చ్ అకాడమికి బహూకరించారని కూడా ఖలీల్ హామిదిగారు తెలిపారు.

సౌదీ కుటుంబ విషయాలు ప్రస్తావనలో రావటంమూలానా నాలో ఎప్పట్నుంచో మెదలుతున్న ఒకప్రశ్నను అడక్కుండా ఉండలేకపోయ్యాను. "సౌదీ రాకుమారులు, రాజకుటుంబీకులు చేసే విలాసభోగాలు ప్రపంచమంతా ప్రతీతి పొందాయే, మరి మౌలానా ఎప్పటి నుండో సౌదీ అరేబియా వెళ్తుండేవారు, ఆయనకు ఆ వంశంలో ఎంతో పలుకుబడి ఉందని కూడ విన్నాం. అయితే మౌలానా అయినా మీరైనా మరే ధర్మవేత్తలైనా వారిని వారి రాజ భోగాలను గురించి హెచ్చరించలేదా?"

నా యీ ప్రశ్న వారి పెదాలపై ఓ అందమయిన చిరునవ్వును తెప్పించింది. ఆయన నెమ్మదిగా చెప్పసాగారు:

"ఈ ప్రశ్న ఇలా రావడం సహజమే! ఎన్నో సత్యాలు సామాన్యంగా ప్రజలకు తెలియవు కాబట్టి ఇలా అనుకోవడం కూడా సహజమే. వాస్తవమేమంటే మౌలానా తనకు

షాఫైసల్‌తో ఉన్న సంబంధాలను పురస్కరించుకుని ఆయనకు ఈ విషయాలను గురించి ప్రత్యక్షంగా చెప్పడమే కాక లేఖల ద్వారా సౌదీ వంశం సంస్కరణ శిక్షణల కొరకు ఎన్నో సలహాలు కూడా ఇచ్చారు. వాటిలో సందర్భోచితంగా వీలుపడిన మేరకు షాఫైసల్ అమలు పరిచారు కూడా. షాఫైసల్ తరువాత షాఖాలిద్‌కు కూడా మౌలానా ఈ విషయంలో గుర్తుచేసిన సందర్భాలు లేకపోలేదు. అసలు విషయమేమంటే, ఆ వంశంలో వారికి ఎన్నో ఆంతరంగిక సమస్యలున్నాయి. వాటినన్నిటినీ సర్దుకుని రాజ్యపాలన చెయ్యవలసి ఉంటుంది. ఈ చిక్కుల్లో కొన్ని లోటుపాట్లు ఉండక మానవు--- ఇంకా అసలు రాచరిక వ్యవస్థే ఎన్నో కీడుల్ని సృష్టిస్తుంది. ఆ వ్యవస్థ మారనంత వరకు, నిజమయిన ఇస్లామీయ జీవనవ్యవస్థ సమస్త రంగాల్లో నెలకోనంత వరకు ఏ సంస్కరణా సాధ్యం కాదన్న నిజాన్ని మీరు ఒప్పుకోండి!" అన్నారాయన నవ్వుతూ.

"కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?"

మాకు ఒక వ్యాన్ ఇచ్చారు. ఏడుగురం. మిగతా ముగ్గురు మరో చోటి నుండి వస్తారు. లాహోర్ స్టేషన్ చేరాం. అంత పెద్దస్టేషన్, కాని ఏ మాత్రం పరిశుభ్రంగా లేదు. బ్రిటిష్ వాళ్ళ కాలం నాటి స్టేషను బిల్డింగు మెరుగులు దిద్దుకోవడం పోయి ఇంకా కాస్త రోతగానే తయారయింది. టికెట్టు తీసుకుని ప్లాట్‌ఫారం మీది కెళ్ళాం. అక్కడి పరిస్థితీ ఏమంత బాగా లేదు. మమ్మల్ని చూడగానే కూలీ వాళ్ళు ఎగబడ్డారు. పది రూపాయలకో సీటట! వద్దని చెప్పేశాం. ట్రయిన్ రాగానే ఎక్కేద్దామనుకున్నాం.

ఇంటర్, థర్డు క్లాసులు ఎప్పుడో తీసిపారేశారట అక్కడ. మన లాగే ఫస్టు సెకండు క్లాసులే ఉన్నాయి. పాత కాలపు ఇంటర్ పెట్టెలనే నేడు ఫస్టుగా కొన్ని బండ్లలో ప్రవేశపెట్టారు. థర్డును మనలాగే సెకండ్‌గా మార్చారు. అయితే ఈ మార్పులు అక్కడ మనకంటే ఎన్నో ఏండ్ల క్రితమే జరిగిపోయాయట. కాని కాగితంపైన శోభయమానంగా జరిగిన ఈ మార్పులు తప్ప "రైల్వే" వ్యవస్థ ఏ మాత్రం వృద్ధి పొందలేదు.

బండి వచ్చి మేము ఎక్కేవరకు, సామెత మేరకు కాదు, అక్షరాలా తల ప్రాణం తోకకు వచ్చిందంటే నమ్మండి. ఎలాగో ఎక్కి సర్దుకున్నాం, బండి ముందుకు సాగితే అదే అంతా సర్దుకుంటుందని యువకులం నిలబడ్డాం. పెద్దవాళ్ళు ఎలాగో కష్టపడి కూర్చుని కష్టమనుభవిస్తున్నారు. నాకు సరిగ్గా ముప్ఫయి ఏళ్ళ క్రితం (1949, డిసెంబర్) కంభం (నాటి కర్నూలు జిల్లా నేటి ప్రకాశం జిల్లా) నుండి బెల్లంపల్లి (నాటి ఆసిఫాబాద్ జిల్లా నేటి ఆదిలాబాద్ జిల్లా) వరకు ఎం.ఎస్.ఎం. రైల్వే, ఎన్.ఎస్. రైల్వేలలో చేసిన ప్రయాణం గుర్తుకు వచ్చింది. అప్పుడు నేను చిన్నవాణ్ణి. కూర్చోడానికి కూడ చోటు దొరకలేదు. రాత్రి పూట నిలబడే గాఢనిద్ర ననుభవించాను. నాకు ఆ ప్రయాణం ఎప్పటికి మరుపురాదు. అలాగే లాహోర్ నుండి కరాచీకి చేసిన 24గంటల ప్రయాణమూ మరుపు రానిదే! బండిలో కూర్చున్నాక మాలో తర్జనభర్జనలు ప్రారంభమయ్యాయి. ఫస్టుక్లాసు

టికెట్ తీసుకోవలసిందని కొందరు అభిప్రాయపడ్డారు. తోటి ప్రయాణికుల్లో ఒకరు మా తర్జనభర్జనలు విని నవ్వేశారు. "మీరు ఫస్టు క్లాసు తీసుకోనిదే నయం" అన్నారు.

'ఎందుకూ?' ఆశ్చర్యం వేసి అడిగారు ఎవరో. "అక్కడా ఇలాగే ఉంటుంది. సెకండ్ క్లాస్ ప్రయాణీకులు వచ్చి కూర్చుంటారు. ఎవరూ ఏమీ చెప్పలేరు. ఏమీ చెయ్యలేరు." కుండ బ్రద్దలు కొట్టినట్టు చెప్పారు. అదేమని అడిగితే అది అంతే అన్నాడాయన.

"పాకిస్తాన్ ఏర్పడ్డాక రైల్వే సంస్థ ఏమీ పురోగమించలేదు. కావలసినన్ని రైల్వే లైన్లు లేవు అవసరమయినన్ని ట్రయిన్లు లేవు. జనసాంద్రత పెరుగుతోంది కాని ప్రయాణీకులకు తగినన్ని వసతులు లేవు. కొన్ని ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బండ్లు ఇంతకంటే కాస్త మెరుగ్గా ఉన్నాయనుకోండి" అని సమాధాన మిచ్చాడాయన. మేము ఒకళ్ళ ముఖం ఒకళ్ళం చూచుకున్నాం. అంతటితో మాలో తృప్తి చోటుచేసుకుంది.

ప్రక్కవాళ్ళతో హుషారుగా మాటలు మొదలు పెట్టి ఎలాగో కాలం వెళ్ళబుచ్చ సాగాం. స్టేషన్లు వచ్చినప్పుడల్లా, కిటికీగుండా ప్రయాణీకులు, వాళ్ళ సామాన్లు వచ్చి పడటం, వాళ్ళను, వాళ్ళ 'వాటి'నీ లోనున్న వాళ్లు అందుకోవడం, "ఏదో పరోపకారార్థం ఇదం శరీరం" అని నిరూపించుకోవడం. ఆకలి వేస్తే స్టేషన్లలో "అమ్ముడు పోయే సరకు" కొని కడుపులో వేసుకుని ముందుకు సాగడం, అంతా "సక్రమం"గా "సవ్యంగా" కొనసాగుతోంది.

నిలబడ్డ వారికి ముగ్గురికి కూర్చున్నవారు వంతుల వారీగా చోటిచ్చి, తాము నిలబడి సత్కరిస్తున్నారు. పరిస్థితులతో రాజీపడ్డ మేము ఈ కష్టాలను అంతగా పట్టించుకోవడం లేదు. తోటి ప్రయాణీకుల ద్వారా "విషయం" రాబట్టడానికి నేను సకల ప్రయత్నాలు చేస్తున్నాను. ఒక బెలూచీ తారస పడ్డాడు. అతడు కూలీ వాడికి 10 రూపాయలిచ్చి "సీటు" తీసుకున్నాడట. అయితే అక్కడ సీటు లేదు! వచ్చి పడే వారిని ఏమీ చెయ్యలేకపోతున్నాడు. కూలీ వాళ్ళను రైల్వే వాళ్ళను, ప్రభుత్వాన్ని బాగా తిట్టాడు. గత ముప్ఫయ్యేళ్ళలో అయ్యూబ్ ఖాన్ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, భుట్టో తన హయాంలో ఏదో పంచి పెట్టాడని భారత పత్రికలు కోసే కోతలన్నీ బట్టబయలయ్యాయి.

నాకు మా దేశప్రజలపైన నవ్వు వచ్చింది. కొన్ని నెలల క్రితం భుట్టోను పాకిస్తాన్ న్యాయస్థానం తీర్పు రీత్యా ఉరితీస్తే మన దేశ పత్రికలన్నీ (ఏవో కొన్ని తప్ప) జనరల్ జియాను ఎంతో తూలనాడాయి. భుట్టో లేకపోతే పాకిస్తాన్ ఏమయిపోతుందో అని గొంతెత్తి అరిచాయి. భుట్టో తన ఏడేళ్ళ పాలనలో చేసింది ఏమీ లేదని ఇక్కడకు వచ్చాకే తెలుస్తోంది. భారత్‌లో భుట్టో పాలనను సమర్థించిన గొప్ప గొప్ప పాత్రికేయులంతా ఒక్కసారి పాకిస్తాన్ పర్యటించి నిజానిజాలు తెలుసుకోవడం ఉత్తమం అనిపించింది నాకు.

ట్రయిన్‌లోనే ఒక హైద్రాబాదీ కలిశాడు. అతను 30 ఏళ్ళ క్రితం పాకిస్తాన్ వచ్చేశాడట. అతను ఇంజనీరు, కొంతసేపు అతని గోడు విని, పాకిస్తాన్‌లో పరిశ్రమలను గురించి కదిలించాను. "నాకు రాజకీయాలు తెలియవు కాని, నిజం ఏమిటంటే, అయ్యూబ్ కాలంలో కొన్ని పరిశ్రమలు ప్రగతి సాధించిన విషయం నిజమే. బట్టల ఉత్పాదనలో మేము ప్రపంచ మార్కెట్‌లో జపాన్‌ని ఛాలెంజి చేశాము. భుట్టో గారు వచ్చాక ఆ మిల్లులు మూతపడ్డాయి. కార్మికులు అష్టకష్టాల పాలయ్యారు. చెక్కరలో స్వయం సమృద్ధి సాధించి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాము, భుట్టో పరిపాలనలో 22 చెక్కర మిల్లులకు తాళాలు పడ్డాయి. ఇప్పుడు చెక్కెర, ఒక్కోసారి ఇరువయి రూపాయలకు కిలో అమ్ముడుబోతోంది. రైల్వే ఎంత అధ్వాన్నంగా ఉందో చూస్తూనే ఉన్నారు. బస్సులు ఇంతకంటె అధోగతి పాలయ్యాయి. ఆరు నెలల క్రితమే నేను మొదటి సారిగా హైదారాబద్ (దక్కన్) వెళ్ళాను. అక్కడ రైల్వే వసతుల్ని చూసి నా ఆనందానికి అవధులు లేవంటే నమ్మండి. ఉభయ దేశాల్లో మైత్రి సుహృద్భావాలు ఏర్పడితే, సాంకేతిక జ్ఞానాన్ని ఉభయులు పరస్పరం పంచుకుని వృద్ధీ వికాసాలు పొందవచ్చు. క్షుద్రమయిన రాజకీయాలు అడ్డురాకుండా ఉంటే ఉభయ దేశాలు సహాయసహకారాలు పెంపొందించుకునే అవకాశాలు ఎన్నో ఉన్నాయి."

ఆ హైదరాబాదీ అమాయకంగా అంటుంటే నా ఆంతర్యం ఆనందంతో పొంగి పోయింది. ఉభయత్రా ప్రజలు కాంక్షించేది ఇదే. కాని ఈ ప్రజలు ఎన్నుకున్న నాయకులే కలసి మెలసి జీవించాలని కోరే ఈ హృదయాల్లో విభేదాలు సృష్టించి, విద్వేషాగ్నిని రగుల్గొలిపి ఆసనాలను ఈ వైషమ్యాల ఆధారంగా నిలబెట్టుకోడానికి తంటాలు పడు తుంటారు. ఈ నాయకులకు జ్ఞానోదయం కలిగి భారత ఉపఖండంలో శాంతి వర్ధిల్లే రోజులు దగ్గరవుతున్నాయని నా అంతరాత్మ సాక్ష్యం పలికింది, మనసు దానికి "ఆమీన్" అన్నది!

దాదాపు 24 గంటలు తరువాత కరాచీ స్టేషన్ చేరాము. స్టేషన్‌కు జమాఅతె ఇస్లామీ కరాచీకి సంబంధించిన నలుగురయిదుగురు కార్యకర్తలు వచ్చి రిసీవ్ చేసుకున్నారు. మౌలానా అబ్దుల్ అజీజ్ బావమరిది ఒకాయన అక్కడే ఉంటారు. ఆయన కూడా స్టేషన్‌కు వచ్చారు. మౌలానా అబ్దుల్ అజీజ్ గారి గురువు గారు, నకీఅలీ కూడా అక్కడే ఉంటారు, కాబట్టి ఆయన కూడా వచ్చారు. ట్రయిన్‌లో మేమనుభవించిన "సుఖం" మా వేషాల వల్ల బాగా వ్యక్తమయింది. అందరూ మమ్మల్ని చూసి జాలిగొన్నారు.

అందరం కలసి ముందు కరాచీ జమాఅత్ కార్యాలయానికి పొయ్యాము. అక్కడ కాలకృత్యాలు తీర్చుకుని, టిఫిన్ చేసుకునే లోపు జియావుల్‌హక్ క్యాబినేట్‌లో ప్రచార ప్రసారాల మంత్రిగా పి.ఎన్.ఏ. తరఫున పని చేసిన మహ్మూద్ ఆజం ఫారూకీ వచ్చారు. ఆయన చాలా చమత్కారంగా మాట్లాడతారు. నవ్వుతూ నవ్విస్తూ ఉంటారు. "ఏదయినా సమావేశం ఏర్పాటు చేద్దామంటే ఇప్పుడు ఎలక్షన్ల గొడవలో ఏదీ సాధ్యమయ్యేలా లేదు.

మీరంతా అంత దూరాన్నుండి వచ్చారు కనీసం జమాఅత్ కార్యకర్తలనయినా సమావేశ పరిచేస్థితిలో లేము. మీ అధీనంలో ఒక కారు ఇచ్చేస్తాము. అంతా తిరిగిచూడండి. అలాగే జమాఅత్ కార్యకలాపాలు కూడా తెలుసుకోండి" అన్నారాయన. "సరే" అన్నాము చేసేది లేక!

ఎలక్షన్ల బాదరబందీ అంతా ఇంతా ఉండదని అప్పుడే తెలుసుకోగలిగాను. అక్కడ కారు తీసుకొని నకీఅలీ గారి ఇంట టీ త్రాగి మన అమీరె హల్కా గారి బావమరిది ఇంటికి పోయాము. అతి సామాన్యమయిన ఇల్లు. మూడు పెద్ద గదులు పోగా వంట గది ఇత్యాది నిత్యావసరాల గదులు అవీ వున్నాయి. సొంత ఇల్లేనట. డ్రాయింగ్ రూంలో సోఫాసెట్, రేడియో, టీవిలున్నాయి, ఇంట్లో బట్టలుతికే మిషిన్, రెఫ్రిజిరేటర్ కూడా ఉన్నాయట. తరువాత అమీరె హల్కా చెప్పారు. అన్నీ విదేశీ సామానులే! ఆయన ఇంజనీరు. ఏదో ఎలెక్ట్రికల్ ఫర్మ్‌లో పని. ఆ ఫర్మ్ కూడా విదేశీ ఫర్మే!

ఆయన ఇంతకు ముందే రెండు సార్లు భారత్ వచ్చి ఉండటం మూలాన నాకు పరిచయం ఉంది. ఆయనతో కాస్త ఫ్రీ గానే మాట్లాడాను.

"ఏమండి మీరు ఇంకా కారు కొనలేదేమీ?" కదిలించాను మెల్లిగా నవ్వి, నా ప్రశ్నను దాటేశారాయన. కాని కార్ల ప్రస్తావన చర్చలోకి వచ్చింది. అక్కడ కారు ఫారిన్ నుండే రావాలి. మోటార్లు కూడ అంతే అక్కడ తయారయ్యేవి బహు స్వల్పం.

"ఇక్కడ ప్రజలకు కూడా విదేశీ సరుకు మీద ఇంకా మోజు తగ్గలేదు" నవ్వుతూ అన్నాడాయన.

"కారణం?" నా ప్రశ్న.

"ఏముంది? చాలా మటుకు ఇక్కడ చదివిన వాళ్ళంతా గల్ఫ్‌దేశాలకు, అమెరికా, ఇంగ్లాండుకు సంపాదనకై వెళ్తారు. అక్కడ సంపాదించి తెస్తారు. ఇక్కడ పారిశ్రామికంగా వెనుకబడ్డతనాన్ని దూరం చెయ్యాలన్న ధ్యాసే ఉండదు. సంపాదనంతా అధునాతన సౌకర్యాల్ని సమకూర్చుకోవడంలోనే సరిపుచ్చుకుంటారు. అందువల్లనే మీరు చూస్తున్న ఈ పటాటోపం!"

"దీనివల్ల దేశ ఆర్థిక స్థితి...."

"దేశ ఆర్థిక స్థితి" నా మాటకు అడ్డు వస్తూ చెప్పాడాయన, "ఎటుపోతే ఎవరి కేమి? అంతా 'కౌన్ కిసా' గాళ్ళు. ఇంత వరకు పాలించిన నాయకులు నేర్పింది ఇంతే. మా వాళ్ళు చేస్తున్నది ఇంతే" ముగించాడయన ఉద్రేకంతో.

పంజాబ్ భూభాగం దాటగానే రైలులో కనిపించిన బంజరు భూములు గుర్తుకు వచ్చాయి. వాటితోబాటే లాహోర్, కరాచీ రోడ్లపై 'రయ్ రయ్" మని దూసుకుపోతూ

కనిపించే కార్లు ఇక్కడి ఇండ్లలోని ఫారిన్ సరకు అన్నీ కన్నుల్లో మెదిలాయి. పెట్రో డాలర్లపై నిలబడి ఉందన్న మాట పాకిస్తాన్! అదే అన్నాను ఆయనతో.

మందహాసం తొణికిసలాడింది ఆయన పెదాలపై "స్థూలంగా చూస్తే అలాగే అగుపిస్తుంది. మరీ అంత అన్యాయంగా, అధ్వాన్నంగా లేదులేండి మా పరిస్థితి. ఇప్పు డిప్పుడే సర్దుకుంటున్నాము. కొన్ని రోజులు పోతే మా కాళ్ళపై మేమూ నిలబడ గలుగుతాము" అన్నాడు ధీమాగా.

మధ్యాహ్నం అక్కడే భోజనాలయ్యాయి. కాస్సేపు రెస్టు తీసుకుని సాయంత్రానికల్లా బయల్దేరాం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు మిత్రులుంటే చుద్దానికని. అందరినీ పలకరించి పరామర్శించుకుని జమాఅత్ కార్యాలయానికి చేరే వరకు రాత్రి పది గంటలయ్యాయి. అమీరెహల్కా గారి బావమరిది ఇంటి పరిస్థితి అక్కడి మధ్య తరగతి ఇండ్లల్లో అధమం అన్న సంగతి ఇంకా రెండు మూడు ఇళ్లు తిరిగి చూశాక అర్థమయింది. సగటు మనిషి, మేము మాకు విలాస వస్తువులుగా భావించే సౌకార్యాల్ని హాయిగా అనుభవిస్తున్నాడు. ఫారిన్ వస్తువుల పట్ల వాళ్ళ మోజు, ఆ సౌకార్యాల పట్ల నాకు వెగటు కలిగించింది. ఒక్క టీవీ సెట్ తయారు చెయ్యలేని వారు ఇంటింటా టీవి పెట్టుకుని కూర్చోవడం గొప్ప విశేషంగా నాకు అగుపించలేదు. వేలాది ఎకరాల భూమి బంజరుగా పడి వుంటే దాన్నంతా సాగుబడి చేసుకుని పంటలు సమృద్ధిగా పండించుకోలేని ప్రజలు విదేశీ కార్లలో కాలరెత్తుకుని తిరుగుతూ ఉండటం అంత సమంజసంగా తోచలేదు. ఇదంతా 'పైన పటారం లోన లొటారం' లాంటి డంబాచారంగానే అగుపించింది. అదే భావాన్ని నేను కలసి మాట్లాడిన పాకిస్తానీయులందరి ఎదుట నిర్మొహమాటంగా వ్యక్తపరిచాను. కొందరు ఒప్పుకున్నా కొందరు నవ్వి త్రోసిపుచ్చారు.

ఆరిపోయిన మంటల గాథ!

మా కరాచి ఆగమనాన్ని ఫారిన్ డిపార్ట్‌మెంట్‌లో నమోదు చేయించడానికని వెళ్తే ఫోటోలు కావాలన్నారు. కరాచీలో ఇదోపద్ధతి. పోలీసువాళ్ళ రిజిస్టర్‌లో విదేశీయుని ఫోటోకూడా, 'ఎందుకయినా మంచిదని' పొందుపరుస్తారు. మేము ఫోటోలు తీయించి ఆ పని పూర్తి చేయించుకునేలోగా ఓ రోజంతా వ్యర్థమయింది. మరో రోజూ కాస్త తీరిగ్గా పాత్రికేయుల్ని సందర్శించాలని అనుకున్నాను. ఒక్కో పత్రిక కార్యాలయానికి పోవడం, అక్కడ వారితో పరిచయం చేసుకోవడం, కొన్ని ప్రశ్నలడిగి, వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ముందుకు సాగడం, ఈ విధంగా కార్యక్రమం ప్రారంభించాను. సాయంత్రాని కల్లా కొందరిని కలుసుకోవడం పూర్తయింది. కరాచీ జమాఅత్ వాళ్ళు మాకు కార్లు సప్లయి చేశారని సరిపోయింది కాని, లేకపోతే అక్కడి టాక్సీ బాడుగల్ని తట్టుకోవడం సాధ్యమయ్యేదికాదు.



ఒక పత్రికలో మొదటి పేజీ

మౌలానా మౌదూదీ
మరణించిన రోజున
ఒక పత్రిక
ప్రచురించిన ఒక
పేజీ...

ఒక ఉర్దూ దినప్రతిక ఎడిటర్‌ని కలుసుకుంటే ఆయన మురాదాబాద్ (యు.పి)కి చెందినవారని తెలిసింది. ఆయన చెల్లెలు ఇప్పటికీ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉందట "1969లో అహ్మదాబాద్‌లో మత కలహాలు జరిగినప్పుడు నేను అక్కడే ఉన్నాను. ఆరోజు శుక్రవారం అనుకుంటా. ప్రొద్దునే ఇంటి నుండి బయల్దేరి కొందరు మిత్రులతో కాలం గడిపి, శుక్రవారం ప్రార్థన, మధ్యాహ్నం భోజనాలు అన్నీ మిత్రులతో ముగించుకొని, కాస్త విశ్రాంతి తీసుకుని సాయంత్రానికి ఇంటికి వెళ్ళాలనుకుంటే మా బావవాళ్ళుండే ప్రాంతంలోనే అలజడులు మొదలయ్యాయని వార్త అందింది". చిరునవ్వు పెదాలపై తొణికిసలాడగా క్షణకాలంపాటు కళ్ళుమూసుకున్నాడు.

"ఆ తరువాత ఏమయిందీ----?" మాలో ఎవరో ఆత్రుత కనబరిచారు.

"అప్పుడు మా మిత్రులు ఎంత వారించినా నేను మా ఇంటికి బయల్దేరాను, నా గడ్డం నేను ముస్లింనని చాటి చెబుతూనే ఉందనీ, నేను పాకిస్తానీనని మా వీధిలో అందరికీ తెలుసనీ, గుర్తుకు రాగానే దారిలో ఓ సారి తడబడ్డాను" పూర్తిగా నెరవకపోయినా అధిక భాగం తెల్లబడుతున్న అందమయిన గడ్డం సవరించుకుంటూ చెప్పారాయన. మరుక్షణమే ఆ జంకు దూరమయింది. ఏది ఏమయినా చెల్లి ఇంటికి పోవలసిందే అన్న ఆలోచన వచ్చింది. గబగబా అడుగులు వెయ్యసాగాను. మా వీధి దగ్గరయిన కొద్ది పొగ, సెగ, నినాదాల గలభా ఉధృతమవసాగింది. వీధిలో ప్రవేశించాను అంతే-" మంచినీళ్ళు త్రాగసాగారాయన.

"దుండగుల మూక చుట్టు ముట్టిందా?" అక్కడ కూర్చున్న మిత్రుల్లో ఒకరు ఓపికపట్టలేక పొయ్యారు.

"నేనా దృశ్యాన్ని చూడలేక పొయ్యాను. గాజుముక్కలు, నీళ్ళు, కాలుతున్న బట్టపేలికలు, కట్టెముక్కలు వగైరాలతో రోడ్డంతా రోతగా ఉంది. అప్పుడే పోలిసులు వచ్చినట్టుంది, దుండగుల్ని తరుముతున్నారు, రోడ్డుకు ఇరుప్రక్కల నున్న సందుల్లో నుంచి రౌడి కుర్రాళ్ళు పోలీసులను ఆట పట్టిస్తున్నారు. కొన్ని దుకాణాల నుండి, ఇండ్ల నుండి పొగవస్తోంది. మంటలు ఆరిపోయాయి. నేను రంగప్రవేశం చెయ్యడాన్ని ఎవరూ గయనించినట్లులేదు. నేను మామూలుగానే రోడ్డును దాటి మా ఇల్లున్న సందులోకి చేరాను. అక్కడ రౌడిమూక కట్టెలు పట్టుకొని తిరుగాడుతోంది."

"అరె! ఉట్టిగానే చిక్కిపొయ్యారే!" అన్నాడు మాతో కూర్చున్న పెద్దమనిషి.

ఆయన తన్మయత్వంతో ఓ చిరునవ్వుపారేసి అందుకున్నాడు. "నా గుండె ఒక్కసారి అదిరింది. అయితే, అదేం విచిత్రమో కాని, దుండగులు నన్ను చూసి పట్టించుకోక పోవడమే కాక నేను వెళ్ళిపోతూ ఉంటే నాకు దారి ఇచ్చారు కూడ."

"నాకు తరువాత అనిపించింది. నేను వారితో మాట్లాడి వారిని ఆ అఘాయిత్యాల నుండి వారించే పని చెయ్యలేదే. ఒకరికి ఒకమంచి మాటచెప్పే అవకాశం దైవం నాకు ప్రసాదిస్తే దాన్ని వదలుకున్నానే అని!"

"ఇంకా నయం, మీరు ప్రాణాలతో బయటపడ్డారు అదే పదివేలు. ఇంతకీ మీ చెల్లెవాళ్ళు, వాళ్ళ ఇల్లు అంతా క్షేమంగా ఉన్నారా మీరు వెళ్ళేటప్పటికీ?" అడిగారక్కడున్న వారు.

"ఆ! దేవుని దయవల్ల నేను వెళ్ళేసరికి అందరూ క్షేమంగానే ఉన్నారు. నా రాక కోసం ఎదురుచూస్తూ, పెద్దలూ పిన్నలు ప్రాణాలు గుప్పెట్లో పట్టుకొని బిక్కుబిక్కుమని కూర్చున్నారు. నేను ఇంట్లోకి రాగానే వాళ్ళ ముఖాలపై కొంత తృప్తి, కాస్త ఆనందం చోటుచేసుకున్నాయి."

"ఆ తరువాత మీరు అక్కడే ఉన్నారా, లేక........"

"రెండో రోజే నేను మా బావను చెల్లెల్నీ, పిల్లల్ని తీసుకొని మురాదాబాద్ వచ్చేశాననుకోండి. అయితే నా జీవితంలో ఆ రాత్రి మరపురానిది. నేను పాత్రికేయునిగా ఎన్నో గండాలకు గురయినా ఆనాటి గండం గడవటం కేవలం దైవకృపవల్లనే" సాలోచనగా అన్నారాయన.

"ఏ గండం గడిచినా అది దైవకృప వల్లనేగా" మందహాసంతో నేనన్న దానికి ఆయనా మందహాసంచేస్తూ అర్థవంతంగా, "నిజమేననుకోండి................."

"భుట్టో పతనానికి మీ దృష్టిలో కారణాలేవో చెబుతారా?" అని ఓ పాత్రికేయునికి అడిగితే ఆయన బిగ్గరగా నవ్వి. అవన్నీ ఎవరయినా రాజకీయ నాయకునికి అడిగి తెలుసుకోండి. నేను కొన్ని గమ్మత్తయిన విషయాలు చెబుతాను అవి మీకే (భారతీయులకే) కాదు మావాళ్ళకు (పాకిస్తానీయులకు) కూడా చాలా మందికి తెలియవు."

"సరే ఏవో చెప్పండి!" అన్నాను నిరుత్సాహంతో.

"అబ్బే మీరలా నిరాశ చెందితే ఎలా? కొద్ది సేపట్లో రాజకీయ వేత్తగా మారిన ఓ పాత పాత్రికేయులు వస్తారు ఆయన్ని అడగండి, మీరు ఏమేమి అడగదలిచారో," అన్నారు తిరిగి.

"మీరు చేప్పే విషయాలు యథార్థాలయితే తప్పకచెప్పండి" అన్నాను నవ్వుతూ.

ఆయన చిరుకోపం నటిస్తూ "అయితే నేను అబద్ధాలాడతానంటారా? "అన్నాడు. అంతలోనే సర్దుకోని "ఇవి కేవలం నిజాలే కాదు. పచ్చినిజాలు, పాకిస్తానీయుల అనుభవంలోకి వచ్చిన యదార్థాలు" అని సీరియస్‌గా చెప్పసాగారు.

"భుట్టో ప్రభుత్వం పడిపోవటానికి, ఆయన పాలనలో జరిగిన అత్యాచారాలు చాలావరకు ముఖ్యకారణాలని చెప్పవచ్చు. పాలనా యంత్రాంగం చాలావరకు నిర్వీర్యమయిపోయింది. కార్యదక్షత పూర్తిగా కోల్పోయింది. ఎన్నని చెప్పమంటారు. అన్నీ అవకతవకలే - పీపుల్స్ పార్టీకి చెందిన వారికి వారు సాధారణ గ్రాడ్యుయేట్లయినా ఐ. సి.ఎస్. హోదాలు అంటగట్టారు. దాదాపు 500 అధికారుల్ని పదవీచ్యుతులుగావించడమో,

రాజీనామాలు కోరడమో జరిగింది. వారి స్థానాల్లో ఈ "కొత్తరకం" సివిల్ సర్వెంట్లను నియుక్తులు గావించడం జరిగింది. ఫలితం ఎలా ఉంటుందో తెలుస్తూనే ఉంది" శ్వాసపీల్చడానికని ఆగారాయన.

మళ్ళీ ప్రారంభించారు.

"ఆఫీసులు ఈవిధంగా తగలెడితే ఇక పని ఎలా సాగుతుంది? లేబర్ తగాదాలన్నీ పీపుల్స్ పార్టీ కార్యాలయానికి తరలించబడేవి. అన్నీ అక్కడే తీర్పు చెయ్యబడేవి. పీపుల్స్ పార్టీ కార్యకర్తలకు రాజ్యాంగేతర అధికారాలు సంక్రమించాయి. తాము కోరినవారిని అధికారంలో ఉంచి, తమకు నచ్చనివారికి ఉద్వాసన చెప్పించారు. క్రియారూపంగా పాలనా యంత్రాంగం అంతా స్తంభించిపోయింది."

"మరో తమాషా ఏమిటంటే పి.పి.పి. ఛైర్మెన్ సిఫారసు చేసిన వారికి 'జనరల్ పర్మిట్‌లెటర్' (జి.పి.యల్) అని ఒక పత్రం దొరికేది. వారు ఏసంస్థలోనయినా ఎలాంటి రికమండేషన్ అయినా చెయ్యవచ్చు. వారికి రైల్వేలో, విమానాల్లో, ఇతర కార్యాలయాల్లో ప్రత్యేక సౌకర్యాలు, అనుమతి లభించేవి. వారు దాన్ని పురస్కరించుకొని ఇష్టారాజ్యంచేశారు. పి.పి.పి కార్యకర్తలనబడే రౌడీమూక సామాన్య ప్రజల్ని తమ పార్టీ పేరు చెప్పి నానాబాధల పాల్జేశారు. అంతెందుకు మా నగరంలో ఉన్న పీపుల్స్ పార్టీ ఆఫీస్ బలవంతంగా ఆక్రమించుకున్న అద్దెకొంప. అంత పెద్ద భవనానికి ఇంతవరకు అద్దె చెల్లించిన పాపానపోయిన పుణ్యాత్ముడెవడూలేడు - కరెంటు బిల్లు, నీళ్ళబిల్లు చెల్లించకపోవడంవల్ల పి.పి.పి వాళ్ళు కరాచీ మునిసిపాలిటీకి దాదాపు పాతికవేలు బాకీపడ్డారు. మొన్నీ మధ్యనే వాటి కనెక్షన్లు తీసేశారు. మీరు ఇప్పుడయినా వెళ్ళి చూడండి, 'కాయిదె ఆజం' గోరీకి తూర్పునఉంది. రాత్రివేళ మూసే ఉంటుంది". ఆయన అరక్షణం ఆగి నవ్వి అన్నారు "ఇప్పుడయితే పగటిపూట కూడా ఎవరూ ఉండరనుకోండి- ఒక్క కాపలా వాడు తప్ప!"

అంతలో ఈ పాత్రికేయులు గారు పరోక్ష పరిచయం చేసిన రాజకీయవేత్త (పాత పాత్రికేయులు) ప్రత్యక్షమయ్యారు. పరిచయాలయ్యాయి, ఆయన భలే తమాషా మనిషి అన్నీ జోకులు విసురుతూ కాలం గడుపుతారు.

"మిమ్మల్ని ఏదో అడగాలనుకుంటున్నాను మీరు ఈ విధంగా ఇంతవేగంగా జోకులు విసురుతూ ఉంటే మీరు నుడివే నిజాలేవో కల్పించే కథలేవో తెలుసుకోవడం కష్టమే" అన్నాను నేను కాస్త సన్నిహితత్వం ఏర్పరచుకుంటూ.

"నేను చెప్పేవన్నీ నిజాలే, మహాప్రవక్త(స) వేళాకోళానికైనా అబద్ధాలు చెప్పొద్దని చెప్పలేదా? నేను ఆ మాత్రమయినా ముస్లింని కాననుకున్నారా?" అని నిష్ఠూరంగా అంటే నాలుక్కరుచుకున్నాను.

"అబ్బే నేననేది అదికాదండీ......"

బిత్తరబోయి ఏదో సంజాయిషీ చెప్పబోయాను. ఫకాలున నవ్వేశాడాయన" అంతలోనే ఇంత ఇదయిపోవాలా? చూశారా నేను కాస్త సీరియసవగానే మీరు ఎలా భయపడ్డారు!"

"అందుకు, నన్ను అలాగే జోకులాడుతూ ఉండనివ్వండి!!"

"జోకంటే గుర్తుకు వచ్చింది" అంటూ అడ్డుపడ్డారు మాకు ఆతిధ్యమిచ్చిన పాత్రి కేయులు. "పీపుల్స్‌పార్టీలో వాళ్ళ మహిళావిభాగం ఓ పెద్ద జోకే. వాళ్ళపనేమిటో తెలుసా? రోజూ అవివాహితులయిన అమ్మాయిల్ని పట్టుకుని (పి.పి.పి) కార్యకర్తలకు సమర్పించు కోవడం!" ప్రక్కలో బాంబు పేలినంత పని జరిగింది. నాకు మరీ అసహ్యమనిపించింది. కళ్ళు గట్టిగా మూసుకున్నాను. కళ్ళ నీటి పర్యంతమయింది. ఇంత జరుగుతుంటే ఈ దేశం బీడుపోయిందా? ముస్లిముల మస్తిష్కాలు శుష్కించి పొయ్యాయా? మీ అంతరాత్మలు చచ్చిపొయ్యాయా? ప్రాణభీతి లేనివారు, అన్యాయాన్ని అడ్డుకునేవారు, ధైర్యవంతులు ఒక్కరూ లేకపొయ్యారా ఈ పాడుదేశంలో..... .....? అని నిలదీసి అడుగుదామనుకున్నాను. కాని ఏదో మొహమాట మనిపించింది. అయితే నా భావాలు నా ముఖంపై వెలిశాయేమో-

"ఇదంతా చూస్తూ ఊరుకున్నారా పాకిస్తానీయులు, అని అడగుదామను కుంటున్నారా? అడగండి తప్పక అడగండి." ఆయనకూ కళ్ళ నీటిపర్యంతమయింది- "మా సమాధానం ఒక్కటే, మేము ఒక సజీవజాతిగా ఇంకా చావలేదు. మాలో చైతన్యం ఉంది. అయితే పాపాలు పండేవరకు నిరీక్షించాము. ఆ తరువాత మాలో ఉబికిన సహనధార రగులుకున్న మంటల్ని ఆర్పలేకపోయింది. చివరికి మేమంతా బజారులోకి వచ్చేశాము. మా నిరసన తెలిపాము. మా యువకులు, మా యువతులు, మాస్త్రీలు, పిల్లలు వృద్ధులు అంతా రోడ్లకెక్కాము. ఆందోళన ప్రారంభించాము. మాపైనా మాభావి పౌరులపైనా నిర్దాక్షిణ్యంగా గుండ్లు కురిపించారు "భుట్టో రక్షకభటులు," వారు దేశానికి కాక ఒక వ్యక్తికి దాసులుగా తయారయ్యారు. మా వీధులు రక్తంతో మా ఆంతర్యాలు తుపాకి గుండ్లతో నిండిపొయ్యాయి. మాధర్మవేత్తల్ని నడిబజారుల్లో దిగంబరులుగా చేసి కోరడాలతో కొట్టారు. మిలిటరీని కూడా రప్పించే వరకు వచ్చింది వ్యవహారం. మిలిటరీ వారు జరిపే ఈ అత్యాచారాన్ని చూస్తూ, చేతులు నలుపుకుంటూ కూర్చోలేక పొయ్యారు, తిరగబడ్డారు, పర్యవసానం మీకందరికీ తెలిసిందే, చేసినవారికి చేసినంత అన్నట్టు ఎవరి ఖర్మను వారు అనుభవించారు. ఇంకా పరలోకంలో కూడా అనుభవిస్తారు. దేవుడు ఎప్పుడూ న్యాయం చేసేవాడే." కళ్ళనుండి కారే జలధారను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ, ముగించి, కళ్ళుమూసుకొని, సోఫావెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడాయన. ఎప్పుడూ జోకులు విసురుతూ కులాసాగా కబుర్లుచెప్పే ఈ పెద్ద మనిషి ఆంతర్యంలో ఇన్ని మంటలు, ఇన్ని తూట్లు, ఇన్ని గాయాలున్నాయని ఎవరు ఊహించగలరు? వాతావరణం భారంగా, గంభీరంగా, నిశ్శబ్దంగా తయారయింది. అందరూ ఆలోచనల్లోనే ఉన్నట్లుంది- ఏదో ఒకటి ఆలోచిస్తూ, నెమరు వేసుకుంటూ.

నా మనసులో మసలేమాట మాత్రం ఒక్కటే – ఈ ముస్లిం సమాజపు చరిత్ర అంతా కష్టాలతో, త్యాగాలతో, నిరంతర కృషితో, ఎడతెగని పరీక్షలతో నిండి ఉంది. ఇది చాలా గట్టిజీవి, అన్నింటినీ దాటుకుంటూ, సజీవంగా సచేతనంగా ముందుకే పయనిస్తోంది. నిజమే మరి – ఇస్లాం జిందా హోతాహై హర్ కర్బలాకేబాద్ – ప్రతిసారి కర్బలా మైదానాన్ని దాటిన తరువాతనే ఇస్లాం జీవం పోసుకుంటుంది!

ప్రతీకారానికి పరాకాష్ఠ

అజాన్ వినగానే లేచి కాలకృత్యాలు తీర్చుకుని జమాఅత్ ఆఫీస్ నుండి మెల్లగా బయల్దేరి ఉషోదయపు ఉల్లాసవంతమయిన హుషారులో మస్జిద్ కెళ్ళాము. పాకిస్తాన్‌లో దాదాపు ప్రతి మస్జిద్‌లో ఒక వాటర్‌కూలర్ ఉంటుంది. ప్రజలకు చల్లని నీరు త్రాగే అభిరుచి మెండు. నేను అలవాటు ప్రకారం రెండు గ్లాసులు చల్లని మధుర జలాన్ని లోనికి పంపాను నమాజ్ అయ్యాక.

కాయిదే ఆజం ముహమ్మద్ అలీ జిన్నా సమాధిని సందర్శిద్దామని ప్రోగ్రాం, ఎదురుగానే ఆ మైదానం కనిపిస్తోంది. కనుకనే కాలినడకన పొయ్యాము. ఎత్తయిన ప్రదేశం, ఓ ప్రక్కన 150 అడుగుల ఎత్తుగల ఆధునిక తరహాలో కట్టబడిన గుంబద్, అదే జిన్నా సమాధి. దాని వెనకాల ఫాతిమా జిన్నా (జిన్నా సోదరి), లియాకత్ అలీ (పాకిస్తాన్ తొలి ప్రధాని), నూరుల్ అమీన్ (తూర్పు పాకిస్తాన్ నాయకుడు), ప్రభృతుల సమాధులున్నాయి. ఈ నాయకులంతా ఇక్కడ విశ్రమించడం మూలానే ఎదురుగా ఉన్న రోడ్డుకు కాయిదీన్ (నాయకుల) రోడ్డని, దగ్గరలో ఉన్న కాలనీకి కాయిదీన్ కాలనీ అని నామకరణం చేశారు. ఈగోరీలు, వాటిచుట్టూ గోడలు అన్నీ పాలరాతి నిర్మాణాలే. ఇదంతా చూసుకుంటూ అసలు జిన్నా సమాధిని చేరేవరకు అది ఎంత పెద్దగా ఉందో అర్థమవలేదు. 200 అడుగులు వెడల్పుతో చతురస్రాకారపు పాలరాతి అరుగుపై చతురస్రాకారంలోనే ప్రారంభమయి 150 అడుగుల ఎత్తునచేరి గుమ్మటంలా అర్ధగోళంగా మారింది. చెక్కిన పాలరాతితో నిర్మించబడ్డ సమాధి ఎంతో హుందాగా అగుపించినా అదొక ప్రదర్శనాస్థలిగానే రూపొందింది.

మేము వెళ్ళే సరికి ప్రజలు చుట్టూ కనిపిస్తున్నారు. అందరూ ఆ కట్టడంలోని గొప్పను దాని ఠీవీని మేచ్చుకునేవారే కాని కనీసం ఒక్కరయినా, అక్కడ శాశ్వతనిద్రలో ఉన్న జిన్నాగారి కోసం ప్రార్థించేవారు కానరాలేదు. అదో తమాషా లాగుంది. లోపలి వైపున ఇంకా తుది మెరుగులు జోరుగా సాగుతున్నాయి. ఈ కట్టడమంతా ఈరానీ నిపుణులు తయారుచేసిందే. ఈ మధ్యన అక్కడ వచ్చిన విప్లవంవల్ల పని కాస్త కుంటుపడినా మున్ముందు ఇంకా శీఘ్రంగా పనిసాగే అవకాశముంది అని అక్కడి గైడ్ చెప్పాడు. సమాధి వెనకాల ఓ మ్యూజియం కూడా ఉంది. అందులో జిన్నా ఉపయోగించిన పెన్ను మొదలుకొని కార్ల వరకు అన్నీ పొందుపరిచారు. ఆ అందమయిన కట్టడం చుట్టూ

ముళ్ళకంపలు, చెత్త చెదారం దాదాపు పాతిక ఎకరాలపై విస్తరించి ఉంది. ఆ కట్టడాన్ని, దాని చుట్టు ప్రక్కల్ని "కాయిదె ఆజం అకాడెమి" ఆధ్వర్యాన ఒక శాస్త్రీయ పరిశోధనాలయంగా చిరస్మరణీయ స్మారక స్థలంగా మార్చాలని అసలు పథకమట. అయితే అది ఇంకా కార్యరూపం ధరించలేకపోయింది. నల్లరాతితో కట్టిన అసలు సమాధిని చూసి, అక్కడ మృతుల కొరకు దుఆ చేసి తిరుగు ముఖం పట్టాము. సమాధివద్దకు వెళ్ళినట్టు, అదీ ఒకనాటి గొప్పనాయకుని సమాధిని చూసినట్టు అనుభూతి కలగకపోగా ఏదో ప్రదర్శనశాలను చూసినంత తేలిగ్గా ఉండటం, అక్కణ్ణుంచి బయల్దేరగానే మనసులో ఆవేదన సృష్టించింది, అందువల్లనే మరణించినవారి సమాధుల్ని ఇలా ప్రదర్శనశాలలుగా మలచవద్దని మహాప్రవక్త బోధించారు. మనసంతా ఏదో వెలితి ఆవరించగా, భారమయిన హృదయాలతో, ఇంత ధనం వెచ్చించి తమ నాయకుని సమాధిని ఈ విధంగా ప్రదర్శనశాలగా మార్చిన పాకిస్తానీయులపై విచారం వెలిబుచ్చుకుంటూ మా విడిదికి వచ్చేశాము.

"దౌర్జన్యాలు అత్యాచారాలేకాదు, ఎన్నో తమాషాలు కూడా జరిగాయి భుట్టో కాలంలో!" అన్నాడొక పాత్రికేయుడు.

"అంటే - కొన్ని వినిపించండి మరి" అడిగాను కుతూహలంతో.

"ఉదాహరణకు" ఆయన మొదలెట్టాడు. "నన్ను జైల్లో వేశారు. దీని వివరాలేమంటే, మా పత్రికలో ఒక వ్యాసం బెనజీర్ భుట్టోను గురించి, ఆమె వేషభాషలు, ఆమె అనుసరించే ఇస్లామేతర, పాశ్చాత్యనాగరికతలను గురించి విమర్శించడం జరిగింది. అందులో ముఖ్యమయిన విషయం ఒక్కటి - ఒక ఇస్లామీయ రాజ్యాధినేత కుమార్తె ఇలాంటి ఇస్లాం వ్యతిరేక వైఖరిని అవలంబించడం పట్ల విమర్శన ఉంది అందులో," ఒక నిమిషం ఆగాడాయన, 'సరె ఆ తర్వాత నన్నుపిలిపించి ఓ మంత్రి గారు మందలించడానికి ప్రయత్నించారు. నేనుఅంతా విని ఇదంతా దేనికి, నేను రాసినదానిలో అసమంజసమయిందేదో, మన సంస్కృతికి, మనజాతి లక్ష్యాలకు, శ్రేయస్సుకు తగనిదేదో చెప్పండి లేదా ఆమె గారి వైఖరి ఎంతవరకు ఇస్లాంకు సమీపంలో ఉందో చెప్పండి' అని అడిగాను. 'ఓహూ నీకు ఇంత తలబిరుసుతనమా?' అని గదమాయించి 'నిన్ను, నీ ఇస్లాంను ఏంచేస్తానో చూసుకో' అని బెదరించారు. ఇంకేముంది రెండో రోజున కటకటాల వెనక పడేశారు!' బిగ్గరగా నవ్వుతూ అదో పెద్ద జోకుగా చెబుతూ ముగించాడాయన.

నాకు మనదేశంలో రెండేళ్ళ పాటు ఆవరించిన ఎమర్జెన్సీ భీతావహ వాతావరణం, మన దేశపాలకురాలి సుపుత్రుని పాదరక్షలు ఓ కేంద్ర క్యాబినెట్ మంత్రిగారు మోసిన ఉదంతం గుర్తుకువచ్చింది, మనసంతా వెగటుతో నిండిపోయింది.

"మరో గాథ వినండి, భుట్టో తండ్రిగారు జూనాగఢ్ రాజు వద్ద దివాన్‌గా పనిచేసే వారన్న సంగతి మీకు తెలిసిందేగా."

"అవును. చెప్పండి"

"రాజుగారు పాకిస్తాన్‌కు వచ్చేశారు దేశ విభజనానంతరం. ఆయన ముసలివారయి పోయారు. పాపం ఆయన తన ముసలితనాన్ని గురించి విన్నవించుకుని గవర్నర్ గిరీ చెయ్యలేనని చెప్పుకున్నారు. అప్పుడు 'నా ఆజ్ఞనే త్రోసిపుచ్చుతావా?' అని బలవంతంగా గవర్నరు కావలసిందే లేదా జైలును చూడవలసి వస్తుందని బెదిరించాడు. ఇంకేముంది, పాపం ముసలాడు సరే అన్నాడట'

"అయ్యో పాపం!" అన్నారు ఎవరో మా మిత్రుల్లో.

"అసలు కథ ఇప్పుడే ప్రారంభమవుతుంది" అన్నాడాయన హాయిగానవ్వుతూ.

"అలాగా?" అని మేము మళ్ళీ కళ్ళప్పగించి చూడసాగాము.

"సింధ్ అధికారులందరి ద్వారా గవర్నర్ గారికి తన ప్రత్యేక ఫర్మానాను అంద జేశారు పాకిస్తాన్ నియంతగారు"

'ఏమనీ?"

ఏమని ఉంటుంది. గంభీరంగా అన్నాడయన –"భుట్టోగారు హైదరాబాద్ (సింధ్) వచ్చినా లేదా సింధ్ రాష్ట్ర పర్యటన జరిపినా ఆయనకు తోడుగా గవర్నర్ గారు ఖుద్దుగా ఉండాలి అని?"

అయితే–? మాకు బోధపడ లేదు.

'అంటే దేశాధినేతగారు ముందు నడవగా గవర్నర్‌గారు చేతులు కట్టుకుని వెనకాల నడవాలి ఆయనకై కారు తలుపులు తెరవాలి, తదితర లాంఛనాలన్నీ నమ్మిన బంటులా పూర్తి చెయ్యాలన్నమాట!' ఆయన పెదాలపై ఎంతో చేదయిన నిరునవ్వు అల్లాడింది. తన తండ్రి దివాన్‌గా జూనాగఢ్ రాజుకు ఇవన్నీ చేసేవారు కదా, దానికి ఇది 'ప్రతిఫలమ'న్న మాట!'

'కక్ష సాధింపుకు సంబంధించిన మరో కేసు ఉంది' కాస్సేపయ్యాక సాలోచనగా అన్నారాయన.

'చెప్పండి' అందరూ కుతూహలంతో ముందుకు వంగారు.

"భుట్టోగారు ద్వంద్వ పౌరసత్వపు డ్రామా ఆడారన్న విషయం కూడా అందరికి తెలిసిందే, భుట్టో పాకిస్తాన్‌లో ఉంటూ భారత పౌరసత్వం ఉన్నట్టు, బాంబెలో ఆస్తిపాస్తులున్నట్టు నాటకమాడి ధనం చేసుకుందామని చూశారు." ఆగారాయన.

'అవును అలాంటి వార్తలు చదివినట్టు గుర్తుంది, చెప్పండి' మాలో ఓ మిత్రుడు పలికారు.

'ఆ సందర్భంలో, సలహా కొరకు ఒకసారి ఒక పెద్ద జడ్జి గారిని కలుసుకోవడానికి భుట్టో ఆయన ఇంటికి వెళ్ళాడు. అక్కడ జడ్జిగారు ఏదో పనిలో ఉండటం మూలాన

రెండు గంటలకాలం నిరీక్షించవలసి వచ్చిందట! అది భరింపరానిదయింది భుట్టో గారికి, తాను పాకిస్తాన్ అధ్యక్షుడిగా అలరారిన కాలంలో పాపం ఆ జడ్జిగారి జీవనవ్యవధి సమాప్తమవడం వల్ల తప్పించుకున్నారు కాని భుట్టో మనసు నుండి ఆ రెండు గంటల నిరీక్షణ దూరమవలేదు, ఆ జడ్జిగారి కొడుకు లాహోర్ లో పేరుమోసిన లాయరు. అతన్ని ఓ సారి అధ్యక్ష సదనానికి పిలిపించి విజిటర్స్ రూములో రెండు గంటలపాటు నిరీక్షింపజేసి 'ఇవాళ సందర్శించడానికి వీల్లేదని చెప్పించి మరి పంపాడట!' నవ్వేశాడాయన! నాకు నవ్వాగలేదు. ఇదేం తరహా కక్ష సాధింపో అర్థంకాలేదు.

ఆ మాటే అన్నాను ఆ ఎడిటర్ గారితో.

'ఇంతే కాదు. ఇంకా విచిత్రమయింది మరోగాథ ఉంది' అంటూ టీ తెప్పించారు టీ త్రాగుతుండగా ఆ విచిత్రగాథను వినిపించారు.

'డాన్ పత్రిక మాజీ ఎడిటర్ మునుపు ఏదో శాఖలో సెక్రటరీగా ఉండేవారు. అవి భుట్టో ఇండియా నుండి పాకిస్తాన్‌కు వచ్చిన తొలిరోజులు, ఆయనకు వేట అంటే చాలా ప్రీతి, రెండు తుపాకుల లైసెన్సు సంపాదించుకున్నాడు. మూడో దానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. ఎన్ని రోజులయినా తన దరఖాస్తుకు సరయిన సమాధానం రానందున సరాసరి సెక్రటరీతో సంభాషించి సాధిద్దామని వెళ్ళాడు. ఆ రోజుల్లో ఆ కేసుకు సంబంధించిన కాగితాలు అల్తాఫ్ గౌహర్ గారు చూస్తున్నారు. భుట్టో ఆయనతో మాట్లాడి తన కోరికను ఆయనచేత ఒప్పించలేకపోయాడు, 'మీకు ముందే రెండు తుపాకుల లైసెన్సు ఉందిగా, మీకు మరో లైసెన్సు ఇవ్వడానికి నియమాలు అనుమతించవు' అని నిక్కచ్చిగా చెప్పేశారు.

అది భుట్టో గారికి ఎంతో పరాభవమనిపించింది. అప్పుడు ఏమీ చెయ్యలేక పొయ్యారు. రానురాను రాజ్యాధికారాన్ని చేపట్టిన మరుక్షణమే, అప్పటికి డాన్ ఎడిటర్‌గా పనిచేస్తున్న అల్తాఫ్ గౌహర్‌ని తన కార్యాలయానికి పిలిపించి 'నేనెవరినో గుర్తున్నానా' అని అడిగాడట.

తుపాకి లైసెన్సు వ్యవహారాన్ని అప్పటికప్పుడే మరచిపోయిన గౌహర్‌గారు ఈ విచిత్రమయిన ప్రశ్నకు నవ్వేసి,

'మీరు పాకిస్తాన్ అధ్యక్షులన్న సంగతి కూడా మీముందు ధృవీకరించవలసి ఉంటుందని నేనెప్పుడూ అనుకోలే'దన్నారు.

దానికి బిగ్గరగా నవ్వి 'మీరు ఫలానా సెక్రటరీగా ఉన్నప్పుడు నేను తుపాకి లైసెన్స్ కోసం వచ్చాను. మీరు నా అభ్యర్థనను త్రోసిపుచ్చారు. గుర్తుందా?' అని అడిగాడు.

'అలా అర్హతలేని కోరికలతో వచ్చేవాళ్ళు ఎంతో మంది. వారిలో మిమ్మల్ని ప్రత్యేకంగా గుర్తుంచుకోవడం కష్టమే. అయినా అప్పుడు నా ఉద్యోగ ధర్మం రీత్యా ఏదో

చేసిఉంటాను. నేనెప్పుడూ తెలిసి ఎవరికి అన్యాయం చెయ్యలేదు. మీపట్ల ప్రత్యేకంగా ప్రవర్తించినట్టు నాకు గుర్తులేదు. అసలు మీరు వచ్చినట్టు నాకుగుర్తేలేదు సారి' అన్నారట ఎంతో సౌమ్యంగా.

మండిపడ్డాడు భుట్టో, ఈ తల బిరుసుతనానికి మందేమిటో తెలుసా? అని గద్దించాడు.

'నేను రోజూ చూస్తూనే ఉన్నాను, అంతగా అయితే జైలుకు పంపగలరు, అంతకు మించి ధైర్యం మీకు లేదని నాకు తెలుసు, సెలవ్! అని అధ్యక్ష ప్రాసాదానికి వెలుపల వచ్చేశారట, అయితే గేటును దాటే లోపుగానే ఆయన్ని అరెస్టు చేసి జైల్లో పడేశారన్నది వేరే విషయం, అని మందహాసంతో ముగించారు ఎడిటర్‌గారు.

"ఓహూ, అప్పుడే అనుకుంటా అల్తాఫ్ గౌహర్‌గారు తఫ్‌హీముల్ ఖురాన్ అధ్యయనం చేసి మానసిక పరివర్తన చెందింది" అని నేను అడగ్గానే, "అవును, అప్పుడే. దేవుడేది చేసినా మన మేలుకే అంటారే, అది ఈవిధంగా రుజువయింది. గౌహర్‌గారు 'తఫ్‌హీమ్' వల్ల ప్రభావితులై అతి సమీపమయ్యారు. ఇప్పుడు ఆయన ప్రపంచ ఇస్లామీయ ఉద్యమ కార్యకర్త అనడంలో అతిశయోక్తిలేదు.

"అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్! దేవుడే గొప్పవాడు. దేవుడే గొప్పవాడు." మఘ్‌రిబ్ నమాజ్‌కై పిలుపు ప్రారంభమవగానే మేమంతా లేచి దైవం చేసే, మానవుడు ఊహించలేని పరిణామాలపై, ఆలోచించుకుంటూ ఆయన సన్నిధిలో మోకరిల్లడానికని బయల్దేరాము.

గజి బిజి వాతావరణం!

మేము లాహోర్ లో ఉన్నప్పుడే రాజకీయ పార్టీలతో ప్రెసిడెంట్ జియా, సార్వత్రిక ఎన్నికలను గురించి చేస్తున్న సంప్రతింపులు ఎటూ తెగక, మార్షల్ లా పాలకుల తరపున విధించబడిన షరతుల్ని రాజకీయ పక్షాలు అంగీకరించక, రాజకీయ వాతావరణం అంతా అయోమయంగా, ఓ విధంగా గందరగోళంగానే తయారయింది. ఆ దశలో రాజకీయ పక్షాలు తమ జమాఖర్చుల లెక్కలు ఆడిట్ చేయించాలన్న నిబంధనను (దాదాపు అన్ని ప్రముఖ పక్షాలు) అంగీకరించాయి. ఈ సందర్భంలో భుట్టో స్థాపించిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పి.పి.పి)లో భేదాభిప్రాయాలు తలెత్తి ఆ పార్టీ మూడు ముక్కలుగా చీలిపోయింది. వాటిలో ప్రధాన వర్గమయిన పి.పి.పి మాత్రం ఆడిటు షరతును అంగీకరించలేదు. మరే షరతును కూడా ఆపార్టీ ఖాతరు చెయ్యకుండా ఎన్నికలనే బహిష్కరించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇదంతా చేతకానితనానికి నిదర్శనం అని కొందరు వ్యాఖ్యానించారు. పి.పి.పి. భుట్టో తోనే అంతమయిందని వారివాదన. అయితే మిగతా వర్గాలు కొత్త పేర్లతో సరికొత్త నాయకత్వం క్రింద ప్రోగయి ప్రభుత్వ షరతులన్నింటినీ అంగీకరించాయి.

అయితే ప్రధాన రాజకీయ పక్షమయిన పి.ఎన్.ఏ. మాత్రం ఒక్కషరతును అసలు అంగీకరించనేలేదు. ఆ షరతు, రాజకీయ పక్షాలు తమ నిబంధనావళిని తమ పాలసీ ప్రోగ్రాంలను కూడా ఎలక్షన్ కమీషను కార్యాలయంలో పొందుపరచాలన్నది. పి.ఎన్.ఏ. ముఖ్య భాగస్వామ్య పక్షమయిన జమాఅత్ ఇస్లామీ పాకిస్తాన్, తోటి భాగస్వామ్య వర్గాలకు నచ్చజెప్పడానికి కృషి చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి, చివరికి ఆ పత్రాలు సమర్పించే చివరి రోజు కూడా ఆసన్నమయింది. అప్పటికప్పుడు జమాఅత్ కార్యనిర్వాహక సంఘం సమావేశమయి, పి.ఎన్.ఏ. లేదా ఇతర భాగస్వామ్య పక్షాలు అవసర పత్రాలను సమర్పించకపోయినా తాము మాత్రం ఆ షరతును కూడా అంగీకరించాలని నిర్ణయించి, తదనుగుణంగానే అమలు జరిపారు.

పి.ఎన్.ఏ. అధ్యక్షుడు ముఫ్తీ మహ్మూద్, ఇతర నాయకులకు జమాఅత్ చేసిన ఈ పని ఏ మాత్రం నచ్చలేదు. వారు బాహాటంగానే జమాఅత్‌ను విమర్శించసాగారు. జమాఅత్ వాదన యేమంటే, దేశంలో మిలటరీ ప్రభుత్వం కొనసాగడం దేశ శ్రేయస్సు దృష్ట్యా అంత సముచితం కాదు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపనకు ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదుర్కొని, ఎన్ని త్యాగాలు అవసరమయినా చేసి పటిష్ఠమయిన ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పడానికి అందరూ సహకరించాలి. ఇప్పుడున్న మిలిటరీ ప్రభుత్వం, ప్రజాప్రతి నిధులకు పరిపాలన అందజేయడానికి ఎవరూ తోడ్పడ లేదని నిందించడానికి ఆస్కారమివ్వ కుండా, లేనిపోని ప్రతిష్ఠల్ని అడ్డుగా నిలబెట్టుకుని ప్రజాస్వామ్య వ్యవస్థ సంస్థాపనకై చేజిక్కిన ఈ అవకాశాన్ని జారవిడువరాదు అన్నది. ముఫ్తీ గారి వాదన ఏమంటే, మనకు ప్రజాబాహుళ్యం తోడుంది, కాబట్టి మనకు అవమానకరమయిన షరతుల్ని అంగీకరించ నవసరం లేదు. జనరల్ జియా మన షరతుల్ని ఒప్పుకోవాలి. కాని, మనం ఆయన మాటలకు తల ఒగ్గడం దేనికి అన్నది.

అయితే జమాఅత్ పత్రాలు సమర్పించి ప్రభుత్వ గుర్తింపు పొందిన 16 పార్టీల జాబితాలోకి చేరగానే జమాఅత్ పై పి.ఎన్.ఏ. ధ్వజమెత్తినా ప్రజాబాహుళ్యం, జమాఅత్ కార్యకర్తలు మాత్రం జమాఅత్ చర్యను హృదయపూర్వకంగా శ్లాఘించారు. నిండు మనసుతో ఆహ్వానించారు.

"మీరు తొలి నుంచి ఇస్లామీయ శక్తుల ఏకీకరణకు ఎంతో కృషిచేశారే, మరిప్పుడు ఇస్లామీయ వ్యవస్థ ధ్వజవాహకులయిన మీరే మీ ఐక్యతను ఇలా భంగపరచడంలో సామంజస్యత, సంయమనం యేదయినా గోచరిస్తుందా?" అని నేనడిగన ప్రశ్నకు జమాఅత్ నాయకులు పై వాదనను ముందుంచారు. అనుయాయులు, కార్యకర్తలు పైవాదనతో పాటు మరో విషయాన్ని ఎంతో ఆవేదనతో బయట పెట్టారు. అసలు విషయమేమంటే, దేశంలో క్రింది స్థాయి నుండి క్రమశిక్షణగల వ్యవస్థ, నిస్వార్థసేవకులు, నిర్విరామంగా కృషి చెయ్యగల కార్యకర్తలు జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్ తప్ప మరెవరి దగ్గరరాలేరు, మా వద్ద నిధులు కొరవడినా త్యాగనిరతితో పని చేసే యోధులున్నారు.

ఇతర పి.ఎన్.ఏ. భాగస్వామ్య పక్షాల్లో క్రింది స్థాయి ఆర్గనైజేషన్ అన్నది స్వల్పం. అందరూ నాయకులే, కార్యకర్తలు అసలు లేరు. అయితే జమాఅత్ పి.ఎన్.ఏ.లో ఉండడం మూలానా మా కార్యకర్తలందరూ పి.ఎన్.ఏ.లో చేతులూ కాళ్ళయి, రేయనక పగలనక, ఎండలో మాడి, వానలో తడిసి, ఎలాంటి కృషి కయినా సిద్ధమయి, ఎలాంటి కష్టానికయినా ఓర్చి, పి.ఎన్.ఏ. నిర్వహించిన కార్యక్రమాలకు కార్య రూపాన్నిచ్చారు. దానికి పి.ఎన్.ఏ. నాయకులు దేశప్రజలు అందరూ సాక్షులే. అందుకే ఇప్పుడు జమాఅత్, దేశ శ్రేయస్సు దృష్ట్యా ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంతరం వాటిల్లకుండా, ఓ చర్య గైకొంటే అందరూ బిత్తరపోయి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు.

ఈ వాదనలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్న విషయం మేము అక్కడ విభిన్న జీవితరంగాలకు సంబంధించిన వ్యక్తులతో జరిపిన సంభాషణను బట్టి నిర్ధారణ అయింది. (లోగడ ఈ విషయాన్ని ఈ పుటల్లో సూచించాము). ఆ సమయంలో మాలో చాలా మందికి భారతదేశంలో విభిన్న దృక్పథాలు గల ముస్లిం సంస్థల్లో ఐక్యతను సాధించడానికి జమాఅతె ఇస్లామీ హింద్ చేసినకృషి, తత్ఫలితంగా ముస్లిం మజ్లిసె ముషావరత్ అవతరణ, ముస్లిం పర్సనల్ లా బోర్డు వ్యవస్థాపన, అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ యాక్షన్ కమిటీ నిర్మాణం, ఆ సందర్భంలో జమాఅత్ కార్యకర్తల భావాలు అన్నీ స్ఫురణకు వచ్చాయి. భారత ఉపఖండంలో అంతటా ముస్లింల పరిస్థితి ఒకేలాగున ఉందన్న విషయం రూఢీ అయింది.

కరాచీ వచ్చేసరికి, పి.ఎన్.ఏ. ధోరణి మరీ మొండిగా రూపుదాల్చగా జమాఅత్ నాయకులు, పి.ఎన్.ఏ., ప్రభుత్వం మధ్య సయోధ్య కోసం కృషి చేస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వం అవసరమయిన పత్రాలు సమర్పించే వ్యవధిని పెంచింది. నామినేషన్ పత్రాలు దాఖలవసాగాయి. పి.ఎన్.ఏ. నాయకులు కూడా తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఎప్పటికయినా జనరల్ జియా మన కోరికలకు తల ఒగ్గడా అని భావించి. జియా ఏమో మిలిటరీ మనిషి, పైగా సిద్ధాంతాలూ సూత్రాలంటే పడి చచ్చే రకం. జమాఅత్ నాయకులు, పాత్రికేయులు చెప్పిన దానిని బట్టి వ్యవధిని పెంచాడే కాని ఎన్నికలు సక్రమంగా జరగవనీ అంటున్నారు. రాజకీయ వేత్తల ధోరణి దేశానికి హానికరమని కొందరు అనడం మొదలు పెట్టారు. రాజకీయ నాయకులతో సమావేశాలు జరుగుతున్నాయి, ఈ ప్రతిష్ఠంభన తొలగించి చర్చలు ఓ కొలిక్కి రావాలని చెయ్యగలిగిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారు జమాఅత్ నాయకులు.

ఇదిలాఉండగా స్థానిక పరిపాలనా వ్యవస్థల ఎన్నికల ఫలితాలు రాసాగాయి. అయితే ప్రచారంలో సిద్ధహస్తులయిన పి.పి.పి. వాళ్ళు, వాళ్ళకు వంతపాడే పాశ్చాత్య ప్రచార సాధనాలు, కమ్యూనిస్టు ప్రసారాలు ఆ ఫలితాలకు వక్రభాష్యం చెప్పసాగాయి. ఎక్కడెక్కడయితే సోకాల్డ్ "అవామ్ దోస్త్" (ప్రజా మిత్రులు) ఎన్నికయ్యారో ఆ ఫలితాల్ని పతాకానికెక్కించి "ఇస్లాం పసంద్" (ఇస్లాం ప్రేమికులు) అభ్యర్థుల ఎన్నికల్ని మరుగున

పడేశారు. ఇస్లాం ప్రేమికులు ఓ వైపున ఇస్లామీయ ఉద్యమ వ్యవస్థాపకులయిన మౌలానా మౌదూదీ నిష్క్రమించడం వల్లను, మరో వైపున ప్రభుత్వానికీ వారికి మధ్య ఏర్పడిన తగాదాల్లో పడి ఈ ప్రచార ఉద్యమాన్ని సక్రమంగా ఎదుర్కోలేక పోయ్యారు. వాస్తవ మేమంటే ప్రతిచోటా ఇస్లాం ప్రేమికులు అధిక సంఖ్యలో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించారు. ముఖ్యపట్టణాలన్నింటిలో మునిసివల్ కౌన్సిల్స్ వీరి హస్తగతమయ్యాయి. కొన్ని టౌన్లలోనూ ఒకటీ అరా పట్నాల్లో "అవామ్‌దోస్తు"లు పైకి వచ్చారు.

కరాచీలో మేమున్నప్పుడే ఎన్నికలు వాయిదా పడతాయన్న వదంతులు బయల్దేరాయి. ఒక సందర్భంలో ఓ ప్రముఖ రాజకీయ నాయకుడు అభ్యర్థులను గురించి ఎవరెవరు ఎక్కడెక్కడ నామినేషన్లు దాఖలు చేశారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ"ఎహ్ సబ్ ఉన్ ఇన్తిఖాబాత్ కేలియే జో నహీ హెూంగే!" (ఇదంతా జరగబోని ఆ ఎన్నికలకోసం!) అన్నాడు.

"అట్లాగా?" అని మేము విస్తుపోతే, "అవును ప్రభుత్వం, నాయకుల ధోరణి చూస్తుంటే అలాగే అనిపిస్తోంది" అన్నారయన.

పి.ఎన్.ఏ.లో కేవలం భుట్టో నియంతృత్వాన్ని ఎదురించడానికి మాత్రమే వచ్చి చేరిన పార్టీలు ఒక్కొక్కటి ఐక్య సంఘటనను వదలి వెళ్ళాయి. వారికి పి.ఎన్.ఏ. ప్రధాన లక్ష్యమయిన ఇస్లామీయ రాజకీయ వ్యవస్థ (నిజామెముస్తఫా) స్థాపనలో ఎలాంటి ఆసక్తి అభిలాషలు లేవు. తొమ్మిది పార్టీల ఐక్యసంఘటనలో మిగిలింది అయిదు పార్టీలే. వాటిలో కూడా ఈ సార్వత్రిక ఎన్నికల నిబంధనల విషయంలో పొడసూపిన ముసలం వల్ల చీలిక ఏర్పడే ప్రమాదం అసన్నమయింది. వాటిలో సంస్థాగతంగా పటిష్టమయింది, దేశమంతా మంచిపలుకుబడి కలిగి అనేక సంఘసేవా కార్యక్రమాల్లో సందేశప్రచార కార్యంలో నిమగ్నమయి ఉన్న రాజకీయ పక్షం జమాఅతె ఇస్లామీ పాకిస్తాన్. పాకిస్తాన్‌లో ఇస్లామీయ జీవన వ్యవస్థ సంస్థాపనానికి అదిప్రతీక. ఇస్లామీయ వుద్యమాన్ని తన పార్టీ ఉద్యమంగా కాక ప్రజా ఉద్యమంగా రూపొందించ గలిగిన ఘనత ఈపార్టీకే చెందుతుంది. జమాఅత్ కరాచీలో చేసిన, చేస్తున్న సేవలు అనన్యమయినవి. ఒక్క కరాచీలోనే అయిదు ఫ్రీ డిస్పెన్సరీలు, సంచార ఆస్పత్రులు, నాలుగు శవపేటిక వాహనాలే కాక అసంఖ్యాక మయిన లైబ్రరీలు ఇతర ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జమాఅత్‌కు కరాచీలోవున్న పలుకుబడి కూడా అనన్యమయిందే. ప్రజాహిత కార్యాల్లో ప్రజల తోడ్పాటుతో బాటు ప్రజల సానుభుతి కూడా లభిస్తుందనడంలో సందేహంలేదు.

భుట్టో నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో జమాఅత్ కార్యకర్తలు, ఇస్లామీ జమీఅత్ తలబాకు చెందిన విద్యార్థులే ప్రముఖ పాత్ర వహించారు. ఆ కాలంలో మార్షల్ లా విధింపునకు దారితీసిన పరిస్థితుల్ని గురించి ఆరా తీయగా ఓ రాజకీయ నాయకుడు ఆ వివాదాన్ని ఓ పత్రికలో ఇలా పొందుపరిచాడు. తన పరిపాలనకు

నిరసనగాబయల్దేరిన ప్రజావాహినిని అరికట్టడం తనవల్ల కాదని తెలుసుకున్న భుట్టో మార్షల్ లా విధించాలని నిర్ణయించుకున్నాడు. ఆవిధంగా అసమర్థులయిన సేనా నాయకుల నుండి విముక్తి పొందడం, వారి స్థానంలో తెచ్చిన కొత్త వారి అభిమానాన్ని చూరగొనడంతో పాటు వారిద్వారా ఉద్యమకారుల నాయకుల్ని సంహరించడం లాంటి లక్ష్యాలన్నీ సాధించవచ్చని భావించాడు.

తను నమ్మిన బంటులు అందచేసిన సమాచారం మేరకు జనరల్ జియాను గద్దె నెక్కించాడు. జనరల్ జియా అప్పటికే, క్రమశిక్షణ తాను పాటిస్తూ ఇతరులచేత గట్టిగా పాటింప జేసే వ్యక్తి అని ప్రతీతి పొందాడు. జియా సైన్యాధిపతి అవగానే భుట్టో ఉద్దేశ్యాలేవో తెలుసుకున్నాడు. మార్షల్ లా విధించాలని భుట్టో నిర్ణయించిన తేదీకి ఓ రోజు ముందే కీలక స్థానాల్లో సైన్యాన్ని నియమించి మెల్లిగా "రాజ ప్రాసాదాన్ని" చుట్టు ముట్టాడు. ఈ కార్యక్రమమంతా ఎంత రహస్యంగా, చాకచక్యంగా జరిగిందంటే, తన ఇంటి పైకి వచ్చిపడినంతవరకు భుట్టో గారిక్కూడా ఏదీ తెలియదు. తన భవనం సైన్యాధికారంలో ఉందని తెలుసుకోగానే భుట్టో జియాకు ఫోన్ చేసి "ఏమిటి ఇదంతా?" అని అడుగ్గా, "అంతా మీ ఆజ్ఞల మేరకే జరుగుతోంది. అయితే కొన్ని గంటల ముందు, అంతే! మరో విషయం, మీ రక్షణ దృష్ట్యా మిమ్మల్ని కూడా కస్టడీలో తీసుకునేందుకు నిర్ణయించాము. మీరు సిద్ధంగా ఉండండి" అని జనరల్ జియా బదులిచ్చాడట. ఆ తరువాత జరిగినదంతా లోకమంతా ఎరిగిందే!

పాకిస్తాన్‌లో పటిష్ఠమయిన ప్రభుత్వం, ఆ దేశ ప్రజల ఆశలు, ఆశయాలను ప్రతిబింబించే ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడుతుంది? ఇస్లామీయ జీవన వ్యవస్థ 1400 ఏళ్ళకు పూర్వం ఏవిధంగా నయితే మనిషి వ్యక్తిగత సామూహిక జీవన రంగాలను తీర్చిదిద్ది ఆదర్శ వ్యక్తిని, ఆదర్శ రాజ్యాన్ని రూపొందించ గలిగిందో, వైజ్ఞానికంగా ప్రగతిని సాధించిన ఈ అణుయుగంలోనూ అదే విధంగా మనిషిని మానవునిగా మలచగలదని నిరూపించగల రాజ్యం - ఒక్క రాజ్యం - ప్రపంచ చిత్రపటంలో ఎప్పుడు రూపుదిద్దు కుంటుందో? ఆ శుభకరమయిన ఘడియలు ఎప్పుడు ఎక్కడ తారసపడతాయో? ఇవీ నేటి శేష ప్రశ్నలు!

పరదేశంలో తెలుగు జిలుగులు

మీరు నమ్ముతారో నమ్మరోకాని నేను ఇక్కడకు వచ్చాక నా స్వదేశం నా దేశభాష కోసం అల్లాడి పొయ్యాను. "ఎనభయి ఏళ్ళకు పైబడ్డ వయస్సు, ఎత్తయిన బక్కపల్చని దేహం, గాంభీర్యం, హుందాతనం, స్థయిర్యం ఉట్టిపడే కంఠం, వయసు ముదిరినా నిటారుగా నిలబడి గట్టిగా మాట్లాడగల స్తోమత - ఈయన శ్రీఅబ్దుల్ వహీద్ ముజాహీద్ "యక్తా"గారు, హైదరాబాద్ నివాసి. చంచల్‌గూడాలో ఇప్పటికి తనవారి ఇల్లు ఉందనీ ఎప్పుడయినా వస్తే అక్కడే బస చేస్తానని చెప్పారు. "యక్తా" గారు సాహిత్య పిపాసి కవి.

బహు భాషాకోవిదుడు, 1965లో మన రాష్ట్రం నుండి కరాచీ వెళ్ళి పొయ్యారు. అక్కడ పంజాబీ, సింధీ భాషలు నేర్చుకున్నారు. పంజాబీలో మహా కావ్యమయిన వారిస్ షా రచన 'హీర్-రాంఝా'ను సరళమయిన ప్రశస్తమయిన ఉర్దూలో పద్యానువాదం చేశారు. నేను ఓ తెలుగు పత్రికలో ఉన్నానని వినగానే ఆయన తన్మయత్వంతో అన్నమాటలు నాకు నేటికీ గుర్తున్నాయి.

రెండు నిముషాలు కళ్ళుమూసుకుని ఆ కవిత వింటూ ఏవో తెలీనిలోకాల్లో విహరిస్తూ ఉన్నట్టు అనుభూతి చెందారు.

"ఎన్నాళ్ళ కెనాళ్ళకు, కాని, దురదృష్టవంతుణ్ణి నేను అక్కడున్నంత కాలం తెలుగు లాంటి రసమయ భాషను నేర్చుకోలేకపొయ్యాను, ఇక్కడికి వచ్చి పంజాబీ, సింధి, నేర్చుకోవలసి వచ్చింది."

కొంతసేపు తెలుగు కవిత్వం కథానికలను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు యక్తా గారు. ఆ తరువాత, మీకు ఉర్దూ కూడా బాగావస్తుందని, ఉర్దూలో కవిత్వం కూడా చెప్పగలరని మీ అమీరె హల్కా చెప్పారు. ఓ పని మాత్రం తప్పక చెయ్యండి తెలుగు కథల్ని, కవితల్ని ఉర్దూ ప్రజలకు పరిచయం చెయ్యండి. ఉర్దూ రచనల్ని తెలుగు వారికి అందజేసే కృషి కొంతవరకు జరిగింది కాని తెలుగు రచనలు ఉర్దూ వారికి తెలియపరిచే ప్రయత్నాలు బహు స్వల్పం, ఈ పనీ మీరే సరిగ్గా చెయ్యగలరు అని ప్రోత్సహించడంతో పాటు నాలో కొత్త ప్రేరణను సృజించారు.

ఆంధ్ర దేశానికి వేల మైళ్ళదూరంలో, పరదేశంలో తెలుగును గురించి ప్రశంసలు, తెలుగు సాహిత్యంగురించి చర్చలు నాకు ఎంతో గర్వకారణమయ్యాయి. ఒక వైపున సంతోషంతో నేను ఉబ్బితబ్బిబ్బయితే మరో వైపున యక్తా గారి సూచన వల్ల జనించిన ఉత్తేజం నాలో గగనాన ఎగిరి తెలుగునాట వాలాలన్న వాంఛను అధికతరం చెయ్యసాగింది. నా రక్తం కొన్ని కిలోగ్రాములు అధికమయిందనే అనుభూతి కలిగింది.

అప్పటికప్పుడే ఆయన, దగ్గర లోనే వున్న తన ఇంటికి వెళ్ళి తాను అనువదించిన "హీర్- రాంఝా" ప్రతిని ఎంతో ప్రేమతో నాకు బహూకరించారు.

కరాచీకి వచ్చే ముందే ఏదో పత్రికలో చదివాము - కరాచీపోర్టులో దాదాపు 700 కార్లు అక్రమరీతిలో దిగుమతి అవుతుండగా పట్టివేశారని. అవి కాస్తా చూద్దా మనిపించింది. అలాగే కరాచీ పోర్టు తదితర ముఖ్యస్థలాలు చూడాలని కార్లో బయల్దే రాము. కరాచీ పోర్టు చాలా హడావిడిగా వుంది. దగ్గరలో వున్న ఏదో ద్వీపానికి చిన్న బోటులో చేరవేసే ఏర్పాటు అక్కడ వుంది. ఆ ద్వీపం ఏదో పిక్‌నిక్ స్పాట్ అట.

కరాచీ పోర్టు యార్డు చూపించడానికి ఏదో ఎత్తు ప్రదేశానికి ఎక్కించాడు మా కారు డ్రయివర్. వందలాది జపాన్ కార్లు గొప్ప బహిరంగసభలో క్రమశిక్షణ పొందిన శ్రోతల్లా బారులు తీరి నిల్చున్నాయి.

"ఇవన్నీ అక్రమ దిగుమతులే. ఇంకా కొన్ని కార్గో షిప్పులకు పోర్టుకు చేరే అనుమతే ఇవ్వలేదు అధికారులు అని అక్కడ వున్న పోర్ట్ అధికారి ఎవరో వివరించాడు. మేము అంతా చూసుకుంటూ, మధ్యాహ్ననికల్లా వరంగల్‌కు చెందిన ఓ మిత్రుని ఇంట భోజనం ముగించుకుని కాస్త బడలిక తీర్చుకుని డిఫెన్సు కాలనీ మస్జిద్ చూడటానికని బయల్దేరాము.

డిఫెన్సు కాలనీ, వాస్తవానికి పాకిస్తాన్ డిఫెన్సులో రిటైరయిన ఉద్యోగుల కొరకు అయ్యూబ్‌ఖాన్ కాలంలో కేటాయించిన స్థలం. కాని ఇప్పుడు అక్కడ కేవలం రక్షణ సిబ్బందే కాకుండా బడా వ్యాపారులు కూడా చాలా మంది చేరి ఉన్నారు. అప్పుడు డిఫెన్స్ అధికారులు ఆ స్థలాన్ని ఓ కమర్షియల్ కమోడిటిగా వాడుకున్నారట. కాని ఆ కాలనీలో ప్రభుత్వ సహాయంతో నిర్మించి మస్జిద్ తన కోవకు చెందిన ఏకైక మస్జిద్ అని చెప్పవచ్చు.

మేము అక్కడికి వెళ్లేవరకు అస్ర్ సమయమయింది. బయటి నుండి చూస్తే అది ఓ పెద్ద విశాలమయిన డోమ్(గుమ్మటం)లా కనబడుతుంది. వృత్తాకారంలో ఉన్న ఆ డోమ్‌కు పశ్చిమదిశన ఎత్తయిన మీనార్ ఒకటి వుంది. మస్జిద్ ముఖద్వారం నుండి ప్రవేశద్వారం వరకు అందంగా నిర్మించబడ్డ ఫౌంటెయిన్లున్నాయి. గుండ్రంగా వున్న కట్టడానికి అన్ని వైపుల నుండి కూడా ప్రవేశ ద్వారాలున్నాయి. నేల, గోడలు పాలరాతితో కట్టారు.లోపల ప్రవేశించగానే విచిత్రమయిన అనుభూతి కలుగుతుంది. వెలుపలి నుండి కనబడే డోమ్‌కు లోపల ఒక్క స్తంభం, లేక అడ్డం నిలువు బీములు, ఏవీ ఆధారంగా లేవు. లోపలి నుంచి చూసినా చిన్న సైజు ఆకాశంలా ఆధారం లేని కప్పు దర్శన మిస్తుంది. దానికి తోడుగా డోం ఆకారంలో గల పైకప్పు ఫాల్స్ సీలింగ్‌లో ఒక క్రమంలో అద్దాలు అమర్చబడి వున్నాయి. ఆ అద్దాల్లో కట్టడానికి చుట్టూత ఉన్న ద్వారాల్లోంచి వచ్చే వెల్తురు ప్రతిఫలించి ఆ గగనానికి వింత శోభను ఆపాదిస్తోంది. ఏ ద్వారం నుండి ఎవరు వచ్చి పోతున్నా- ఏ మూలన, ఏటు వైపు తిరిగి కూర్చున్న వ్యక్తి అయినా ఆ ఆకాశపు అద్దాల గుండా ఇట్టే తెలుసుకోగలడు. రాత్రుల్లో వెలుతురుకై చేసిన ఏర్పాటు కూడా చాలా అపురూపంగా వుంది. పైకప్పు, వృత్తాకారపు గోడ కలిసే చోట 12 అంగుళాల అంచు కట్టి దానిచాటున చుట్టూతా ట్యూబ్ లైట్లను అమర్చారు. లైటు ఏ మాత్రం కనబడదు. అద్దాల గుండా పరావర్తనం చెందిన వెల్తురు చల్లగా హాయిగా మస్జిద్ నలుమూలలకు వ్యాపిస్తుంది.

మరొక విచిత్రం ఏమిటంటే, మస్జిద్‌లో ఏ మూలన కూర్చొని నెమ్మదిగా మాట్లాడినా మరే మూలన కూర్చొని విన్నా ఆ మాట్లాడేవారు తన ప్రక్కన వున్నట్టే అనిపిస్తుంది వినేవాడికి. నమాజ్ సమయాల్లో దివ్య గ్రంథం పఠనం జరుగుతుంటే చివరి వరుసలో నిలబడ్డ వ్యక్తి కూడా తొలి వరుసలోని వ్యక్తిలానే ఖుర్ఆన్ వినగలుగుతాడన్నమాట. అందుకే అక్కడ స్పీకర్‌లాంటి దేమీ లేదు. ఇంతచేసి అదేమయిన చిన్నసైజు కట్టడమా? మేము అక్కడ వరసల్లో పరచిన ముదురు ఆకుపచ్చరంగు ఈరానీ తివాచీలను లెక్కవేశాము

అవి మొత్తం కనీసం 5000 మంది నమాజ్ చెయ్యడానికి సరిపడా వున్నాయని మా అంచనా. అయితే అక్కడ 10 వేల మంది నమాజ్ చెయ్యగలరని లోగడ ఎక్కడో చదివి ఉండటం మూలాన మాకు అది ఎలా సాధ్యమని అనిపించింది. మరో నిముషం ఆ సందేహం కూడా తీరిపోయింది. వృత్తాకారపు గోడకు వెలుపల కూడా చుట్టూతా విశాలమయిన వరండా లాంటిది ఉంది. దాన్ని కూడా చేర్చుకుంటే మొత్తం పదివేల మంది సునాయాసంగా నమాజ్ చేసుకోగలరని అనిపించింది. డిఫెన్స్ కాలనీ మస్జిద్‌లో అస్ర్ నమాజ్ ముగించుకుని మేము 'క్లిఫ్టన్' బీచికి బయల్దేరాము.

'క్లిఫ్టన్' కరాచీ సంపన్నుల బంగళాలతో ఫైవ్ స్టార్ హోటళ్ళతో అత్యాధునిక సౌకర్యాలతో అలరారే బీచిగా రూపొందుతున్న కాలక్షేప స్థలం. ఆ ఏరియాలోనే భుట్టో గారి కాలంలో నిర్మాణమయిన బంగళా ఉంది. బయటి నుండి దాని ఆకారం ఓ గొప్ప నౌకలా వుంది. దాని చుట్టూ రంగు రాళ్ళతో నిర్మించిన పిట్టగోడ, కుడ్యాలంకరణ అనుపమమయిందనడంలో సందేహంలేదు. జనరల్ జియా దానికి మరో విధమయిన నిర్మాణాత్మకమయిన వినియోగం కావాలని యోచిస్తూన్నాడట. దానికి దగ్గరలోనే వున్న బాలల క్రీడాగృహాలు, జూద గృహాలు, అక్వేరియం (మత్స్యగృహం) అన్నీ చూసుకుంటూ క్లిఫ్టన్ నుండి బయలుదేరి మస్జిదే- ముహమ్మద్ బిన్ కాసిమ్‌లో మగ్‌రిబ్ నమాజ్ చేసుకుని బయల్దేరుతుండగా మా డ్రయివర్ 'పదండి ఓ సారి పట్టణం చుట్టూ తిరిగి వెళ్ళిపోదాం' అన్నాడు. సరే అని సాయంత్రపు చల్లని గాలులు పంచే ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తూ రాత్రి తొమ్మిది గంటల కల్లా నగరం చేరుకున్నాము. రాత్రి భోజనాలయ్యాక, నాకోసం ఎవరో వచ్చి వెళ్ళారని జమాఅత్ కార్యాలయంలోని కార్యకర్త ఎవరో తెలిపారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇక్కడ నా చుట్టాలని చెప్పుకో తగ్గవారు ఎవరూలేరు. మిత్రులు కొందరు ఉన్నా వారికి నా రాక గురించి ఎలా తెలుస్తుంది? అదీ నేను ఇక్కడ ఉన్నట్లు తెలవడం ఇంకా ఆశ్చర్యకరం. ఎవరయి ఉంటారని చాలా సేపు ఆలోచించుకుంటూ, ఊహించుకుంటూ ఆ నిరీక్షకునికై నిరీక్షిస్తూ కూర్చున్నాను. పదకొండు గంటల ప్రాంతంలో ఆయన వచ్చారని తెలిసింది. మేమున్న గదిలోకి పిలిపించుకున్నాను, మేము నలుగురం ఆ హాలులో కూర్చుని పేపర్లు చూసుకుంటున్నాము ఆ రాత్రి వేళ!

"అస్సలాము అలైకుం, మీలో మలిక్ గారెవరండి"? అంటూ ఓ ఇరువయి ఏళ్ళ యువకుడువచ్చాడు, బాగా పరికించి చూశాను. ఇంతవరకు ముందు పరిచయంలేదని అతని ప్రశ్న వల్లనే తెలుస్తోంది.

"వ అలైకుముస్సలాం. ఈయనే" అని మా మిత్రులు ఒకాయన పరిచయం చేశారు.

"మీరా"? అన్నట్టు అతని ముఖమంతా ఆశ్చర్యార్థకమయిపోయింది.

"రండి కూర్చోండి." అని కరచాలనం చేస్తూ అతనికి ఓ కుర్చీ చూపించాను, వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు.

మౌలానా మౌదూదీ ప్రసంగం,
సంప్రదింపుల భంగిమల్లో...

ప్రసంగిస్తూ...

నిర్దేశాలనిస్తూ...



మీనారె పాకిస్తాన్ (పాకిస్తాన్ ధ్వజం)

షాహి మస్జిద్, లాహోర్



ఫైసల్ మస్జిద్

డిఫెన్స్ మస్జిద్

"మీరేనా మలిక్ గారు"?

ఆశ్చర్యపడటం ఇప్పుడు నా వంతయింది. ఆశ్చర్యంగా వెలువడిన ఆ ప్రశ్న తెలుగులో వచ్చింది!

ఆనందం, ఆశ్చర్యం సమ్మిళితమయిన అనుభూతి నుండి తేరుకుని "అవును,....." నా అసంపూర్ణ ప్రశ్నకు అతడు తక్షణం సమాధానం ఇచ్చాడు.

"మాది కృష్ణా జిల్లా నా పేరు.... ఇక్కడ మా బావగారు ఉంటున్నారు. నేనూ వచ్చేశాను. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు అక్కడే చదువుకున్నాను. కాబట్టి నాకు తెలుగు బాగా వచ్చు" అని ముసి ముసి నవ్వుతో సమాధాన మిచ్చాడు.

'అయితే నా గురించి ఎలా తెలిసింది?' అని అడిగాను, ఎవరో మిత్రులు చెప్పారట తెలుగు ఇస్లామీయ పత్రిక సంపాదకుడు హైదరాబాద్ నుండి వచ్చినట్లు. కాస్సేపు మేమిద్దరం ఇక్కడి, అక్కడి కబుర్లు చెప్పుకున్నాము.

"నాకు గీటురాయి కావాలండి, నేను ఇంకా సంపాదనపరుణ్ణి కాలేదు...." నసిగాడు.

"ఫరవాలేదు. పంపించే ఏర్పాటు చేస్తానులేండి" మాటిచ్చాను. పరదేశంలో తాను చదువుకున్న భాష పట్ల శ్రద్ధ కనబరచడం, ఇప్పుడు దాని ప్రయోజనం అసలే గోచరించని పరిస్థితిలో నాకు ఎంతో ముచ్చట వేసింది. తెలుగును మన నుండి మరుగుపరచరాదన్న అతని తపన నన్ను ముగ్ధుణ్ణి చేసింది, అతడు తాను మరవక పోవడమే కాక తన లాంటి వారు ఇతరులున్నా వారిలో కూడా ఈ భాష పరిజ్ఞానాన్ని సజీవంగా ఉంచాలని అతన్ని కోరి సాగనంపాను.

నా భూమి, నా కర్తవ్యాలు

హైదరాబాద్ నుండి బయల్దేరి సరిగ్గా 15 రోజులయింది. మాబృందంలో మిగిలింది మౌలానా అబ్దుల్ అజీజ్ (ఆంధ్రప్రదేశ్ జమాఅత్ అధ్యక్షులు), రషీద్ ముహియుద్దీన్, నేను మాత్రమే. గుజరాత్, మహారాష్ట్ర అధ్యక్షులు అక్టోబర్ 7వ తారీఖునే బయల్దేరి వెళ్ళిపొయ్యారు. కొత్తస్థలం చూడాలని, కొత్తవారితో మాట్లాడాలని, కొత్త విషయాలు తెలుసుకోవాలని ఏర్పడే కుతూహలం వల్ల ఇన్ని రోజులు తెలీకుండానే దొర్లి పొయ్యాయి. ఇప్పుడు స్వదేశం, పుట్టి పెరిగిన వాతావరణం, గుర్తుకు రాసాగాయి.

నా ఊహల్లో భారత ఇస్లామీయ ఉద్యమం, ప్రపంచస్థాయిలో జరుగుతున్న ధర్మ సంస్థాపన కృషి మెదలసాగాయి.

పాకిస్తాన్‌లో ఇస్లామీయ ఉద్యమాన్ని ఇక ఎవ్వరూ అణచలేరు. ఏ నిరంకుశ పరిపాలకుడు వచ్చినా అక్కడ ఎక్కువ కాలం మనజాలడు. ప్రజల్లో ఇస్లామీయ చైతన్యం మేల్కొన్నది. ఇస్లామీయ జీవన వ్యవస్థ సంస్థాపన ఇప్పుడు పాకిస్తాని జాతి లక్ష్యమయి

పోయింది. ధార్మిక వ్యవస్థను జీవితపు అన్ని రంగాల్లో ప్రవేశ పెట్టాలన్న దృఢ నిశ్చయానికి వచ్చింది ఏకాగ్రచిత్తంతో పాకిస్తాన్ ప్రజ. ఈ నిశ్చయాన్ని మార్చడం ఏ అగ్ర రాజ్యానికి, మరే పాశ్చాత్యతత్వానికి, ఇంకా ఏ ఇతర శక్తికీ సాధ్యపడదు. అదీకాక ప్రపంచ స్థాయిలో ముస్లింలు తమ నిజస్థానాన్ని, తమ ప్రభువు తమపై మోపిన ధర్మప్రచార భారాన్ని గుర్తించగలిగారు. నేడు వైజ్ఞానికంగా, సాంకేతంగా ప్రగతి గగనాలకు ఎగిసినజాతులు, ఎన్నో నైతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రుగ్మతలకు గురయి కర్తవ్యం బోధపడక, మునిగిపోయే మనిషిలా అందిన ప్రతి గడ్డిపోచను పట్టుకుని సమస్యల సాగరాన్ని ఈదాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి. ఈ తరుణంలో మానవుల నిజస్వామి, విశ్వకర్త, ప్రభువు తన దాసులయిన మానవులకై పంపిన జీవత విధానం తమ వద్దగల ముస్లింలు, ఈ పతనమవుతున్న జాతులకు ఆదర్శంగా నిలువకపోతే బ్రహ్మాండమయిన అగ్నిగుండం అంచుల్లో నిల్చున్న ప్రపంచం ఏ క్షణాన్నయినా నామరూపాల్లేకుండా సమసిపోయే ప్రమాద ముంది.

ఈ యుగపు నిజమయిన బాధను ఆవేదనను ముస్లిం నవతరం బాగా అర్థం చేసుకుంది. అందుకే ముస్లిం దేశాల్లోనే కాక యూరోపు దేశాల్లోను, అమెరికాలోనూ మరెక్కడవున్నా సరే, ముస్లిం యువత ఇస్లాం పునరుజ్జీవనానికి కంకణధారులై పాటు పడుతున్నారు. యువతలో ఈచైతన్యాన్ని ఈ స్ఫూర్తిని సృజించింది రెండు ఉద్యమాలే. ఈజిప్టులోని "అల్ ఇఖ్వానుల్ ముస్లిమూన్", భారత ఉప ఖండంలో మౌలానా మౌదూదీ స్థాపించిన "జమాఅతె ఇస్లామీ".

పాకిస్తాన్‌లో మౌలానా మౌదూదీ స్వయంగా ఉండి తన అనుపమ ప్రజ్ఞతో ఇస్లామీయ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచడమే కాక నవతరంలో ఇస్లాం, ఇస్లామీయ జీవన వ్యవస్థ, ఇస్లాం ఉన్నతి స్థాపనల కొరకు పాటుపడే ప్రేరణను, వాటికై ఎలాంటి త్యాగాన్నయినా, చివరికి ప్రాణాలను సయితం సమర్పించగల సచ్ఛీలతను సృజించ గలిగారు. అయితే మన దేశంలో పరిస్థితులు వేరు. ఇక్కడ దేశ విభజన తరువాత ముస్లింలు అనేక కారణాలవల్ల ఎన్నో సమస్యలకు గురయ్యారు. ఇస్లామీయ ఉద్యమం కొత్త పరిస్థితుల్లో, కొత్త పాలసీ ప్రోగ్రాములు నిర్మించుకుని తన పయనం సాగించింది. ఉద్యమం సాఫీగా సాగడానికి అవకాశం లభించలేదు. ఎన్నో చారిత్రక కారణాలవల్ల దేశప్రజల్లో ఇస్లాం, ముస్లింల పట్ల పొడసూపిన అపోహలు, స్వయంగా ముస్లింల సమస్యలు, ఎన్నో అవాంతరాలు ఏర్పడ్డాయి. వాటిని దాటుకుంటూ ఇప్పుడు కాస్త నిలదొక్కుకో గలుగుతోందంటే, అంతర్జాతీయ స్థాయిలో ఇస్లాం ఓ కొత్త శక్తిగా విజృంభించడం పట్ల బిత్తరపోయిన కమ్యూనిస్టు సంస్థ క్రమేణ ప్రతిచోటా ఇస్లామీయ ఉద్యమం పట్ల అనుమానాలు సృజించడంలో నిమగ్నమయింది – భారత దేశంలోనూ ఆ బెడద ఇస్లామీయ ఉద్యమానికి తప్పలేదు.

నా మస్తిష్కంలో తలెత్తిన ఊహలన్నీ నన్ను వేగిర పెట్టసాగాయి - పద నీ భూమికి, నీ దేశంలో నీ ప్రజల్లో మంచిని స్థాపించడానికి, చెడును నిర్మూలించడానికి అని!

నా దేశంలో ఎన్ని సమస్యలు - ప్రజా స్వామ్యానికి ప్రతి అడుగునా ప్రమాదాలే అని రాజకీయ నాయకులు, మేధావులు అనునిత్యం చాటుతుంటారు. పాకిస్తాన్ సైనిక నియంతృత్వం, మొదలుకొని రాజకీయనియంతృత్వం వరకు పలురకాల పాలనల్ని చవిచూసింది. అయితే మన దేశం ప్రజాస్వామ్యాన్ని తన పోకడగా ఎన్నుకుని ముందుకు సాగుతోంది. ఒక్కోసారి ఆ ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు మూడే పరిస్థితులు రాలేక పోలేదని కాదు. ఎమర్జెన్సీలో ప్రజాస్వామ్యం అలా ఉంచి ప్రజల ప్రాధమిక హక్కులే దేశాన్నుండి నామరూపాల్లేకుండా మటుమాయమయ్యాయి. కాని ప్రజాస్వామ్యాన్ని శాంతి యుతంగా పునరుద్ధరించిన ఘనత భారతప్రజలకే దక్కింది. ఇప్పుడు ఏ దేశంలోనయినా, ఏ వ్యవస్థలోనయినా ప్రజాభిప్రాయాన్ని కాదన్న పాలకులకు బూడిద బొక్కడంతప్ప గత్యంతరం లేదు. ఇస్లామీయు ఉద్యమం మనగలగాలంటే ప్రజాస్వామ్య వ్యవస్థ మనగలగడం అతిముఖ్యం. అటువంటి ప్రజాస్వామ్య ప్రతిష్ఠకు నేను పాటుపాడాలి.

నా దేశంలో నిరక్షరాస్యత 80 శాతం. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో పథకాలు వేసి 30 ఏళ్ళనుండి కష్టపడుతున్నా ఆ సమస్యలు పూర్తిగా పరిష్కారమవడం లేదు. వట్టి నినాదాల ఆధారంగా బ్రతుకు సాగించే ఉద్యమాల విషయం వేరు. ఇస్లామీయ ఉద్యమం ఒక వైపున ఆత్మకు, మనస్సుకు సంబోంధించినా, ఈ విజ్ఞాన యుగంలో దాని అసలు సంబోధన మస్తిష్కానికే! ఇలాంటి ఓ ఉద్యమం నిరక్షరాస్యత ప్రబలి ఉన్న ప్రజల్లో ప్రేళ్ళూనడం ఎంతో కష్టం. ఇస్లామీయ ఉద్యమం పురోగమించాలంటే నిరక్షరాస్యత దూరం కావాలి. నేను నా దేశ ప్రజల్లో నుండి నిరక్షరాస్యతను దూరం చెయ్యడానికి చేస్తున్నదేమిటి? ఏదో చెయ్యాలి. నా దేశం బీదదేశం, నా ప్రజలు అధిక భాగం పల్లెల్లో జీవిస్తారు. వారి పల్లె జీవితంలోనే ఉత్తేజం, చైతన్యం సృజించాలి. వారిని పైకి లేవనేత్తాలి. లేకపోతే నినాదాల పురుష పుంగవులు అరచేతి స్వర్గం చూపించి స్వప్రయోజనాల కొరకు వాడుకుంటారీ అమాయక ప్రజల్ని. బీదరికం దూరం చెయ్యడానికి జరుగుతున్న కృషిలో నా వాటాను నేను సక్రమంగా నెరవేర్చాలి.

భౌతికపరమయిన సౌకర్యాల కంటే, నైతిక జీవితం ఎంత ముఖ్యమయినదో, సౌశీల్యత విలువ ఏమిటో వారికి బోధించాలి. ఉదర పోషణ, కామప్రేరణలను అధిక మించిన పరిశుద్ధ జీవితం పట్ల చైతన్యం కలిగించాలి. నా దేశంలో అనునిత్యం ఏవో భాషా విభేదాలు, ప్రాంతీయ తత్వాలు, కులాల కలతలు, మత కల్లోలాలు జరుగుతూనే ఉంటాయి. శాంతి ఏదో ఓ రూపంలో అప్పుడప్పుడు నా దేశ ప్రజలకు కనుమరుగయిపోతూ ఉంటుంది. శాంతంగా కాలం గడపలేని ప్రజలు ఇస్లామీయ ఉద్యమం అందజేసే సందేశాన్ని ఎలా అర్థం చేసుకోగలుగుతారు? నా దేశంలో దేవుని భయభక్తుల వాతావరణం

అలరారాలంటే, ముందు దేశంలో ప్రశాంతత నెలకొనాలి. ప్రజలు శాంతంగా ఆలోచించ గలగాలి. అప్పుడే మనస్సునూ మస్తిష్కాన్నీ జాగరూక పరిచే ఇస్లాం సందేశాన్ని వినగలుగు తారు. దాని హేతువును అర్థం చేసుకోగలుగుతారు. నేను ఆ శాంతి స్థాపనకు నిరంతరం కృషి చెయ్యాలి. నా దేశ ప్రజల ఆంతర్యాల్లో ఏ కారణాల వల్లనయినా సరే ఏర్పడిన అపోహల్ని, తప్పుడు అభిప్రాయాల్ని దూరం చెయ్యాలి. దేశ ప్రజల్లో సామరస్యం, సదవ గాహన సుహృద్భావ వాతావరణం సృజించడానికి కృషి చేయాలి.

ఇంకా ఎన్నెనో సమస్యలు అలలు అలలుగా నాహృదయాన్ని పట్టి కదిలించ సాగాయి. నాలో ఏదో సంచలనాన్ని రేకెత్తించ సాగాయి ఎన్నో బాధ్యతలు కర్తవ్యాలు హిమాలయాల్లా వచ్చి నిల్చోసాగాయి. పరాయి దేశంలో ఇంకా ఎన్ని రోజులు? ముస్లింగా నాకు మూడు స్వస్థలాలున్న విషయం వాస్తవమే. ప్రపంచ ముస్లింల కిబ్లా 'కాబా' గృహం ఉన్న మక్కా నగరమూ విశ్వాసికి స్వస్థలమే. ముస్లిం సోదరులు నివసించే దేశాలు, ప్రదేశాలు కూడా ప్రపంచ ముస్లింలకు స్వస్థలంతో సమానమే! అయితే జన్మస్థలం మాత్రం కర్తవ్యాలు, విధులు, బాధ్యతల దృష్ట్యా ముస్లిం వ్యక్తి జీవితానికి విడివడని సంబంధం గల స్వస్థలం!

నా భూమిపైన, నా బాధ్యతలు నా కర్తవ్యాలు గుర్తుకు రాగానే తిరుగు ప్రయాణపు సన్నాహాలు మొదలు పెట్టాను. అక్టోబర్ 8వ తారీఖున కరాచీ నుండి బయల్దేరాలని వీజా పాస్పోర్టులపై అవసరమయిన ఎండార్స్‌మెంటులు చేయించుకున్నాము. రిజర్వేషన్ దొరకలేదు. వచ్చినట్టే తంటాలుపడి పోవడం తప్ప గత్యంతరం లేదు గనక మానసికంగా దానికి కూడా మేమందరం సిద్ధమయి అందరి వద్ద వీడ్కోలు పుచ్చుకోసాగాము.

ఖుదాహాఫిజ్!

రిజర్వేషన్ ఎలాగూ దొరకలేదు కాబట్టి ప్రొద్దుననగా బయల్దేరవలసిన ట్రయిను కొరకు రాత్రే వెళ్ళి కరాచీ స్టేషన్‌లో తిష్ఠ వేశాము. ఎలాగో మూడు సీట్లు సంపాదించి పట్టుకున్నాము. ట్రయినులో అదే సందడితో ప్రయాణీకులతో ముచ్చటించుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం ప్రారంభించాము.

నా ఆంతర్యంలో మట్టుకు రెండు రకాల భావాలు, సమ్మిళితమయి, సమాంతరంగా ప్రవహిస్తున్నాయి. ఈ భూభాగానికి ఏనాడయినా వస్తానని, ఇక్కడి నా అనుభవాలు నా జీవితంలో ఓ చెరగని ముద్ర వెయ్యగలుగుతాయని నేనెన్నడూ కలగనలేదు. అకస్మాత్తుగా మౌలానా అస్తమించడం, హుటాహుటిన నేనిలా ప్రయాణమవడం, ఈ గడ్డపై ఇలా వచ్చేసి వాలడం, అంతా దైవేచ్ఛ తప్ప మరేదీ కాదు.

పాకిస్తాన్ కా మత్‌లబ్ క్యా?
లా ఇలాహ ఇల్లల్లాహ్!

పాకిస్తానంటే ఏమిటి?

దేవుని ఏకత్వపు సద్వచనం!

అన్న నినాదంతో ఆవిర్భవించిన దేశంలో కాలూనడంలో ఓ ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తగా నాకొక థ్రిల్ ఉండేది- ఆ దేశం నిజంగా తన నినాదానికి తగినట్టుగా రూపొంది, ప్రపంచపటంలో తన ప్రత్యేక ప్రతిపత్తిని, స్థానాన్ని నిలబెట్టుకొని ఉండి ఉన్నట్లయితే! మనతోపాటూ ఆ భూభాగానికి స్వాతంత్ర్యం లభించినా అది ఇటు ఇస్లామీయ సిద్ధాంతాల దృష్ట్యా తన ప్రత్యేకతను నిలబెట్టుకోలేకపోయింది, ఇటు భౌతికం గానూ ప్రగతి సాధించలేకపోయింది. నిత్యం కుర్చీల కుమ్ములాటతోనే సరిపోయింది ఇక్కడి పాలకులకు. లియాకత్ అలీఖాన్ మొదలుకొని అయ్యూబ్ ఖాన్ వరకు అందరూ తమ ఆసన పటిష్ఠతకు పాటుపడటమే కాని, దేశంలో భావసమగ్రతకు, దేశ సైద్ధాంతిక ప్రాతిపదికల పరిరక్షణ కొరకు, దానికనుగుణంగా ప్రజల శీల నిర్మాణానికి చిత్తశుద్ధితో ఎలాంటి చర్యలు గైకొనలేదు. అందువల్ల దేశం అనునిత్యం సైనిక రాజకీయ అలజడుల ఆలవాలమయి కూర్చుంది. ఏ కలిమా, ఏ సద్వచనం ఆధారంగా వేల కిలోమీటర్ల ఎడంగా ఉన్న రెండు భూభాగాలు కలిసి కట్టుగా ఉంటాయని, ఉమ్మడి కృషితో దేశ సమగ్ర ప్రగతిలో తమ పాత్ర నిర్వహిస్తాయని పాకిస్తాన్ నిర్మాతలు ఆశించారో ఆ సద్వచనానికి, ఆ ఇస్లాం భావానికే ఎసరు పెట్టి తమ సొంత ప్రయోజనాలకు, స్వలాభాలకు ఊపిరి పోసుకున్నారు - కాకతాళీయంగానో, శక్తి ఆధారంగానో పైకి వచ్చిన పెద్దమనుష్యులు.

పర్యవసానంగా తొలి నుంచి ఏలిన వారి చిన్న చూపుకు గురవుతూ వచ్చిన తూర్పుపాకిస్తాన్ నివాసుల్లో వేర్పాటు ధోరణులు పొడసూపాయి. తూర్పు పాకిస్తాన్ స్థానే బంగ్లాదేశ్ ప్రపంచ చిత్రపటంలో రూపుదిద్దుకోవడాన్ని ఎందరో ఎన్నో వక్రభాష్యాలతో సత్కరించారు. పాకిస్తాన్ ఏర్పాటుకు పునాది అయిన ధార్మిక ప్రాతిపదికే అపజయం పొందింది అన్నారు. 1400 ఏళ్ళకు పూర్వం ఇస్లాం మనుషుల్ని సంస్కారులుగా తీర్చిదిద్దిందేమో కాని నేటి ఆధునిక యుగంలో అలా చేయడం దానివల్ల కాని పని అన్నారు. ఏ దృక్పథంతో వేల కిలో మీటర్ల దూరాన ఉన్న భూభాగాలను ఏకంగా ఉంచగలమని ముస్లిం నాయకులు భ్రమపడ్డారో ఆ దృక్పథం కాస్తా పటాపంచలయి పోయిందన్నారు. ఇప్పుడు పాకిస్తాన్ ఉనికే సహేతుకం కాదని వాదించారు. ఇస్లాం సార్వజనీనత పట్లనే అనుమానాలు సృజించారు.

పాకిస్తాన్ చాటుగా, స్వాతంత్ర్యానికి పూర్వపు ముస్లిం నాయకుల చాటుగా, నేటి ముస్లింలను ఇంకా నిజం చెప్పాలంటే ఇస్లాంనే అవహేళన చేశారు, అపహాస్యం చేశారు. వ్యంగ్యాలు విసిరారు. సూటిపోటి మాటలతో పొడిచారు, వెకిలి నవ్వులు నవ్వారు.

కాని 'వీరు తమ నోటితో ఊది అల్లాహ్ జ్యోతిని ఆర్పాలని చూస్తున్నారు. కాని అల్లాహ్ తన జ్యోతిని పరిపూర్ణం చేయనిదే వదలడు.' అన్న దైవవాక్కు ఫలించకుండా ఉంటుందా?

పాకిస్తాన్ అంటే కొందరికి ఎందుకంత ద్వేషం? నిన్న మొన్నటి దాకా అది భారత భూభాగం కాదా? అన్నదమ్ముల మధ్య ఏవయినా విభేదాలు పుట్టి, ఏ కారణాల వల్లనయినా వేర్పడినంత మాత్రాన వీరు తమ సోదరత్వం కోల్పోతారా? అలాగే భారతదేశం అంటే పాకిస్తానీయులకు కోపం ఎందుకు? ఇలాంటి ప్రశ్నలు నేను ప్రజల్లో తిరుగకముందు నన్ను పట్టిపీడించేవి. అయితే కొంతకాలానికి అసలు ఈ ప్రశ్నలే నిరాధారమయినవన్న భావం ఏర్పడింది నాలో. పాకిస్తానీయులంటే మన దేశంలో ద్వేషం ఉన్నవారు నాకు తటస్థించడం బహు స్వల్పం. ఒకరో ఇద్దరో తగిలినా వారిదికూడా ద్వేషం కాదు కేవలం నిష్ఠూరం లాంటిది. అలాగే ఇప్పుడు పాకిస్తాన్ కెళ్ళి చూద్దునుగదా, అక్కడా భారత ప్రజలంటే ప్రేమామయ వాతావరణం, భారత ప్రగతిపథం పట్ల హర్షం, భారతపరిపాలకుల పట్ల ప్రశంసాపూరిత భావాలు కనిపించాయి. నేను కళ్ళారా ఉభయత్రా గాంచిన సత్యాలను ఏ పక్షీయులయినా, ఏ పాలకులయినా తమ స్వప్రయోజనాల కొరకు కాదన్నా నేనెలా నమ్మగలను?

"అవును, బ్రదర్.................."

ఫ్రీగా విహరిస్తున్న నా ఊహాశకటాన్ని నా ప్రక్కలో కూర్చున్న యువకుడు సడన్ బ్రేక్ వేసి రైలుపెట్టెలోకి మళ్ళించాడు.

"ఆ! చెప్పండి." అన్నాను కాస్సేపటికి తేరుకుని. నా ఊహాలోకంలో చొరబడి నన్ను అటకాయించడం నాకంతగా రుచించలేదు.

"ఇండియాలో ఎమర్జెన్సీ విధించినప్పుడు మీరు అక్కడి సాంస్కృతిక అతివాద పక్షమయిన జనసంఘ్, ఆర్.ఎస్.ఎస్.లతో సంబంధాలు పెంచుకున్నారటగా?"

ముందే నాకు చీకాకుగా ఉంది. పైగా ఈ చచ్చు ప్రశ్న. నాకు అరికాలి మంట నెత్తికెక్కినట్టయింది.

'అవునండి ఏర్పర్చుకున్నాం. అయితే ఇప్పుడేమంటారు?' అందామనుకున్నాను. కాని సభ్యత అడ్డు వచ్చింది. నిమ్మళంగానే సమాధానమిచ్చాను.

"చూడండి, ఎమర్జెన్సీలో జమాఅతె ఇస్లామీ వాళ్ళు జైళ్ళల్లో దాదాపు రెండేళ్ళు గడిపారు. అక్కడ ఒక్క ఆర్.ఎస్.ఎస్. వాళ్ళతోనే కాక సోషలిస్టులు, పాత కాంగ్రెస్ వాళ్ళు, ఆనంద్‌మార్గీయులు, మార్క్సిస్టులు ఇంకా ఇతర ప్రాంతీయ పార్టీల వాళ్ళూ చాలా మంది ఉండేవారు. జమాఅత్ కార్యకర్తలు తమ తర్ఫీదు రీత్యా సత్సందేశకులు. వాళ్ళ సందేశం మాటల్లో చెప్పాలంటే ఖురాన్, మహాప్రవక్త (స) హదీసులుతప్ప మరేదీ కాదు. చేతల్లో చెప్పాలంటే దైవాదేశాలు దైవప్రవక్త సంప్రదాయాల అనుసరణ, జమాఅత్ కార్యకర్తలు జైళ్ళల్లో అదే చేశారు." చిన్న ఉపన్యాసం ఇచ్చాను. పరుగెత్తే రైల్లో ఉపన్యాసం అంటే గొంతు చించుకు చావడమన్నమాట! అతడు గ్లాసెడు చన్నీళ్ళు అందించి, దరహాసం చేశాడు నా వైపు చూసి, నేను ప్రతిహాసం చేశాను.

"చెప్పండి," అన్నట్టు పోజుపెట్టి కూర్చున్నాడు ఆ యువకుడు. నేనప్పుడు గమనించాను. మేమిద్దరమే కాక మా 'ఇరుగుపొరుగు' వాళ్ళు కూడా పాల్గొంటున్నారు మా గోష్ఠిలో అని!

'కాస్త హెల్ప్ చెయ్యండి,' అన్నట్టు చూస్తూ మన అమీరెహల్కాను చూపించి "నేను జైలుకు వెళ్ళలేదు కాని బాబు, మా అమిరెహల్కా గారికి దాని దర్శన భాగ్యం కలిగింది. ఆయన వివరంగా చెబుతారు విను" అని ఆయనకు అప్పగించాను అతన్ని.

"మా మిత్రుడు చెప్పినట్టు జైళ్ళల్లో మేము అందరితో కలిశాము. దివ్య ఖురాన్ బోధనల్ని వినిపించాము. హదీసు ప్రవచనాల్ని వివరించాము. మాకు సన్నిహితులుగా అక్కడి వారు చాలా మంది తయారయ్యారు. వారిలో ఒక్క ఆర్.ఎస్.ఎస్. దేముంది, ఇతర పార్టీల వాళ్ళు కూడా ఉన్నారు. మేమంతా గొప్పగా ఖురాన్ హదీసుల్ని అనుసరించే వాళ్ళమని డంబాలు చెప్పుకోము, అయినా దైవకృపవల్ల జమాఅత్ ఇచ్చిన సుశిక్షణ వల్ల ఏదో కొంత వరకు మేము నిజమయిన ముస్లింల మార్గాన నడవ గలిగాము. సువాసన ఎక్కడున్నా ఎలాంటి బుడ్డిలోపోసినా తన సహజగుణాలన్నీ ఎలా వదులుకుంటుంది.? మాతో పాటు ఉన్న విభిన్న పార్టీల ముస్లిమేతర సోదరులు ప్రభావితులయ్యారంటే అది మా గొప్పేమికాదు. అంతా మేమనుసరించే ధర్మం- ఇస్లాంలోని ఔన్నత్యమే. ఆ సఖ్యత కూడా ఒకరోజా రెండు రోజులా.....రెండుసంవత్సరాలు! ఆ మైత్రిని ఆ సామరస్యాన్ని జైళ్ళ వెలుపల కూడా కొనసాగించాలని మేము జైళ్ళలోనే నిర్ణయించుకున్నాము. తదనుగుణంగా బయటికి వచ్చిన తరువాత స్వేచ్ఛా వాతావరణంలోనూ మా మైత్రీలత సుదూరాలకు అల్లుకు పోవాలని ఆశించాము. అంతే" అని ఆయన తన ప్రత్యేక ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపొయ్యారు.

"అయినా, మీరు అనేక పార్టీలతో సంబంధాలున్నాయంటారు. కాని, ఆర్.ఎస్.ఎస్. పేరే అంతగా పైకి రావడానికి మరేదయినా కారణం ఉండవచ్చునేమో........"

"అవును," నేనందుకున్నాను, "అసలు కారణమేమంటే భారతదేశంలో జాతీయ స్థాయి సంస్థలో సంస్థాగతంగా క్రింది స్థాయి నుండి గట్టి పునాదులపై నిలబడ్డ సంస్థలు బహుకొద్ది మాత్రమే. కమ్యూనిస్టులు, ఆరెస్సెస్ తర్వాత జమాఅతె ఇస్లామీ హింద్ అలాంటి సంస్థల లోనిదే. కమ్యూనిస్టులు ఆ కాలంలో అత్యయిక నాయకత్వానికి వంతపాడిన వాళ్ళు కావటాన మా వాళ్ళతోపాటు లోనికి పోలేక పొయ్యారు. ఇతర పార్టీల వాళ్ళతో నాయకుల స్థాయిలో ఇప్పటికి సత్సంబంధాలున్నాయి ఆర్.ఎస్,ఎస్. విషయంలో క్రింది స్థాయిలోనూ సంబంధాలున్నాయి."

'ఓ హో! అదా సంగతి......'

'సంబంధాలంటే రాజకీయ సంబంధాలు అనుకోబోయేరు. మేమింకా రాజ కీయాల్లో కాలిడలేదు. సంస్థాగతంగా కూడా ఎలాంటి సంబంధాలు లేవు. కేవలం

వ్యక్తిగత స్థాయిలో జైళ్ళల్లోని మైత్రిని దేశనిర్మాణ కార్యక్రమంలో ప్రజాహిత కార్యాల్లో వినియోగించే దృష్టితో కొనసాగిస్తున్నాము.' మళ్ళీ వివరించాను.

ఆ గోష్ఠిని అక్కడికి ఆపి నేను మళ్ళీ నా ఊహా జగత్తులోకి పోయి తేలియాడసాగాను. బీడువారిన సింధ్ రాష్ట్ర భూముల్ని చూస్తుంటే జాలివేసింది.

ఉభయ దేశాల్లో పాలకుల మధ్యన కూడా సుహృద్భావ వాతావరణముంటే ఉభయత్రా లాభదాయకంగా ఉండేది! దురుద్దేశాల రాజకీయాల పుణ్యమా అని ప్రజా సామాన్యంలో లేని ద్వేషాగ్నిని సృష్టించి ఉద్రేకాలను ఆవేశాలను రేకెత్తించి ఉపఖండంలో శాంతి లేకుండా చేశారు ఈ నాయకులు!

చాలా మంది దృష్టిలో దేశ విభజన జరగడం ఘోరమయిన పొరపాటు కావచ్చు. ఆనాటి ఉభయపక్షాల నాయకుల ఉమ్మడి పొరపాటు అది. నేడు అదొక యదార్థం. ఆ యదార్థాన్ని కాదని పాడిందేపాటరా........ అని ఇంకా పాతగీతపై ససేమిరా కదలమని కూర్చుంటే జరిగేదేమిటీ, ఒరిగేదేమిటీ?

ఆ నాటి ముస్లిం నాయకుల్లో దేశవిభజన కూడదన్న వాళ్ళలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అగ్రగణ్యులు. ఆయన తనవాదనను శక్తివంచన లేకుండా హేతుబద్ధం చేసి వినిపించారు. రాశారు. అయినా ప్రత్యర్థులు కాదు పొమ్మన్నారు. ఆయన కూడా ఉమ్మడి నిర్ణయానికి తల వంచారు. దేశస్వాతంత్ర్యం తరువాత ఆయన విద్యాశాఖ నిర్వహిస్తున్న కాలంలో ఓ సందర్భాన ఓ ప్రయివేటు సిట్టింగ్‌లో ఆయన ఇలా అన్నారని విన్నాను.

"దేశవిభజన విషయంలో నేను, జిన్నా రెండు విభిన్న అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించాము. నా దృక్పథం సరయినదో, లేదా జిన్నా అభిప్రాయమే కరెక్టో అది ఇక్కడ తేలదు. రేపు ప్రళయ దినాన అల్లాహ్ సమ్ముఖాన మేమిద్దరం హాజరయినప్పుడే దాని తుది నిర్ణయం. ఇంతకు ఇప్పుడు పాకిస్తాన్ ఒక యథార్థ రూపం ధరించింది. మా అభిప్రాయాలు, అభిలాషలు ఎలా ఉన్నా పాకిస్తాన్ మాత్రం ఇప్పుడు ఒక నిజం. దానికి ఎలాంటి హాని కలక్కుండా కాపాడడం మనందరి విధి. నా మట్టుకు నేను, కేవలం దాని అవతరణను వ్యతిరేకించిన వాణ్ణి కాబట్టి, ఇప్పుడు దాని కీడును ఆశించే వాణ్ణి మాత్రం కాను."

వాస్తవానికి ఆయన ఒక్కరే కాదు. ఆనాడు పాకిస్తాన్ భావనను వ్యతిరేకించిన అనేక ముస్లిం, ముస్లిమేతర నాయకులు దాని అవతరణకు పిదప తమ విభేదాన్ని తిరిగి తోడలేదు, నాటి నాయకుల్లోని నిండుతనం, సహనం, హుందా కేవలం చరిత్ర పుటలకే అంకితమా? మనకు తిరిగి అలాంటి వాతావరణం అనుభవించే యోగం లేదా!

మనసుకు దేశకాల పరిమితుల్లేవు. అది ఎకాఎకీన సుదూర భుతకాలంలో నుంచి భవిష్యత్తులోకి అక్కణ్నుంచి తిరిగి వర్తమానంలో ఎన్ని పరుగులయినా, తీయగలదు.

అవకాశం దొరకడమే తడవు! నేను కూడా ఎక్కడెక్కడో విహరించి వచ్చేవరకు రాత్రి చీకటి ఆవరించింది. ఫజ్ర్ నమాజ్ ఒక్కటే కరాచీ ప్లాట్‌ఫారంపైన సక్రమంగా నిల్చొని చెయ్యగలిగాము - అప్పట్నుంచి రైలు పెట్టెలో చేసిన నమాజులన్నీ సీటుపై కూర్చుని కేవలం సంజ్ఞలతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. మగ్రిబ్, ఇషా, నమాజులు ముగించు కుని, ఏదో దొరికిన భోజన సామాగ్రి కడుపులో వేసుకుని అందరూ కునుకు తీయసాగారు.

నాకు సాధారణంగా ఊహలు ఆవరిస్తే ఒక పట్టాన నిద్రపట్టదు. ఇప్పుడు కూర్చుని కునుకు తీయడమంటే ఇంకా దుర్లభం. అందుకే తిరుగుడుకు అలవాటుపడ్డ మనసును స్వేచ్ఛగా వదిలివేశాను - అదే తిరిగి తిరిగి అలసి, సొలసి వచ్చిపడి పోతుందని. నేనిక్కడికి రావడానికి అసలు కారణమయిన వ్యక్తిత్వం కళ్ళ ముందు నిల్చుంది. మౌలానా మౌదూది- వాస్తవానికి 20వ శతాబ్దంలో ప్రపంచగతికి ఓ మలుపు ప్రసాదించిన యుగపురుషుడు. రాబోయే చరిత్రకారుడే దాన్ని ప్రపంచానికి చాటిచెప్పగలుగుతాడు. ఈ ఊహలు చరణాలరూపు ధరించసాగాయి. గుర్తున్న వాటిని కొన్నింటినీ పొందు పరిచాను.

యుగపురుషుడు

విజ్ఞానపు వీధుల్లో
నాగరికత మలుపుల్లో
నవ శతాబ్ది అంచులపై
ఉదయించిన ఓ భాస్కరుడు
ఇపుడిపుడే, నా ఎదుటే, అల్లదిగో
కాలానికి కళ్ళెం వేసి
కనుమరుగయి పోయాడు....

అతడో తిరుగుబాటు సూర్యుడనీ
మంటల్లోని కప్పలు
గుడ్డి, గున్న గబ్బిలాలు
ఒంటికంటి గానుగెద్దులు
ఏడుస్తూ ప్రకటించాయి

విజ్ఞానం వెదజల్లిన
మూఢత్వపు తత్వాలను
ఎదిరించి పోరాడిన
తిరుగుబాటు వీరుడే!

పడమరలో వెలుగొంది
తూర్పున భాసిల్లిన
భౌతికపు వెలుగుల్లో
కళ్ళుమూసి పరుగెత్తే
నవతరాన్ని ఆదుకుని
కన్నుల్లో జ్యోతిని
వెలిగించిన కాంతిదాత

"మా బతుకులు బండలయినా
మా లోకం శిథిలమయినా
పట్టించుకోలేని వాడు
ఏ దేవుడయితే మాకేమి, మాకు వద్దంటే వద్దు" అని
చాటిన ధీశాలి అతడు

పూజా గృహాల మధ్య నుండి
ధర్మాన్ని వెలికితీసి
వంటగదిలో పడక గదిలో
బజారుల్లో వీధుల్లో
రచ్చబండ మీటింగుల్లో
పార్లమెంటు మహాసభల్లో
న్యాయస్థాన భవనాల్లో
ప్రతిచోట ప్రతిష్ఠించిన
విప్లవ వైతాళికుడు

అల్లదిగో పోతూ పోతూ
ధరణిలోని చీకట్లతో
ఎర్రని కాగడ మంటలతో
నీలి జ్వాలల చుక్కలతో
నిరంతరం పొందుకై
ఆలోచన ఆచరణల
పాలవెల్లి ఒకదాన్ని
సృష్టించి పొయ్యాడు

కాలానికి కళ్ళెంవేసి
కనుమరుగయి పొయ్యాడు.

తెల తెల్లారుతుండగా లాహోర్ స్టేషను చేరాము. అక్కణ్ణుంచి అందరి వద్ద శెలవు తీసుకోవడానికి ఉపక్రమిస్తే అందరి గడ్డాలూ తడిసిపొయ్యాయి. వారంతా మాకు కొత్త ముఖాలే. కాని ఒకే జీవితవిధానం, ఒకే జీవిత దృక్పథం, ఒకే ధ్యేయం మా అందరినీ, దేశాలు వేరయినా ఏకం చేసింది. అపరిచితుల్ని సయితం ఎన్నో యుగాల అనుబంధంతో కట్టిపడేసింది. మాకు పాకిస్తాన్ సోదరులు అందించిన నిర్మల ప్రేమాభిమానాలు, నిష్కల్మష మయిన అనురాగం మరువరానిది. ప్రతిగా ఇవ్వటానికి మా వద్ద భాష్పాంజలి తప్ప మరేముందనీ?

మేము మన్సూరా నుండి బయల్దేరే సమయంలో మౌలానా తుఫైల్ ముహమ్మద్ తదితర నాయకులు రావల్పిండిలో ఉన్నారు. వారి వద్ద సెలవు తీసుకునే భాగ్యం మాకు లభించలేదు. మన్సూరాలో ఓ వ్యాన్ అరేంజ్ చేశారు. ఎక్కి వాఘా సరిహద్దుకు తిరోన్ముఖుల మయ్యాం. వెనకాల లాహోర్ మహా పట్టణాన్ని వదిలివేస్తు మా వ్యాన్ శరవేగంగా సరిహద్దు వైపునకు పోతుంది. చెట్లతో గుమ్మటాలతో గోపురాలతో కళకళలాడే ఆ పట్టణం కేవలం పాకిస్తాన్‌కు చెందిన ఓ మహా పట్టణం కాదు. 20వ శతాబ్దంలో ఇస్లామీయ ఉద్యమ రథ సారథి మౌలానా మౌదూదీ విశ్రమిస్తున్న మహా నగరం! కంటి నుండి ప్రవహించే ధారను ఆపడం మా శక్యం కాలేదు.

వాఘావద్ద కస్టమ్స్ తతంగమంతా సునాయాసంగా ముగించుకోగలిగాము. జన్మభూమి పరిమళాలు అప్పుడే రాసాగాయి. సిక్కు సోదరులు సరిహద్దు వద్ద ఆహ్వా నించారు. భారత సరిహద్దులకు మధ్యాహ్నం12 గంటలకల్లా చేరాము. అక్కడ పెద్దక్యూ. కస్టమ్స్‌లో పెద్దహంగామా, పాకిస్తాన్‌లో స్టెయిన్‌లెస్ స్టీల్ చాలా అగువ అనీ, విదేశీ వస్తువులపై సుంకం చాలా తక్కువ అనీ, స్టీలు సామానులు, విదేశీ గడియారాలు, బట్టలు చాలా మంది తెచ్చుకుంటారు. భారత కస్టమ్స్‌లో పట్టుబడి సుంకమో ముడుపో చెల్లించుకుని పోతూవుంటారు. మేము ఎంట్రీ చేయించుకోవడానికి పోయినప్పుడు అక్కడ ఓ సర్దార్జీగారు– "క్యాఁ మౌలానా, ఆప్‌లోగ్ జమాఅతె ఇస్లామీకేహై?"అని అడిగాడు. అవునయ్యా అని చెప్పేసి కూర్చున్నాను. అయిదు నిమిషాల్లో పని ముగించి "అబ్ ఆప్ జాయియే" అని సాగనంపాడు. థ్యాంక్స్ చెప్పి కస్టమ్స్ క్లియరెన్స్ వద్దకు వచ్చే సరికి ఆ పెద్ద కుప్పలో మా పాస్‌పోర్టులు ఎటు మాయమవుతాయో అనిపిస్తోంది. ఎట్టకేలకు సాయంత్రం అయిదున్నర ప్రాంతంలో మా వంతు వచ్చింది. మా ముఖాలు చూసి, ఒక సారి మా ఎయిర్‌బ్యాగుల వైపు చూసి ఒక ఎయిర్ బ్యాగ్, ఒక సూట్‌కేస్ తెరపించి వాటిని ఓ సారి కెలికి వీటిలో ఏమీ లెవ్వకదా? అని అడిగాడు. నాకు నవ్వు వచ్చింది.

ఉన్నా ఎవడయినా ఉందని చెబుతాడేం? "ఈ పత్రికలు తప్పమరేమీ లేవు" అన్నాను కొన్ని పత్రికలు చూపి.

"సరే వెళ్ళండి" అని ముగించాడు.

బయటికి వచ్చి ఓ టాక్సి పట్టి అమృతసర్ చేరేసరికి ఏదో ట్రయిన్ రెడిగా ఉందని చెప్పారు. ఎలాగో సందు చేసుకుని ఎక్కేశాము, ఈ బాధలు ఢిల్లీ వెళ్ళే వరకు తప్పవని నిర్ణయించుకుని.

ట్రయిన్‌లో తోటి ప్రయాణీకులంతా పాకిస్తాన్ వివరాలు కుతూహలంగా అడగసాగారు. అవే అమృతమయిన పరామర్శలు, అవే స్నేహపూర్వకమయిన ప్రశ్నలు. ఎంత ప్రేమ, ఎంత స్నేహ భావం. ఉభయ దేశాల పాలకులు తమ సంకుచిత రాజకీయ దురభిమానాలను వదలి, ఉభయ దేశాల మధ్య సామరస్య సాధనకు పూనుకుంటే అలాంటి ప్రయత్నాలు ఫలించే సదవకాశాలు ఎన్నో వున్నాయి. మనసున్నచోట మార్గముంటుంది అన్నట్టు ప్రయత్నించే వాడే కావాలిగాని.....!

అందాల అండమాన్

విశ్వం విశాలమయింది దాని వైశాల్యాన్ని కాకలు తీరిన శాస్త్రజ్ఞులే అంచనా వెయ్యలేక పోతున్నారు. విశ్వ మహాసాగరంలో బిందు ప్రాయమయిన మన భూమినే మనం పూర్తిగా చూడలేకపోతున్నాము. భూగోళ వైశాల్యం లెక్కగట్టి దాదాపు 51 కోట్ల చదరపు కిలోమీటర్లని (నేల 15కోట్ల చ.కి.మీ., నీరు 36 కోట్ల చ.కీ.మీ) చెప్పుకున్నా అందులో వాస్తవంగా మనం పయనించింది, చూసింది ఎంత? సుదూర ప్రయాణాలు చేస్తే ఓహో మన దేశం, మన భూమి ఎంత విశాలమయింది! అని అబ్బుర పడతాము, సంబరపడతాము. ఇక ప్రపంచమంతా మూలమూలనా, కోన కోనన్నా తిరిగి, తిలకించి తరించడమంటే ఓ జీవితకాలం చాలదేమో అనిపిస్తుంది. అందుకే భూమిని 'విపుల' అని కూడా అంటారు! ప్రపంచమంతా తిరగడమలా ఉంచి కనీసం మనదేశంలోనే ఓగాలి దుమారంలాంటి యాత్రచేసినా కొంతయినా చూడసాధ్యమయ్యేది. కాని జీవితంలో వేనవేల కోరికలు, ఒకొక్క కోరికనే నెరవేర్చుకోవాలంటే ప్రాణాలు పోతాయంటాడు గాలిబ్ మహాకవి:

హజారోఁ ఖ్వాహిషేఁ అయిసీ
కె హర్ ఖ్వాహిష్ పె దమ్ నిక్లే

అలాగే ఎన్నో కలలు కల్లలయి పోతూ ఉంటాయి. అలాంటిదే ఓ కల నాలో అప్పుడప్పుడు అంతర్యాన్ని కెలుకుతూ ఉంటుంది. మన రాష్ట్రంలో ప్రకృతి తన అందాలను పుష్కలంగా పరిచి ఉంచిన ప్రదేశాలను తనివి తీరా చూడాలన్నదే ఆ కల... ప్చ్.. ఇంత వరకూ నెరవేరే అవకాశాల పడవలు బహుదూరాలలోనూ కానరావడం లేదు. నేను స్వయంగా వేసుకున్న బరువులు కొన్నయితే సంస్థ మోపిన భారాలు మరికొన్ని, జీవితం విధించిన ఆంక్షలు వాటన్నింటిపైనా ఇంకా కొన్ని, వెరసి, తలనెరసిపోయినా తీరని జిజ్ఞాసదాహం! అయితే తలవని తలంపులా జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు

మౌలానా అబ్దుల్ అజీజ్ తన సంస్థాగత బాధ్యతల నిర్వహణకై అండమాన్ దీవులకు వెళ్ళవలసి రావడం, ఆయన తనకు తోడుగా ఎవరయినా వస్తే బావుంటుందని కోరడం, నేనూ నా ఆరోగ్యం దృష్ట్యా ఈ దినసరి కార్యరంగానికి దూరంగా కనీసం ఓ వారమయినా గడపి వద్దామని అనుకోవడం యాధృచ్ఛికంగా జరిగాయి. అయినా కాస్త సందిగ్ధంలో పడ్డాను. ఇంట్లో చెప్పగానే ప్రప్రథమంగా మా పాప, ఆ తరువాత ఇంటిల్లిపాది అందరూ వెళ్ళిరండని ఒకే గోల. ఇంకేం ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు చకచకా చేసుకు పొయ్యాను.

అండమాన్‌ను గురించి ఆలోచించే, అధ్యయనం చేసే అవకాశం ఇంత వరకు కలగలేదు, ఆ పని ఇప్పుడు చేపట్టాను, మా లైబ్రరీలో ఉన్న గ్రంథాల ఆధారంగా కొంత వరకు అండమాన్ అంటే ఏమిటో టూకిగా తెలుసుకున్నాను. బహుశా 1965లో కాబోలు జమాఅత్ కార్యదర్శి కీ.శే. మౌలానా సయ్యిద్ హామిద్ హుసైన్ గారు ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు అండమాన్ పర్యటన జరిపారు. అప్పుడు ఆయన పడవలో పయనించి దీవులన్నీ తిరిగి తన అనుభవాలను ఎంతో మనోజ్ఞంగా 'దావత్' దినప్రతికల్లో ఓ వ్యాసావళిగా వ్రాశారు. నేడు ఆ ఫైలు చూడడమంటే పాల నదిని త్రవ్వి తీయడటమే అవుతుంది. అయితే దానికి సంబంధించిన కొన్ని ఛాయలు మటుకు జ్ఞాపకాల పొరల్లో వెదగ్గా లీలగా కనిపించాయి. వాటితో సరిపుచ్చుకుని బయల్దేరే సన్నాహాలు చేసుకున్నాను.

ప్రయాణం

ఫిబ్రవరి 11 న మద్రాసు నుంచి బయల్దేరాలని తెలిసింది. హైదరాబాద్ నుండి మద్రాసుకు 9న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ద్వారా బెర్త్ రిజర్వ్ చేయించుకున్నాను. మౌలానాగారేమో ఓ కార్యక్రమంలో పాల్గొని 10వ తారీఖున విమానంలో మదరాస్ చేరనున్నారు. జామియతుల్ హుమైరా నిర్వాహకులు రషీద్ మొహియుద్దీన్ గారు, పామర్రు నుండి నేరుగా 10న అక్కడకు చేరనున్నారు. వీలయినంతమటుకు సకల సన్నాహాలు చేసుకుని నేను ఫిబ్రవరి 9న బయల్దేరాను. సాయంత్రం 6.40 గంటలకు చార్మినార్ ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది. నా సీటుకు ప్రక్కసీటు ఓ యువతిది. ఆవిడ గారితో వాళ్ళాయన కూడా వచ్చి ట్రెయిన్ ఎక్కించి వెళ్ళారు. వెడుతూ టి.టి.ఇ. వచ్చిన తరువాత బెర్తుకై ప్రయత్నించమని, తరువాత తెల్లారుజామున నెల్లూరులో మేల్కొలిపి ట్రెయిన్ దింపమనీ నన్ను అభ్యర్థించి మరీ వెళ్ళాడు. అలాగే క్రింది బెర్తు ఇప్పించాను. నా బెర్తుకు వెళ్ళి పడుకున్నానన్న మాటేగాని ఆలోచనలన్నీ అండమాన్ యాత్రపైన్నే ముసురుకుంటున్నాయి.

మానవ భక్షకులని చెప్పబడే అక్కడి ఆదివాసులు, అక్కడి వాతావారణం, నాగరికతా సంస్కృతులు- అన్నీ ఊహాల్లోనే ఏవేవో రూపాలు ధరిస్తూ ముందుకు వస్తున్నాయి.

ఆలోచనల్లోనే కాలం గడిచింది. 11 గంటలకు నిద్రపట్టింది. అలవాటు ప్రకారం మూడున్నర గంటలకు చేతిగడియారం చేసిన అలారమ్ మోతకు మేల్కొన్నాను. కాలకృత్యాలన్నీ తీర్చుకుని అయిదు గంటలవరకు మేల్కొనే ఉన్నాను. నెల్లూరు దగ్గరపడుతోంది. నెల్లూరు దిగేవారు మేల్కొంటున్నారు. ఆ యువతినీ మేల్కొలిపాను. ఆవిడ తయారయిన తరువాత సామాను డోరుకు దగ్గర సర్దిపెట్టాను. ఆవిడ ఎంతో కృతజ్ఞతతో చేతులు జోడించి నమస్కరించింది. స్టేషన్లో వాళ్ళ తమ్ముడు వచ్చి రిసీవ్ చేసుకున్నాడు.

సాటి ప్రయాణీకునికి చేసే అతి స్వల్పయిన సహాయానికే మనిషి సంస్కారవంతుడయితే ఎంత కృతజ్ఞుడయిపోతాడు. కాని తన ఉనికికీ, తనలోని శక్తి సామర్థ్యాలకూ, తన జీవితంలో సకల సౌలభ్యాలకు, సౌకర్యాలకు కారణభూతుడయిన సృష్టికర్తను గుర్తించడంలోను, ఆయన పట్ల కృతజ్ఞతలు చెల్లించుకోవడంలోనూ మనిషి తన సంస్కారాన్ని రుజువు చేసుకోలేకపోతున్నాడేమిటి? కానరాని ప్రభువుని గుర్తించే దృష్టి మనిషికి సులువుగా లభ్యమవదనే కదా ఆ స్వామి తన సందేశహరుల్ని, తన గ్రంథాలను పంపాడు! వాటి ద్వారా మనిషికి దూరమయిన ఆలోచనా విధానాన్ని, కరవయిన అంతర్ దృష్టినీ, అవసరమయిన మార్గదర్శకత్వాన్ని అందజేసాడాయన!! వాటిని సయితం నిర్లక్ష్యం చేసే మానవుడిలో మానవత కొరవడిందని తప్ప మరేమని చెప్పగలము.

ఆరు గంటలు కావస్తున్నాయి. ఫజ్ర్ నమాజ్ చేసుకున్నాను. డెయిరీలో కొన్ని విషయాలు వ్రాసుకుని వెంటదెచ్చుకున్న పుస్తకంలోకి తలదూర్చాను. పుస్తకం నుండి చూపు కిటికీ వెలుపలికి ప్రసరించింది. ముప్పయ్యేళ్ళ క్రితం ఈ దారిగుండా తరచుగా ప్రయాణాలు సాగేవి! సదరన్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ అమ్మా నాన్నను చూడటానికి కనీసం మూడు నెల్లకోసారి అయినా బెల్లంపల్లికి రైల్లో ప్రయాణం చేసేవాణ్ణి. ఆ తరువాత ఎన్నెన్ని మలుపులు ! ఎన్నెన్ని అనుభవాలు!! అమృతతుల్యమయిన అనుభవాలతో పాటు హాలాహల మయమయిన వాటికీ కొదువలేదు.!!!– జీవితంలో – విషం!!! – ఆలోచనలు ఘనీభవించ సాగాయి, ద్రవించనూసాగాయి. అప్పుడే డెయిరీ తీసాను. భావాలు గుండెలోనుంచి చేతిగుండా పయనించి కలం ద్వారా డెయిరీ కాగితంపై పరచుకోసాగాయి. కవిత రూపు దాల్చింది. శీర్షిక "నీలకంఠి" అని వ్రాసి తృప్తిగా కళ్ళుమూసుకున్నాను.

నీలకంఠి

విషం
తేనెల విషం
తీయదనం పూసిన విషం
సౌరభ విషం

చందనం రంగరించిన విషం
విషం
అందని విషం
ఆనందాలు నింపిన విషం
ద్రాక్షల విషం
అశక్తత పులిపించిన విషం
విషం
ఆత్మీయుల విషం
ఆత్మీయత పంచిన విషం
ఆప్తుల విషం
ఆప్యాయత చిలకరించిన విషం
విషం
వైరుల విషం
వైషమ్యం కక్కిన విషం
విరోధుల విషం
వ్యతిరేకత చిందించిన విషం
ఈ కంఠంలో ఎన్నెన్ని విషాలో
ఎన్నెన్ని విషాల విషాదాలో
విషం నిండిన గళం నుండి
అమృతభాండం అందించినా
హాలాహలం నిండిన కలంనుండి
అనురాగరాగాలు వినిపించనా
చేదు నిజాలే దిగ మ్రింగి
కమ్మని కలలే పండించనా
అంతర్యంలో అలజడిని అణచి
ఆనందతాండవ మభినయించనా.

పెట్టెలో హడావిడి. గూడూరు వచ్చింది. టిఫిన్ కోసం టీ కోసం జనం ఎగబడుతున్నారు. నేనూ కాఫీ తెప్పించుకున్నాను.

మద్రాసు

9.00 కావచ్చింది. మద్రాసు పొలిమేరల్లో ప్రవేశించింది చార్మినార్ ఎక్స్‌ప్రెస్. స్టేషన్ వెలుపలికి వచ్చి, ఆటో ఎక్కి పెరంబూర్‌లో ఉన్న ఐ.ఎఫ్.టి.(ఇస్లామిక్ ఫౌండేషన్ ట్రస్టు) చేరేవరకు 10 దాటింది. ఎంతగా మారిపోయింది మద్రాసు. మద్రాసు వచ్చి



సెల్యూలర్ జెయిల్‌లో చిత్రహింసల నమూనాలు



సెల్యూలర్ జెయిల్ విహంగ వీక్షణం

పోర్ట్ బ్లెయిర్‌లో ఉర్దూ ముషాయిరా

సెల్యూలర్ జెయిల్ ఒక దృశ్యం

ఏడేళ్ళయిందేమో అంతా కొత్తగా అనిపించింది. "రిప్ వాన్ వింకిల్"లా కళ్ళప్పగించి చూడటం మొదలెట్టాను, మోర్ మార్కెట్ స్థానే కొత్త భవనం వెలిసింది. మనస్సు చివుక్కుమంది. కాని ప్రపంచంలో మార్పు అనివార్యం అని సరిపుచ్చుకున్నాను. సామాను గెస్టురూములోకి పంపించి నేరుగా జమీల్ భాయ్ చాంబర్లోకి వెళ్ళాను. అప్పటికే రషీద్గారు వచ్చి..... టిఫిన్ చేసి తాపిగా కబుర్లలో మునిగి తేలియాడుతున్నారు.

అరగంట వారితో గడిపి రూములోకి వచ్చాను. టిఫిన్ ముగించుకుని ఐ.యఫ్.టి ప్రచురించిన కొత్తపుస్తకాలు, ప్రచురణా కార్యక్రమాలు జమీల్ భాయ్తో చర్చించాను. గీటురాయి మాసపత్రిక టైటిల్ మదరాసులోనే ప్రింటవుతుంది. గనక ఆ విషయాలేవో కొన్ని చర్చించడం జరిగింది. అంతలోనే మౌలానా అబ్దుల్ అజీజ్గారు మీనంబాకం నుంచి వచ్చారు. కుశల ప్రశ్నలు. మౌలానా గారి టిఫిన్ ముగిసిన తరువాత రేపు వెళ్ళనున్న అండమాన్ ఫ్లయిట్ టికెట్ దాని లెక్కలు గట్రా చూసుకున్నాము. ఉదయం 6.30గంటలకు ఫ్లయిట్ కనీసం 5.30కు ఎయిర్ పోర్టులో రిపోర్ట్ చెయ్యాలి. అంటే ఉదయం 3.30 గంటలకు మేల్కొంటేగాని కార్యక్రమం సక్రమంగా సాగదన్నమాట.

మధ్యాహ్నం తమిళనాడు జమాఅతె ఇస్లామీ హింద్ అమీరె హల్కా అబ్దుర్రకీబ్ గారు, మదరాసు నగర స్థానిక అమీర్ సయ్యద్ రియాజుల్ హక్గారు వచ్చారు. సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలను గురించి, అండమాన్లో జమాఅత్ కార్యకలాపాలను గురించి మాట్లాడుకున్నాము. ఈ పర్యటనలో రాష్ట్ర జమాఅత్ శాఖ తరపున అమీరె హల్కా లేదా మరో బాధ్యులయిన వారు, ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్ అజీజ్తో పాటు పాల్గొనవలసింది. కాని కారణాంతరాలవల్ల సాధ్యపడటంలేదని తెలిసింది సాయంత్రం సింగపూర్లో ఇస్లామీయ ఉద్యమ కార్యకర్త సోదరి డా. ఆయిషా దగ్గరినుండి ఫోను వచ్చింది. లోగడ ఆవిడ హైదరాబాద్ వచ్చినప్పుడు గీటురాయి ఆతిధ్యం స్వీకరించి హైదరాబాద్లో మహిళా కార్యకర్తలతో పాటు కొంత కాలం గడిపి ఉన్నారు. ఆ చొరవతోనే ఈ టెలిఫోన్ కాల్. తనకూ మా పర్యటన గురించి తెలిసిందని పర్యటన ముగించుకుని తిరిగి వచ్చినప్పుడు అంటే 18వ తేదిన ఐ.ఎఫ్.టి.కి వచ్చి కలసుకుంటానని పర్యటనా వివరాలు తెలుసుకుంటానని డా.ఆయిషా చెప్పారు.

స్ఫూర్తినివ్వగల మహిళలు

నిజానికి డా.ఆయిషాని నేను పూర్వం ఎరుగను. కాని ధార్మిక కార్యకలాపాల వల్ల సింగపూర్లో ఉంటున్న డా.ఆయిషాకు గీటురాయి ద్వారా నేను పరిచయమయ్యాను. చిత్తూరుకు చెందిన డా.ఆయిషా ఇస్లాం అధ్యయనం చేసి ఎప్పుడో ముస్లిమయ్యారు. జీవనోపాధి కారణంగా సింగపూర్లో స్థిరపడిన తల్లిదండ్రులతో ఉంటూ అక్కడ తమిళుడయిన ఓ ఆడిటర్ని పెళ్ళి చేసుకున్నారు. భార్యాభర్తలిద్దరూ సింగపూర్లో ధార్మిక

కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. డా. ఆయిషా పాదరస గుణంగల మహిళ, నిత్యం చలన ప్రధానమయిన జీవితం ఆవిడదీ. ఎక్కడున్నా మనిషికి సత్యమార్గాన్ని చూపాలన్న తహ తహ ఆమె మాటల్లో చేతల్లో కొట్టవచ్చినట్టు కానవస్తుంది. ఇప్పుడు తన చుట్టాలను, భర్త తరపు వారినీ, స్నేహితుల్ని, తెలిసిన వారినీ కలుసుకోవాలని మద్రాసుకు వచ్చి ఉన్నారు.

మద్రాసులో ఉన్నంతకాలం ఆమె ఓ సిసలయిన కార్యకర్తలా అనునిత్యం ఇస్లామీయ జీవన మార్గాన్ని ఆటో డ్రైవర్ మొదలుకుని అరిస్టోక్రేట్‌ల వరకు అందరికీ పరిచయం చేస్తూ ఉంటారు. నిద్రాణమయి ఉన్న ముస్లిం మహిళలకు ఆమె జీవితం ఓ మేల్కొలుపు లాంటిది. ఆమె ద్వారా స్ఫూర్తిని పొందలేకపోతే అది మన దురదృష్టం మటుకేనని చెప్పగలను. ఆవిడద్వారా గీటురాయి అనేక మందికి పరిచయమయింది. సింగపూర్‌కు 19న వాపసు వెళ్తున్న కారణంగా 18 న కలుసుకుని అనేక విషయాలు మాట్లాడుకోవచ్చని సోదరి ఆయిషా చెప్పారు. నా ఆనందానికి మరో కారణం ఏమిటంటే గీటురాయికి చిరపరిచుతురాలయిన శ్రీమతి మాలతీ చెందూర్‌తో డా.ఆయిషాకు బాగా పరిచయ ముంది.

నా అండమాన్ పర్యటనకు పూర్వం శ్రీమతి చెందూర్‌ని కలుసుకోవడానికి వ్యవధి లేకపోయినా కనీసం ఫోనులో మాట్లాడాలనుకున్నా వీలుపడలేదు. ఆవిడగారు ఎప్పటిలానే తీరిక లేకుండా ఏవో కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్ళారు. నాకు నచ్చిన రచయితలు, రచయిత్రుల్లో శ్రీమతి చెందూర్ కూడా ఉన్నారు. ఆవిడగారు నన్ను ప్రభావితమూ చేశారు, ప్రోత్సాహమూ ఇచ్చారు. డా. ఆయిషా, శ్రీమతి చెందూర్‌ని కలుసుకున్నట్లు, ఆవిడ గారికి ఓ పని అప్పజెప్పినట్లు చెప్పారు. నాకు మహదానందమయింది.

అప్పుడే చీకటిపడింది. రేపు (11.2.92) తెల్లవారుజామున అండమాన్ యాత్ర ప్రారంభం. అండమాన్‌కు చెందిన శ్రీ హమ్‌జా మమ్మల్ని కలుసుకోవడానికి వచ్చారు. ఆయన కేరళలోని ఇస్లామీయ కాలేజి, శాంతపురంలో లెక్చరర్. అండమాన్, స్టివర్ట్ గంజ్‌లో తన తమ్ముడు మూసాను కలసుకుని తమ తల్లి క్షేమ సమాచారం అందజెయ్య మన్నారు. జమీల్ భాయ్ యేమో, మౌలానా అబ్దుల్ అజీజ్‌కు అండమాన్ దీవుల్లో జమాఅత్ కార్యకలాపాలను గురించి చెబుతున్నారు. (జమాఅత్ సంస్థాగత వ్యవస్థ ప్రకారం అండమాన్ దీవుల్లో జమాఅత్ కార్యకలాపాలకు తమిళనాడు హల్కా బాధ్యత వహించాలి.) అకస్మాత్తుగా ఆయన నా వైపునకు తిరిగి, “మీరూ వస్తున్నారని ముహమ్మద్ అలీకి తెలిపాను. అక్కడ మీ ప్రోగ్రాం కూడా ఏదయినా ఏర్పాటు చేసి ఉంటారు” అన్నారు. ప్రోగ్రామ్ వివరాలు

పోస్టుద్వారా తెలిపానని ముహమ్మద్ అలీగారు ఫోనులో జమీల్ భాయితో చెప్పారట. వారం గడచిపోయినా అవి అందలేదు. తపాల విభాగం ఎంత తాపీగా పనిచేస్తోందో బోధపడింది.

❖ ❖ ❖

గగన యానం

తెల్లవారు మూడున్నర గంటలకు నిద్ర లేచి, తయారయి ఐ.ఎఫ్.టి. ఆటోలో మీనంబాకం చేరుకున్నాము. బోర్డింగ్ లాంఛనాలు పూర్తి చేసుకునేటప్పటికి ఫజ్ర్ నమాజ్ వేళయింది. ఎయిర్ పోర్ట్ లాంజ్‌లోనే ఓ మూలన నమాజ్ చేసుకున్నాము. మౌలానా అబ్దుల్ అజీజ్, రషీద్ మొహియుద్దీన్, నేను, ఐ.ఎఫ్.టి. కార్యకర్తలు లుత్ఫుల్లా, అష్రఫ్‌లు అందరం కలసి నమాజ్ చేసుకున్న తరువాత ఐ.ఎఫ్.టి కార్యకర్తల్ని సాగనంపాము. 6 గంటల 20 నిముషాలకు ఫ్లయిటెక్కాము. మద్రాసులో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల మాదిరిగా విమానంలోకి నేరుగా ఎక్కే ప్లాట్ ఫారం ఉంది. మన హైదరాబాద్‌లోనయితే మైదానంలో నడిచి వెళ్ళి విమానం ఎక్కవలసి ఉంటుంది.

ఇంకా హాలులో నడుస్తున్నామని అనుకునే లోగానే విమాన ద్వారం వచ్చేస్తుంది! సరిగ్గా ఆరున్నర గంటలకు ఐసి 549 విమానం బయలుదేరే ముందు రెడ్డిగారు విమాన చాలకులని ప్రకటన చేసింది విమాన సిబ్బంది. రెడ్డిగారి ఇనీషియల్స్ ఇప్పుడు జ్ఞాపకం రావడం లేదు. మేము ముగ్గురం ప్రక్క ప్రక్కన కూర్చున్నాము. మౌలానా గారు నాకు కిటికి ప్రక్క సీటు ఇచ్చి తాను మధ్య సీటులో కూర్చున్నారు. విమానం కొన్ని క్షణాల్లోనే మద్రాసు మహానగరంలోని ఆకాశహర్మ్యాలను బొమ్మరిండ్లల్లా చూపిస్తూ సాగర తీరాన్ని దాటింది. సముద్రం మీదే ప్రయాణమయినా క్రమేణ సముద్రపు ముద్ర కనుమరుగవ సాగింది. విమాన సిబ్బంది రక్షణ పరికరాలను గురించి వివరించసాగారు. ఆక్సిజన్‌ను గురించి, ఎయిర్ జాకెట్ గురించి అంతర్జాతీయ నిబంధనల ననుసరించి ప్రయాణీకులకు బోధించారు. ముందు పోచ్‌లో ఆంధ్రప్రభ దినపత్రిక కానవచ్చింది. అండమాన్ ప్రయాణీకుల్లో తెలుగువారి శాతం అధికమేనన్నమాట! లోగడ నేల మీదుగా విమానయానం చేసినా సముద్రం మీదుగా చెయ్యడం ఇదే తొలుత గనక ఆ అనుభూతి ఎంతో అపురూప మనిపించింది. బయటి దృశ్యంలో ఏమీ లేకపోయినా అదో కొత్త అనుభూతి అనే చెప్పగలను. కిటికి గుండా క్రిందికి చూస్తే మేఘాలు, మేఘాల క్రింద నీటి సముద్రం. పైకి చూసినా వినీలాకాశమే. అయితే రంగుల్లో తేడా కొంత కానవచ్చింది. సముద్రం ఊదా (Blue) రంగుపైన పొగమంచు కప్పినట్టు అగుపిస్తే ఆకాశమేమో (Purple Green).

పై పొగమంచు కప్పినట్టు అగుపిస్తోంది. అవి రెండూ కలిసేచోట క్షితిజాన ఆకాశం వైపునకు ప్రాకుతున్న వెలుగు రేఖలు. సముద్రంలో వాటి ప్రతిబింబం- చూడవలసిందేగాని వర్ణించవీలవదు! క్రిందో ఆకాశమయితే పైన మరో ఆకాశం! చూడగానే నాకు వచ్చిన ఆలోచన అది!! మేఘాల మధ్య తేలియాడే అనుభూతిని దీనితో జోడించుకుంటే.........

అకస్మాత్తుగా నిన్న రైల్లో ప్రయాణం గుర్తుకువచ్చింది. తెలతెలవారుతుండగా ప్రత్యూష పవనాల మధ్య తూర్పు తట్టున వెలుగు రేఖలు గుర్తుకు వచ్చాయి. అప్పుడు 'నీలకంఠి' వ్రాయడమూ గుర్తుకు వచ్చింది...............

'హో.........! ' అప్రయత్నంగా ఓ దీర్ఘమయిన నిట్టూర్పు వెడలింది.

'ఏమిటి?'..... ప్రశ్నించారు మౌలానా అజీజ్, 'టిఫిన్ వస్తోంది. ఆలోచనలు మాని షెల్ఫ్ తీసుకో' అన్నారాయన. విజిటేరియన్ టిఫిన్ ఆర్డర్ చేశాము. టిఫిన్ చేస్తున్నంత సేపు బయటి దృశ్యమే నా మనస్సులో మెదులుతూ ఉండింది. దాన్ని ఎలాగయినా కుంచె కందించాలని సంకల్పించుకున్నాను. కాఫి సిప్ చేస్తూ మౌలానా గారితో 'సముద్రం మీదుగా విమానయానం..... మహదానందంగా ఉందండి' అన్నాను.

'సముద్రంలో ద్వీపాలుంటే మరింత ముచ్చటగా ఉంటుంది' బహుదేశాలు పలుసార్లు పర్యటించిన మౌలానా అజీజ్ అన్నారు గతస్మృతుల ఆనందం ఉట్టిపడగా. కాఫి ముగిశాక పాకెట్ డెయిరీ తీసి బయటి దృశ్యాన్ని స్కెచ్ వేసి భద్రం చేసుకున్నాను. నా ఈ చర్యకు నాకే నవ్వు వచ్చింది. స్కెచ్ వేసుకోలేక పోతే ఆ దృశ్యం నా స్మృతి పుటల్లో నుంచి మాయమవుతుందా?

అంతర్మథనం

బంగాళాఖాతం మీదుగా మద్రాసునుంచి తూర్పు దిశగా దాదాపు 1200 కి.మీ. ప్రయాణం రెండు గంటలు సాగుతుంది. అదే నావ ద్వారా వెళ్ళాలంటే, మంచి నావ అయితే మూడు రోజులు, పాత నావయితే అయిదారు రోజులు పట్టే సందర్భాలూ ఉన్నాయట. ఈ బంగాళాఖాతంలోనే నవంబరు, మే మాసాల్లో తుఫానులు చెలరేగి భారత కోస్తా ప్రాంతాన్ని ముఖ్యంగా ఇటు తమిళనాడు ఆంధ్ర, అటు బంగ్లాదేశ్ తీరప్రాంతాలను నీట ముంచేస్తుంటాయి. వీటి వల్ల అపార ధన ప్రాణనష్టం ప్రతి ఏటా జరుగుతూనే ఉంటుంది. 1977లో వచ్చిన ఉప్పెన మూలంగా ఆంధ్ర దివిసీమ ప్రాంతం జలమయమయి ఎనలేని ధన, ధాన్య, పశు, మానవ నష్టం సంభవించింది. ఆ బంగాళా ఖాతం నేడు ఎంత ప్రశాంతంగా అగుపిస్తోంది! కాని వాస్తవంగా సాగరతీరాన ఎన్ని అలలూ అలజడులూ లేస్తున్నాయో! దూరాన ఆకాశాన ఎగురుతూ చూస్తే అగుపడుతాయా? మానవ అంతరంగం కూడా మహా సాగరంలాంటిదే. అందులో ఏర్పడే భావావేశాల

ఉత్తుంగ తరంగాల తాకిడికి మనిషి మానస నావ ఎంత అతలాకుతలమవుతూ ఉంటుందో ఎవరెరిగారు? బాహ్యంలో చూసేవారికి అంతా ప్రశాంతతే గోచరిస్తుంది. ఎదుటివాడి గుండెల్లోకి తొంగిచూసే సమయం, సామర్థ్యం, అగత్యం, అవకాశం ఎవరికున్నాయి? ఈ భావాలు అలా, అలా పదాల రూపం ధరించసాగాయి. డెయిరీలో పొందుపరచుకున్నాను.

'అంతర్మథనం'

ధర్మపీఠం కక్షకట్టి
న్యాయదేవతకు శిలువ వేస్తే...
మూఢరేయితో పోరు సలపక
సత్యదీపిక ఆరిపోతే..
మనసు చేసే మూగ రోదన
ఎన్ని చెవులకు సోకుతుంది?
ఎన్ని ఎదలను కుదుపుతుంది??
లేమి కడలిలో మునిగితేలుతు
కాలపడవను పట్టలేక
అలల ఎత్తుకు ఎదగలేక
దూరతీరం ఈదలేక
బ్రతుకు పెట్టే ఆర్తనాదం
ఎన్ని చెవులకు సోకుతుంది?
ఎన్ని ఎదలను కుదుపుతుంది??
నీతిమాటలు - నీటిమూటలు
మంచినడవడి - పాత ఉరవడి
స్వార్థప్రీతియె త్యాగనిరతి
తన్ను మించిన ధర్మమేది
మనిషి వేసే పిల్లిమొగ్గలు
ఎన్నిచూపులకానుతాయి
ఎన్ని ఎదలను కుదుపుతాయి.

దర్శనీయ నిదర్శనాలు
ముందుకువచ్చిన చూడలేక
విశ్వప్రభువును కానలేక
సత్యధర్మం ఎరుగలేక
మనిషి త్రొక్కే ప్రక్కదారులు
ఎన్ని చూపుల కానుతాయి.
ఎన్ని ఎదలను కుదుపుతాయి.

ముఖ్య భూమికి దూరంగా.......

మరో కొన్ని నిముషాల్లో పోర్ట్‌బ్లెయిర్‌లో విమానం దిగబోతోందని హెచ్చరించి బయట పోర్ట్‌బ్లెయిర్‌లో వాతావరణ వివరాలు తెలుపుతూ సేఫ్టీ బెల్టులు బిగించుకోవాలని ప్రకటించారు విమాన సిబ్బంది. క్రిందికి చూస్తే పచ్చటి ద్వీపం వంకలు తిరుగుతూ కానవచ్చింది. తీరంలోని సముద్రం నీటి రంగు కూడా ఆకు పచ్చగానే ఉంది. క్రమేణ ద్వీపం అందులో పోకచెట్ల గుబుర్లు దగ్గరవసాగాయి. బిల్డింగులపై నుంచి ఎగురుతూ విమానం విమానాశ్రయంలో ప్రవేశించింది. పెద్ద రోదన చేస్తూ విమానం లేండయింది. అయిదు నిముషాల్లో అంతా క్రిందికి దిగి అక్కడ సిద్ధంగా ఉన్న వ్యాను వైపునకు నడువసాగారు. ముందు సీట్లల్లో ఉన్నందువల్ల తొలి ట్రిప్పు లోనే మేము వ్యానులో ఎయిర్ పోర్టు లాంజికి చేరుకున్నాము. మా స్వాగతానికి ముహమ్మద్ అలీగారితో పాటు నలుగురయిదుగురు జమాఅత్ కార్యకర్తలు ఎదురయ్యారు. సలాములు. యోగక్షేమా లయ్యాయి. లాంజిలో కూర్చోగానే సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు ముహమ్మద్ అలీగారిని మమ్మల్నందరి గురించి అడిగి తెలుసుకోవడం కనిపించింది. నేనూ మౌలానాగారు ఒకరినొకరం చూసుకుని నవ్వుకున్నాము. లగేజి వచ్చేవరకు పది నిముషాలు గడిచాయి. లగేజి తీసుకుని టాక్సీ నెక్కాము.

'ఎక్కడికి?' టాక్సిలో కూర్చోగానే నా ప్రశ్న ముహమ్మద్ అలిగారితో.

'మేమెక్కడికి తీసుకు వెడితే అక్కడికే......' చిరునవ్వుతో సమాధానం.

'మేము మీ అధీనంలో ఉన్నాము, ఎక్కడికయినా తీసుకు వెళ్ళండి......'

టాక్సీలు కొండల మధ్య, లోయల్లో మెలికదారుల వెంట ఎంతో ఆహ్లాదకరమయిన వాతావరణంలో దూసుకుపోతూనే ఉన్నాయి. బజారు, ఇండ్లను వెనక్కి పంపి మెట్ట పల్లాలు దాటి సముద్రంపై దాదాపు ఓ ఫర్లాంగు పొడవు వంతెన పైకి వచ్చాయి టాక్సీలు. వంతెనల ఆవల 'చాట్టం' టింబర్ ఫ్యాక్టరి. ఈ ఫ్యాక్టరీ ఆసియాలోని పెద్ద ఫ్యాక్టరీల్లో

ఒకటట. మౌలానా గారు ముహమ్మద్ అలిగారితో ప్రోగ్రాం విశేషాలు అడుగుతున్నారు. సంభాషణ అంతా ఉర్దూలోనే జరుగుతోంది. చాట్టంలో టాక్సీ దిగి బోటు కోసం నిరీక్షిస్తు న్నాము.

'అరగంటలో బోటు వస్తుంది. దాటి ఆవల వైపున...... అదో ఆ కనిపిస్తున్న గట్టుకు- బంబూ ఫ్లేట్ - వెళ్ళాలి, 10 నిముషాల ప్రయాణం' చెప్పారు ముహమ్మద్ అలి. వచ్చిన మిత్రులతో పరిచయాలు జరుగుతున్నాయి.

'ఈయన మజీద్ గారు- జమాఅత్ సభ్యులు'

'వీరు, మూసా.....'

'హమ్జా గారి తమ్ముడా?' అడిగాను.

'అవును, శాంతపురంలో లెక్చరర్‌గా పనిచేస్తున్న హమ్జా..... మీకు తెలుసా?'

'మీ అన్నయ్య, నిన్ననే కలిసారు.' హమ్జా చెప్పిన సమాచారం అందజేశాను. వాళ్ళమ్మకు ఇప్పుడు ఫరవాలేదు, కోలుకుంటోందన్న విషయం తెలుసుకుని మూసా ముఖాన సంతోషం, తృప్తి కానవచ్చాయి, బోటు కోసం నిరీక్షిస్తూ కూచున్న చోట కొందరు మహిళలు కూర్చుని ఉన్నారు. వాళ్ళ మాటల్ని గమనించినట్టుంది మౌలానా అబ్దుల్ అజీజ్, నాతో - ' వీరు తెలుగువారు- మీ వాళ్ళే' అని నవ్వారు. ఆయనే వారితో మాట కలుపుకుని, 'మేము ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చాము. తెలుగువాళ్ళం....'

'అలాగా?...... ' అన్నారు వారు కాస్త మొహమాటంతో మరి కాస్త సిగ్గు పడుతూ.

'మీది ఏ ప్రాంతం........?' మళ్ళీ అడిగారు మౌలానా.

'విశాఖపట్నం జిల్లా......' చెప్పారు వారు.

'మేము హైదరాబాద్ నుంచి వచ్చాము. ఈయనేమో కృష్ణా జిల్లా......' రషీద్ గారిని చూపిస్తూ అన్నారాయన.

'తెలుగువారు చాలామంది ఉన్నారా?' అని నేనడిగిన దానికి ముహమ్మద్ అలిగారు, 'హార్బరులో, పోర్ట్‌బ్లెయిర్‌లో చాలా మందే ఉన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ ఉన్నారు. బహుశా నాల్గోస్థానంలో ఉన్నారనుకుంటా' అన్నారాయన.

కోడ్ వర్డు

బోటు వచ్చింది. ఎక్కాము. చుట్టూ కొండల్లా ద్వీపాలు. ద్వీపాల్లో కొండలు. కొండలనిండా గుబురుగా పచ్చని చెట్లు, బోటు నిండా ఆడ, మగా, కూలి పనిచేసేవారు, దుకాణదారులు, ఉద్యోగులు, అంతా కలిసి ప్రయాణం చేస్తున్నారు. లోకల్ ట్రెయిన్‌లో మాదిరిగా, సిటీ బస్సుల్లో మాదిరిగా ! మాకు ముందు సీట్లో కూర్చున్నవారు అనేకమంది

తెలుగు వారే. ప్రక్కన పలకరించినా తెలుగు వారే. ఇంకా అనేకచోట్ల నుంచి తెలుగు ఉర్దూ మిళితమయిన సంభాషణ వినవస్తోంది. ఆశ్చర్యం వేసింది, తెలుగు వారింత మంది ఉన్నారా?! అదే మాట అడిగాను ముహమ్మద్ అలిని.

'ముందే చెప్పాగా. తెలుగువారు బాగానే ఉన్నారని ' గుర్తు చేశాడతను.

'మరి మీకూ తెలుగు అర్ధమవుతుందనుకుంటా' తెలుగులో అడిగా.

చిరునవ్వే సమాధానంగా - 'కొంచెం కొంచెం' అన్నాడతను.

ముహమ్మద్ అలి మలయాళీ. అతను నాకు కనీసం పన్నెండేళ్ళుగా పరిచయం. వాళ్ళ నాన్నను మోపళా ఉద్యమంలో(1942) పట్టుకుని తొలుత బళ్ళారి జైల్లోనూ ఆ తరువాత అండమాన్‌లో పడేశారు. జైలునుంచి విడుదలయిన తరువాత ఆయన అక్కడే స్థిరపడాలని నిశ్చయించుకున్నాడు. అలాంటి అనేక కుటుంబాలక్కడ ఉన్నాయి. ఉన్న మలయాళీ కుంటుంబాలలో అధికాంశం మోపళా ఉద్యమంలో పట్టుబడి తెల్లదొరల ఆగ్రహాన్ని ఆహ్వానించిన వారే అంటే అతిశయోక్తి కాదు. పన్నెండు నిముషాల్లో బోటు తీరం చేరింది. దాన్ని బంబూఫ్లేట్ అనంటారు. ద్వీపాలనిండా నిండుగా కొండలే గనక మైదానాలు చాలా తక్కువ. బంబూఫ్లేట్ (Bamboo Flat) కూడా అంతే. పచ్చని కొండల మధ్య కర్ర పలకలతో చేసిన ఇండ్లు ఎంతో రోమాంటిగ్గా అగుపిస్తాయి. బోటు దిగి బయటికి రాగానే టాక్సీలు రెడీగా ఉన్నాయి. బస్సులూ ఉన్నాయి. మేమంతా మళ్ళీ టాక్సీలే ఎక్కాము.

'వింబర్లిగంజ్' అన్నాడు ముహమ్మద్ అలి టాక్సీలో కూర్చోగానే,. ఏదో కోడ్‌వర్డ్‌లా.

"అదేమిటి?"

"మనం వెళ్ళేవూరు"

"ఊరా?"

"అవును. ఇది బంబూఫ్లేట్. దారిలో టాపుబస్తీ ఆపైన స్టీవర్ట్ గంజ్. ఆ తరువాత వచ్చేదే వింబర్లీ గంజ్!" చెప్పాడు ముహమ్మద్ అలి.

"ఓహో, ఎన్ని మైళ్ళేమిటి?" ఇంకా ఎంత ప్రయాణమో అని భయంగా అడిగాన్నేను.

"మొత్తం మూడు కిలో మీటర్లు" నవ్వుతూ బదులిచ్చాడు అలి.

"సరే......." ఏదో అడగ బోయాను. దారి ప్రక్కన చూస్తే ఓ ఎత్తయిన ప్రదేశంలో బాల బాలికలు యూనిఫాం ధరించి.... బహుశా మాణింగ్ అసెంబ్లీ కాబోలు.....

"ఇది ఒకప్పుడు మళయాళీ స్కూలు. నేడు తెలుగు స్కూలు" చెప్పాడు నిట్టూర్చుతూ అలి.

"అదేం?" ఆశ్చర్యంగా అడిగాను.

"ప్రప్రథమంలో తమ మాతృభాషలో పాఠశాలలు ప్రారంభించింది మళయాళీలే, అంతకు పూర్వం అన్నీ ఉర్దూ పాఠశాలలే. తరువాత్తరువాత అందరూ మాతృభాషలో పాఠశాలలు మొదలు పెట్టుకున్నారు" వివరించాడు అలి.

"వీరు ముస్లిం బాలికల్లా ఉన్నారే...." అన్నాను కొందరు స్కూలుకు పోతున్న బాలికలు దారిలో కనిపిస్తే. వారు మోచేతులు క్రిందుగా చేతులున్న కమీసులు, తలనిండుగా కప్పుకున్న ఓణిలతో తెల్లషల్వారులు ధరించి కనిపించారు.

"అవును, వారందరూ దాదాపు మళయాళీలే"

అంతలోనే టాక్సీలాగాయి. చుట్టూ చూసాను. దాదాపు ఊరు చివరన మస్జిద్ బాగుంది. ఎదురుగా రెండిళ్ళు కుడిప్రక్కన రెండిళ్ళున్నాయి.

"దిగండి, ఇదే మన బస" అన్నారు రషీద్ గారు. క్రిందికి దిగాము. సామానులన్నీ కార్యకర్తలు ఒక్కొరొక్కరే తీసుకుని లోనికి వెళుతున్నారు.

మస్జిద్‌లో ఓ భాగాన తెరకట్టి మా బస ఏర్పాటు చేశారు. ఇతర అవసరాలన్నింటికి దిగువ సౌలభ్యాలున్నాయి. క్రింధి మాళిగలోనే మదరసా (ధార్మిక పాఠశాల) కూడా ఉంది.

బసలో కూర్చున్నాము. చక్కగా సన్నగా అల్లిన ప్లాస్టిక్ చాపలు పరచి వాటిపై పడకలు వేశారు. సామానులు ఓ ప్రక్కన సర్ది పడకలపైనే కూర్చున్నాము. వచ్చిన మిత్రులు కూడా మాతోపాటే కూర్చున్న తరువాత పరిచయాలు ప్రారంభమయ్యాయి.

"వీరు ఖాలిద్. జమాఅత్ సభ్యులు. ఇస్లాహియా కాలేజిలో పట్టభద్రులు. ఇక్కడ పాఠశాల నిర్వహణ. మస్జిద్ ఇమామత్ వారి బాధ్యత..."

"ఇప్పుడు మీ సేవచేసే భాగ్యం కూడా నాకేదక్కింది...." అన్నాడు ఖాలిద్ చిరునవ్వుతో "అది మాకు మహాభాగ్యం, మీ వంటి పండితుల సహచర్యం లభించడం" అన్నారు మౌలానా అబ్దుల్ అజీజ్. అందరం నవ్వుకున్నాము.

"అబ్దుర్రషీద్- జమాఅత్ కార్యకర్త.."

"వీరు కె.సి. ముహమ్మద్ అలి....." కారునన్నటి ఆసామి. ఊదితే పడిపోతాడేమో అనేలా ఉన్నాడు..........మా వెల్ఫేర్ సొసైటి అకౌంటెంటు. "వీరేమో పి.కె., ఇతను కె.సి..- ఇద్దరూ ముహమ్మద్ అలీలే !" అన్న నామాటలకు అందరు నవ్వుకున్నారు.

తొలి తెలుగు ప్రసంగం

క్రిందికి వెళ్ళి మదరసా లైబ్రరీ, రీడింగ్ రూము అన్నీ పరిశీలించాము. ఆ స్థలానికి తగ్గట్టుగానే ఉన్నాయి. ఇస్లామిక్ కేసెట్ సెంటర్ అధినేతగా, జామియతుల్ హుమైరా అధినేతగా రషీద్‌గారు లైబ్రరీలని కేసెట్లను గురించి మదరసాను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మదరసాలో దాదాపు 200 మంది బాలబాలికలు ధార్మిక విద్యనభ్యసిస్తున్నారు. వారు మదరసా ముగించుకుని సాధారణ పాఠశాలలకు కూడా వెడతారు.

ఆ తరువాత అండమాన్ దీవుల్లో పర్యటన కార్యక్రమాలు తుది రూపు నివ్వడానికి కూర్చున్నాము. "ఈ వేళ రాత్రి 6.30 గంటలకు మన పంచాయతీ గ్రౌండులో 'మత సామరస్యం' అన్న విషయం పైన ఓ బహిరంగ సభ, మలిక్ గారు తెలుగులో మాట్లాడాలి" అన్నారు ముహమ్మద్ అలి "రాత్రి 6.30 గంటలేమిటీ" అన్న నా ప్రశ్నకు, " ఇక్కడ మధ్యాహ్నం 12 గంటలకు జుహర్ నమాజ్, మూడున్నరకు అస్ర్, అయిదున్నరకు మగ్‌రిబ్ (సూర్యాస్తమయం) నమాజ్‌లు జరుగుతాయి....." వివరించారు ముహమ్మద్ అలి. నోరు వెళ్ళబెట్టడం నాపనయింది....... మధ్యాహ్నం భోజనాలయ్యాక "మిమ్మల్ని కలుసు కోవడానికి కొందరు వస్తున్నారిక్కడికి" తెలిపాడు ముహమ్మద్ అలి. ఇక్కడెవరబ్బా నన్ను కలుసుకునేవారు? అనుకుంటూ ఆశ్చర్య పడేలోపలే తిరిగి చెప్పాడు,"మీ తెలుగువారు"! అని, "అలాగా, బావుంది, కలుసుకుందాము" అన్నాను సంతోషంగా.

రెండున్నర గంటలకు వారు వచ్చారు. పరిచయాలయ్యాయి. టీ తాగాము. అనకాపల్లికి చెందిన వారు రెండు తరాలుగా ఇక్కడే సెటిలయ్యారు. చిన్న చిన్న వ్యాపారాలు, పి. డబ్ల్యుడిలో కంట్రాక్టు లేదా చిన్న ఉద్యోగాలు చేసేవారు. భాషపూర్తిగా మారకపోయినా యాస మారిపోయింది. హింది కాస్త మిళితమయినట్లు అనిపించింది. బ్రతుకు తెరువు కోసం వచ్చిన వారికి ఇదే సొంత ఊరయిపోయింది. సాయంత్రం వెంకట్రావుగారింటికి వెళ్ళాను. వాళ్ళ అయిదేళ్ళ బాబు సగం హింది సగం తెలుగు కలిపి మాట్లాడుతున్నాడు. స్కూలు లోనూ హిందే చదువుతున్నాడట. ఆ సాయంత్రం అలా తిరుగుతూ సుబ్బారావనే మరో మిత్రునితో అలా తెలుగు వాళ్ళుంటున్న వీధికి వెళ్ళాము. అక్కడి వారు కూడా అధికాంశం అనకాపల్లికి చెందినవారే. అక్కడ రామాలయంలో కూర్చొని మాట్లాడుకున్నాము.

❖ ❖ ❖

సామరస్యానికి ప్రతీక

అండమాన్‌లో నివసించే విభిన్న భాషా వర్గాల ప్రస్తావన వచ్చింది. "మేము పేపర్లల్లో అప్పుడప్పుడు చదువుతూ ఉంటాము. హైదరాబాద్‌లో మతకల్లోలాలు జరుగుతున్నాయని. మాకు చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడ దేశంలోని విభిన్న భాషలు మాట్లాడేవారు ఉన్నారు. మేమంతా కలసి మెలసి ఉంటాము. ఇప్పుడయితే మా అందరికీ మా భాషల్లో స్కూళ్ళు ఉన్నాయి. అయినప్పటికీ మా మధ్య ఎప్పుడూ భాషగాని, మతంగాని, కులంగాని తగువుకు కారణం కాలేదు" అన్నారు సుబ్బారావు. రామాలయం కమిటీ ప్రెసిడెంటాయన.

'అసంపూర్ణ గీతం'

ప్రేమే కరవాయెవా
నా ప్రియతమ దేశంలో
కలతలు బాపి మమతలు పెంచే
చీకటి బ్రతుకులో వెలుగులు నింపె
బాధలు వికటించెనా
మనసులు వెగటాయెనా...నా ప్రియతమ దేశంలో
మత మత్తేభం, కులశార్దూలం
భాషా రాక్షసి ప్రాంతపిశాచం
ప్రేమను చీల్చేసెనా
శాంతిని కబళించెనా.... నా ప్రియతమ దేశంలో....
విలువలు మరచి, ప్రగతి గడించి
విగతిని తెచ్చి పొందిందేమిటి
స్వార్థమె గురిఆయెనా
తొలి మెట్టు కడదాయెనా.... నా ప్రియతమ దేశంలో.

కొండలూ, లోయల మధ్య ఎన్ని ఎత్తుపల్లాలున్నా వాతావరణం హాయిగా ఆహ్లాదకరంగా, ఆరోగ్యదాయకంగా ఉంది. ఇక్కడి బాహ్య వాతావరణంలానే సామాజిక వాతావరణంకూడా ప్రేమపూర్వకంగా, సానుభూతిమయంగా, ఆనందదాయకంగా ఉంది.

"మన రాష్ట్ర రాజధానిలో కలహాలు జరుగుతున్న వార్తలు విన్నప్పుడు, చదువుతున్నపుడు మీ కేమనిపిస్తుంది?" అడిగాను సుబ్బారావును. "అసలు మాకు అర్థమే కాదు ఆ విషయం ఏమిటో? మీరే చూడండి. మా ఇండ్లు మలబారీ ముస్లిం సోదరుల ఇండ్లు ఎలా ఒకదాని ప్రక్కన ఒకటున్నాయో, మేమూ వాళ్ళూ కలసిమెలసి ఉంటాము. అలా అని వారు మతావలంబీకులు కారని అనడానికీ వీల్లేదు" చెప్పాడు సుబ్బారావు.

"చాలా సంతోషమండి" నా ఆనందాన్ని వెలిబుచ్చాను.

వింటే మతిబోతుంది

"మళయాళీ ముస్లిములు అయిదు పూటలా నమాజ్‌కు వెళతారు ఇంటిల్లీపాదీ ప్రొద్దున లేవగానే ఖుర్ఆన్ చదువుకుంటారు. మేము మా పూజా పురస్కారాలు చేసుకుంటూ ఉంటాము. అయినా ఇరుగు పొరుగు అంతా సఖ్యంగా జీవిస్తాము."

"భాష కూడా మీకు అడ్డురాదా?"

"బలేవారే, ఇక్కడ మా వీధిలోనే చూడండి, ఇటు మలయాళీలా? అటుమేము. ఆ దిగువున తమిళులు. భాషగాని, మతంగాని మాకు ఎన్నడూ అడ్డురాలేదండి"

"అంతే గాదండి, ఎవరన్నా అడిగితే తప్ప మాకు మా కులాలు కూడా గుర్తు లేవు. దేశంలో కమ్మవారూ, కాపులూ కొట్లాడుకున్నారని విని మేము బాధపడ్డాము" చెప్పాడో పెద్ద మనిషి. (దేశమంటే ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా ప్రాంతం, వాళ్ళ మాతృభూమి అన్నమాట) "నిజమేనండి, మా పిల్లలు స్కూలుకు వెడతారు. నేను ఆఫీసుకు వెడతాను. కాని బ్రాహ్మణులెవరని, కాపులెవరని, హరిజనులెవరని ఆరాతీసే, కనీసం ఆలోచించే యోచనకూడా మాకు రాదంటే నమ్మండి."

"మీరిలాగే చెబుతూ ఉంటే, నేను కూడా అండమాన్‌కు వచ్చేస్తానో ఏమో" అన్నాను నవ్వుతూ. "అంతే కాదండి", సంతోషం ఉట్టిపడే కంఠంతో సుబ్బారావు చెప్పసాగాడు. "కొన్నాళ్ళ క్రితం వరకు దారిలో ఏదయినా వస్తువు పడిపోతే అసలు దాని యజమాని వచ్చి దాన్ని ఎత్తుకునే వరకు ముట్టేవాడు లేడు. విలువయినదయినా అందరూ దాన్ని చూసి తప్పుకు పోవడమేగాని చెయ్యితో ముట్టుకోవడం కూడా జరగదు. కాకపోతే అది ఫలానా వారిదని తెలిసిన వారు దాన్ని తీసుకువెళ్ళి దాని యజమానికి అప్పజెప్పేవారు. వారం వారం వరకు వస్తువులు అలా పడి ఉండవలసిందే".

నా ఆశ్చర్యానికి అంతులేదు. "ఏమిటి నిజమా?" నేను వెంట వచ్చిన మరో మిత్రుని వైపు తిరిగి అడిగాను. అతనూ నవ్వి "నిజమేనండి, ఇప్పటికీ మా వీధి గుమ్మాలు మూసుకోవడం అన్నది మాకు తెలియదు. ఒక్క దొంగతనమూ జరగదు" నాకు నమ్మశక్యం కాలేదు. అపనమ్మకంగా వాళ్ళ వైపు చూశాను "మీరు నమ్మరు. కాని ఇది వాస్తవం."

"......కాని మెయిన్‌లాండ్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్న వారు ఈ మధ్యనే ఎక్కువవుతున్నారు...... ఏదో చిన్న చిన్న చోరీలు జరుగుతున్నట్లు విన్నాం...." నా వైపు నవ్వుతూ చూస్తూ చెప్పాడు ఓ పెద్దాయన. ఆ చూపు నాకు వింతగా తోచింది. నాకు సిగ్గు అనిపించింది. మెయిన్ లాండ్‌లోని వారి పట్ల వీరి ఏహ్యాం చెడుగుల మూలమే అన్న భావం నన్ను కుంచింపజేసింది. "అసలు కారణం అన్ని రోగాలకూ స్వార్థమే బాబు. మీరు చదువుకున్న వారు, పత్రికకు ఎడిటర్ అన్నారు. మీకు చెప్పలేను గాని ఇది మటుకు ఎవరూ కాదనలేరు. స్వార్థమే సకల రోగాలకు మూలం" బాధగా అన్నదాయన. "నిజమేనండి. మనిషికి ఈ జీవితమే సర్వస్వం అని, ఇక్కడ తప్ప మరెక్కడా జీవితం లేదని నమ్మేమనిషి వీలయినంత అధికంగా ప్రపంచ సుఖాలు జుర్రుకోవాలని చూస్తాడు. అంతే కాదు, తన్ను అడ్డుకునే సమాజం కళ్ళు కప్పి చెయ్యగలిగితే పోలీసులను తప్పించుకోగలిగితే తాను ఏమి చేసినా చెల్లుతుంది అన్న భావమూ దానికి జోడయితే ఇక ఆంబోతులా తయారవుతాడు మనిషి......."

"మా బాగా చెప్పారు బాబు"

ప్రభువూ ఒక్కడే, బోధనా ఒక్కటే

"అందువల్లనే మనిషిని అదుపు చెయ్యాలంటే, మనిషివల్ల సమాజానికి కీడు కలగకుండా చూడాలంటే పరలోక భావన ఎంతయినా అవసరం. నన్ను పుట్టించిన స్వామికి నేను చేసే ప్రతిపనికీ జవాబు చెప్పుకోవలసి ఉంది. మానవులందరూ ఆ స్వామి దాసులే, అందరూ పరస్పరం సోదరులే, తోటి సోదరుని కష్టం నా కష్టం లాంటిదే అన్న భావాలు లేనిదే మనిషి సవ్యంగా జీవించలేడు. సమాజంలో సానుభూతి, ప్రేమానురాగాలు వెల్లివిరియ లేవు...." నా మాటలు.

నా ఈ మాటలకు ప్రతిస్పందించి ఓ పద్యం వినిపించాడు ఓ తాత. నా కిపుడు అది గుర్తులేదు. కాని దాని భావం మటుకు గుర్తుంది. మనిషి ఎన్ని సాధించినా, ఎన్నేళ్ళు జీవించినా, ఎంతగా ఎదిగినా అంతా వదలి వెళ్ళవలసిన వాడే. అందుకు ప్రేమతో మెలగటమే మానవత్వం అన్నది దాని సారాంశం. " ఎవరి మతాన్ని వారు అనుసరిస్తే అంతా హాయిగా ఉంటుంది బాబు. ఏమతమూ చెడును బోధించదుగా" అన్నాడు తాత.

"తాత, మనలనందరినీ పుట్టించినవాడు దేవుడు ఒక్కడే. మనమంతా ఒక్కటే అయినప్పుడు ఆ దేవుడు మనకు బోధించేది వేర్వేరెలా అవుతుంది. అందరూ కలసి మెలసి ప్రేమతో జీవించాలనే ఆయన బోధించాడు. ఆయన పంపిన ప్రవక్తలు, గురువులు, రుషులు మునులూ అందరూ మంచినే సత్యాన్నే బోధించారు. మనమే వాటిని సరిగ్గా అర్థం చేసుకుని ఆచరించడం మరిచాము" అన్నాన్నేను.

❖ ❖ ❖

ఆరోజు రాత్రి ఆరున్నర గంటలకు వింబర్లి గంజ్ పంచాయత్ గ్రౌండులో జమాఅత్ ఏర్పరచిన "మత సామరస్యం" అనే అంశంపై బహిరంగ సభ. ప్రయాణంలో ఉన్నాం కాబట్టి మేము మగ్‌రిబ్ నమాజ్‌తో పాటు ఇషా నమాజ్ కస్ర్ కూడా జతచేసి చేసుకున్నాము. ఆరుగంటలకు స్థానిక మిత్రులతో కలిసి పంచాయత్ మైదానానికి బయల్దేరాము. సాయంత్రం పూట కలసిన మిత్రులు అనేకమంది దారిలో కనబడి అక్కడికే వస్తున్నామని చెప్పారు. రోడ్డు వద్ద మైదానానికి ప్రవేశం ఏర్పరచి ట్యూబులైట్లు దారివెంట ఏర్పరచారు. మైదానంలో చిన్న స్టేజి. స్టేజి పై ఒక సోఫా నాలుగయిదు కుర్చీలు. మైకు, స్పీకర్స్ స్టాండు. స్టేజ్ కెదురుగా 20 గజాల దూరాన దాదాపు 100 కుర్చీలు పెట్టారు. స్టేజికి ఎడం ప్రక్కన కొందరు మహిళలకు కేటాయించారు. మేము వెళ్ళే సమయానికి గవర్నమెంటు జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ రామ్‌లఖన్ సింగ్ గారు, అంబుజన్ గారు(లెక్చరర్) వచ్చి ఉన్నారు. అందరితో కుశల ప్రశ్నలు. కరచాలనం వగైరా జరిగిన తరువాత కార్యక్రమం ప్రారంభమయింది.

సామరస్యానికి ప్రతీక

మిత్రులు మూసా ఖుర్‌ఆన్ పఠనం ఆ తరువాత ముహమ్మద్ అలి ప్రారంభ వచనాలతో మత సామరస్య బహిరంగ సభ మొదలయింది. తొలుత మిస్టర్ అంబుజన్ గోష్ఠిని ప్రారంభిస్తూ మన దేశంలో అనేక మతావలంబీకులు జీవిస్తున్నారని ఇక్కడ అందరూ కలసి మెలసి సామరస్యంగా జీవించడమే సరయిన పద్ధతి అని చెప్పారు. ఆయన ఇంగ్లీషు, మలయాళీ భాషల్లో ప్రసంగించారు. ఆ తరువాత శ్రీ రామ్‌లఖన్ సింగ్ గారు హిందీలో మాట్లాడుతూ మన దేశం సదా సత్యానికి, న్యాయానికి ప్రతీకగా నిలిచిందని, ముఖ్యంగా అండమాన్ దీవుల్లోనయితే భారతావనిలోని సకల ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఉంది. అన్ని మతాలవారు ఇక్కడ నివసిస్తున్నారు. మతం అన్నది ఆధ్యాత్మికమయింది. దైవిక చింతనను బోధిస్తుంది గనక మతం కారణంగా ఒకరినొకరు ద్వేషించుకోవడం అన్నది సంభవించదని అన్నారు. అండమాన్ దీవుల్లో మత సామరస్య వాతావరణాన్ని ప్రస్తావిస్తూ "ఇప్పుడిప్పుడే కొందరు రాజకీయాల ద్వారా మతతత్వాన్ని ప్రబోధించే కుట్రలు పన్నుతున్నారు. అవి ఇక్కడ సాగనివ్వరాదని అండమాన్ వాసులు దృఢసంకల్పం చేసుకుంటే మనల్ని ఎవరూ మన మార్గాన్నుండి తప్పించలేరు" అని గట్టిగా పలికారు. ఆ తరువాత శ్రీ సేతు మాధవన్ ఇంగ్లీషులో ప్రారంభించి తిరిగి తమిళంలో మాట్లాడుతూ తమిళ కవి భారతియార్‌ని, తిరుక్కురళ్‌ని ప్రస్తావించి, మతం లేని జీవితం ప్రాణం లేని కళేబరం లాంటిదని చెప్పారు. అందరూ సుఖంగా జీవించాలంటే తమ సృష్టికర్త పట్ల నమ్మకంతో ఆయన సృష్టి అయిన తోటి మానవుల పట్ల ప్రేమతో జీవించాలని అది ఒక్కటే సరయిన మార్గమని బోధించారు. శాంతి అన్నది అంతర్గతంగా సుస్థాపితమయినప్పుడే ప్రపంచం

లోనూ దాన్ని స్థాపించడం సాధ్యమవుతుందన్న ఇస్లామీయ సిద్ధాంతం నన్ను ఎంతో ఆకట్టుకుందని తెలిపారాయన.

ఈ ఆదర్శం అంతటా వెల్లివిరియాలి

శ్రీ సేతు మాధవన్ తరువాత మీ సంపాదకుని వంతయింది మాట్లాడటం. నేను వక్తను కాక పోయినప్పటికీ అక్కడకు విన వచ్చిన తెలుగు సోదరులతో మాట్లాడాలని, వారికి తెలుగు తీయదనాలను రుచి చూపించాలని శాయశక్తులా కృషి చేశాను. స్వరాష్ట్రానికి వెయ్యి మైళ్ళ దూరాన అందమయిన అండమాన్ లోయల మధ్య తెలుగు సోదరుల్ని సంబోధిస్తూ సహజంగానే నాలో లేచిన ఆనంద తరంగాలను తొలుత బహిర్గతం చేసుకున్నాను. ఆ తరువాత అండమాన్‌ని మినియేచర్ ఇండియాగా అభివర్ణించి "అయితే మెయిన్ లాండ్‌కు భిన్నంగా సతతం సకల మతాల మధ్య, సర్వ భాషల మధ్య, సమస్త ప్రాంతీయతత్వాల మధ్య సామరస్యాన్ని సాధించి భారతావనికే ఓ కలికి తురాయిగా నిలిచింది" అని నాలో ఉప్పొంగుతున్న ప్రశంసాకాంతుల్ని విరజిమ్మాను, ఆనందాతిరేకంతో అండమాన్ భారతదేశానికి ఆదర్శ ప్రాంతమని చాటాను. మెయిన్ లాండ్ వాళ్ళు ఇక్కడినుంచి నేర్చుకోలసింది చాలా ఉందని, అండమాన్ సాధించిన భిన్నత్వంలో ఏకత్వాన్ని, ఇక్కడ నాకు ఎల్లెడలా కానవచ్చే కుల, మత, వర్గ, భాషా, ప్రాంత వైవిధ్యాల మధ్య అంతర్గత తరంగంగా భాసిల్లుతున్న సమైక్యతా కాంతిని గురించి దేశ ప్రజలందరికి చాటి చెబుతానని ప్రకటించాను.

"ఈ ప్రాంతాన్ని ఓ రాష్ట్రంగా మలచాలని కృషి జరుగుతున్నట్లు వినవచ్చింది. అయితే రాజకీయ వాదులు ఇక్కడ తమ పాదాలు మోపినట్లయితే ఈ సుందరమయిన ఆనందదాయకమయిన, శాంతిప్రదమయిన వాతావరణం కలుషితమయ్యే ప్రమాద ముంది. దీన్ని ఇలాగే పదిలంగా కాపాడవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది. అంతేకాదు దీని సామరస్య సౌరభాలను దేశమంతటా విస్తరింపజెయ్యవలసిన బాధ్యత కూడా మనందరిపైన ఉంది" అని ప్రకటించి నా వంతు పాత్రను ముగించుకున్నాను.

చివరన మౌలానా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ తన సహజ వాక్ చాతుర్యంతో, ఉపన్యాస పటిమతో శ్రోతల్ని ఉద్రూత లూగించారు. ఆయన మనిషి జీవితంలో మతం ప్రాముఖ్యాన్ని తెలుపుతూ అది మనిషిని మానవునిగా మలచుతుందని, దాని ద్వారా జంతుప్రాయమయిన క్షుద్రమయిన కోరికలపై మనిషి అదుపు సాధించి సృష్టి శ్రేష్ఠమయిన తన ప్రత్యేకతను నిలుపుకోగలుగుతాడు అని అన్నారు. అలాంటి మతావలంబీకులు రక్తపాతానికి, దహనకాండకు, మానభంగాలకు పాల్పడగలరా అని ప్రశ్నించారాయన. దేశంలో నెలకొన్న రాజకీయ సామాజిక పరిస్థితుల విశ్లేషణ చేసి రాజకీయాల్లో ఎలాంటి

దుష్ట శక్తులకు స్థానం ఏర్పడుతూ ఉందో ఉదాహరణలతో తెలిపారు. కాలేజీల్లో, యూనివర్సిటీల్లో విద్యార్థి విద్యార్థినులు విచ్చలవిడితనానికి పాల్పడి ఎలా నైతికపు విలువల్ని మంటగలుపుతున్నారో కొన్ని సంఘటనలు ఉదాహరించి మరీ చెప్పారు. ఇలాంటి పరిస్థితిని నిజమయిన ధర్మం ఒక్కటే చక్కబెట్టగలదని, దైవభావన, పరలోక చింతన, దైవ మార్గదర్శకత్వపు భావనలే మనిషి మార్గాన్ని చక్కదిద్దగలవని, మనిషి జీవితాన్ని చక్కబెట్టగలవని ప్రకటించారు.

కలుషితం చేసేవారిని మట్టుపెట్టండి

అండమాన్ వాతావరణాన్ని ఏ శక్తులయితే కలుషితం చెయ్యాలని చూస్తున్నాయో వాటికి గట్టిగా బుద్ధిజెప్పాలని బోధించారు. మతతత్వ శక్తులకు, మతతత్వ రాజకీయ పక్షాలకు ఇక్కడ తావివ్వరాదని, ఈ పార్టీల వల్లనే మెయిన్ లాండ్‌లో దేశం రోజుకు రోజు బలహీనమయి పోతోందని ఆయన హెచ్చరించారు. జమాఅతె ఇస్లామీ హింద్ ప్రజల్లో నిజమయిన మత భావనను కలిగించడానికి, సరయిన నైతిక ప్రమాణాలను నెలకొల్పడానికి, ప్రజాసేవా, సాంఘిక సేవా కార్యక్రమాల ద్వారా కృషి చేస్తోందని తెలిపారు. జమాఅతె ఇస్లామీ హింద్ కులమత విచక్షణ లేకుండా అందరి సహాయ సహకారాలతో దేశ ప్రజలందరికి తన సేవల్ని అందజెయ్యాలని ప్రయత్నిస్తోందని చెప్పారు. దానికి అందరి తోడ్పాటు కావాలని అభ్యర్థించారు.

మౌలానాగారి అధ్యక్షోపన్యాసం తరువాత ముహమ్మద్ అలి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమం ముగిసిన తరువాత అనేకమంది వచ్చి కలుసు కున్నారు. వక్తలం కూడా పరస్పరం కలుసుకుని కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాము. సేతు మాధవన్‌గారు, 'నేను తెలుగువాడినే కాని తమిళం ద్వారా నా విద్యాభ్యాసం జరగటం మూలన తమిళంలోనే స్థిరపడ్డాను. నేను మీ తెలుగు ఉపన్యాసాన్ని అర్థం చేసుకోగలిగా" నని చెప్పారు. అలాగే నేను కూడా తమిళ ఉపన్యాసం కూడా చాలా మటుకు అందులో విపరీతంగా ప్రయోగించిన సంస్కృతపదాల ఆధారంగా అర్థం చేసుకునేందుకు యత్నించానని చెప్పాను. అందరూ ఇలాంటి సమావేశాలు మళ్ళీ మళ్ళీ పెట్టాలని, జమాఅతె ఇస్లామీ లాంటి సంస్థలు దీనికి పూనుకుని అందరినీ ఓ చోట చేర్చడం చాలా సంతోషకరమయిన విషయమని చెప్పారు.

పంచాయత్ గ్రౌండు నుండి తిరిగివస్తున్నప్పుడు అనేకమంది తెలుగు సోదరులు కలసి పలుకరించారు. తెలుగులో ఇది తొలి ధార్మిక ఉపన్యాసమని ఇలాంటివి తెలుగు వాడల్లో పెడితే బావుంటుందని చెప్పారు. కోరికలన్నీ నెరవేరడం సాధ్యమా?

❖ ❖ ❖

ఈ వేళ ఫిబ్రవరి పన్నెండు. పోర్టు బ్లెయిర్‌కి వెళ్లి వక్ఫ్ బోర్డు చైర్మన్ శ్రీ అబ్దుల్ గని గారిని బిజెపి నేతగా చెప్పబడే శ్రీ పరశురామ్ గారిని కలసుకోవాలన్న ప్రోగ్రామ్ నిర్ణయమయింది. బంబూ ఫ్లాట్ నుండి చాట్టం రేవుకు బోట్‌లో ప్రయాణం. ఉదయంపూట చల్లని గాలులు బంగాళాఖాతం మీదుగా పయనిస్తూ ఆహ్లాదాన్ని కలిగిస్తుంటే చుట్టూ రంగురంగుల పూల చెట్లతో కళకళలాడే పచ్చని గుబుర్లు నిండిన కొండలు ఊహాలోకాల్లో విహరింపజేస్తుంటాయి.

సుకవనం

రషీద్ మొహియుద్దీన్ గారు తమ కెమెరాను నిన్నటి నుండి క్లిక్ మనిపిస్తూనే ఉన్నారు. నేడు పడవలో అటూ ఇటూ తిరుగుతూ మంచి ప్రకృతి దృశ్యాల అన్వేషణ, అవి దొరకగానే వాటిని 'చిత్రయంత్రం'లో బంధించడం కొనసాగిస్తున్నారు. నేనేమో ఆ దృశ్యాల మనోహర రూపాల్లో విహరిస్తూ ఉంటే ఆయన మాటిమాటికి అది చూడు, ఇది చూడు అంటూ ఊహాలోకాల్లోంచి లాక్కొస్తున్నారు. ఊహల తీగలు పలుమార్లు తెగిపోతున్నాయి. అలాంటి ఓ సందర్భంలోనే పోర్టు బ్లెయిర్ ఎయిర్ పోర్టులో దిగగానే పర్యాటక శాఖ వారు కాబోలు వేసిన ఓ హోర్డింగులోని మాటలు గుర్తుకు వచ్చాయి. అందులో అండమాన్ దీవుల్ని The most beautiful Islands in the world అని ఉంది. ఈ స్టేట్‌మెంట్ నిజమో కాదో తేల్చి చెప్పే స్థితిలో నేను లేకపోయినా, నేను చూసినంత మేరకు నిజమేనేమో అనిపించింది.

తెగిపోతున్న ఊహల తీగల మధ్యనే కొన్ని పంక్తులు నా అంతరంగంలో మొలకెత్త సాగాయి. పోర్టు బ్లెయిర్ చేరుకునేటప్పటికి అవి ఓ రూపును సంతరించుకున్నాయి. పన్నెండు నిమిషాల్లో ఓ భావకిరణం పరిపూర్ణత సాధించింది! అదే "సుకవనం."

'సుకవనం'

భువిలోనే దివిశోభను
చవి చూసిన ఓ మనసా
నీ వీధుల మలపుల్లో
ఈ సొగసుల పదిలంచెయ్
ఆ కొండల ఎత్తుల్లో
ఈ లోయల లోతుల్లో
విహరించె విహంగాలయి
ఆనంద తరంగాలయి
నర్తించే ఊహలతో

ప్రభు కీర్తన గానం చేయ్
వన పుష్ప సురభి మధువు
హృదయాంతర అధరాలకు
చిరు గాలుల పాత్రలలో
పూబాటల కెరటంపై
అందంగా అందుతూ ఉంటే
ఆనంద విలాసం చేయ్
రస సాగర తీరాలను
ఇల ఈదగ వీలవునా?
ఈ ప్రకృతి అందాలను
తిలకించగ తీరేనా?
నవసాగర మథనం చేయ్
నవగగన సుకవనం చేయ్.

బోటు రేవుకు చేరగానే అందులో నుంచి స్కూటర్లు స్టార్టయి ఒక్కొక్కటే బయల్దేరి ఒడ్డుకు చేరి దూసుకుపోతున్నాయి. స్కూటర్లయినా, టాక్సీలయినా, లారీలయినా ఇలా బోటు ద్వారానే వాటి రాకపోకలు. దీనికి అనువుగానే రేవులోనూ బోటులోనూ ఏర్పాట్లు చెయ్యబడ్డాయి. చాట్టంరేవు నుండి బయటికి రాగానే టాక్సీ రెడీగా ఉంది. బయల్దేరాము. అదే సముద్రంపై వంతెన, ఆ తరువాత ఎగుళ్ళు దిగుళ్ళు. వంకలు, మలుపులు నిండిన బాటలగుండా పోర్టుబ్లెయిర్ రాజధాని నగరంలో ప్రవేశం.

జీవికకై...

ఏదయినా కూల్ డ్రింకు లేదా టీ తీసుకుందామని ముహమ్మద్ అలి ఓ బేకరి – కమ్– కూల్ డ్రింకు షాపునకు తీసుకు వెళ్ళారు. మమ్మల్ని చూడగానే హోటల్ యజమాని పరుగు పరుగున వచ్చాడు. పరిచయాలయ్యాక, "మీరు మా అతిథులు, ఏం తీసుకుంటారో చెప్పండి" అంటూ బలవంతపెట్ట సాగాడు. కాస్త మొహమాటం అనిపించింది తొలుత, తరువాత అతని బలవంతాన, టీ కావలసినవారు, కూల్ డ్రింకు కావసిన వారు తెప్పించుకుని త్రాగాము.

అతని పేరు మాషూక్ అలి. 1937లో వాళ్ళ తాత, నాన్న ఇక్కడికి వచ్చి వ్యాపారం మొదలెట్టారని నేడు తాను వాళ్ళ వారసునిగా అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నానని చెప్పారు. తాము ఉత్తరప్రదేశ్‌కి చెందినవారమని నేటికీ ఉర్దూ భాషను కాపాడుకుంటూ ఉన్నామని, మున్ముందు తమ భాషకు ఏమవుతుందో ఏమో ఆందోళనగా ఉందని అన్నాడు.

ప్రజలు జీవనోపాధికై వేలాది మైళ్ళు ప్రయాణాలు చేసి ఆ కాలంలో అష్టకష్టాలను భవించి అండమాన్ దీవుల్ని శోభాయమానం చేశారు. అయితే ఓ కాలంలో ముస్లిములు వాణిజ్యంతో పాటు సత్యధర్మ వ్యాప్తికై అంతకంటే కఠినమయిన పరిస్థితుల్ని ఎదుర్కొని అంతకంటే అధికమయిన బాధల్ని సహించి, భరించి తాము అడుగిడిన చోటల్లా చెరగని ముద్ర వెయ్యగలిగారు. నాడు వారు ధర్మపరాయణులు, వారి ఆదర్శజీవితమే వారి ధర్మాన్ని, దాని వైశిష్టిని, దాని ఉన్నతిని చాటిచెప్పింది. వారు మాటలతో కాక చేత లతో ప్రచారం చేసిన మహనీయులు, అలాంటి వారే కేరళ, సింహళం, ఇండోనేషియా, మలేషియా, చైనా దేశాలకు సముద్రయానం ద్వారా వెళ్ళి తమ ఉనికికే ఓ ప్రత్యేకతను సాధించారు. తద్వారా ఆ ప్రాంతం అంతా రూపాంతరం చెందేందుకు కారణ భూతు లయ్యారు. వారికి తమ భాష ఏమవుతుందోనన్న భయం ఏ మాత్రం బాధించలేదు. ఎదుటి వారితో ఏ భాషలో అభిప్రాయాల మార్పిడి సాధ్యమో ఆ భాషను సునాయాసంగా నేర్చుకుని వారిలో ఒకరయి వారిని తమలో ఒకరుగా చేసుకున్నారు. నేడు ముస్లిముల్లో ఆ ధ్యాస లేదు, ఆ ధ్యేయం లేదు, ఆ గుణగణాల్లేవు, ఆ సచ్చరితలేదు, ఆ ఆదర్శాల్లేవు. పరిణామ ఫలంగా ఆ మార్పులూ ఎక్కడా కానరావడం లేదు. నేడూ వేలాది మైళ్ళ సముద్రయానాలు, గగనయానాలు, జీవనోపాధికై సాగుతూనే ఉన్నా, ఎటొచ్చీ ఆ ఫలితాలే కానరావడం లేదు!

మాషూక్ అలీ గారి దగ్గర సెలవు తీసుకుని శ్రీ అబ్దుల్‌గని, వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్‌గారి వద్దకు వెళ్ళాము. పరిచయాలయ్యాక ఆయన అండమాన్‌లో వక్ఫ్ బోర్డు చరిత్ర అంతా వినిపించారు. 1972లో అండమాన్ దీవుల్లో వక్ఫ్ బోర్డు స్థాపించినా, ఓ కమీషన్ వచ్చి అన్నింటినీ పరిశీలించి అసలు ఇక్కడ ఎలాంటి వక్ఫ్ ఆస్తులు లేవని తేల్చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. అప్పటి నుంచి అండమాన్ వక్ఫ్‌బోర్డు 'నిష్కర్మ యోగి' లా పడి ఉండింది. 1984లో శ్రీ అబ్దుల్ గని గారు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత కేంద్ర ప్రభుత్వ కమీషన్ నివేదిక తప్పుల తడక అని నిరూపించి అండమాన్‌లో వక్ఫ్ ఆస్తులు కొన్ని కోట్ల విలువ చేసేవి ఉన్నాయని వాటి జాబితాతో బాటు అంతా ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పుడు వక్ఫ్‌బోర్డు తరపున పాఠశాలలు, ఓ కాలేజి నిర్వహించబడుతున్నాయి. మస్జిదుల నిర్వహణ ఉండనే ఉంది.

చేసేవాడికి చేతినిండా పని

మనిషి నిస్వార్థ సేవాభావంతో సమాజానికి ఏదయినా అందజెయ్యగల సంకల్పంతో కృషి చేస్తే అసాధ్యం ఏదీకాదని శ్రీ అబ్దుల్ గని మరోసారి రుజువు చేశారనిపించింది నాకు, ఆయన ద్వారా తెలిసిందేమిటంటే 1957 వరకు అండమాన్ దీవుల్లో కేవలం ఉర్దూ భాష మాత్రమే బోధనా భాషగా ఉండేది. ఆ తరువాత క్రమేణ

భారత ప్రాంతీయ భాషలు బోధనభాషలుగా అవతరించాయి. అవసరానికనుగుణంగా స్కూళ్ళు రూపొంద సాగాయి. చివరికి 1984లో ఉర్దూ కేవలం రెండవ భాషగా మటుకే మిగిలిపోయింది. శ్రీ అబ్దుల్ గని గారు ఉర్దూ ప్రధాన భాషగా చదివే డిగ్రీ విద్యార్థులకు పాండిచ్చేరి విశ్వ విద్యాలయంలోనూ పరీక్షలు వ్రాసే సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారట. సమాజంలో ఒక్కో రంగాన్ని ఒకరు సముద్ధరిస్తూ సేవచేస్తే సమాజం రూపు రేఖలే మారిపోవచ్చు. మంచి వ్యాపారస్తుడయిన అబ్దుల్ గని గారు తన వాణిజ్య వ్యవహారాలను సంతానానికి అప్పజెప్పి ప్రశాంతంగా సమాజసేవా కార్యక్రమాల్లో నిమగ్నులవటం ఎంతయినా హర్షించదగ్గ విషయం. తన జీవికకై కాక కేవలం సేవాభావంతో ప్రజా సమస్యల్ని చేపట్టడమే నేడు ఎక్కడా కానరాని అంశం. ప్రజాసేవలోనూ ఆత్మసేవే ధ్యేయంగా జీవించే వారే అధికం. కేవలం ప్రజాసేవ కోసమే సేవ చేసేవారు మనలో ఎంత మంది ఉన్నారో?!

శ్రీ అబ్దుల్‌గనితో మరి కాస్సేపు మాట్లాడాలన్న కోరిక కలిగినా సమయంలేదు గనక సెలవు దీసుకొని పరశురామ్‌గారి ఇంటికి బయల్దేరాము. ఆయన ఇంటికి వెళ్ళే సరికి టైం ఇచ్చిన మాట వాస్తవమేకాని ఇప్పుడు ఇంట్లో లేరు, హాస్పిటల్‌కు వెళ్ళారని ఆయనగారి సతీమణి సెలవిచ్చారు. విచారమూ కలిగింది. ఆశ్చర్యమూ కలిగింది. ఎంతో అవసరం కలిగితే హాస్పిటల్‌కు వెళ్ళడంలో తప్పులేదు కాని, ఇంటర్‌వ్యూ సమయం నిర్ణయించిన తరువాత కనీసం మర్యాదకు ఇప్పుడు వీలుకాదని తెలుపనయినా తెలుపకుండా, పాత కీళ్ళ నొప్పికోసమని హాస్పిటల్‌కు వెళ్ళడం ఏమంత మంచి అభిరుచినీ మర్యాదనూ సూచించడంలేదు. కొందరు మిత్రులయితే అది కేవలం సాకు మాత్రమేనని, ఆయన నిక్షేపంగా తిరుగుతూ ఉంటారని చెప్పారు. అదంతా మనకనవసరం. ఆయనే స్వయంగా సమయం కేటాయించి ఇలా అమర్యాదగా ప్రవర్తించడం భావ్యం కాదని మటుకు అనిపించింది. ఇలాంటి వారు భావి భారత పాలక పక్షం నాయకులు!

అండమాన్ దీవులు నేడు ఇలా జనసంచారంతో కళకళలాడుతున్నాయంటే దానికిగల పూర్వరంగం తెలుసుకోవాలన్న కుతూహలం సహజమయింది. ఆ కుతూహలంతోనే సెల్యూలర్ జెయిల్ చూడాలని బయల్దేరాము. అండమాన్ చరిత్రలో సెల్యూలర్ జెయిల్ కున్న సంబంధం ఏమిటి అని ఆశ్చర్యం కలగవచ్చు. అండమాన్ అంటేనే తెలిసిన వారికి ముందు గుర్తుకు వచ్చేది సెల్యూలర్ జెయిల్ అన్నది వాస్తవం, కాని సెల్యూలర్ జెయిల్ లేకపోతే అసలు అండమాన్ దీవుల్ని గురించి నేడు చెప్పుకునేవారు కూడా ఉండేవారో లేదో అనుమానాస్పదం. ఆ ప్రాముఖ్యం ఈ జెయిల్‌కే ఉంది.

❖ ❖ ❖

దేశానికి దూరంగా

1857 తరువాత స్వాతంత్ర్యయోధులు విరివిగా పట్టుబడుతున్న కాలంలో వారినందరినీ నిర్బంధంలో ఉంచడం సమస్యగా పరిణమించింది బ్రిటీష్ పాలకులకు. అప్పుడు తెల్లదొరల మేధ చాలా చురుగ్గా పనిచేసింది. ఆలోచన ఎంతో దూరాలకు వెళ్ళింది- కాలం రీత్యాను, ప్రదేశం రీత్యాను. వారు ఈ మహత్కార్యానికిగాను అండమాన్ దీవుల్ని ఎన్నుకున్నారు. ఖైదీలను కుప్పలు తెప్పల్లా తెచ్చి దీవుల్లో వదిలేసి వాళ్ళచేత కూలీ పనిచేయించి ఈ జైలును కట్టారు. 1896లో ప్రారంభించి 1906లో పని ముగించారు. దిబ్బలా ఉన్న ప్రదేశాన్ని త్రవ్వి చదును చేశారు. ఆ మట్టితో ప్రక్కనే వున్న గుంట నింపి ఆ ప్రదేశాన్ని మిలిటరీ పరేడ్ గ్రౌండ్‌గా తీర్చిదిద్దారు. ఇటుకలతో కట్టిన మూడంతస్తుల జెయిలు ఆ తరువాత ప్రసిద్ధమయిన సెల్యూలర్ జెయిల్‌గా, దౌర్జన్యాలు అత్యాచారాల నిలయంగా రూపొందింది. అక్కడ వేలాదిమంది స్వాతంత్ర్య యోధులు అసువులు బాసారు. తెల్ల దొరల రాక్షసత్వానికి, యోధుల ఆక్రందనలకు, బానిసజాతి ఆర్తనాదాలకు, మూగ సాక్షిగా అక్కడ ఓ వృద్ధ పిప్పలి వృక్షం నేటికీ నిలిచి ఉంది. అది జైలు నిర్మాణ కాలంనుండి సాగిన జులుంకు ప్రత్యక్షసాక్షి. నేటి వరకు దాని సాక్ష్యం సజీవంగా అందజెయ్యడానికి స్వతంత్ర భారతప్రభుత్వం అవసరమయిన ఏర్పాట్లు చేసింది. అవకాశం, సందర్భం వచ్చినప్పుడు దాని గురించి కూడా వివరించగలను. ప్రస్తుతం అక్కడికి వెడదాం.

జైలుకు వెళ్ళగానే అది నేడు జైలుకాదు. ఓ జాతీయ స్మారక భవనం అన్న విషయం తెలుస్తుంది. నేటికీ జైలుగా ఉపయోగిస్తున్న భాగాలను మటుకు వేరు చేసి అక్కడ జైలు వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు అధికారులు. ఈ జైలు చరిత్రను చాటడానికి ప్రవేశ ద్వారానికి లోపలి వైపున, ఇరు ప్రక్కల రెండు హాళ్ళల్లో జైలు మ్యూజియంలాంటిది ఏర్పాటు చేశారు. వాటిలో జైల్లో ప్రవేశించిన స్వాతంత్ర్య సమర యోధుల పేర్లు రాష్ట్రాల వారిగా ఫోటోలతో సహా ప్రదర్శనకు పెట్టారు. జైల్లో వివిధ సందర్భాలలో "అవిధేయు"లయిన ఖైదీలకు ఇచ్చే శిక్షను తెలిపే ప్రదర్శనలున్నాయి. ఖైదీల దుస్తులు గోనెతో చేసినవి చూపెట్టారు. కొరడాదెబ్బలు కొట్టేందుకు అమర్చిన ఫ్రేము, కొరడా నార విడదీసేందుకు వినియోగించే పరికరాలు, విసుర్రాయి, జైల్లో శిక్షించే ఇతర విధానాలను తెలిపే పరికరాలు ప్రదర్శించారు. మునుపటి జైలు ప్రస్తుతం పూర్తిగా లేదు. 1940లో జపాను చేసిన దాడిలో ఓ భాగం దెబ్బ తినడంతో, ఆసుపత్రి కొరకు చోటు అవసరమయినందుకుగాను కొన్ని భాగాలను పడగొట్టారు. అందువల్ల

మొత్తం జైలు నమూనాను తయారుచేసి మ్యూజియంలో పెట్టారు. మూడంతస్తుల జైలు నిర్మాణం నిర్వహణకు అనుగుణంగా ఎంతో చాకచక్యంతో చేశారు. మధ్యలో ఓ గోపురం. అందులోనే మెట్లు ఏర్పాటు చేసి దానికి ఏడు పాయల్లా పుష్పపత్రాల్లో ఏడు వరుసల్లో జైలు గదులు నిర్మించారు. గోపురం కేంద్రంగా, అజమాయిషీకి, నిర్వహణకు అనువుగా ఏర్పాటుచేసిన ఈ జైలు సామ్రాజ్యవాదుల మనస్తత్వాన్ని, బుద్ధిని, చతురతను చాటుతోంది.

కారాగారమా? మృత్యుకుహరమా?

ఈ జైలు ప్రత్యేకత ఏమిటంటే దీన్ని దర్శించడానికి లోగడ శ్రీ సుభాష్ చంద్రబోస్, పండిత నెహ్రూ, శ్రీ మొరార్జీ దేశాయి ప్రభృతులు విచ్చేశారు. వారి రాకకు సంబంధించిన ఫొటోలు, వివరాలు కూడా ఆ మ్యూజియంలో చూపెట్టారు. జైలు ప్రవేశ ద్వారాన్ని, మ్యూజియంను దాటి లోనికి వెళ్ళగానే పిప్పలి వృక్షం దర్శనమిస్తుంది. అత్యంత ప్రాచీనమయిన ఈ చెట్టు ఆహ్వానం పలుకుతున్నట్టు గలగలమని ఆకులతో చప్పుడు చేస్తుంది. దాని కుడి ప్రక్కనే ఉరికంబం ఉంది. అది 'కంబం' అసలే కాదు. అదొక గది. ఆ గదిలో మూడు ఉరితాళ్ళ ఉచ్చులు వ్రేలాడుతుంటాయి. వాటిని ముగ్గురు నేరస్థుల మెడలకు బిగించి, ఒకానొక యాంత్రిక పరికరం ద్వారా కాళ్ళ క్రింద బల్లను లాగివేస్తారు. శారీరక భారంతో వ్రేలాడే దేహంలో వెన్నుముక విరిగి నాడి మండలం తెగి మృత్యువు సంభవిస్తుంది. దేహాన్ని క్రింద ఏర్పాటు చేసిన గోతిలాంటి గది నుండి తీసి ప్రక్కనే ప్రవహించే బంగాళఖాతపు జలాల్లో విసిరివేసే వారు.

కాస్త తక్కువగా శిక్షించాలంటే, దాదాపు 60 డిగ్రీలు వంచిన ఓ ఫ్రేముపై మనిషిని బోర్లా పడేసి కాళ్ళు చేతులు క్లాంపులకు బిగించి వీపు మీద కొరడా దెబ్బలు కొట్టేవారు. ఈ ఏర్పాటు ఉరికంబానికి కాస్త ముందు, జైలు ఆవరణలో చేసేవారు. కాస్త ప్రక్కనే కొబ్బరి టెంకను కొట్టి నారతీసే విభాగం ఉండేది. కొరడాదెబ్బలకన్నా కాస్త తక్కువ శిక్ష వెయ్యదలచినప్పుడు 24 గంటల్లో ఇంత కొబ్బరి పీచు తీయాలని కట్టడి చేసేవారు.

నేడు ఈ విభాగాల చిహ్నాలనయితే అలాగే ఉంచారు కాని ఆ ఆవరణ అంతా పూల చెట్లతో పచ్చికతో అలంకరించి, ఆహ్లాదకరమయిన వాతావరణం సృష్టించారు. అయినా మొత్తం వాతావరణంలో ఆవరించిన విషాదం, బాధ అడుగడుగునా కొట్టవచ్చినట్టు కానవస్తుంది. మనిషికి మనసుండాలిగాని ఖైదీల ఆర్త నాదాలూ వినవస్తాయి.

దేశాన్ని పరపాలన నుండి, పరపీడననుండి విముక్తం చేసేందుకు పాటుపడిన వారి చరిత్ర ఎంత బాధామయమయింది, ఎంత ఆవేదనా పూర్వకమయింది! నేడు స్వాతంత్ర్య ఫలాలను ఆస్వాదిస్తున్న ప్రజలు, నాయకులు, ఏలికలు దాన్ని గ్రహించగలిగితే

నాగరికతకు దూరంగా...

అండమాన్ దీవుల్లో ఆదిమవాసులున్నారు. ఆంత్రపోలజి అధ్యయనం చేసేవారికి మంచి సరకు, ఇంకా ఆలస్యం దేనికి– ఆంత్రపోలాజికల్ మ్యూజియం చూడకుండా వెళ్ళడం అంటే మనిషి తన శారీరక, మానసిక, సామాజిక, భౌగోళిక స్వరూపాన్ని చూడటాన్ని తిరస్కరించడమేనన్నమాట. అందుకని అక్కడికి వెళ్ళాము. అక్కడ అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే ఆదిమానవుల జీవన విధానాన్ని, వారి గుడిసెలు, పాత్రలు, ఆయుధాలు, పనిముట్లు, వాహనాలు చూపెట్టే అనేక పటాలు, మోడళ్ళు, పుస్తకాలూ ఉన్నాయి.

రెండు విభిన్న జాతులు!

అండమాన్ నికోబార్ దీవుల్లో ప్రధానంగా రెండు జాతుల వారున్నారు. ఒకటి నీగ్రిటో (Negrito), రెండవది మంగోలాయిడ్ (Mongoloid). నీగ్రిటో జాతివారు అండమాన్ దీవుల్లోనూ మంగోలాయిడ్ జాతివారు నికోబార్ దీవుల్లోనూ నివసిస్తూ ఉంటారు. నీగ్రిటో జాతిలో, అండమానీస్, జార్వాస్, ఓన్జిస్, సెంతినెలీస్ అనే నాలుగు తెగలున్నూ; మంగోలాయిడ్ జాతిలో నికోబారీస్, షాంపీన్స్ అనే తెగలున్నూ నివసిస్తున్నాయి. ఈ రెండు జాతుల ప్రజలు ముఖ నిర్మాణం, రంగు రీత్యా వేర్వేరు జాతులవారని ఇట్టే చెప్పెయ్యవచ్చు. నీగ్రిటో జాతిలోని అండమానీస్ ప్రజలు అత్యంత త్వరితగతిన క్షీణించి పోతున్నారు. ప్రస్తుతం వారి సంఖ్య కేవలం 28 మందికే దిగిపోయింది. బ్రిటిష్ పాలనా కాలంలో వారికి బయటి ప్రపంచంతో సోకిన అనేక వ్యాధులు ఈ క్షీణతకు కారణమని భావించబడుతోంది. స్ట్రెయిట్ ఐలాండ్ (Strait Island) అనే ద్వీపంలో ప్రత్యేకంగా నివసింపజేసి ప్రభుత్వం వారికి బయటి రోగాలు సోకకుండా చర్యలు తీసుకుంటోంది. వీరు క్రమంగా నాగరికలోకంతో కలసిపోతున్నారు. ఓన్జీస్ అనే తెగ లిటిల్ అండమాన్‌లో నివసిస్తున్నారు. వీరి సంఖ్య కూడా బాగా తగ్గిపోయి ఇప్పుడు కేవలం 95 మంది మాత్రమే ఉన్నారు. వీరు జంతు వేట, చేపల వేట ద్వారా జీవించే జాతి. ఇప్పుడు క్రమంగా నాగరికత అబ్బినా వారి ప్రత్యేకతల్ని కాపాడుతూనే ఆధునిక సౌకర్యాలు కల్పిస్తోంది ప్రభుత్వం. వారి హస్త కళల్ని సయితం వికసింపజేసే యత్నాలు జరుగుతున్నాయి.

ఆటవిక సంస్కృతి

జార్వా తెగ ప్రజలు దక్షిణ, మధ్య అండమాన్ దీవుల పడమటి తీరాల్లో నివసిస్తూ ఉండే క్రూరజాతి. నరమాంస భక్షకులని ప్రతీతి. వారు నేటికి నగ్నంగానే ఉంటారు. గవ్వలతో చేసిన ఆభరణాలు మెడలో ధరిస్తారు. వాటినే మర్మాంగాలపైన నడుముకు కట్టుకుంటారు. 1974లో వీరిని కలవడానికి ప్రయత్నాలు జరిగాయి. ఇప్పటికీ కొబ్బరి

వంతులయిన యువకుల్ని కేవలం అనుమానాల కారణంగా జైల్లో నిర్బంధించి తుపాకి గుండ్లకు బలిచేశారు. పెద్ద పెద్ద గోతుల్లో పడేసి సజీవ ఖననం చేశారు. అండమాన్ ప్రజలపై జపానీయులు జరిపిన రాక్షసత్వానికి "హంఫ్రీగంజ్ అమరవీరుల స్మారక స్థలం" ఒక్కటే నేడు మిగిలివున్న సాక్షి. 1943 డిసెంబరు 29న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రొవిజనల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అధినేతగా దీవుల్ని పర్యటించినప్పుడు సెల్యూలర్ జైలును కూడా దర్శించారు. ఆనాటి నుంచి ఖైదీలకు చట్టబద్ధమయిన న్యాయవిచారణ, మరణశిక్ష విధించే ఆచారం సమాప్తమయింది. ఆ తరువాత అసలు మరణదండనే విధించబడలేదు జైలులో.

జైలులో జైలు

ఈ విధంగా అండమాన్ దీవుల్ని తొలి నుంచి ఓ మహాకారాగారంగా మలిచారు బ్రిటిష్ పాలకులు. ఆ జైలులో అకృత్యాలకు నిలయమయింది మరో జైలు - సెల్యూలర్ జైలు! సెల్యూలర్ జైలు మధ్య భాగాన ఉన్న టవర్‌లో ప్రతి అంతస్తున ఆ జైలును అలంకరించిన స్వాతంత్ర్య యోధుల పేర్లు, రాష్ట్రాల వారిగా వ్రాయబడి ఉన్నాయి. తొలి స్వాతంత్ర్య సంగ్రామం 1857లో వచ్చిన వారిలో కేవలం ముప్పయి మంది పేర్లూ, వహాబీ తిరుగుబాటుదార్లల్లో (1860- 1870) కేవలం అయిదుగురి పేర్లు మటుకే మనకు రికార్డుల్లో కనిపిస్తాయి. అయితే సెల్యూలర్ జైలును పావనం చేసిన స్వాతంత్ర్య యోధులు కనీసం 739 మంది పేర్లన్నా మనకు కానవస్తాయి. అలాగే 1942-45 మధ్యన అసువులు బాసిన 51 మంది పేర్లు కూడా రికార్డులో ఉన్నాయి. రికార్డులకెక్కని ప్రాణాలు ఎన్నో ఎవరెరిగారు?

స్వాతంత్ర్యానంతరం, అండమాన్ మాజీ రాజకీయ ఖైదీల సంఘం ఒక ప్రచురణ "అండమాన్ ముక్తి తీర్థ" అన్న పేరుతో వెలువరించింది. ఆ సంఘం సెల్యూలర్ జైలును జాతీయ స్మారక చిహ్నంగా భద్రపరచాలన్న ప్రతిపాదనతో ప్రభుత్వానికి అనేక అభ్యర్థనలు పంపించింది. చివరకి 1979లో అప్పటి ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయి ఫిబ్రవరి 11న దాన్ని జాతీయ స్మారకంగా ప్రకటించారు. 1941లో వచ్చిన భూకంపం, జపాను దాడుల కారణంగా పాడయిపోయిన జైలు భాగాలను నాల్గింటిని నేలమట్టం చేసి అక్కడ నేడు దీవుల్లో కెల్ల పెద్ద ఆసుపత్రిని నిర్మించారు. మిగిలిన 3 భాగాలు జిల్లా జైలుగా వినియోగిస్తున్నారు. ఇంతఘనమయిన చరిత్రగల సెల్యూలర్ జైలు చూడకపోతే అందమయిన అండమాన్ దీవుల్లో మరేమీ చూడనట్టే అనిపించింది నాకు. జైలు బయటికి వస్తుంటే గుండె భారంగా, మెదడు మొద్దు బారినట్టుగా ఫీలయ్యాము ఎందుకో?!

❖ ❖ ❖

కాని అవి ఎక్కడున్నాయో, ఏవేవి ఎవరెవరివో చెప్పే నాథుడూ లేడు, తెలిపే రికార్డులూ లేవు. బర్మా జాతీయులు బ్రిటిష్ దుష్పరిపాలనకు ఎదురు తిరిగి శరణు పొందింది ఇక్కడి అరణ్యాల్లోనే. ఆ తరువాతనే బ్రిటిష్ మిలిటరీ ఆఫీసర్లకు ఇక్కడ ఒక క్రమబద్ధమయిన జైలు నిర్మించాలన్న బ్రహ్మాండమయిన ఆలోచన తట్టింది. ఫలితంగా పోర్ట్‌బ్లెయిర్ సూపరింటెండెంట్ కల్నల్ ఎన్.ఎన్.టి. హార్స్‌ఫోర్ట్, 1896 సెప్టెంబరు 30 న జారీ చేసిన ఆర్డరు ప్రకారం అక్టోబరులో జైలు నిర్మాణం ప్రారంభమయింది. మేస్త్రీలు, సూపర్ వైజర్లు కాక కేవలం కూలీ పనివాళ్ళు 600 మంది పది సంత్సరాల కాలం శ్రమించి 1906లో దీని నిర్మాణం పూర్తి చేశారు. ఆ కాలంలో దాని నిర్మాణ వ్యయం రు.5,17,352.00 అని అంచనా వేశారు.

బ్రిటిష్ పాలనకు 1921లో ఎదురు తిరిగిన కేరళ మలబారీ ముస్లిం యోధులు (మోప్లాలు) అనేక మందిని 1922లో ఈ దీవుల్లోకి తీసుకువచ్చారు. ఇక్కడ వారిపట్ల కూడా హింసా దౌర్జన్యాలు మితిమీరిపోగానే, ఖైదీలు అధికారులకు ఎదురు తిరిగారు. అన్నింటికి తెగించిన ఈ యోధుల బారి నుండి తప్పించుకోవడానికి అధికారులు స్వేచ్ఛనిచ్చి అండమాన్‌లోనే నివాసాలు ఏర్పరచుకునేందుకు వారికి అవకాశమిచ్చారు. ప్రభుత్వం ఖర్చులపై తమ స్వస్థలానికి వెళ్ళి భార్యాపిల్లలను తెచ్చుకునేందుకు అవకాశమిచ్చారు. సేద్యం చేసుకునేందుకు భూమినిచ్చారు. వ్యాపారానికి అవకాశాలు కల్పించారు. ఆ విధంగా మలబారీ యెధులు అండమాన్ నివాసులయిపొయ్యారు.

రాక్షసత్వపు శిఖరాన

మూడంతస్తులు, చక్రంలోని కమ్మీలాంటి ఏడు విభాగాలతో 698 గదులు (cells) గల ఈ జైలు, అనేక దుర్ఘటనలకు, బ్రిటిషు పాలకుల దౌర్జన్యాలకు, అత్యాచారాలకు, స్వాతంత్ర్య యోధుల ధైర్య సాహసాలకు, వారి బలవత్తర ప్రతిఘటనలకు మూగసాక్షి. మిస్టర్ బారి (Barrie) అనే జైలు సూపరింటెండెంటు దురాగతాలు ప్రపంచ జైలు చరిత్రనే తిరగ వ్రాశాయి. అతని దుష్టపరిపాలనలో రాత్రివేళ మలమూత్ర విసర్జనకై వెళ్ళే అవకాశం కూడా లేకపొయ్యేది ఖైదీలకు. అర్ధరాత్రి మలవిసర్జన అవసరం కలిగినందుకుగాను ఖైదీకి కఠిన శిక్ష అనుభవంచవలసి వచ్చేది. ఈ సహజ అవసరానికి కూడా ఖైదీలు ఎంతో శిక్షంచబడేవారు. వ్యాధి వస్తే ఈ బారీ గారి దయ కలిగితే తప్ప డాక్టరుకు రిపోర్టు వెళ్ళేది కాదు. రిపోర్టు వెళ్ళిన వంద కేసుల్లో ఏ ఒక్క దానికో డాక్టరుగారు కరుణించి చూసేవారు. అండమాన్ దీవులకు మరో చరిత్ర కూడా ఉంది. రెండో ప్రపంచ మహా సంగ్రామం కాలంలో ఈ దీవులు బ్రిటిషు పాలకుల బారి నుండి జపాన్ కైవసమయ్యాయి. మార్చి 23, 1943 నుండి అక్టోబరు 7, 1945 వరకు జపాన్ పాలన క్రింద కూడా అండమాన్ వాసులు అనేక విధాల చిత్ర హింసలకు గురయ్యారు. వందలాది విద్యా

ఎంత బావుండేది?! వేలాది ప్రజల ప్రాణదానాలతో, రక్త ప్రవాహాలతో, ఎందరో వితంతువుల మూగ రోదనలతో, అసంఖ్యాక అనాధల గాధలతో అంతర్లీనమయివచ్చింది స్వాతంత్ర్యం. ఆ స్వాతంత్ర్య ఫలాలను, స్వతంత్ర భారతి గడించిన ప్రగతి ఫలాలను ఆస్వాదించేందుకు, అప్పుడు ఎనలేని దౌర్భాగ్యాలను చవి చూసిన వారెవరూ నేడు లేరు. ప్రపంచ చరిత్ర ఇలాగే కొనసాగుతుంది. ఎవరో నాటిన చెట్లు ఫలాలు మరెవరోతింటారు. ఎవరోకట్టిన భవంతుల్లో ఇంకెవరో రాజభోగాలననుభవిస్తారు.

ఈ రహస్యం తెలిసినా మనిషి శ్రమించి చెట్లను నాటడం మానడు, కష్టించి కట్టడాలు కట్టడం మానడు, ఇలాంటి నిస్వార్ధ కృషి ద్వారానే ప్రపంచం కళకళ లాడుతూ కనుల పండువుగా సాగుతోంది. కాని మనిషికి కేవలం భావితరాల నశ్వర భవిష్యత్తు చింతమటుకే కాకుండా శాశ్వత భవిష్యత్తు గురించిన చింతన కూడా కలిగి, పరలోక సాఫల్యం కొరకు సచేతన కృషి సలిపినట్లయితే తన సౌభాగ్యమే కాకుండా ప్రపంచ సౌభాగ్యాన్నీ స్వహస్తాలతో లిఖించగలడు. కాని మానవునికి ఆ భావన కలిగేదెన్నడు?

❖ ❖ ❖

మహాకారాగారం

ఈ సెల్యూలర్ జైలు నిర్మాణానికి పూర్వం కూడా అండమాన్ దీవుల్లోని అనేక ద్వీపాల్లో ఖైదీలను ముఖ్య భూమికి దూరంగా ఉంచి బాధించేవారు. 1857 లో జరిగిన తిరుగుబాటులో అసంఖ్యాకమయిన తిరుగుబాటుదారుల్ని ఇక్కడికి తీసుకువచ్చి నిర్బంధించారు. ఎంతమంది వచ్చారు, ఎంతమంది హతమయ్యారు, ఎంతమంది తిరిగి వెళ్లగలిగారు అన్నది నేటికీ తేలని విషయం. ఎలాంటి భోగట్టా పొందుపరచ బడలేదు. అయితే ఇక్కడికి వచ్చిన ప్రముఖులయిన బందీలు కొందరిలో మహా విద్వాంసులు, ఉన్నత గుణ సంపన్నులయిన ఇద్దరు ప్రప్రథమ స్వాతంత్ర్య యోధుల భోగట్టా లభిస్తుంది. వీరు ఇక్కడే పరమపదించారు కూడా. వారిలో ఒకరు, అల్లామా ఫజలె హక్ ఖైరాబాదీ, మరొకరు మౌలానా లియాకత్ అలి. వీరుకాక వీరితో పాటు 20 సంవత్సరాలు ఇక్కడ గడిపి తిరిగి ముఖ్య భూమికి చేరుకున్న అల్లామా మీర్ జాఫర్ అలి థానేసరి వ్రాసిన ఆత్మ కథ ద్వారా కొన్ని వివరాలు, ఆనాటి గాధలు వెలుగుచూశాయి.

యోధానుయోధుల శయ్య

అలాగే వహీబీ యోధులు (సయ్యిద్ అహ్మద్ షహీద్, సయ్యిద్ ఇస్మాయిల్ షహీద్ ఉద్యమానికి చెందిన వారు) కూడా అనేక మంది ఇక్కడే యాతనలకు గురయ్యారు. కాని వారి వివరాలు సయితం ఇంకా వెలుగుచూడలేదు. బ్రిటిష్ పరిపాలనకు ఎదురు తిరిగిన ఇంకా అనేక మంది యోధానుయోధుల సమాధులతో ఈ ద్వీపాలు పునీతమయిఉన్నాయి.

కాయలు, అరటిపళ్ళు కానుకలుగా తీసుకువెళ్ళి పాలనా యంత్రాంగంలోని వారు, విదేశీ పరిశోధకులు అప్పుడప్పుడు కలవడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. ఫలితంగా కొందరు జార్వాలు సన్నిహితులయ్యారు. కానుకలే వారిని మచ్చికచేసే మార్గాలుగా వారిని మరింత చేరువలోకి తీసుకునే యత్నాలు జరుగుతున్నాయి. వీరు దాదాపు 200 మంది ఉండవచ్చునని అంచనా. సెంతినెలీస్ అనే తెగ సెంతినెలీస్ ద్వీపం (అండమాన్ గ్రూపు)లో నివసిస్తున్నారు. వీరు కూడ క్రూరజాతియే. వీలు చిక్కితే వీరు అప్పుడప్పుడు నాగరిక మానవుల్ని ఎత్తుకు పోయి చంపుకు తింటారని ప్రతీత. వీరిని చేరడానికి జరిగిన ప్రయత్నాలు ఫలించలేదు. దూరం నుంచి, హెలికాప్టర్ల ద్వారా కానుకలు అందజేసి మచ్చిక చేసుకునే యత్నాలు జరుగుతున్నాయి. వీరు దాదాపు 80 మంది ఉండవచ్చునని అంచనా.

నాగరికత అబ్బుతోంది

మంగోలాయిడ్ జాతిలోని షాంపిన్స్ తెగ ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న తెగ. వీరు గ్రేట్ నికోబార్ అడవుల్లో ఉంటారు. జంకు, మొగమాటం ఎక్కువ, అయితే త్వరిత గతిన నాగరికులవుతున్నారు. వీరు 1981 సెన్సెస్ ప్రకారం 214 మంది ఉన్నారు. నికోబారీస్ తెగవారు బాగా ఎదుగుతున్న ప్రజలు. వీరు 1981 సెన్సెస్ ప్రకారం 22,025 మంది ఉన్నారు. వీరిలో విద్యావంతులు నాగరికులు అధికం. అనేకమంది అండమాన్ దీవుల్లో వచ్చి స్థిరపడ్డారు. ప్రభుత్వం అందజేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

❖ ❖ ❖

పరదేశంలో స్వభాషామృతం

ప్రపంచంలో మానవజాతి ఎన్ని సహస్రాబ్దుల నుండి నివసిస్తూఉందో, ఆదమ్ సంతతి వాతావరణ ప్రభావానికిలోనయి ప్రపంచంలో తిరుగుతూ ఎన్నెన్ని మార్పులకు, ఎన్నెన్ని వైవిధ్యాలకు లోనవుతూ అనేక జాతులుగా, తెగలుగా నేడున్న పరిస్థితికి చేరుకుందో ఇదమిత్థంగా చెప్పడం కష్టం. ఒకటి మాత్రం నిజం. మానవులు సాంఘికంగా ఎదిగి పలు సమస్యల్ని ఎదుర్కొని వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు సాగినప్పుడే ప్రగతి సాధ్యమయింది. ఏఏ ప్రాంతాల్లోనయితే విభిన్న కారణాలుగా ఒక్కోజాతికి బయటి లోకంతో, విభిన్న జాతులతో సంపర్కం కరవయిందో ఆయా ప్రాంతాల్లో నాగరికత ఎదగలేకపోయింది. దానికి అండమాన్ దీవుల్లోని ఆదిమవాసులే సాక్ష్యం. అక్కడ నివసించే విభిన్న తెగలు నేడు సమసిపోవడానికి కారణం బ్రిటిష పాలన కాలంలో వారివల్ల విభిన్న రోగాలు సోకడమని అండమాన్ దీవుల్లో ఆదిమ జాతుల అధ్యయనం చేసిన

ఆంత్రపోలాజిస్టులు అంటున్నారన్నది వాస్తవమే అనుకుంటే నాగరికత కేవలం ప్రగతీ వికాసాలనే కాదు వినాశ హేతువులనూ మానవతకు అందజేసిందని చెప్పక తప్పదు.

ఈ తెగల్లో కనీసం నాగరికతకు చేరువవుతున్న తెగల ద్వారా వారి సామాజిక, మతపరమయిన ప్రవర్తనలు, పోకడలు, సంప్రదాయాలు, విధానాలు ఎలాంటివో తెలుసుకునే అవకాశం నాకు అక్కడ ప్రాప్తం కాలేదు. వాటిని గురించి తెలుసుకుని ఉంటే, గీటురాయి పాఠకులకు ఆసక్తికరమయిన సమాచారాన్ని అందించి ఉండేవాణ్ణని ఇప్పుడుకాస్త బాధపడుతున్నాను.

ఉర్దూకు అడవుల్లో ఆదరణ

అది 12-2-1992 మధ్యాహ్నం సమయం. ఆంత్రపోలజీ మ్యూజియం నుండి బయటికి వచ్చి జుహర్ నమాజ్, భోజనాలు వగైరా ముగించుకుని కాసేపు సేద దీర్చుకున్నాము. మౌలానా అబ్దుల్ అజీజ్ గారు బాగా అలసిపోయినట్టుంది. ఆయనగారు వింబర్లి గంజ్‌కు తిరిగి వెళ్లిపొయ్యారు. ఇక మిగిలింది ముహమ్మద్ అలిగారు, రషీద్‌గారు, నేను, అబ్దుస్సలామ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)తో కాస్సేపు ముచ్చటించుకున్నాము. ఆయన మలబారీ (మోపలా ఉద్యమంలో వచ్చినవారి) సంతానం. అయితే తనకు మలయాళీ భాషలో ఆసక్తి లేదు ఉర్దూ బాగావచ్చు. ఉర్దూలో కవితలూ అవీ వ్రాస్తున్నారు. " హల్కయే అదబ్" అన్న పేరుతో ఓ సంఘం ఉందని ఈ సంఘం దీవుల్లో ఉర్దూ సాహిత్య వికాసానికి కృషి చేస్తోందని తెలిపాడు. మరోసారి ఆశ్చర్యపోవడం నావంతయింది. ఇక్కడ, ముఖ్యభూమికి వెయ్యి మైళ్ళ దూరాన ఉర్దూ సాహిత్యం (ఉర్దూ అదబ్) అన్నమాట విని సంభ్రమమూ ఆనందమూ కలిగాయి. ఉర్దూ పుట్టిన భూభాగాన (ఢిల్లీ) దాని నిరాదరణ, ఉర్దూ కవిత జన్మస్థలం (హైదరాబాద్)లో దాని పట్ల సవతి తల్లి ప్రేమ లభిస్తున్న తరుణంలో ఇక్కడ ఆదరం, పోషణ లభించడం అదృష్టమే కదా! సలామ్ గారు కొన్ని గజళ్ళు వినిపించారు. ఇంగ్లీషులో సయితం ఆయన వ్యాసాలు వ్రాస్తుంటారు. లోకల్ పేపర్లలోనే కాక 'రేడియన్స్'లోనూ వాటిని ప్రచురించారని ఆయన తెలిపారు. హల్కయే అదబ్ వారితో నేనూ కలవాలన్న కుతూహలం చూపాను. దానికి ముహమ్మద్ అలీ గారు ఈ వేళ సాయంత్రం వారితో పరిచయం చేయిస్తానని మాటిచ్చారు. ఆ తరువాత ఆంధ్ర అసోసియేషన్ వారిని వెదుక్కుంటూ బయల్దేరాము. సెక్రటరీగా ఉంటున్న అశోక్ కుమార్ గారితో నేను ముందు ఫోన్‌లో మాట్లాడాను. ఆయనగారేమో సాయంత్రం ఆరు గంటలకు వస్తే బావుంటుందని చెప్పారు. అలాగేనని ఒప్పుకుని హల్కయే ఆదబ్ వారిని కలుసుకునేందుకు ప్రయత్నిస్తే వారు కూడా సాయంత్రం మగ్రిబ్ తరువాతే నని చెప్పారు. చేసేదిలేక అలాగే ప్రోగ్రాం పెట్టుకున్నాము.

తెలుగువారి అనాసక్తత

ఆంధ్ర అసోసియేషన్ కన్నా 'తమిళ్ సంఘం' ఎంతో ఉత్సాహకరమయిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అలాగే కన్నడ సంఘం కూడా లైబ్రరీ గట్రా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియం లాంటి హాలు ఒకటి నిర్మించింది. అది పెళ్ళిళ్ళకు అద్దెకు ఇవ్వడం జరుగుతూ ఉంటుంది. అప్పుడప్పుడు పౌరాణిక, సాంఘిక డ్రామాలు వేస్తుంటారు. ఇవి తప్ప సాహితీ కార్యక్రమాలు ఏవీ లేవు. అండమాన్ దీవుల్లోని తెలుగువారు చాలామంది హార్బరులో కూలీ పనిచేసేవారుగా, చేపలు పట్టి అమ్మేవారుగా, ఇతర సాధారణ కూలీలుగా పనిచేస్తున్నారు. తెలుగువిద్య ఇప్పుడిప్పుడే వారిలో వ్యాప్తి చెందుతూ ఉంది. ఇంతకాలం దాదాపు 20 శాతం ఉన్నప్పటికి తెలుగు పాఠశాలలు లేవు కాబట్టి వారు చదువు వైపు శ్రద్ధ చూపలేదని, ఇప్పుడిప్పుడే ఆ రంగంలో ముందడుగు వేస్తున్నారని శ్రీ అశోక్ కుమార్ తెలిపారు. లైబ్రరి, రీడింగ్ రూము, వయోజన విద్య లాంటి విషయాలను చేపట్టమని నేను సలహా ఇచ్చాను. అసోసియేషన్ క్రొత్త బిల్డింగ్ కడుతున్నామని ఆ తరువాత వయోజనవిద్య, లైబ్రరీ, రీడింగురూము ఇంకా సాహితీ కార్యకలాపాలను ప్రారంభిస్తామని శ్రీ అశోక్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సహాయం అందజేస్తోందని ఈ కార్యక్రమాలను చేపట్టేందుకు తగిన ప్రోత్సాహం లభిస్తే తప్పక చేపడతామని ఆయన హామీ నిచ్చారు. అక్కడ వారికి గీటురాయి పరిచయం చేశాను. డ్రామా రిహర్సల్స్‌కు వచ్చిన కొందరు కళాకారులతో శ్రీ అశోక్ కుమార్ పరిచయం చేయించారు. శ్రీ జగన్నాధరావు, శ్రీ షేక్ అమీర్ అలి గార్లు ప్రముఖంగా డ్రామాల్లో శ్రద్ధ కనబరుస్తున్నట్లు తెలిసింది. అండమాన్ దీవుల్లోని ఆంధ్రుల సామాజిక స్థితి బాగుపడాలంటే వారిలో చైతన్యం కలగటం, విద్య వ్యాప్తి చెందడం ఎంతయినా అవసరమని దానిగ్గాను ఆంధ్ర అసోసియేషన్ తగిన శ్రద్ధ, ఆసక్తి చూపుతూ సరయిన కార్యక్రమాలు రూపొందించాలని శ్రీ అశోక్ కుమార్ గారికి సలహా ఇచ్చి అక్కణ్ణుంచి తిరుగుముఖం పట్టాము.

కమ్మదనాలు పండుతున్నాయి

మిష్టర్ ఐ.ఏ.ఖాన్ గారి నేషనల్ ఎలక్ట్రానిక్స్ షాపులో ఉర్దూ సాహితీ సంఘం వారిని కలసుకున్నాము. ఖాలిద్‌గారు యు.పి.కి చెందినవారు. ముహమ్మద్ ఈసా కలకత్తాకు చెందినవారు, గోవింద రాజు 'రాజ్'గారు కన్నడిగులు, శ్రీ రాజ్‌గారు హల్కయే అదబ్‌కు సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. శ్రీ గోవిందరాజు 'రాజ్' గారి పేరు విని తొలుత తెలుగు వారని భావించాను. తరువాత తెలిసింది ఆయన కన్నడిగులని. ఆయన ఉర్దూ మీడియంతో చదువుకున్నారు. ఉర్దూ సాహిత్యం బాగా ఆకళింపు చేసుకున్నారు. గజళ్ళు

వ్రాస్తున్నారు "అందువల్లనే నా సంతానానికీ ఉర్దూ భాషను నేర్పుతున్నాను. ఉర్దూలోని మాధుర్యం నా ఇంట్లో నాతోనే అంతరించి పోరాదన్నది నా ప్రగాఢ వాంఛ" అని ఆయన అన్నారు. నాకు వీలున్న సమయం చూసి ఆదివారం 16న మధ్యాహ్నం వేళ ఓ సాహిత్య గోష్ఠి పెట్టుకుందాము రండని కోరారు. నా కోసమని పెడుతున్న గోష్ఠి ఎలాగయినా తప్పక హాజరవుతానని మాటిచ్చాను. నేనూ కవితలు వినిపించాలని శ్రీ రాజ్ గారు పట్టుపట్టారు. సరేననక తప్ప లేదు.

జాతి పేర్ల ప్రత్యేకతలు

పోయినవారం చెప్పాను మంగోలాయిడ్, నీగ్రిటో జాతులను గురించి చెబుతానని! నీగ్రిటో జాతి వారు పొట్టిగా, కొంత పసుపు వన్నె కలగలిపిన నల్లని ఛాయకలిగి చిన్న చిన్న ఉంగరాల జుత్తుతో, పెద్ద పల్లు, ముందుకు వచ్చిన దవడలతో, చప్పిడి ముక్కుతో ఆఫ్రికా (నీగ్రో) జాతి ప్రజలను పోలి ఉంటారు. మంగోలాయిడ్ జాతివారేమో మధ్యస్థ ఎత్తు, పాలిపోయిన తెల్లగా లేదా కాస్త బ్రౌను ఛాయతో కరుకైన వంకీలులేని నల్లని జుత్తుతో, దాదాపు చదునయిన ముఖం, కాస్త ఎత్తయిన చెంప ఎముకలు కలిగి ముఖాన, కంటిపై రోమాలు దాదాపు లేకుండా మంగోలియా జాతిని పోలి ఉంటారు. ఈ రెండు విభిన్న జాతుల ప్రజలు అండమాన్ దీవుల్లోకి ఎలా చేరారు? ఆంథ్రోపోలాజిస్టులు తేల్చవలసిన విషయం.

❖ ❖ ❖

అందం, ఆనందం, ఆహ్వానం

ఫజ్ర్ నమాజ్ తరువాత నేను ఒంటరిగా చెట్ల మధ్య వంకలు తిరిగిన బాటలో కాస్సేపు తిరిగి వద్దామని బయలుదేరాను. పోకతోటలు, ఇండ్ల చుట్టూ ఆవరణలో యధేచ్ఛగా పెరిగిన పోక చెట్లు బాగా కాయలు కాసినట్లున్నాయి. పచ్చని చెట్లు ఆకుల మధ్య నారింజ రంగు పోక కాయలు ఎంతో అందంగా అగుపిస్తున్నాయి. అండమాన్‌లో విరివిగా జరిగే ఉత్పాదన పోకలే, తరువాత బహుశా కొబ్బరికాయలు రెండవ స్థానంలో ఉండవచ్చు.

ఆటవిక సౌందర్యం

ఇక్కడి అడవిలో రెండు రకాల చెట్ల ప్రత్యేకతలు చెప్పుకోవలసిందే. ఒకటి 'సిరిస్' చెట్లు ఇవి మహావృక్షాలు. రోడ్ల వెంట, కొండలపైనా, బయట ప్రదేశాల్లో ఫిబ్రవరి నెల కావటాన అప్పుడప్పుడే ఆకులు చిగురిస్తున్నాయేమో ఆకాశంలో ఎగబాసిన చెట్ల కొమ్మలు,

విరబూసిన కురుల్లా ఎంతో అందంగా, ఆకర్షణీయంగా, వాటినే గంటల తరబడి చూస్తూ నిలుచునేలా చేస్తున్నాయి. అండమాన్‌లో మరో చెప్పుకోదగ్గ చెట్టు 'పెడాక్ చెట్టు'. ఇది మన ప్రాంతాల్లోని టేకు కన్నా నాణ్యమయినది, ఖరీదయిందట. దాని చెక్క రంగు రూపు దాదాపు టేకులానే ఉంటుంది. 'సిరిస్' చెట్లు పోక చెట్ల అందాలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి.

పచ్చని చెట్లు నిండిన కొండల మధ్య దిబ్బలు, వాటిపై కట్టెపలకలతో కట్టిన ఇండ్లు, ఇండ్ల చుట్టూ మెండుగా కాసిన పోక చెట్లు ఎంత చూసినా తనివి తీరని దృశ్యాలు! ఇలా ఆలోచించుకుంటూ, ఆనందిస్తూ, ఆహ్లాదిస్తూ నడుస్తున్నాను. చాలా సేపటికిగాని తెలిసిరాలేదు, నేను చాలా దూరం వచ్చేశానని. కాస్త పొద్దెక్కింది, వెనక్కితిరిగాను. తూర్పుతట్టు నుండి వెండిలా మెరుస్తున్నాయి సూర్యకిరణాలు. కొండలు, కారడవులు, ఇండ్లూ పొదరిండ్లు దాటుకుంటూ, నేను నడుస్తున్న రోడ్డుపై నుంచి పడమటి దిక్కున కొండలపైదాకా వెడుతున్నాయి. వింబర్లిగంజ్‌లోని 'మన్‌ఫఉల్ ఇస్లాం' మస్జిద్ మదరసా చేరే వరకు ఖాలిద్ గారు నిరీక్షిస్తున్నారు. "గబగబా స్నానాలు గట్రా ముగించుకోండి, మౌలానా గారు టిఫిన్ చెయ్యడానికి మీ కోసం చూస్తున్నారు" హెచ్చరించారు ఖాలిద్‌గారు. ఆరోజున (13.2.1992) ఏ కార్యక్రమమూ లేదు. వింబర్లిగంజ్, చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో మిత్రుల్ని కలసుకోవడం, మా నివాసస్థలానికి వచ్చిన మిత్రులతో ముచ్చటించడం ఇవే ఆరోజు కార్యక్రమాలు.

సాయంత్రం 'స్టీవర్ట్ గంజ్'లోని సివిల్ ఆసుపత్రిలో డా.ప్రసాద్ గారిని కలుసుకోవాలన్నది ప్రత్యేక కార్యక్రమం. డా.ప్రసాద్ గోదావరి జిల్లాకు చెందినవారు. వారి శ్రీమతి డా.లలితా ప్రసాద్ కూడా ఆ ప్రాంతం వారే. డాక్టరుగారు మమ్మల్ని ఆదరంగా ఆహ్వానించి, అతిథి మర్యాదలన్నీ చేశారు. డాక్టర్ గారితో అక్కడి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకునే అవకాశం కలిగింది. ఇంతటి ఆహ్లాదకరమయిన, ఆరోగ్యకరమయిన వాతావరణంలో ఉన్నప్పటికీ అక్కడి సామాన్య ప్రజలు ఆరోగ్యవంతంగా కనిపించరేమిటీ అన్నది నన్ను వేధిస్తున్న ప్రశ్న. అదే అడిగాను డాక్టరుగారిని. రక్షిత(protected) నీరు లభ్యం కాకపోవడం చేతను, ఆ విషయంలో అలక్ష్యం వల్ల నిలువ వుండే కుంటల్లోని నీరు త్రాగడం చేతను, పొగ (బీడీలు, చుట్టలు) విరివిగా త్రాగడం చేతను అక్కడి ప్రజలు ఆరోగ్యవంతంగా కనిపించరని, కాని ప్రభుత్వం తరపున వారి చికిత్సకు తగినన్ని ఏర్పాట్లున్నాయని మందులు మెండుగా లభ్యమవుతున్నాయని ఆయన తెలిపారు. "ఒక్కోసారి వినియోగం కన్నా అధికంగా మందులు వస్తుంటాయి" అని డాక్టరుగారు చెప్పారు. పోర్టు బ్లెయిర్‌లోని సెల్యూలర్ జైల్లో కట్టిన పెద్దాసుపత్రికాక అనేక సివిల్ ఆసుత్రులు, డిస్పెన్సరీలు ఈ దీవుల్లో ఉన్నాయని, ఏవయినా చిక్కు సమస్యలుంటే తప్ప ముఖ్యభూమికి వైద్య సహాయానికి వెళ్ళవలసిన పని ఉండదని డాక్టరుగారు చెప్పారు.

"ఇక్కడ ప్రయివేటు ప్రాక్టీసుకు తావేలేదు. అందువల్ల మందుల షాపులూ మీకు కానరావు. పోర్ట్‌బ్లెయిర్‌లో ఒకటి అరా ఉన్నాయి. అవి అంతంత మాత్రంగానే నడుస్తున్నాయన్నారు డాక్టరు ప్రసాద్. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడిపోయినట్లు డా. శ్రీమతి లలితా ప్రసాద్ చెప్పారు. తెలుగు నేలనుంచి వచ్చిన డాక్టర్ దంపతుల్ని కలుసుకున్న నాకూ, రషీద్ గారికి ఎంతో ఆనందానుభూతి కలిగింది. ఆ తరువాత ఎవరో నావల్ ఆఫిసర్లు అతిథులుగా రావడంతో సెలవుతీసుకుని బయల్దేరాము.

భావన, సంభావన

దారి మధ్యలో ఓ చోట ఆపి ముహమ్మద్ అలీగారు, 'ఈ కొండ పైన్నే మాజీ ప్రధాని రాజీవ్ గాంధి, ఆయన మిత్రులు అమితాబ్‌బచ్చన్ వగైరా హాలిడే జరుపుకోవడానికి ఏర్పాట్లు జరిగింది", "ఏర్పాట్లంటే ఏం చేశారు?", "చాలా అందమయిన రెస్ట్ హౌజ్ కట్టి ఆ ప్రాంతాన్నంతా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. మనం వెళ్లాలంటే ఏదయినా జీపు మాట్లాడుకోవలసి ఉంటుంది" చెప్పారు ముహమ్మద్ అలి. "పాపం స్వయాన రాజీవ్ గాంధిగారే అనుభవించలేక పొయ్యారు. ఇక మనం వెళ్ళడం దేనికి?" అన్నాను నిరాసక్తంగా.

మనిషి ఎన్నెన్నో ఆలోచించుకుంటాడు. ఏవేవో పథకాలు వేసుకుంటాడు. కాని అవన్నీ నెరవేరుతాయన్న నమ్మకముండదు. బలీయమయిన ఓ శక్తి యావత్తు సృష్టి కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్టే మనిషి కదలికల్నీ నియంత్రిస్తోంది. కాని ఆ శక్తి సంకల్పం ఎవరిని ఏ దిశలో పయనింపజెయ్యదలిచిందో, ఎవరి సంకల్పాలను ఎలా మలచ దలచిందో మనలో ఎవరికీ అంతుపట్టని వ్యవహారం. అందుకే మనకు మేలయినదని, సరయినదని, శ్రేయస్కరమయినదని, శుభకరమయినదని తెలిసిన మార్గాన నిరంతరం ఆత్మావలోకనం చేసుకుంటూ ముందుకు సాగడమే మన కర్తవ్యం, మన సంకల్పం. ఆ పరమ సంకల్ప శక్తి సమక్షంలో ఏమాత్రం విలువయినది కాకపోయినా, ప్రతిఫలం మటుకు మనకు మన సంకల్పం ఆధారంగానే ప్రాప్తమవుతుంది. ఈ చిదంబర రహస్యం తెలుసుకుంటే మనిషి జీవితం ఆనందమయం, సుఖదాయకం అవుతుంది.

విశ్వాస పరిమళం

మగిరిబ్ వేళ అవుతోంది. అస్తమించే సూర్యుణ్ణి చిత్రీకరణ యంత్రంలో బంధించాలని ప్రయత్నించాను. (అది విఫలమయిందని ఫిల్మ్ డెవలప్ చేసిన తరువాతగాని తెలిసిరాలేదు.)

14.2.92 న శుక్రవారం కాబట్టి మౌలానా అబ్దుల్ అజీజ్ గారు వింబర్లీ గంజ్ మస్జిద్‌లోనే జుమా ప్రసంగం చేశారు. విశ్వాసికి విశ్వమంతా ఇల్లే. అతను ఎక్కడున్నా

తన చుట్టూ నున్న వాతావరణాన్ని విశ్వాసమయం చేస్తాడు. సుగంధ భరితమయిన అందమయిన రోజాపువ్వు ఎక్కడున్నా వాతావరణాన్నంతా పరిమళమయం చేస్తుంది. అది తన సహజ సౌందర్యంతో మొత్తం వాతావరణాన్నే సొగసయినదిగా మార్చివేస్తుంది. పరదేశంలో ఉంటున్నామన్న భావన వదిలి, ఏ చెట్టున చేరిన పక్షి అయినా ఆ చెట్టుపైనే గూడుకట్టుకుని ఆ చెట్టునే నందనవనంగా మార్చే యత్నం చేస్తుంది. దాన్ని సకల ప్రమాదాలనుండి కాపాడే కృషి జరుపుతుంది. ఈ భావం నాలో కలగటానికి కారణం శుక్రవారంనాడు మస్జిద్‌లో కనిపించిన మిత్రులు. వారిలో యు.పి. నుండి వచ్చిన వారు, బీహారు నుండి, కేరళ నుంచి, తమిళనాడు నుంచి, ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన వారు, విభేదాలు ఎంత మాత్రం లేకుండా సమైక్యంగా ఆరాధన జరపడమే కాక అక్కడి వాతావరణంలో ఇమిడి పోయినట్టు కానరావడమే. ఇలాంటి దృశ్యాలు మన దేశంలో అనేక చోట్ల అగుపడినా, ప్రపంచంలో మరెన్నో చోట్ల కానవచ్చినా, వింబర్లీగంజ్‌లోని ముస్లిములందరూ అపరిచిత వాతావరణంలోకి వచ్చి, దాన్నే తమ నివాసంగా చేసుకుని, అందరూ కలసి ధర్మ సంస్థాపనార్థం కృషి జరిపే వారుగా రూపొందటం నన్ను అబ్బురపరిచి ఆలోచింపజేసింది.

❖ ❖ ❖

శిథిలమయిన తెల్లదొరల ప్రాభవం

ఆరోజు (14.2.92) సాయంత్రం పోర్టు బ్లెయిర్‌కు వచ్చాము. కొందరు మిత్రుల్ని కలసుకున్న తరువాత నేనూ రషీద్ గారు కలసి సెల్యూలర్ జైలులో జరిగే 'దృశ్యశ్రవణ' (Light & Sound) కార్యక్రమం చూడడానికి వెళ్ళాము. మహాద్భుతమయిన కార్యక్రమం.

దృశ్యశ్రవణం- మహాసాధనం

సెల్యూలర్ జైలు చరిత్రను తద్వారా అండమాన్ చరిత్రను సయితం ఆ కార్యక్రమంలో ఇమిడ్చారు. మిగిలి ఉన్న కట్టడం, ఉరి వేసే గది, కొరడా దెబ్బలతో శిక్షించే చోటు, కొబ్బరి పీచుతీసే గదులు - వీటినన్నింటినీ ఉపయోగించుకుంటూ నేపథ్యంలో వివరణ, సంభాషణలతో ఎంతో ముచ్చటగా, సమాచారాన్నీ, వినోదాన్నీ, భావోద్వేగాన్నీ, సమ్మిళితం చేసి రూపొందించిన కార్యక్రమం అది. మనిషి అందులో, ఆనాటి వాతావరణంలో లీనమయి పొయ్యేలా చేస్తుంది. ఒక గంటసాగే కార్యక్రమం ముగిసిన తరువాతకూడా ఇంకా కాస్త పొడిగిస్తే బావుండేది అనిపించేలా తీర్చిదిద్దారు దాన్ని. చరిత్రతో సంబంధం అంటే గతంతో సంబంధమన్న మాట. భావితరాలవారికి తమ గత గాథ తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎన్నయినా కావలసిందే

అనిపించింది. మరో విషయం ఆ సమయంలో నాలో మెదిలింది. చరిత్ర కట్టడాలు, స్థలాల ద్వారా మంచి భావస్ఫోరకమయిన నేపథ్య వివరణతో వీడియో కేసెట్లను తయారు చేసినట్లయితే ఆయా స్థలాలకు వెళ్ళలేనివారు వాటి ద్వారా ఎంతయినా ప్రయోజనం పొందగలరు. ఆ తయారు చేసే వారు దైవవిశ్వాసం, దైవమార్గదర్శకత్వం, పరలోక భావం కూడా కలవారయితే ప్రజల్లో నిజమయిన దైవభక్తిని కలిగించడానికి ఇలాంటి వీడియో కేసట్లు ఎంతయినా ప్రయోజనకరమవుతాయి. అయితే అన్ని కార్యక్రమాల మాదిరిగానే ఈ కార్యక్రమాన్నీ చేపట్టాలంటే చిత్తశుద్ధి, ఏకాగ్రత, త్యాగభావం, పరిశ్రమలతో పాటు కార్యదక్షత, కార్యదీక్ష, శక్తి సామర్థ్యాలుగల కార్యకర్తలూకావాలి, ధనస్థోమతా ఉండాలి. ప్చ్, నేడు మనకు కొరవడినవి బహుశా ఇవే కాబోలు! చెయ్యాలనుకంటే ఎన్నో పనులు !!

ఆ కార్యక్రమం ముగించుకుని నేరుగా 'ముబారక్ స్టోర్స్ ' యజమాని ఎం. ఏ. మజీద్‌గారి ఇంటికి వెళ్లాము. అక్కడ కార్యకర్తల సమావేశం ఒకటి జరుగుతోంది. యువ కార్యకర్తల ఆ సమావేశంలో మౌలానా అబ్దుల్ అజీజ్‌గారు, అవినీతి, అశ్లీలత, లక్ష్యరాహిత్యం పెరిగిపోతున్న ఈ రోజుల్లో ప్రజల్లో దైవభావన, పరలోక చింతన కలిగించడం, అందరినీ మంచి పౌరులు, మంచి దేవుని దాసులుగా, మానవ సేవకులుగా మలచడం ఎంత ప్రముఖమయిన కార్యమో వివరించి యువకులు సమాజ సముద్ధరణకు నడుం కట్టుకున్నప్పుడే ఏ కార్యమయినా సఫలీకృతమవుతుందని తెలిపారు. హాజరయిన యువకులు కొందరే అయినా విద్యాధికులవడం చేత వారి ద్వారా ఆ ప్రాంతాల్లో సమగ్రమయిన సమాజోద్ధరణ జరుగుతుందన్న నమ్మకం కుదిరింది. యువకులు తమ సంకల్పాన్నీ కృతనిశ్చయాన్నీ అక్కడ ధృవపరిచారు కూడా.

జీర్ణ సౌందర్యం

మరుసటి రోజు రోస్ ఐలాండ్ (Rose Island) కు వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకున్నాము కాబట్టి కార్యక్రమం ముగిసిన తరువాత, భోజనాలు చేసుకుని రాత్రి అక్కడే బసచేశాము. తెల్లారి (15.2.92) 8.30 గంటలకల్లా తయారయి రోస్ ఐలాండ్‌కని బయల్దేరాము. రోస్ ఐలాండ్ సౌత్ అండమాన్ ద్వీపానికి తూర్పున ఉన్న చిన్న ద్వీపం. పోర్ట్‌బ్లెయిర్ నుండి వింబర్లిగంజ్‌కు వెళ్ళే సమయాల్లో మధ్యన అగుపిస్తూ ఉంటుంది. సెల్యూలర్ జెయిల్ నుంచి అతి సమీపంగా దర్శనమిస్తుంది. హార్బరునుండి 10 నిమిషాల పడవ ప్రయాణం. రోస్ ఐలాండ్ అండమాన్ నికోబార్ దీవుల్లో వెలిసిన ప్రప్రథమ బ్రిటిష్ రాజధాని, ఇక్కడ సెక్రటేరియట్, ప్రింటింగ్‌ప్రెస్, పార్కు, క్లబ్బు, స్విమ్మింగ్‌పూల్, చర్చీ, నివాస భవనాలు, బజారు అన్నీ శిధిలావస్థలో దర్శనమిస్తాయి. బిల్డింగులన్నీ ఆ కాలంలో ఎంతో అందాన్ని సంతరించుకుని వాటిని వాడుకున్న వారికి మరెంతో ఆనందాన్ని

ఆహ్లాదాన్నీ పంచి ఇచ్చాయన్నది ప్రస్ఫుటంగా అగుపడుతోంది. ఇక్కడి తొల్దొలి బేకరి కమ్ జనరల్ స్టోర్‌ని ఫర్జంద్ అలీ అనే ఆసామి స్థాపించడం వింతల్లో వింతయిన విషయం. అతన్ని గురించి ఆరా తీసి తెలుసుకునే అవకాశం దొరకలేదు కాని అతను ధనం సంపాదించడమే కాక లక్షల విలువ చేసే వక్ఫ్ ఆస్తుల్ని పోర్ట్‌బ్లెయిర్‌లో దానం చేశాడు. ప్రభుత్వ కార్యాలయాలనేకం ఫర్జందె అలీ దానం చేసిన స్థలాల్లోనే నిర్మించ బడ్డాయట. శిధిలావస్థలో ఉన్న అనేక కట్టడాలపై రషీద్‌గారి కెమెరా క్లిక్కుమంటూనే ఉంది. జింకలు, లేళ్ళు గంతులు వేస్తూ ఉంటే తీసిన ఫోటోలను గురించి చెప్పనవసరం లేదు. కడకు రీలు మొత్తం ముగిసినట్లు చివరి నెంబరూ వచ్చేసింది.

కెమెరా మింగిన చిత్రాలు

పన్నెండు గంటలు కావచ్చాయి. బాగా అలసిపోయామేమో చెట్ల క్రింద కూర్చొని సేదదీర్చుకుంటున్నాము. రషీద్ గారు కెమెరా తెరచి కొత్తరీలు ఎక్కిద్దామన్నారు. కెమెరా తెరవడం ఎవరి తరమూకాలేదు. అంతలోనే ఓ టూరిస్టు అటుగా వచ్చారు. ఆయన చేతిలోనూ ఓ కెమెరా ఉంది. ఆయన్ని అర్థించారు రషీద్ గారు. ఆయన కాస్త ప్రయత్నించి తెరచారు. ఆశ్చర్యం ! అందులో రీలు లేనే లేదు ! అంతా పగలబడి నవ్వాము. "నాలుగు రోజులుగా తెగ దీసిన ఫోటోలు ఏమయ్యాయి?" అంటూ మౌలానా అబ్దుల్ అజీజ్ గారు ఆటపట్టించారు రషీద్‌గారిని. పాపం రషీద్‌గారి ముఖం జేవురించింది. జరిగిందేమిటో అర్థమే కావడం లేదాయనకు! "పచ్చి మోసం, రీలు నింపి ఇస్తానని లోనికి తీసుకువెళ్ళాడు, మోసం చేశాడు" అన్నారాయన కోపంతో "ఎవరూ?" అని నేనడిగిన దానికి "ఎవరయితే నేమి, సరే ఇక చేసేదేమీ లేదు, కొత్తరీలు నింపండి" అన్నారాయన. అలా రషీద్‌గారి కెమెరా ఉందంతం, దాదాపు మేము రోస్ ఐలాండ్ నుండి తిరిగి వచ్చే వరకూ నవ్వు తెప్పిస్తూనే ఉండింది. సముద్ర జీవ జాలంతో ఏర్పడిన 'కోరల్' (Coral) రాళ్ళు కొన్ని నేను, రషీద్ గారు రోస్ ఐలాండ్ తీరాన వెదికి యేరుకున్నాము. కోరల్‌ని సజీవంగా చూడాలంటే 'జాలిబోయ్' (Jolly Buoy) ద్వీపానికి వెళ్ళాలని చెప్పారు. కాని నాకు కారణాంతరాల వల్ల అక్కడికి వేళ్ళే సమయం, అవకాశం లేకపోయింది. అండమాన్ దీవుల్ని జపాన్ వారు స్వాధీనం చేసుకున్న కాలం (1942- 45)లో యుద్ధకాలం కాబట్టి పలుచోట్ల వారు బంకర్లు కట్టారు. రోస్ ఐలాండ్ లోనూ అలాంటి బంకర్లు కనిపించాయి. మధ్యాహ్నం 1-30 గంటలకు 'రోస్ తిరంగా పార్క్' వద్ద బహిరంగ సభ నుద్దేశించి మాట్లాడవలసి ఉంది. మౌలానా గారిది మెయిన్ స్పీచ్ అయితే నన్నూ తెలుగులో మాట్లాడమన్నారు. దానిగ్గాను ప్రిపేరవుతున్నాను.

❖ ❖ ❖

తిరంగా పార్క్

పోర్టుబ్లెయిర్‌లో ప్రముఖ వాణిజ్య కూడలి అయిన అబెర్‌దీన్, బజార్‌లో సాధారణంగా బహిరంగ సభలు జరిగే చోటు. 'తిరంగా పార్క్' 'రత్నం మార్కెట్ ' (రత్నం గారు ఆంధ్రులు), నగరపాలిక (మునిసిపల్ ఆఫీసు), పోలిసు స్టేషను - వీటన్నింటికి చేరువగా వున్న తిరంగా పార్క్‌లో జమాఅత్ కార్యకర్తలు ఏర్పాటు చేశారు బహిరంగసభ.

ఇక్కడి బహిరంగ సభలింతే

ఓ మూలన ఉన్న స్టేజిపైన కుర్చీలు, మైకు అమర్చి పెట్టారు. పార్కు మధ్యన కొందరు పిల్లలు ఆడుకుంటున్నారు. రత్నం మార్కెట్ ఎదురుగా పార్కు, అందులో బుక్‌స్టాల్ ఒకటి వెలిసింది. అక్కడ ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు, తమిళం, తెలుగు, మళయాళీ, కన్నడ భాషల్లో పుస్తకాలు, ఇస్లామీయ సాహిత్య పుస్తకాలు అమర్చారు. కొందరు యువకులు, పెద్దలు బుక్‌స్టాల్ వద్ద గుమికూడి పుస్తకాలను చూస్తున్నారు. రోడ్డుపై మహారద్దీగా ఉంది. పార్కు చుట్టూత కొందరు మనుషులు ఫెన్స్‌ను ఆనుకొని నిలబడి పిచ్చాపాటిలో నిమగ్నులయి ఉన్నారు. బహిరంగ సభకై అక్కడికి వచ్చినప్పటి దృశ్యమిది. మాతో పాటు వచ్చిన ముహమ్మద్ అలిని ఉద్దేశించి, "ఇదేమిటి పరిస్థితి ఇలా ఉంది?" అన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాను. చిరునవ్వే సమాధానంగా, "ఇక్కడ అంతేనండి, ఎవ్వరూ వచ్చి తాపీగా కూర్చొని వినరు, అంతా దూరం దూరంగానే నిలబడి వింటారు. అదో అలా చూడండి........... ఆ..... వాళ్ళంతా సభ వినడానికి వచ్చిన వారే. దగ్గరికి రారు. అంతెందుకూ? మొన్న ఎలక్షన్లు జరిగినప్పుడు పెద్ద పెద్ద రాజకీయ నాయకులు మెయిన్‌లాండు నుంచి వచ్చి చాలా మంది ఇక్కడే ప్రసంగాలు చేశారు. భారతీయ జనాతా పార్టీ నాయకులు లాల్ కృష్ణ అద్వాని తిరంగా పార్క్‌లోనే సభ చేశారు. అప్పుడు సయితం జనం ఇలాగే నిలబడి విన్నారు తప్ప దగ్గరికి వచ్చి కూర్చున్న పాపాన పోలేదు" అంటూ నవ్వారాయన. నేనొక్కణ్ణే కాక మౌలానా అబ్దుల్ అజీజ్, రషీద్ ముహియుద్దీన్ కూడా ఆశ్చర్యపొయ్యారు. తరువాత సభ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఓ మిత్రులు మమ్మల్ని ముగ్గురినీ- మౌలానా అబ్దుల్ అజీజ్, మిత్రులు ముహమ్మద్ అలీ, మీ సంపాదకుడు - ముగ్గురినీ వేదికపైకి పిలిచారు. ముహమ్మద్ అలీగారు పరిచయ వాక్యాలు ప్రారంభవాక్కులు పలికారు. ఆ తరువాత మాట్లాడడం నావంతయింది. నేను మైకు దగ్గరికి వెళ్ళి ప్రారంభ వచనాలు పలకడంతో పాటు చుట్టూ కలయజూశాను. ఏమయినా తెలుగు ముఖాలు కనిపిస్తాయేమోనని, రోడ్డుపై జనం హడావిడిగా వస్తూపోతూనే ఉన్నారు. కొందరు మటుకు తెలుగు మాటలు విని ఆగి (వింతగానో మరేమో) మా వైపు చూసి పార్కు ఫెన్స్ వరకు వస్తున్నారు. మరి కొందరు చూసి అలా వెళ్ళి పోతున్నారు. ఈ సభలో జమాఅత్ సందేశాన్ని, జమాఅత్ పరిచయాన్ని నేను అందజెయ్యవలసి ఉంది.

జమాఅత్ సందేశం

నేను నా ప్రసంగంలో, తెలుగు నేలకు దూరంగా తెలుగు వారి మధ్య మాట్లాడుతూ కలుగుతున్న ఆనందానుభూతిని సభికులతో పంచుకుని దైవం మనకు ఇచ్చిన సంపదల్ని - పంటలు, ఖనిజ నిక్షేపాలు మొదలుకుని, విద్య విజ్ఞానాలు, సాధించిన సాంకేతిక నైపుణ్యాల వరకు అన్నింటినీ పుష్కలంగానే ఇచ్చాడన్న సత్యాన్ని తెలిపాను. మనం ఎంతో ప్రగతి సాధించిన దాని ఫలాలు మారు మూల ప్రదేశాలకు అండమాన్ లాంటి దూర దీవులకు అసలు చేరనేలేదు. మనలో స్వార్థం పెరిగింది. పొరుగు వాని పట్ల ప్రేమానురాగాలు అలా ఉంచి కనీస సానుభూతికూడా కొరవడింది. మనలో తనకోసం, తన సంతానం కోసం, తన బంధువులకోసం జీవించే స్వార్థ ప్రియత్వం అధికమయినందున తోటి సోదరుల్లో, విద్వేషం, విద్రోహం చెలరేగింది. ఫలితంగా భాషావాదంతో, ప్రాంతీయ తత్వంతో, టెర్రరిజం, కమ్యునలిజం లాంటి అతివాద వైఖరులు నాటుకు పోసాగాయి. అన్నింటి మూలంగా దేశంలో శాంతి కొరవడింది. హత్యలు, దహనాలు, లూటీలు సాధారణమయిపొయ్యాయి. సామాజిక పరిస్థితులు ఇలా ఉంటే రాజకీయ నాయకుల్లో పదవీ వ్యామోహమే తప్ప సేవాభావం పూజ్యమయింది. అధికారంలో ఉన్నవారిలో బాధ్యతా భావం సన్నగిల్లింది. ఈ పరిస్థితుల్లో దేశవాసుల మధ్య ప్రేమను పెంచేవారు, అనురాగపు పలుకులు పలికేవారు, గుండెల్లో నెమ్మదిని నింపేవారు కరవయ్యారు. జమాఅతె ఇస్లామీ హింద్ ఈ కొరతను పూడ్చాలన్న ధ్యేయంతో తన సేవల్ని అందజేస్తోంది. మానవులంతా దేవుని కుటుంబమే అని, అందరూ ఆదమ్ హవ్వాల తొలిజంట ద్వారా ఉనికిలోకి వచ్చిన వారే కాబట్టి పరస్పరం సోదరులే అని చాటుతుంది. మనిషి పరలోకంలో జవాబు చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని అది గుర్తించి మసలుకుంటే ఎలాంటి అవినీతికయినా, అన్యాయానికయినా, దౌర్జన్యానికయినా ఒడిగట్టలేదని బోధిస్తుంది. మనిషి నేడు తన జీవితాన్ని దైవ మార్గదర్శకత్వంలో గడిపినట్లయితే ఎలాంటి చిక్కుల్లో పడజాలడని, జీవితం శాంతిమయం, సుఖప్రదం అవుతుందని తెలుపుతుంది. ఆ సత్య సందేశ కార్యక్రమంలో అది కులమత విచక్షణ లేకుండా సేవలు అందజెయ్యడానికి దేశ పౌరులందరి అండదండల్ని, సహాయసహకారాలను కాంక్షిస్తుంది. ఇలా సాగిన నా ప్రసంగం ఇరువయి నిమిషాల్లో ముగిసింది. ఆ తరువాత మౌలానా అబ్దుల్ అజీజ్‌గారు జమాఅత్ సందేశాన్ని మరింత విపులంగా, వివరంగా ప్రజలముందుంచారు. ఆ సమయానికి కొందరు వచ్చి పార్కులో అక్కడక్కడ కూర్చోసాగారు. రోడ్డు మీద నడిచేవారు కొందరు ఆగి పార్కు చుట్టూ నిలబడి వింటున్నారు. అప్పటికి దాదాపు 300 మంది నిల్చున్నారేమో అనిపించింది. కార్యకర్తల అంచనా ప్రకారం 500 మంది సభా కార్యక్రమాన్ని విన్నారట. సభ ముగిసిన తరువాత కొందరు వచ్చి మౌలానా గారితో కలిశారు. కాస్సేపు మెయిన్‌లాండ్ విషయాలు మాట్లాడారు. పోలీసు విభాగంలో పనిచేసే సర్దార్జీలు ఇద్దరు వచ్చి మౌలానాని కలుసుకుని ఆయన చేసిన ప్రసంగం పట్ల తమ సంతోషాన్ని

హర్షామోదాన్ని వ్యక్తం చేశారు. అలా కార్యక్రమాన్ని ముగించుకుని దాదాపు పదిన్నర గంటలకు ఇంటికి చేరుకున్నాము. మరుసటి రోజు ఆదివారం. మౌలానా గారు రషీద్‌గారితో కలిసి ఇతర దీవులకు వెళ్ళనున్నారు. నేను అనేక వ్యక్తిగత, సంస్థాగత కారణాలవల్ల అటు వెళ్ళలేక పోతున్నాను. ఇతర ద్వీపాలకు వెళ్ళలేక పోవడం పెద్ద లోటుగా అగుపించినా బాధ్యతల మూలంగా దాన్ని భరించడం తప్ప గత్యంతరం లేకపోయింది.

❖ ❖ ❖

భాషాతీతమైన భావసమ్మేళనం

ఈవేళ (16-2-92) మౌలానా గారు, రషీద్ ముహియుద్దీన్ గారూ కలసి ఇతర దీవులకు వెళ్ళే కార్యక్రమం వేసుకున్నారు. నేను 18న ఇక్కడి నుండి ముఖ్యభూమికి బయల్దేరవలసి ఉంది. ఉదయం 6.30 గంటలకు మౌలానా గారితో పాటు రషీద్ ముహియుద్దీన్, ముహమ్మద్ అలి ప్రభృతులు బయల్దేరారు. వారు వింబర్లిగంజ్ నుంచి బస్సులో బయల్దేరి, బోటు బస్సులో ప్రయాణంచేస్తూ 'రంగత్' 'మాయబందర్' 'విగ్లిపూర్' అన్న ప్రదేశాలను సందర్శిస్తారు. ఆ ప్రదేశాలను చూడాలన్న తపన నాలోనూ ఉన్నా, గీటురాయికి దూరమయి వారం కావస్తోంది, ఎలా ఉందో అన్న ఆందోళనకొద్దీ ఆ కోరికను అణచుకున్నాను. భారమయిన గుండెలతో వారిని తిరిగి హైదరాబాద్‌లో కలసుకుందామనుకుంటూ సాగనంపాము.

సాహిత్యమా? మానసిక భోగ విలాసమా??

నాకు మటుకు నేడూ రేపూ రెండు చిన్న చిన్న కార్యక్రమాలు వినా పెద్ద ఎంగేజ్‌మెంటేదీ లేదు. టిఫిన్ అదీ ముగించుకుని పోర్టు బ్లెయిర్‌కు కొందరు మిత్రులతో పాటు బయల్దేరాను. ప్రోగ్రాం ప్రకారం 'సప్లయి లైను' లో ఓ ముషాయిరా (ఉర్దూ కవి సమ్మేళనం)లో పాల్గొనవలసి ఉంది. "హల్కయే అదబ్" ఆధ్వర్యాన మీ సంపాదకుని రాకను పురస్కరించుకుని నిర్వహించబడే ఈ ముషాయిరాలో ఏదో వినిపించాలన్న కట్టడి కూడా ఉన్నందున ఎప్పుడో వ్రాసిన ఉర్దూ గజళ్ళను నెమరు వేసుకున్నాను. రెండు గజళ్ళు షేర్లు (పంక్తులు) కొన్ని గుర్తుకు వచ్చాయి, వ్రాసుకున్నాను. మధ్యాహ్నం భోజనాలయ్యాక ఉర్దూ అభిమానుల సాంగత్యంలో ముషాయిరా ప్రారంభమయింది. సాహితీమండలి (హల్కయే అదబ్) అధ్యక్షులు ఖాన్ సాహెబ్‌గారు అండమాన్‌లో లేకపోవడంచేత హాజరు కాలేదు. సెక్రటరీగారయిన గోవిందరాజు 'రాజ్' (రహస్యం)❖ గారు స్వాగతం పలికి నన్ను అందరికి

❖ రహస్యం = కలం పేరు. దీన్ని ఉర్దూలో తఖల్లుస్ అంటారు.

పరిచయం చేశారు. తరువాత నేనూ, నా పర్యటన, హైదరాబాద్‌లోను, దేశంలోనూ ఉర్దూ పరిస్థితిని, ఉర్దూ కవులూ, సాహితీ వేత్తల స్థితిగతుల్ని నాకు తెలిసినంత మేరకు వివరించగలిగాను. వారందరికి బాధ అనిపించినా ఆ వివరాలు చెప్పడం తప్పలేదు. సాహిత్యం, సాహిత్యంలో విలువలు, నేటి కవితా ధోరణులు అన్న అంశాలపై చర్చలు, ఇష్టాగోష్ఠి రూపంలో సాగాయి. సాహిత్యం- సిద్ధాంతం, సాహిత్యం - ప్రయోజనం, సాహిత్యం - సమాజం, సాహిత్యం - మానవత్వం - అన్న అంశాలను చర్చించినప్పుడు, సాహిత్యంలో, రూపం, శిల్పం, భావసమ్మేళనాలతో పాటు తత్వం, సామాజిక ప్రయోజనం, మానవీయ విలువల దర్శనం, నిర్మాణాత్మక సందేశం లేకపోతే అది సాహిత్యం కాదు. మానసిక భోగ విలాసం అన్న నా సాహిత్య సందేశాన్ని అక్కడ సమావేశమయిన కవులూ సాహితీ వేత్తలు హర్షామోదంతో అంగీకరించడమే కాక దాన్ని తామూ తమ సాహితీ ప్రక్రియల్లో ఇనుమడింపజేస్తామని హామీనిచ్చారు.

ఏకంచేసిన ఉర్దూ

తరువాత అందరూ కొన్ని కవితలు వినిపించారు. ఆ కవి సమ్మేళనం తరువాత పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండగా ఓ తమాషా జరిగింది. నేను నా పరిస్థితుల్ని చెబుతూ మాతృభాష ఉర్దూ అయినప్పటికి, ఉర్దూలోనే విద్యాభ్యాసం ప్రారంభించినప్పటికి నేడు తెలుగులోనే వ్రాయడం నాకు అలవాటయింది. ఉర్దూ కవితలు వ్రాయడం ఎప్పుడో మానుకున్నానని చెప్పాను. అప్పుడు అకస్మాత్తుగా నేను-"అవును, మనమంతా ఉర్దూలో కవితలు గానం చేశాము. ఏమిటేమిటో చర్చించుకున్నాము. నిజానికి మన మాతృభాష అందరిదీ ఉర్దూ కాదుగదా" అన్నాను. అందరూ చిరునవ్వుతో పరస్పరం ముఖాలు చూసుకున్నారు. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు, గోవిందరాజుగారు మటుకు, మనస్ఫూర్తిగా నవ్వుతూ "మేమెప్పుడూ ఈ విషయాన్ని పట్టించుకోనూ లేదు. ఆలోచించనూ లేదు" అన్నారు. 'దిల్బర్' ముందుకు వచ్చి చిలిపిగా నవ్వుతూ నన్నడిగింది- "నా మాతృ భాష ఏదో చెప్పకోండి చూద్దాం" అని నేను ముందు అందరినీ అడిగాను "మీకెవరికయినా తెలుసా?"అని. లేదని అందరూ ఒప్పుకున్నారు. నేనప్పుడు కాస్త గొంతు సవరించుకుని "బెంగాలీ" అన్నాను. ఆశ్చర్యపోవడం 'దిల్బర్' వంతయింది. అందరూ నిజమా అన్నట్టు ఆమె వైపు చూశారు. "ఎలా తెలుసుకున్నారు?" అనేసి నాలుక కరచుకుంది. 'మీ ఉచ్ఛారణను బట్టి' అన్నాను. "అదేంకాదు లేండి, నేను కలకత్తాలో మెడిసిన్ చేశానని చెప్పాగా, దాన్ని బట్టి" అంది. నవ్వి ఊరుకున్నాను. తిరిగి అందరినీ అడిగాను "రాజ్" గారి భాష ఏదో చెప్పండని. రాజ్‌గారు మటుకు కాలు మీద కాలు వేసుకుని సిగరేట్ దమ్ములాగుతూ హుందాగా నవ్వుతూ కూర్చున్నారు. తిరిగి 'దిల్బర్ ' చెప్పింది "తెలుగో, తమిలో….." రాజ్‌గారూ, నేనూ నవ్వుకున్నాము. "సరే, సలామ్ గారి భాష ఏదో చెప్పండి. "నాకు తెలుసు" చెప్పింది సనాఖానమ్. ఈ విధంగా సంవత్సరాల తరబడి కలసి ఉన్నప్పటి

వారు తమ ప్రాంతాలేవో భాష ఏదో తెలుసుకోకుండానే అన్యోన్యంగా, అనురాగమయంగా ఉర్దూ భాష సేవలో నిమగ్నులయి ఉన్నారు. తమాషా ఏమిటంటే ఈ ఉర్దూ కవులూ కవియిత్రులలో ఉర్దూ మాతృ భాషగా గలవారు బహు స్వల్పం. దాదాపు అందరూ ఇతర భాషల వారే. ఉదాహరణకు శ్రీ గోవిందరాజు 'రాజ్' (కన్నడ భాషీయులు) కుమారి సనాఖానం పంజాబీ తండ్రి, మళయాలి తల్లికి తనయ (ఈమెకు రెండు భాషలూ సరిగ్గారావు - ఉర్దూ తప్ప), కుమారి డా.దిల్బర్ (వృత్తిరీత్యా డాక్టరు, బెంగాలీ మహిళ), శ్రీ సలామ్ (మలయాళీ భాషీయులు), జఫర్ సిద్ధికి, ముహమ్మద్ ఈసా (వీరిద్దరు ఉర్దూ మాతృ భాషీయులు).

ముఖ్యభూమిలోని వక్రబుద్ధి

నేను వచ్చి వారి మధ్య లేనిపోని భాషా విభేదాన్ని సృష్టించానా? అన్న అనుమానం నాకు కలిగింది. అదే భావం కడు విచారంతో వ్యక్తం చేశాను. నాకు నిజంగానే బాధ అనిపించింది. "అబ్బె, అలా ఏమీకాదు. ఇక్కడి వాతావరణంలో ఆ మాటలు మాకు గుర్తు రాలేదు. అంతే, నేటి తరువాత మనం ఏ భాషవారమయినా ఉర్దూ సేవకులమన్న దృఢాభిప్రాయం మాలో నాటజేశారు మీరు" అని రాజ్‌గారు ఏదో సర్ది చెప్పారు. అందరూ అవునవునని నేను బాధపడకుండా ఆదుకున్నారు. అది వారి అతిథి మర్యాద. మెయిన్ లేండ్ (ముఖ్య భూవి) లో నివసించే మాకు ఎన్నెన్ని పట్టింపులు! భాష అని, ప్రాంతమని, మతమని, కులమని........ ఎన్నెన్ని ! కాని అక్కడ అన్ని భాషల వారున్నా అందరూ, అన్ని విభేదాలూ మరచి హాయిగా, ఆనందంగా కలసి మెలసి జీవిస్తున్నారు. ఇక్కడే ఉండిపోతే ఎంత బావుండేది? అందరివద్దా సెలవు తీసుకుని మెయిన్ లేండ్‌కు వస్తే హైదరాబాద్ తప్పక రావాలని ఆహ్వానించి వింబర్లి గంజ్‌కని బయల్దేరాను. అక్కడ సాయంత్రం (మగ్‌రిబ్ తరువాత) టాపు బస్తిలో తెలుగు సోదరులతో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. అందులో పాల్గొనాలి.

వీడ్కోలు ఘడియలు

టాపు బస్తీలో ధర్మారావు అనే మిత్రుడు ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ బస్తీ చాలా వరకు తెలుగు వాళ్ళ బస్తి. స్టీవర్టగంజ్‌కు సమీపాన ఉన్న ఈ బస్తీ విశాలంగా ఉన్న ఓ ఎత్తయిన దిబ్బలాంటి ప్రదేశంలో ఉంది. దాదాపు 20 మంది యువకులు అక్కడ సమావేశమయ్యారు. అంతా తెలుగువారే. కొందరు అండమాన్ టింబర్ ఇండస్ట్రీస్ (అక్కడ పెద్ద ప్లైవుడ్ పరిశ్రమ అదొక్కటే)లో పనిచేస్తారు. మరి కొందరు ఇతరత్రా వ్యవసాయం, కూలీపనులు చేసుకుంటారు. ధర్మారావుతో పాటు దేవదాసు అనే మిత్రులూ కలిశారు. ఆయన అక్కడి సర్‌పంచ్, కొందరు మాత్రమే చదువుకున్న వారు. అందువల్ల వారి సమక్షంలో చదువు ప్రాముఖ్యాన్ని, దురలవాట్ల వల్ల కలిగే కీడుల్ని, కుటుంబంలోనూ సమాజంలోను దుష్ట వ్యసనాలకు బానిసలయినవారి వల్ల జరిగే హానిని వివరించి చెప్పాను.

చదువుకున్న వారు చదువురాని వారిని ఒక్కొక్కరికి చదువు చెప్పినా ఎంతో మేలు జరుగుతుందన్న సత్యాన్ని విడమర్చి చెప్పాను. చర్చలో దేవదాసు, ధర్మారావు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాటల సందర్భంలో ఆలిండియా రేడియో (పోర్ట్‌బ్లెయిర్) లో అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన శ్రీ జి. సత్యరావు తమకు చేసిన ఎన్నో మేళ్ళను వారు చెప్పారు. టాపు బస్తీ నివాసస్థలం సేకరణలో ఆయన ఎంతో తోడ్పడ్డారని చెప్పారు. ఆలిండియా రేడియో అంటే గుర్తుకు వచ్చింది. ఈ యాత్ర వివరణలో పోర్ట్‌బ్లెయిర్‌లోని ఆలిండియా రేడియో స్టేషన్ సందర్శనాన్ని ప్రస్తావించడం మరిచాను. అక్కడ తెలుగు కార్యక్రమాలకుగాను ప్రత్యేక విభాగముంది. ప్రస్తుతం శ్రీ. సి.కె. రావుగారు అక్కడ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. తెలుగులో వార్తలు రోజూ ఉంటాయి. అండమాన్‌లో అన్ని భాషలు మాట్లాడేవారూ ఉన్నారు గనక ఆయా భాషలన్నింటికీ సమయం కేటాయించడం అవసరమవుతుంది. తెలుగులో అప్పుడప్పుడు, నాటకాలు, పండుగలకు ప్రత్యేక కార్యక్రమాలూ నిర్వహిస్తుంటారు. హైదరాబాద్ నగరం 400 ఏళ్ళ పండుగ జరుపుకుంటోన్న సందర్భంలో దాని చరిత్ర గురించి మాట్లాడతారా అని శ్రీ రావుగారు అడిగారు. నేనందుకు ప్రిపేరయి వెళ్ళలేదు గనక సారి చెప్పడం తప్ప గత్యంతరం లేక పోయింది. గీటురాయి వారపత్రిక మటుకు తప్పక పంపమని ఆయన మరీమరీ కోరారు. అలాగే నన్నాను. (పంపే ఏర్పాటు చేశానిప్పుడు) దాదాపు ఓ గంట సేపు వారితో పాటు గడిపి వారు ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి బయల్దేరాను. అంతటితో ఆ రోజు కార్యక్రమం ముగిసినట్లే.

తెలుగు వారి తపన

మరుసటిరోజు (17. 2.92)న తొలి కార్యక్రమంగా అండమాన్ టింబర్ ఇండస్ట్రీస్‌ని చూడబొయ్యాము. తోడుగా మూసా, వాళ్ళనాన్న గారు కూడా వచ్చారు. అవసరమయిన అనుమతి వగైరా తీసుకుని గైడ్ తోడు రాగా అక్కడ జరిగే పనులన్నీ క్షుణ్ణంగా చూసే అవవాశం లభించింది. పెద్దపెద్ద కలప మొద్దుల్ని బోట్ల సహాయంతో సముద్రం ఒడ్డున ఉన్న ఇండస్ట్రీ ఆవరణలోకి తీసుకువస్తారు. క్రేన్ల సహాయంతో ఫ్యాక్టరీలోనికి తెచ్చి పల్చటి పొరలుగా దోసకాయ తోలు తీసినట్టు పల్చగా ఒల్చేస్తారు. ఆ పొరల్ని జిగురుతో ఒకదానిపై ఒకటి పేర్చి పెద్ద పెద్ద పలకలుగా తయారుచేస్తారు. అవి రకరకాల సైజుల్లో తయారవుతాయి. కొన్నింటికి మరికొన్ని రసాయనాలు కలిపిన ద్రావణాలలో ముంచి వాటర్ ప్రూఫ్ ప్లైవుడ్‌గా కూడా తయారు చేస్తున్నారు. ఆ ఫ్యాక్టరీలో నిన్న టాపు బస్తిలో కలసిన సోదరులు కొందరు కలిశారు. వారందరూ చేసే పనులు చూపించారు. వారు అక్కడి కార్మికలకు, సూపర్‌వైజర్లకు నన్ను చూపి ఏదో చెబుతున్నారు. అక్కడ తెలుగువారు అనేక మంది ఉన్నారు. అక్కడి కార్మికుల్లో అధికంగా తెలుగువారే కనిపించారు. మేము ఫ్యాక్టరీనుంచి వెనక్కిమరలుతున్నప్పుడు కొందరు తెలుగు సోదరులు వచ్చి కలిశారు.

"రేపు మా బస్తీలో మీటింగు పెట్టుకుంటాము వీరిని తీసుకురండి" అని వారు నా వెంట వున్న సహచరుల్ని అడుగుతున్నారు. వారేమో, " రేపు ఉదయం ఈయన వెళ్ళి పోతున్నాడు కదండి" అని సముదాయిస్తున్నారు." "టాపు బస్తికి తీసుకువెళ్ళేరు, మా బస్తీకి వస్తే ఎంత బావుండేది. దేశం (ఆంధ్రప్రదేశ్ అన్నమాట) నుంచి వచ్చినాయన మా బస్తికి రాకపోవడం మాకెంతో బాధగా ఉంది" అని అంటున్నారు. ఆ బస్తీ కూడా తెలుగు వారిదేనట! అది ఆ ఫ్యాక్టరీ దగ్గరలోనే ఉంది. పేరు మరిచాను. పేరు వినగానే చెప్ప వచ్చు ఇది తెలుగువారి పేట అయి ఉంటుందని. వాళ్ళ ఆప్యాయతకు నా కళ్ళు చెమర్చాయి. వీలుంటే తప్పక ఓ రోజు నా ప్రయాణాన్ని వాయిదా వేసుకునేవాణ్ణే గాని పరిస్థితులు దానికి అనుకూలంగా లేవు. బాధగానే వారి ఆహ్వానాన్ని వాయిదా వెయ్యవలసి వచ్చింది. "మళ్ళీ ఇటు రావడం మీకు వీలవుతుందని ఎలా చెప్పగలం?" అని వాళ్ళు ప్రశ్నించిన దానికి మా వద్ద సమాధానం లేదు.

"ప్రకృతి నీ సేవకు, నీవేమో దైవ సేవకు"

ఆరోజు మధ్యాహ్నం కొన్ని పుస్తకాలు, ముత్యపు చిప్పలతో గవ్వలతో చేసిన కొన్ని ఫ్యాన్సీ వస్తువులు ఈ పర్యటనకు జ్ఞాపికలుగా కొనుక్కోవడంలో గడిచింది. సాయంత్రం స్టివర్ట్‌గంజ్‌లో కొందరు కార్యకర్తల నుద్దేశించి మాట్లాడే అవకాశం లభించింది. దాదాపు 25 మంది యువకార్యకర్తలు అందులో పాల్గొన్నారు. వారి సమక్షంలో – ఇస్లాంను తమ జీవన విధానంగా, ధర్మ సంస్థాపనే తమ జీవిత ధ్యేయంగా స్వీకరించిన వారు ఎలా మెలగాలో చెప్పడానికి ప్రయత్నించాను. ప్రపంచంలో జీవిస్తూ ప్రపంచంలోనే సకల విద్యల నభ్యసిస్తూ, అందులోని సమస్త సౌలభ్యాలను, సౌకర్యాలను ఆస్వాదిస్తూనే మనిషి తన కార్యకలాపాలన్నింటిలో దైవ ధర్మానుసరణ, దాని సందేశవ్యాప్తి, దాని సంస్థాపనలనే దృష్టిలో ఉంచుకోవాలని తెలిపాను. ఒక్క మాటలో చెప్పాలంటే "ప్రకృతి యావత్తు మానవుని సేవకయితే, మనిషి మటుకు దైవానికి అంకితం కావాలి" అన్న సందేశం అందజేశాను. ప్రసంగం తరువాత ప్రశ్నలకు జవాబులు చెప్పి దాదాపు గంటన్నర కార్యక్రమం ముగించుకుని అక్కడే ఓ మిత్రుని ఇంట రాత్రిభోజనం చేసుకుని వింబర్లి గంజ్‌కు వచ్చేశాను. రాత్రి వింబర్లిగంజ్‌లోని మఊనుల్ ఇస్లాం మదరసా ప్రధానో పాధ్యాయుడు, మస్జిద్‌లో ఇమామ్‌గా పనిచేస్తున్న జమాఅత్ సభ్యుడు, మిత్రుడు ఖాలిద్ వాళ్ళ పిల్లలతో కాస్సేపు గడిపి అందరికీ వారి సేవలకు, సహాయసహకారాలకు కృతజ్ఞతలు తెలుపుకుని సామానంతా సర్దుకుని పడుకునే వరకు 12 గంటలయింది. తెల్లారుజామున (18.2.92) మూడు గంటలకే లేచి కాలకృత్యాలన్నీ ముగించుకుని ఫజ్ర్‌నమాజ్‌కు పూర్వమే అంతా రెడి అయ్యాము. ఫజ్ర్ నమాజ్ తరువాత అల్పాహారం తీసుకుని టాక్సీలో బంబూజట్టికి బయల్దేరాము. మిత్రులు, మజీద్, రషీద్, ఖాలిద్, మూసా వెంట వచ్చారు. బంబూ ఫ్లాట్ చేరగానే 6.30 గంటల బోటు రెడీగా ఉంది. పదినిమిషాల తరువాత

బంగాళాఖాతం అలలపై తేలియాడుతూ ఆ సుందరమయిన ద్వీపాలను చివరిసారిగా చూస్తూ బోటు ప్రయాణం చేస్తున్నాను. ఈ ప్రకృతి సౌందర్యం, అనంతజలరాసి మధ్య జీవన చిహ్నాలుగా అలరారే పచ్చని ద్వీపాలను మళ్ళీ చూడటం ఎప్పుడు తటస్థిస్తుందో? ఆలోచనలు భావతరంగాలపై సుదూరాలకు వెళ్ళిపోతున్నాయి.

దూరమవుతున్న రూపాలు

అందాలు జాలువారే
ఆనంద ధామమే అయినా
అందికలోనే ఉంటూ
అందరికీ అందజాలదీ
అంబోధి యంజలి.
అనంత అంతరంగ శూన్యంలో
చెయ్యిదాటి పోతున్న
సొగసయిన ఊహల్లా
మళ్ళీ ఎప్పుడయినా–
కలలోనయినా
తారలా నయినా కలసుకుంటాయా?
తారసపడతాయా?? అన్నట్టు
ఆశ గొలిపి, చిలిపిగా ఇకిలించి
అందకుండా అందందే
అంచుకానని కడలిలో
కలసి పోతున్నాయి
అందాల రేవులు
అండమాన్ దీవులు!

❖ ❖ ❖

మధురస్మృతులతో ముఖ్యభూమికి

ఊహలకు అడ్డుకట్టవేసి అంతలోనే వచ్చేసింది చాట్టం రేవు. దిగి మళ్ళీ టాక్సీ ఎక్కాము. అవే ఎగుళ్ళు దిగుళ్ళు, జీవితంలా మెట్టపల్లాల భూమి, సొగసయిన వంకీలు తిరిగిన దారులు, టాక్సీ మజీద్ గారి ఇంటి ముందర ఆగింది 'ఎందుకూ? ఇక్కడ ఎవ్వరూ లేరేమో కదా??' నా ప్రశ్న రషీద్ తొందరగా టాక్సీ దిగి ఒక్క ఊపులో ఇంటిలోనికి వెళ్ళి మరో క్షణంలో బయటికి వచ్చాడు. చేతిలో అందమయిన కళాకృతి. నాకర్థమయింది.

మరపురాని ఔదార్యం

నేను మజీద్‌గారి ఇంట బస చేసినపుడు వాళ్ళ డ్రాయింగ్ రూములో దీన్ని చూశాను. ఎంతో అందంగా అగుపించింది. అలాంటిది దొరికితే కొనాలని చెప్పాను. అలాంటివి బర్మా నుంచి వచ్చే వాళ్ళు వెదురు బద్దలతో చేసి అమ్ముకుంటారని, ఎప్పుడుబడితే అప్పుడు దొరకవని అన్నారు. ఆ విషయాన్ని గుర్తుంచుకుని దాన్ని ఇప్పుడు నాకు ఇచ్చేస్తున్నారన్న మాట! 'ఇది మా అన్నయ్య తరపున గిఫ్టుగా స్వీకరించండి! ' అన్నాడు మజీద్ గారి తమ్ముడు. "అబ్బే నేను అలా అడిగానే తప్ప. మీ ఇంటి....." ఏదో అనబోయాను మొహమాటంగా.

"అదేం లేదు ఇలాంటివి మళ్ళీ వచ్చినపుడు మేము ఈజీగా కొనుక్కోగలం. ప్లీజ్ మీరు దీన్ని తప్పక తీసుకోవాలి" మరీ మరీ ప్రాధేయ పడసాగాడు రషీద్. "సరే థ్యాంక్స్" అంటూ స్వీకరించక తప్పలేదు. అతి నాజూకయిన దాన్ని ఎలా తీసుకువెళ్ళాలో అన్న ఆలోచన ఇప్పుడు ప్రధానంగా నన్ను చుట్టుకుంది. పోర్టుబ్లెయిర్ రోడ్లపై చివరిసారిగా టాక్సీలో నుంచి వీధులూ రోడ్లూ చూసుకుంటూ ఎయిర్‌పోర్టు చేరాము. అరైవల్ లాంజ్‌లో చూసిన బోర్డు గుర్తుకు వచ్చింది. "The most beautiful Islands in the world" "And also the most neglected ones" అనుకున్నాను లోలోనే. నా ఆలోచనకు ప్రతిఫలిస్తూ చిరునవ్వు గోచరించిందేమో నా పెదాలపై "ఏమిటీ మీలో మీరే నవ్వుకుంటున్నారు"? అడిగాడు ఖాలిద్. టాక్సీ దిగి సామాను ఒకొక్కటికి లాంజ్‌లో పెట్టారు.

సామానేముంది? ఒక సూట్‌కేసు. ఓ షోల్డర్ బ్యాగు. మరో హ్యాండ్ బ్యాగు. నేను మటుకు వెదురు బద్దల కళాఖండాన్ని (అది ఓ చెట్టు రూపంలో ఉంది) అతి జాగ్రత్తగా పట్టుకుని వచ్చి లాంజ్‌లో కూర్చున్నాను. లాంజ్‌లో చాలా హడావిడిగా ఉంది కలకత్తా వెళ్ళే విమానం కూడా అప్పుడే బయల్దేరనుంది. విదేశీ టూరిస్టులు. భారతీయులు అనేకమంది కూచోడానికి చోటు లేక నిల్చునే ఉన్నారు. కలకత్తా ప్రయాణికుల రిపోర్టింగ్ జరుగుతోంది. మేము ఓ ప్రక్కన కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాము. మిత్రులందరికి కాఫీ ఆఫర్ చేశాను. అందరూ సంతోషంగా స్వీకరించారు.

కాఫీ తాగి, వెదురు చెట్టును భద్రపరిచే ఉపాయం ఏమిటా అని ఆలోచించి మూసా ఓ పెద్ద పాలిథిన్ బేగ్ తీసుకు వచ్చారు. దాన్ని అందులో పెట్టి చేత్తో పట్టుకునేందుకు వీలు కల్పించాడు. చాలా బావుంది. ఖాలిద్ చెప్పాడు "అటు చూడండి. అందరి కళ్ళు ఈ వెదురు చెట్టుపైనే ఉన్నాయి!" నేనూ గమనించాను. ముఖ్యంగా విదేశీ పర్యాటకులు దాన్ని ముచ్చటగా చూస్తున్నారు. అంతలోనే ఓ మహిళ దగ్గరికి వచ్చి మమ్మల్ని అందరినీ కలయజూసి వంగి ఆ చెట్టును ముద్దెట్టుకుంది. దాని వైపు ప్రశంసా పూర్వకంగా చూస్తూ మమ్మల్ని కళ్ళతోనే అభినందించింది. ఆవిడ గారి సహచరులందరూ ఆమె చర్యకు తృప్తిగా నవ్వుకున్నారు. లాంజ్‌లో అందరి ముఖాలపై సంతోషం, చిరునవ్వు తొణకిస లాడాయి. అనేకమంది ఆ చెట్టును, మమ్మల్నీ ప్రశంసా పూర్వకంగా చూస్తున్నారు. నాకు కాస్త సంతోషం, అందరూ మరీమరీ చూడటం వల్ల సిగ్గూ కలగసాగాయి. అయినా తప్పించుకునే మార్గమేముంది! మద్రాసు పోయే ఫ్లయిట్ (నెం550 కాబోలు) ఎనౌన్స్‌మెంట్ అయింది. అందరి దగ్గరా సెలవు తీసుకుని భారమయిన గుండెలతో సెక్యూరిటి చెక్‌కు లోనికి వెళ్ళాను. చేతిలో నా యీ "వెదురు చెట్టు" అందరినీ ఆకర్షించింది. అందరూ దానికై దారి ఇస్తూ చోటు కల్పిస్తూ వచ్చారు. వ్యానులో ఎక్కినప్పుడు కూడా దానిగ్గాను ప్రత్యేక స్థానం లభించింది. ప్లెయిన్‌లో ఎక్కినప్పుడూ దానికి ప్రత్యేకమయిన గుర్తింపు లభించింది. ఎయిర్ హోస్టెస్ నవ్వు ముఖంతో దాన్ని ముచ్చటగా చూసి "If don't mind I shall keep it safely and hand it you over while alightning (మీరు ఏమీ అనుకోకపోతే నేను దాన్ని భద్రంగా పెట్టి మీరు దిగేటప్పుడు అప్పగిస్తాను) అంటూ చొరవగా నాచేతిల్లోంచి తీసుకుని క్యాబిన్ ప్రక్కన తమ రూముకు తీసుకు వెళ్ళింది. ఆ విధంగా దాని భద్రతభారం తప్పింది. లేకపోతే ఎంతసేపని చేతిలో పట్టుకు కూర్చోగలను?

తప్పుడు తత్వాలు తప్పని అగచాట్లు

ఫ్లయిట్‌లో తిరిగి రెడ్డిగారే మా పైలట్. నాకు ఎందుకో చిన్న పిల్లల మాదిరి సంతోషం కలిగింది- తీసుకు వచ్చిన పైలట్‌గారే తిరిగి తీసుకు వెళ్ళుతున్నందుకు. సమయం 9.15 విమానం రన్‌వేపై ప్రాకుతూ గాలిలోకి దౌడు తీయగానే కిటికిలో నుంచి క్రిందికి చూశాను. ఇళ్ళు, చెట్లు క్రమేణ దూరమవుతూ బొమ్మరిళ్ళల్లా మారుతున్నాయి. ద్వీపాలు, సముద్రతీరాలు, అన్నీ ఫోటోలో మాదిరిగా కనిపించసాగాయి. ఎందుకో కళ్ళు చెమర్చాయి. నాకు అనిపించింది. భూమిపుత్ర (Son of soil) అన్న పదానికి సంకుచిత మయిన భావం ఎలా ఏర్పడిందోగాని, మనిషికి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇచ్చి, నచ్చిన ప్రతిచోటు పట్ల అవ్యాజానురాగం ఏర్పడుతుంది. దాన్ని అతను ఎంతవరకు గుర్తిస్తాడు అన్నది వేరే విషయం.

నేను రాయలసీమ (అప్పటి) కర్నూలు జిల్లాలోని కంభం గ్రామంలో పుట్టాను. పెరిగాను. అదన్నా నాకు ప్రేమే. కొంతవరకు చదువు ఆదిలాబాద్ జిల్లా బెల్లంపల్లిలో

సాగింది అదీ నా అభిమాన పాత్రమయిందే. మద్రాసులో ఉద్యోగం రీత్యా ఉన్నా ఇస్లామీయ ఉద్యమ పరిచయం అక్కడే జరిగింది. నా వ్యక్తిత్వ నిర్మాణంలో మద్రాసు నగరం పాత్ర బలీయమయింది. అందువల్ల మద్రాసు అంటేనే నాకు ప్రాణం లేచివచ్చినట్లవుతుంది. ఇప్పుడు హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. నా శక్తి సామర్థ్యాలు, యోగ్యతాయోగ్యతల అభివ్యక్తికి మైదానాన్ని సమకూర్చింది ఈ మహానగరమే కనుక హైదరాబాద్ పట్ల కూడా నాలో అమితమయిన ఆకర్షణ గోచరిస్తుంది. ఇప్పుడు అండమాన్‌లో ఓ వారం గడిపామో లేదో దానిపట్ల కూడా తరగని అనురాగం కానవస్తోంది. ఏమిటీ తత్వం? భూమిపుత్ర సిద్ధాంతం ఎంత బలహీనమయింది? మానవ అస్తిత్వం విశ్వజనీనమయింది. అతను దేశకాల పరిమితులకు, ప్రదేశాలకూ, ప్రాంతాలకు, సీమలకు సీమితుడు కాడు. మానవ మనస్సు విశ్వమంత విశాలం కావాలి. అయ్యయ్యో, ఎన్నెన్నో సంకుచిత తత్వాలకు బానిస అయిపోతున్నాడు మనిషి!

రాతియుగం నుండి నేటియుగం వరకు ఎన్నెన్ని దశలు దాటినా, ఎన్ని యుగాలు ఎగిరినా మనిషి తన్నుతాను తెలుసుకున్న ఘట్టాలు రాలేదా? తప్పు. నా ఈ ఆలోచన సరయినది కాదని ప్రపంచ చరిత్ర చాటుతోంది. మనిషి జ్ఞానజ్యోతితోనే కాలిడినాడు. పుడమిపైన. అయితే తనలోని సహజ చాపల్యంవల్ల తన జ్యోతినే ఆర్పేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. దీపం కొడిగట్టినప్పుడల్లా విశ్వప్రభువు, స్వామి తన అపార కారుణ్యం కారణంగా ఎందరినో ఋషులను, మునులను, ప్రవక్తలను, పైగంబరులను ప్రపంచంలో ప్రభవింపచేశాడు. వారు ఆరిపోయిన జ్యోతిని వెలిగించారు. కొడిగట్టిన దీపాలకు చమురుపోసి బ్రతికించారు. నిద్రబోయిన మనిషిలోని మానవుణ్ణి తట్టి లేపారు. మనిషి తన ఉనికి తెలుసుకున్నాడు. నేడు కూడా- ఓ మనిషీ, నీవు ఏ నేలకూ బిడ్డవు కావు, భూమే కాదు విశ్వమంతా నీదే, ప్రకృతికే సొంతం దారువి నీవు! నీ స్థానం ఏదో తెలుసుకో, అని మేల్కొల్పడమే కావలసింది....

"సర్, లైక్ టు హావ్ విజిటేరియన్ ఆర్...."ఎయిర్ హోస్టెస్ నన్ను మేల్కొలుపు తోంది, ఈ లోకంలోకి కళ్ళు తెరవమని. ఆలోచనల్లోనే ఏదో అన్నాను. కాస్సేపటికి ఆవిడ టిఫిన్ తీసుకు వచ్చింది.

సిగ్గు పడకపోవడం సిగ్గు విడిచి నడవడం

కాఫి ముగించి పేపరు చూస్తున్నాను. అంతలోనే ఓ జర్మన్ టూరిస్టు పేపరు చేత పట్టుకు వచ్చాడు. నా ప్రక్కాయనతో అడిగాడు. ఆయన కూడా అది చదివి 'ఏమిటో' అన్నట్టు పెదవి విరిచాడు. సభ్యత కాకపోయినా చొరవగా జోక్యంచేసుకుని ఏమిటి విషయం అని అడిగాను. జర్మన్ వ్యక్తి పేపరులో వ్రేలెట్టి చూపాడు. ఏదో న్యూస్. ఇప్పుడు గుర్తులేదు. వాక్య నిర్మాణం కాస్త తికమక పెట్టేలా ఉంది. అర్థం కావడం లేదని చెపుతున్నాడు. ఓ క్షణం పరిశీలించాను బోధపడింది. చెప్పాను. తృప్తిగా వెళ్ళాడు. నా

ప్రక్కాయన అడిగాడు ఏమిటి అని, అతనికీ చెప్పాను. "చూశారా, విదేశీయులకు తమకు తెలియని దాన్ని తెలుసుకునే విషయంలో ఎలాంటి జంకు ఉండదు, సిగ్గూ అనిపించదు, అతను ఎలా నిర్మొహమాటంగా అడిగాడో చూడండి" అన్నాడాయన. అవునని చిరునవ్వుతోనే తలాడించాను. మా ఎదుటి సీట్లో తెలుగు దంపతులు. వాళ్ళ వెకిలి చేష్టలు నాకు సిగ్గ అనిపించేలా ఉన్నాయి. నేను ప్రక్కాయనతో 'వాళ్ళు (విదేశీయులు) జ్ఞాన సముపార్జనకు సిగ్గుపడకపోగా మనమేమో మనలోని కుసంస్కారాన్ని ప్రదర్శించడంలో సిగ్గువిడిచి ప్రవర్తిస్తాము' అన్నాను కాస్త వ్యంగ్యంగా. అసకల్పితంగా నా దృష్టి మా ఎదుటి సీటుపైకి వెళ్ళిందప్పుడు. నా ప్రక్కాయన కూడా అటుచూసి ఓ చిరునవ్వు పారేసి ఇది మామూలే అన్నట్టు ఊరుకున్నాడు. ఇంకా పేపరు చూస్తూ ఉండగానే అనౌన్స్‌మెంటయింది. క్రిందికి చూస్తే మద్రాసు సముద్రతీరం కానవచ్చింది. మద్రాసులోని మహాసౌధాలన్నీ పేకమేడల్లా కొలువుదీరి కనిపించసాగాయి. కొన్ని నిముషాల్లోనే మీనంబాకం ఎయిర్ పోర్టులో ఆగింది విమానం. అప్పుడు 11.20 ఎయిర్ హొస్టెస్ వెదురు చెట్టున్న పోలిథిన్ బ్యాగ్ భద్రంగా తెచ్చి ఇచ్చింది Very delicate and beautiful అందావిడ. కాంప్లిమెంట్స్‌కి, భద్రంగా పెట్టినందుకు మెనీ మెనీ థ్యాంక్స్ చెప్పి బయటకు వచ్చాను. సామాను తీసుకుని బయటికి రాగానే కనిపించాడు మిత్రుడు లుత్ఫుల్లా., ఆటో తీసుకుని పెరంబూరు చేరేవరకు 12.30 అయింది.

ఉద్యమ బాంధవ్యం

ఐ.ఎఫ్.టి.లో జమీల్‌భాయ్‌తో పాటు సోదరి డా.ఆయిషా కూడా నా కోసమని నిరీక్షిస్తున్నారు. "మీకు ఇచ్చిన మాట ప్రకారం వచ్చాను" అన్నారు డా. ఆయిషా. "మీరు రేపు సింగపూర్ వెళ్తున్నారేమో కదూ" అడిగాన్నేను.

"అవును, అందుకే ఇవాళ అందరినీ కలుసుకోవాలన్న ఆలోచనతో వచ్చాను. మౌలానా అబ్దుల్ అజీజ్ గారు మీతో పాటు రావడం లేదని తెలిసింది".

"అవునండి, నాకూ టైముంటే కొన్ని రోజులుండి వచ్చేవాణ్ణి"

అక్కడి వివరాలు ఓ 15 నిమిషాలు మాట్లాడుకున్నాము. నాకు గుర్తువచ్చి "మిసెస్ చందూర్‌ని కలుసుకున్నారా" అని అడిగాను మిస్‌స్ ఆయిషా గారిని. వీలుపడలేదని చెప్పి వెంటనే ఫోను తీసి డయల్ చేశారు శ్రీమతి మాలతీ చందూర్‌ని కలుసు కునేందుకు. "ఆవిడ లేదు. ఏదో ప్రోగ్రాంలో పాల్గొనేందుకు వెళ్ళి ఉంటుంది" మాట్లాడి చెప్పారు. నేనయినా కలసుకుని వెళ్ళాలంటే సమయం చాలదు. ఆనాడే సాయంత్రం చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్‌కు బయల్దేరవలసి ఉంది. సరే మరెప్పుడయినా మద్రాసు వచ్చినప్పుడు కలసుకుందామనుకున్నాను. మధ్యాహ్నం భోజనం చేసుకుని డా.ఆయిషా

వెళ్ళి పొయ్యారు. నేనూ జమీల్‌భాయ్ కలిసి అండమాన్ పర్యటన వివరాలు కాస్సేపు మాట్లాడుకున్నాము. ఆరోజు ట్రెయిన్‌లోనూ వెదురుచెట్టు ప్రత్యేకాకర్షణ. దాన్ని ఎంతో జాగ్రత్తగా పదిలపరచుకుని వచ్చాను హైదరాబాదుకు.

19.2.92న ఉదయం 9.30 గంటలకు ఇంటికి చేరడంతో అందమయిన అనుభవాలు, అందమయిన స్మృతులు, మధురమయిన తలంపులు అంద చేసిన అండమాన్ యాత్ర సమాప్తమయింది.